అహం-అసూయ



మూలం: జేన్ ఆస్టిన్

తెలుగు: కె. గంగాధర్

అహం
అసూయ

అహం • అసూయ



మూలం: జేన్ ఆస్టిన్

తెలుగు: కె. గంగాధర్

పీకాక్ క్లాసిక్స్ • హైదరాబాద్

అహం ● అసూయ

Aham . Asooya, slightly abridged, Telugu version of Jane Austin's ***Pride and Prejudice,*** published by Peacock Classics, Publication wing of People's Trust

Cover Design: Suryachandra Reddy (Suri)

Publication No: 77

Price: Rs.75

First Published in 2014
Hyderabad, India

copies: 2000

Printed at Himalaya Graphics, X Roads, Hyderabad

Distributors: All branches of Visalaandhra and Prajasakti, Navodaya and other book stalls

Address for Communication
G2, BLOCK NO. 6, PANCHAVATI, PRAGATHI NAGAR, OPP. JNTU, KUKATPALLY, HYDERABAD - 90

EDITOR

A. Gandhi
Phs: 98499 40791, 901020 4633, 040 2389 4648
email: agaandhi@gmail.com
Blog:http/www/peacockclassics.blogspot.in
website: http/www/peacockclassics.com

అహం • అసూయ

సకల ఐశ్వర్యాలతో తులతూగుతున్న ఒంటరి మగవాడికి, భార్య అవసరం ఎంతైనా ఉంటుందనేది అందరూ నిరభ్యంతరంగా ఒప్పుకునే సత్యం.

అటువంటివాడు తమ ఇరుగుపొరుగులలో ఎక్కడైనా ప్రవేశించినట్టయితే, అతని అభిప్రాయాల గురించి ఏమాత్రం తెలియని వాళ్ళు కూడా, తమ కుమార్తెలలో ఎవరికో ఒకరికి ఈ శ్రీమంతుడు భర్త అయితే బాగుండుననుకొంటారు.

ఒక రోజు ఉదయం బెనెట్ భార్య ఆయనతో అంది. "ఏమండీ! **నెదర్ ఫీల్డ్** పార్క్ చివరకు అద్దెకు ఇచ్చారు, చూశారా?"

బెనెట్ తనకేమీ తెలియదన్నాడు.

"ఇచ్చారు, ఇంతకు ముందే లాంగ్ ఇక్కడికి వచ్చి ఈ విషయం చెప్పి వెళ్ళింది."

దీనికి కూడా బెనెట్ ఏమీ బదులు పలుకలేదు.

'ఇంతకూ ఆ ఇల్లు ఎవరు తీసుకున్నారో తెలుసు కోవాలని ఉందా?' అని అడిగింది.

"నీకు చెప్పాలని ఉంది కదూ! చెప్పు, వింటానికి నాకేం అభ్యంతరం లేదు!"

ఆమెకు ఈ మాత్రం ప్రోత్సాహం చాలు.

"మీరు తప్పకుండా తెలుసుకోవాలి. నెదర్ ఫీల్డు అద్దెకు తీసుకున్న వ్యక్తి యువకుడట! గొప్ప ఐశ్వర్యవంతుడట! ఉత్తర ఇంగ్లండు నుంచి వచ్చాడట. సోమవారంనాడు నాలుగు గుర్రాల బగ్గీ ఎక్కి వచ్చి భవనం చూసుకు వెళ్ళాడట. ఇల్లు, పరిసరాలు అతనికి ఎంతగానో నచ్చాయట. త్వరలోనే వచ్చి చేరతారట. అతని సేవకులు పైవారంలో వచ్చి చేరతారట!"

"ఇంతకూ అతని పేరేమిటి?"

"బింగ్లీ."

"వివాహితుడా లేక బ్రహ్మచారేనా?"

"బ్రహ్మచారేనండీ! ఒట్టి బ్రహ్మచారే కాదు, అగర్భ శ్రీమంతుడు! సంవత్సరానికి నాలుగైదు వేల ఆదాయం ఉంటుందట. మన అమ్మాయిలకు ఎంత అదృష్టం!"

"అదెలా? అతని ఆదాయానికి, అమ్మాయిల అదృష్టానికి సంబంధం ఏమిటి?"

"అబ్బబ్బ! మీరేమీ అర్థం చేసుకోలేరండీ! అతను మన అమ్మాయిలలో ఒక దాన్ని వివాహం చేసుకుంటాడేమోనని ఆలోచిస్తున్నాను" అంది ఆయన భార్య.

"అతను ఇక్కడ చేరటంలో ఉద్దేశమే అదంటావా?"

"ఉద్దేశమా? ఏమిటండీ, ఇలా అసందర్భంగా మాట్లాడతారు? అతను ఎవరినన్నా ప్రేమించటానికి అవకాశం ఉందికదా! అందుచేత మీరొకసారి వెళ్ళి కలుసుకోండి."

"కలుసుకోవటానికి సందర్భం ఏమిటి? నీవూ అమ్మాయిలూ వెళ్ళి రండి. లేకపోతే అమ్మాయిలను ఒక్కళ్ళనే పంపించు. ఆ పని మరీ బాగుంటుంది, ఏమంటే, వాళ్ళ కంటే నీవే అతనికి నదరుగా కనిపిస్తే బింగ్లీ నీతోనే స్నేహం చేస్తానంటాడేమో?"

"నన్ను ఊరికే ఉబ్బెయ్యబోకండి. నా రోజుల్లో నేనూ అందగత్తెనే. ఇప్పటికి కూడా నేను అసాధారణంగా ఉన్నట్టు నటించబోవటం లేదు. అయిదుగురు ఆడపిల్లలున్న ఏ స్త్రీ తన సౌందర్యాన్ని గురించి ఆలోచించటానికి తీరుబడిగా కూర్చోదు. ఏమైనా మీరు, బింగ్లీ ఇంట్లో ప్రవేశించిన వెంటనే అతని దగ్గరకు వెళ్ళి రావాలి!"

"నాకు తీరుబడి ఉండదేమో!"

"మీ కూతుళ్ళను గురించి ఆలోచించండి. వాళ్ళలో ఒకరికి ఈ సంబంధం కుదిరితే ఎంత బాగుంటుందో ఆలోచించండి. లేడీ లూకా, విలియమ్ లూకా అక్కడికి వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. వాళ్ళు సాధారణంగా ఎక్కడికీ కొత్త వాళ్ళను చూడటానికి వెళ్ళరు. అందుచేత ఇదే పనిమీద బయలుదేరుతున్నారేమోనని నా అనుమానం!"

"నువ్వు అతి జాగ్రత్త తీసుకుంటున్నావు. నీవు ఒక్క దానివీ వెళ్ళినా బింగ్లీ పరమ సంతోషంగా మాట్లాడుతాడనుకుంటాను. కావాలంటే, మన అమ్మాయిలలో ఎవర్నైనా అతను చేసుకోవాలని ఉబలాటపడితే నాకూ ఆమోదమేనని ఉత్తరం రాసి ఇస్తాను. ఆ ఉత్తరంలోనే లిజ్జీ (ఎలిజబెత్) గురించి ప్రముఖంగా ఒక ముక్క చేరుస్తానులే!"

"మీరు అలాంటి అనవసరమైన పనులేమీ చెయ్యనక్కర్లేదు. లిజ్జీ తతిమ్మా వాళ్ళ కంటే ఏమీ గొప్ప అందగత్తెకాదు. జేన్ అందంలో సగం అందమైనా దానికి లేదు. లిడియా వాక్చాతుర్యంలో పదోవంతైనా దానికి చేతకాదు. మీరు మాత్రం ఎప్పుడూ లిజ్జీనే గొప్పగా చెబుతారు!"

"వాళ్ళను గురించి ప్రత్యేకంగా చెప్పవలసిందేముంది. అల్లరి పిల్లలు, అమాయకులు. లిజ్జీ తతిమ్మా వాళ్ళ కంటే తెలివైన అమ్మాయి!"

"అబ్బ! మీ స్వంత కూతుళ్ళను గురించే మీరు అలా మాట్లాడగలుగుతున్నారండి! మీకు నన్ను విసిగించడం అంటే సరదా! మీకు నా మీద ఏమాత్రం ఏమీ జాలిలేదు.

"నన్ను అర్థం చేసుకోవటం లేదు. నాకు నీ గురించే నా ఆదుర్దా. నీ గురించి నాకు ఇరవై సంవత్సరాలకు పైగా తెలుసు."

"అయినా నా బాధేమితో మీకు తెలియదు."

"నీ బాధను నీవు గడచిపోతావులే. ఈ చుట్టుపక్కలకు నాలుగు వేల ఆదాయం ఉన్న యువకులు ఎందరో వస్తూ ఉండటం చూస్తావు కూడా."

"ఊరికే చూస్తే ఏం లాభం? అలాంటి వాళ్ళు ఇరవై మంది వస్తేమట్టుకు మనకేం ప్రయోజనం. వెళ్ళి చూసిరానప్పుడు?"

"ఇరవై మంది వచ్చినప్పుడు, నేను తప్పకుండా వాళ్ళను కలుసుకుంటాను."

బెనెట్ అతి విచిత్రమైన వ్యక్తి. మనిషిలో సునిశితమైన హాస్యం ఉంది. గంభీరంగా ముభావంగా ఉంటాడు. అతనితో ఇరవై మూడు సంవత్సరాలుగా కాపురం చేస్తూ ఉన్నా, ఆమె భర్త స్వభావాన్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు. ఆమె ఇప్పుడు కొత్తగా మారే అవకాశం లేదు. ఆమె ఆలోచనల్లో ఒక చౌకబారుతనం తొంగి చూస్తూ ఉంటుంది. ఆమెకు విజ్ఞానం కొంచెం, ఉద్రేకం జాస్తి. ఆమెకు అసంతృప్తి తోచినప్పుడల్లా నరాలతీపు బయలుదేరుతుంది. ఆమె ఏకైక ధ్యాస కుమార్తెలకు వివాహం చేయటం.

2

బెనెట్ ఎప్పటికప్పుడు బింగ్లీని కలుసుకుందామనుకుంటున్నాడు. కానీ కుదరటం లేదు. చివరకు భార్యకు మాత్రం తను వెళ్ళే ఉద్దేశం లేదని చెబుతున్నాడు. తీరా వెళ్ళి వచ్చిన తరువాత, ఆ రోజు సాయంకాలానికి గాని ఈ విషయం ఆమెకు తెలియలేదు. రెండో అమ్మాయి టోపీ అమర్చుకోవటం గమనించి బెనెట్ ఉన్నట్టుండి ఇలా అన్నాడు:

"లిజ్జీ, బింగ్లీకి ఇటువంటి టోపీలంటే ఇష్టమనుకుంటానేం?"

ఆమె తల్లి కోపంగా 'బింగ్లీ ఇష్టాయిష్టాలేమిటో మనకేం తెలుసు? మన మేమన్నా అతన్ని కలుసుకుని వచ్చామా?' అంది. మళ్ళీ నోరు మూసుకు ఉండలేక, కూతుళ్ళను చివాట్లు పెట్టటం ఆరంభించింది: "అలా దగ్గకే కిట్టీ! నా నరాల మీద కాస్త జాలి చూపు."

"దగ్గటానికి సమయం సందర్భం చూసుకోదు, కిట్టీ" అన్నాడు బెనెట్ నవ్వుతూ."

"ఇలా దగ్గటం నాకేం సరదా కాదు" అంటూ కిట్టీ గిరుక్కున పక్కకు తిరిగి 'మళ్ళీ నా బాల్ డ్యాన్స్ ఎప్పుడే లిజ్జీ' అనడిగింది.

"రెండు వారాల తరువాత."

"పరిచయంచేయడం నీ వల్ల కాదంటే ఆ కార్యభారాన్ని నేనే భుజాన వేసుకొంటాను." అని భార్యతో బెనెట్ అన్నాడు.

అమ్మాయిలు తండ్రి వంక తేరిపారజూచారు. పిల్లలకి తండ్రి ఏదో చెప్పబోతున్నాడని అర్థమయింది. తల్లిది మట్టి బుర్ర. ఆమె 'అసందర్భం' అంది.

"ఏమిటి నీ మాటలకు అర్థం? ఇలా పరిచయం చేయటం అసందర్భం అంటావా? ఏమంటావు, మేరీ? నీవెంతో ఆలోచనపరురాలవుగా! ఎన్నో పుస్తకాలు చదివి ఎన్నో వ్యాసాలు రాశావుగా! నీవే ఆలోచించి చెప్పు" అన్నాడు బెనెట్.

మేరీ ఏదో చెబుదామనుకుంది. కానీ ఎలా చెప్పాలో తోచక ఊరుకుంది.

"మేరీ ఆలోచన పూర్తిచేసే లోపల మనం బింగ్లీ గురించి మాట్లాకుందాం."

"నాకు బింగ్లీ అంటే విసుగెత్తిపోయింది" అంది తల్లి.

"ఈ మాటలు నీ నోటి వెంట రావటం నాకు చాలా విచారమనిపిస్తుంది. ఈ సంగతి నాకు ముందుగానే ఎందుకు చెప్పావు కాదు? ఈ విషయం నాకు ఇవాళ ఉదయం తెలిసినప్పటికీ నేను అతన్ని చూడటానికి వెళ్లేవాడిని కాదు. ఇవాళ ఉదయమే నేను అక్కడికి వెళ్ళి వచ్చాను. ఆ పరిచయాన్ని మనం వదులుకుందాం అంటే, నీ ఇష్టం."

వాళ్ళ ఆశ్చర్యం. అచ్చం అతను ఆశించిన స్థాయిలోనే ఉంది. అందరి కంటే ఎక్కువ ఆశ్చర్యం తల్లిది. కొంతసేపు సంతోషంలో తన్మయం అయిన తరువాత, ఆమె నిజానికి తాను ఆశించింది మటుకు ఇదేనని చెప్పనారంభించింది.

"మీరెంత మంచివారండి! ఎలాగైతేనేం, మీ వల్ల ఈ పని చేయగలిగాను. అదీ నాకు తృప్తి. మీకూ మీ అమ్మాయిలంటే ప్రేమలేదా: సిరిరా మోకాలడ్డుతానంటారా? ఇప్పుడు నాకెంతో సంతోషంగా ఉంది. అయినా మీరు ఏం తమాషా మనుషులండీ, ఎప్పుడో ఉదయమనగా అక్కడికి వెళ్ళి పరిచయం చేసుకుని వచ్చి, ఇప్పటివరకు మాటమాత్రంగా నైనా చెప్పారు కాదు!"

"ఇదిగో కిట్టీ, ఇప్పుడు నీ ఇష్టం వచ్చినంతసేపు దగ్గు" అన్నాడు బెనెట్.

"ఆహా! మీ నాన్నగారు ఎంత మంచివారమ్మా, మీరు నిజంగా అదృష్టవంతులమ్మా" అంటూ ఆమె తలుపు మూసింది. 'ఇక మీరు ఎలా బింగ్లీని ఆకట్టుకుంటారో! మా రోజుల్లో అయితే ఇలా కొత్త పరిచయాలు చేసుకొనేవాళ్లం కాదు; ఇప్పుడు మీ కోసం, ఏ పని చేయమన్నా చేస్తాం. విడియా, అందరికన్నా ఆఖరుదానివైనా, నీవే రాబోయే విందులో బింగ్లీతో బాల్‌డ్యాన్స్ చేస్తావని నా ఆశ!"

"నాకా భయం ఏమీలేదమ్మా! అందరికంటే చిన్నదాన్ని అయినా, పొడుగరిని నేనే!"

ఆ సాయంత్రమంతా ఊహాగానాలతో గడిచిపోయింది. అతను తమ ఇంటికి ఎప్పుడు వస్తాడు, ఎప్పుడు అతన్ని భోజనానికి రమ్మని ఆహ్వానిద్దాం - ఇవే ఆలోచనలు.చర్చలు.

3

మిసెస్ బెనెట్ ఆమె కూతుళ్ళు అయిదుగురూ, బెనెట్‌ను బింగ్లీని గురించి ప్రశ్నలు వేసి వేధించారు. ఆయన ఆకుకు అందకుండా పోకకు పొందకుండా జవాబులు చెప్పాడు. అందుచేత వాళ్ళకు తమ పొరుగింటి లేడీ లూకా చెప్పిన వివరాల కోసం ఎగబడవలసిన అగత్యం కలిగింది. ఆమె ఎన్నో ఆహ్లాదకరమైన విషయాలు చెప్పింది. విలియం గారు బింగ్లీతో మాట్లాడి వచ్చారట. బింగ్లీ యువకుడట, సుందరుడట, సహృదయుడట. అన్నిటికీ గొప్ప విషయం ఏమిటంటే రాబోయే సమావేశానికి ఆయన తన బంధువర్గంతో సహా హాజరవుతాడట. ఇంతకంటే ఆనందదాయకమైన సంగతి ఇంకేముంటుంది? నాట్యమంటే ఇష్టం - అనే లక్షణం ప్రేమ పాశంలో పడటానికి ప్రథమ సోపానం.

“మన అమ్మాయిలలో ఎవరో ఒకరు అతని జత కుదిరి, తతిమ్మా అమ్మాయిలకు కూడా ఇలాంటివే మంచి సంబంధాలు వస్తే, ఇంతకంటే నేను కోరుకోవలసిందేమీ ఉండదు” అంది ఆమె భర్త బెనెట్‌తో.

కొద్దిరోజులలోనే బింగ్లీ బెనెట్ గారి ఇంటికి వచ్చాడు. పది నిమిషాలపాటు ఆయన గారి లైబ్రరీ గదిలో కూర్చుని కబుర్లు చెప్పాడు. ఈ ఇంట్లో ఉన్న ఆడవాళ్ళ సందర్శన భాగ్యం కలుగుతుందేమోనని ప్రయత్నించాడు. ఏమంటే ఇక్కడ సుందరాంగులు ఉన్నట్టు అతను విన్నాడు. అయితేనేం తండ్రిని ఒక్కడినీ తప్ప ఇంకెవరినీ చూడలేకపోయాడు. ఆడవాళ్ళే అతని కంటే అదృష్టవంతులని చెప్పాలి. ఎందుచేతనంటే వాళ్ళు మేడ మీదినించి అతని నీలికోటును, ఎక్కి వచ్చిన నల్లగుర్రాన్ని చూడగలిగారు.

మరురోజు తమ ఇంటికి విందుకు రమ్మని ఆహ్వానం పంపారు. మిసెస్ బెనెట్ విందుకు ఏమేమి ఏర్పాట్లుచేసి అతిథి మన్ననలు పొందాలో ఆలోచనలు చేస్తూ కూర్చుంది. అయితే ఇంతలోనే ఆహ్వానం అందుకొన్నట్టుగా కబురు వచ్చింది. బింగ్లీ మరురోజు ఏదో వ్యవహారం మీద నగరానికి వెళ్ళవలసి ఉన్నదట. అందుచేత ఈ ఆహ్వానాన్ని మన్నించలేనందుకు విచారం వెలిబుచ్చాడు. మిసెస్ బెనెట్‌కు చాలా ఆశాభంగం అయింది. వచ్చి వారం రోజులైనా తిరగలేదు. అప్పుడే నగరంలో ఏం పనా అని ఆశ్చర్యపోయింది. ఎప్పుడూ ఇలాగే అక్కడికీ ఇక్కడికీ తిరుగుతాడేమో, తాము అనుకున్నట్టుగా ఈ నెదర్ ఫీల్డ్‌లో మకాం ఉండడేమోనని భయపడింది. అయితే లూకా ఆమె భయాలకు నివృత్తి చేసింది. ఆమె చెప్పిన భోగట్టా ప్రకారం, అతను లండన్ వెళ్ళాడు! అదికూడా ఏదో బాల్‌డ్యాన్స్‌లో పాల్గొనే నిమిత్తమే. అక్కడి నుంచి పన్నెండు మంది స్త్రీలను, ఏడుగురు మగవాళ్ళను తీసుకు వస్తాడట. అంతమంది ఆడవాళ్ళు ఒక్కమారుగా వస్తారని తెలుసుకునేటప్పటికి. అమ్మాయిలు విచారసాగరంలో మునిగిపోయారు. పోతే, బాల్ రేపేననగా ఒక విషయం తెలిసింది. అదేమిటంటే అతను లండన్ నుంచి ఏడుగురిని మాత్రమే తీసుకొచ్చాడని; అదీ - అయిదుగురు చెల్లెళ్ళు, పెద్ద ఆమె భర్త, మరో యువకుడు.

బింగ్లీ అందగాడు. అతను పెద్దమనిషి. అతని ముఖం ఎప్పుడూ చిరునవ్వులు చిందుతూ ఉంటుంది. అతని చెల్లెళ్ళు అందమైన వాళ్ళు, అతని బావమరిది హర్స్ట్ కూడా పెద్దమనిషిలా కనిపించాడు. అతని స్నేహితుడు ‘డార్సీ’ మాత్రం కొద్దిసేపట్లోనే అందరినీ ఆకర్షించగలిగాడు. డార్సీ పొడుగరి. దృఢకాయుడు. అతను గదిలో ప్రవేశించిన ఐదు నిమిషాలలోనే అతన్ని గురించి బ్రహ్మాండమైన వార్త అందరికీ ప్రచారమైపోయింది. అతని సంవత్సరాదాయం పదివేలట! మగవాళ్ళందరూ అతన్ని గొప్ప వాడన్నారు. ఆడవాళ్ళు, బింగ్లీ కంటే ఇతనే అందగాడు అన్నారు. అయితే, ఏమీ పట్టనట్టు అందరికీ

దూరంగా కూర్చోవడం చాలా మందికి చికాకు కలిగించింది.

బింగ్లీ గదిలో ఉన్న ప్రధాన వ్యక్తులందరితోనూ పరిచయం చేసుకున్నాడు. అతను చలాకిగా, నిగర్వంగా కనిపించాడు. అన్ని రకాల నృత్యాలు చేశాడు! బాల్ తొందరగా ముగిసిందేం అని కోపగించాడు. నెదర్ ఫీల్డ్‌లో తనే గొప్ప బ్రహ్మాండమైన పార్టీ ఏర్పాటు చేస్తానన్నాడు. ఇటువంటి సద్గుణాలు వాటంతట అవే బయడపడతాయి. అతనికీ అతని స్నేహితునికి ఎంత తారతమ్యం ఉంది! డార్సీ ఒక్కసారి హార్ట్స్ భార్యతోను, మరోసారి ఆమె చెల్లెలితోను డ్యాన్స్ చేశాడు. మరో స్త్రీతో చేయలేదు. పరిచయం చేసుకోవటానికి కూడా నిరాకరించాడు. ఖాళీగా ఉన్నప్పుడు అటూ ఇటూ పచార్లు చేస్తూ గడిపాడు. ఒకటి రెండుసార్లు తన వాళ్ళతో మటుకే మాట్లాడాడు. ఎంత గర్వం! ఈ వ్యక్తి మరెప్పుడూ ఇక్కడికి రాకుండా ఉండాలని, అక్కడికి జనమంతా తమ అంతరంగాలలో కోరుకున్నారు. అందరిలోకీ అతనంటే చికాకు ప్రకటించిన ఆమె మిసెస్ బెనెట్.

మగవాళ్ళ సంఖ్య తక్కువగా ఉండటం వల్ల, ఎలిజబెత్ రెండు డాన్సుల్లోనూ ఖాళీగా ఉండవలసి వచ్చింది. ఆ సమయంలో డార్సీ ఆమెకు దగ్గరగానే నిలుచుని ఉన్నాడు. బింగ్లీ అప్పుడే నృత్యం నుంచి వచ్చి స్నేహితుడిని కూడా వేడుకలలో పాల్గొనమన్నాడు. 'రా డార్సీ.' నీవిలా ఒంటరిగా తిరగటం నేను చూడలేను. నీవు కూడా డ్యాన్స్ చేయి. ఎందుకు అలా సోమరిపోతులా నిలుచుంటావు? ఆనందించవలసిన సమయం ఇది.'

"అవతలి వ్యక్తితో బాగా పరిచయం ఉంటే తప్ప నేను డ్యాన్స్ చేయను. ఇటువంటి సభలలో మనకు తగినవాళ్ళు దొరకటం కష్టం. నీ చెల్లెళ్ళిద్దరూ ఎవరితోనో ఆడుతున్నారు. మరి ఈ గదిలో నాతో నృత్యం చేయగల అమ్మాయి లేదు."

"అలా మంకుపట్టుపడతావేం? ఇవాళ చూస్తున్నలాంటి అందమైన ఇంతమంది అమ్మాయిలను నేను నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు!"

డార్సీ, బెనెట్ పెద్ద కూతురు వంక చూస్తూ "ఇక్కడి ఏకైక అందగత్తెతో నువ్వే డ్యాన్స్ చేస్తున్నావు!" అన్నాడు.

"అవును! ఆమె చాలా అందమైన అమ్మాయి. అయితే చూడు, నీ దగ్గరే ఆమె చెల్లెలు ఒక అమ్మాయి ఖాళీగా కూర్చుని ఉంది. ఆమె కూడా అందంగానే ఉంది. ఆమెతో చేయవచ్చు. ఆమెను నీకు పరిచయం చేయమంటావా?"

"ఎవరిని గురించి, నీవు చెబుతున్నది" అంటూ డార్సీ వెనక్కు తిరిగి ఎలిజబెత్ వంక చూశాడు. ఆమె కూడా అతని వంక చూసింది. అతను తన తల ఇవతలకు తిప్పేసి 'ఆమె అందంగానే ఉంది. కానీ నాకు చాలదు. అయినా **ఇతర మగవాళ్ళు వద్దని అట్టేపెట్టిన అమ్మాయితో నేను డ్యాన్స్ చేయటం అప్రతిష్ఠ**" అన్నాడు.

బింగ్లీ అతని సలహాను పాటించాడు. డార్సీ బయటకు నడిచాడు. లిజ్జీ అతని వంక

నిరామయంగా చూసింది. ఆమె ఈ కథనంతటినీ తన స్నేహితురాళ్ళతో చెప్పింది. ఆమెలో ఎంత గడ్డు పరిస్థితినైనా, సుహృద్భావంతో ఎదుర్కొనే నేర్పు ఉంది.

ఆ సాయంత్రం అందరికీ ఆహ్లాదంగానే గడచింది. మిసెస్ బెనెట్, తన పెద్దకూతురు నెదర్‌ఫీల్డ్ పార్టీకి ఎంతో సంతోషిస్తున్నట్టు గమనించింది. బింగ్లీ ఆమెతో రెండుమార్లు డ్యాన్స్ చేశాడు. అతని చెల్లెళ్ళు కూడా ఆమెను గుర్తించి మన్నించారు. జేన్ ఇందుకు, తన తల్లితో సమానంగా గర్విస్తోంది. అయితే, ఈ గర్వమంతా అంతరంగంలోనే. మేరీ తనను గురించి ఎవరో బింగ్లీ చెల్లెలికి మంచిగా చెబుతూ ఉండటం స్వయంగా విన్నది. కిట్టీ (కాథరైన్), విడియాలు ఎప్పుడూ ఎవరితోనో ఒకరితో డ్యాన్స్ చేస్తూనే ఉన్నారు. అందుచేత, ఆ కుటుంబంలోని వాళ్ళంతా పార్టీ ముగిసిన తర్వాత, ఆహ్లాదపూరిత హృదయాలతో లాంగ్‌బర్న్‌కు తిరిగి వచ్చారు.

ఆ గ్రామంలో వారి కుటుంబం ప్రధానమైనది. వారు తిరిగి వచ్చేసరికి , బెనెట్ ఇంకా మేడమీదే ఉన్నాడు. ఆయనకు చేతిలో పుస్తకం ఉంటే ఇంక కాలాన్ని గురించి ప్రశ్నేరాదు. పోతే ఇక ప్రస్తుత పరిస్థితిలో ఈ సాయంత్రం జరుగబోయే పరిణామాల గురించి ఆయనకు కుతూహలంగా ఉంది. కొత్త వ్యక్తిని గురించి ఆమె ఆశలన్నీ అడియాశలవుతాయని ఆయన ఉద్దేశం. అయితే తను అనుకున్నదంతా తారుమారు అయి చెప్పుకోవటానికో మంచికథ మిగిలిందని ఆయన తెలుసుకున్నాడు.

భార్య ఇంట్లోకి వస్తూనే "అహా! ఈ సాయంత్రం ఎంతో హాయిగా గడిచిపోయిందండీ! విందు, నృత్యాలు- ఎంతో గొప్పగా జరిగాయి. జేన్ ఎంతో సంబరపడింది. అందరూ దాన్ని మెచ్చుకున్నారు. బింగ్లీ దానితో రెండు మార్లు డ్యాన్స్ చేశాడు. ఈ సంతోషం నేను పట్టలేకపోతున్నాను. అంతమందిలోనూ మన అమ్మాయినే అతను రెండోసారి ఆహ్వానించాడు. ముందు లూకా కూతుర్ని ఆహ్వానించాడు. వాళ్లిద్దరూ నిలుచుంటే నాకు చూడటానికే రోత అనిపించింది. నక్క ఎక్కడ, నాకలోకం ఎక్కడ? మన జేన్‌కు అతను అన్ని విధాలా తగినవాడు. తరువాత అతను కింగ్ కూతురుతో, లూకా కూతురుతో, లిజ్జీతో డ్యాన్స్ చేశాడు.''

"చాల్లే, సోది. అతను ఎవరితో డ్యాన్స్ చేస్తే నాకేం కావాలి?"

"అతను నాకెంతో నచ్చాడు. కుర్రవాడు బుద్ధిమంతుడుగా కనిపించాడు. అతని చెల్లెళ్ళు అందాల అప్సరసలనుకోండి. వాళ్ళ దుస్తులు మనోహరం. అటువంటి సుకుమారులను నేను నా జన్మలో చూడలేదు. హార్ట్స్ తొడుక్కున్న గౌను మీది లేసు..."

ఆమె ధోరణికి మళ్ళీ భర్త అడ్డు తగిలాడు. ఇటువంటి చచ్చురకం వర్ణనలేమీ తనకు చెప్పవద్దన్నాడు. అందుచేత ఆమె, మాట్లాడటానికి మరేదైనా విషయం వెదుక్కోవలసి వచ్చింది. డార్సీ ప్రదర్శించిన మూర్ఖత్వాన్ని గురించి చెప్పింది.

"అతను ఎన్నుకోకపోయినంత మాత్రాన మన లిజ్జీకేమీ తక్కువ కాదులెండి. అతన్ని చూస్తేనే నాకు వళ్ళు మండుకు వచ్చింది. ఎంత గర్వం, ఎంత గొప్ప, ఎంత అతిశయం! పెద్ద రాజ కుమారుడిలాగా ఇటు అటు పచార్లు చేశాడు. మీరు కూడా అక్కడికి వస్తే బాగుండేది. మీరు అతనికో గుణపాఠం చెప్పినట్టయితే మరీ బాగుండేది! నాకు అతనంటే అరికాలిమంట నెత్తికెక్కుతోంది. అదేం మనిషి!"

4

జేన్, లిజ్జీ ఒంటరిగా ఉన్నారు. జేన్, బింగ్లీ తనను గురించి చెప్పిన మాటలు నెమరువేసుకుంటూ తనలో తను ఉప్పొంగిపోతోంది. చెల్లెలితో ఇలా అంది: యువకుడికి ఉండవలసిన అన్ని లక్షణాలు అతనిలో ఉన్నాయి. మంచిమాట, పలుకు, హాస్యం."

"అవును. అతను పరిపూర్ణమైన యువకుడు."

"అతను నన్ను రెండోసారి నృత్యం చేయమని అడగటంతో నేను ఎంతో పొంగిపోయాను. ఇలాంటి మన్నన నాకు కలుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు."

"అలాగా! నిన్ను గురించి నేను మాత్రం గొప్పగానే అనుకున్నాను. మనిద్దరికీ ముఖ్యంగా ఒక తేడా ఉంది. నీకు అనుకోకుండా తలవని తలంపుగా మన్ననలు వస్తాయి. నాకు మాత్రం రావు, ఎప్పటికీ రావు. నిన్ను అతను రెండోసారి అడగటం కంటే సహజమైన ప్రక్రియ ఇంకేమీ ఉండదనుకుంటాను. గదిలో ఉన్న అమ్మాయిలందరి కంటే నీవు అయిదురెట్లు అందగత్తెవని అతను ముందే గ్రహించాడు. అందులో అతని ప్రయోజకత్వం ఏమీలేదంటాను. అతను కూడా మంచివాడే! పోనిస్తే లాభంలేదు. ఇతని కంటే తక్కువ వాళ్ళను కూడా నీవు లోగడ ఆశించావు గుర్తుందా? ఈ అవకాశం పోనీకు."

"లిజ్జీ"

"నీ కళ్ళకు అందరూ మంచిగానే కనిపిస్తారు. ఎవరి తప్పులూ నీకు కనిపించవు. నీ కళ్ళకు ఈ ప్రపంచమంతా గొప్పగా, సామరస్యంగా కనిపిస్తుంది. నీవు ఎవర్ని గురించి కానీ చెడ్డగా మాట్లాడటం నేను ఇంతవరకూ ఎరుగను."

'నేను ఎవరిని గురించీ తొందరపడి ఏ నిర్ణయానికీ రాలేను. అయితే ఎప్పుడూ, నేను అనుకునేదేదో పైకి అనేస్తాను."

"అవును నాకు తెలుసు అదే ఆశ్చర్యం. ఎంతసేపూ మనిషిలోని మంచినే తీసుకుని దాన్ని పెంపొందించటానికి ప్రయత్నిస్తావు. వాళ్ళలోని చెడ్డతో ఏమీ ప్రమేయం పెట్టుకోవు. అయితే నీకు, అతని చెల్లెళ్ళ పట్ల కూడా ఇదే అభిప్రాయం ఉందా? వాళ్ళ ప్రవర్తన అతనికంటే కొద్దిగా భిన్నంగా లేదూ?"

"ఎంతమాత్రం కాదు. వాళ్ళ ముందు అలానే ఉంటారు. వాళ్ళతో మాట్లాడటం మొదలెడితే కానీ, వాళ్ళ మధుర భాషణ మనకు అర్థంకాదు. ఒక చెల్లెలు బింగ్లీ అన్నగారి దగ్గరే ఉండి ఇల్లు చక్కబెడుతుందట. మనకు మంచి పొరుగే దొరుకుతుంది."

ఎలిజబెత్ నిశ్శబ్దంగా వింది. కానీ ఆమె ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. సమావేశంలో వారి ప్రవర్తన ఎవరికీ తగినట్టుగా తోచలేదు. వాళ్ళు అందమైన వాళ్ళే. అయితే వాళ్ళు అందరితో కలుపుగోలుతనంగా ఉండరు. అహంభావం ఎక్కువ. బాగా చదువుకున్న వాళ్ళు, డబ్బున్నవాళ్ళు, అవసరమైన దానికంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తారు. పైతరగతి మనుషులతో తప్ప కలిసి తిరగరు. తమను గురించి గొప్పగాను, ఇతరులను గురించి తక్కువగాను భావించుకుంటారు. ఉత్తర ఇంగ్లండులోని ఒక కులీన కుటుంబంలో జన్మించారు. తమ ఆస్తిపాస్తులు, అన్నగారి సంపదలు అన్నీ వ్యాపారరీత్యా సంపాదించినవి అనటం వాళ్ళకు మరింత గర్వకారణం.

బింగ్లీ తన తండ్రి నుంచి లక్ష రూపాయిలు పిత్రార్జితంగా పొందాడు. ఈ డబ్బుతో తండ్రి ఒక ఎస్టేటు కొనాలనుకొన్నాడు. కానీ ఆ పని నెరవేరకముందే చనిపోయాడు. బింగ్లీ కూడా అలాగే చేద్దామనుకున్నాడు. అయితే కొన్ని కారణాల వల్ల తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. తన జీవిత శేషం నెదర్ ఫీల్డ్‌లో హాయిగా గడిపి ఎస్టేట్ కొనేవిషయం తరువాత తరం వాళ్ళకు వదిలి వేద్దామనుకున్నాడు.

అతని చెల్లెళ్ళకు, అన్నగారికొక స్వంత ఎస్టేట్ ఉంటే బాగుండునని ఉంది. అయితేమాత్రం ఏం లాభం? బింగ్లీ నెదర్‌ఫీల్డు గృహం ఎంతో బాగుందని తనకు కావలసిన ఫక్కీలో ఉన్నదని - దాన్ని అద్దెకు తీసుకున్నాడు.

డార్సీకీ అతనికీ స్వభావంలో ఎంత తేడా ఉన్నప్పటికీ, ఇద్దరూ గాఢ స్నేహితులు. డార్సీ ప్రదర్శించే నిర్లక్ష్యం నిష్కల్మషం వంటివి బింగ్లీకి ఉచితంగా తోస్తాయి. అయితేనేం ఎక్కడికి వెళ్ళినా బింగ్లీ అందరినీ ఆకట్టుకుంటాడు. డార్సీమాత్రం ఎక్కడికి వెళ్ళినా ఎవరినీ సంతృప్తిపరచలేడు. పైగా వాళ్ళ అసంతృప్తికి పాత్రుడౌతాడు.

మెరిటన్ సమావేశాన్ని గురించి వాళ్ళు మాట్లాడుకున్న విధం గమనించదగినది. బింగ్లీ ఇంతవరకు తన జీవితంలో ఇంత అందమైన అమ్మాయిలను, తన పట్ల ఆదరం చూసే అమ్మాయిలను చూడలేదన్నాడు. అతనికేమీ కొత్తదనంగానీ, గాంభీర్యం కానీ లేదు. గదిలో వాళ్ళందరితో నిమిషంలో పరిచయం చేసుకున్నాడు. పోతే మిస్ బెనెట్ (జేన్)ను అతను దేవతా స్త్రీగా పరిగణిస్తున్నాడు. డార్సీ ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. అతనికి ఇదంతా గందరగోళంగా ఉంది. ఇక్కడివాళ్లకు అందమూ లేదు, ఫ్యాషన్లూ తెలియవన్నది డార్సీ అభిప్రాయం. మిస్ బెనెట్ అతని దృష్టిలో కూడా అందగత్తే కానీ అతిగా నవ్వుతుంది.

5

లాంగ్‌బర్న్‌కు కొద్దిదూరంలోనే ఉన్న ఒక కుటుంబంతో బెనెట్ కుటుంబానికి బాగా పరిచయం ఉంది. సర్ విలియం లూకా ఇదివరలో మెరిటాస్‌లో వ్యాపారం చేస్తూ ఉండేవాడు. ఆ వ్యాపారంలో బాగా సంపాదించాడు. రాజగౌరవం కూడా పొందాడు. దీన్ని పొందిన తరువాతనే ఆయనకు వ్యాపారమంటేను చిన్న మార్కెట్ దగ్గర నివసించటం అంటేను విసుగు ప్రారంభమైంది. వెంటనే తన కుటుంబాన్ని మెరిటాస్‌కు మైలు దూరంలో ఉన్న ఒక దివ్యభవనంలోకి మార్చాడు ఆ భవనానికి అప్పటి నుంచి **'లూకా లాడ్జి'** అని పేరు ఏర్పడిపోయింది. ఇప్పుడాయనకు తన గొప్పతనాన్ని గురించి ఆలోచించుకోవటం, చుట్టుపక్కల వాళ్ళతో మంచిగా మర్యాదగా ఉండటం తప్ప ఇంకేం పనిలేదు. ప్రకృతి సిద్ధంగా ఆయన ఎవరికీ హానిచేయడు, స్నేహపాత్రుడు, సద్గుణశీలుడు. లూకా భార్యది కూడా దయార్ద్ర హృదయమే. వాళ్ళకు చాలా మంది సంతానం, పెద్ద అమ్మాయికి ఇరవై ఏడు సంవత్సరాలు. ఆమె ఎలిజబెత్‌కు ఆత్మీయురాలు. ఆమె పేరు చార్లెట్.

లూకా గారి అమ్మాయిలు, బెనెట్ గారి అమ్మాయిలు కలిసి 'బాల్' ఏర్పాటు చేయటాన్ని గురించి మాట్లాడుకోవటం అత్యావశ్యకం అయింది. అందుకే లూకా గారి సంతానం ఉదయమే కబుర్లు చెప్పుకునే మిషతో లాంగ్‌బర్న్‌కు వచ్చారు. ముందు వాళ్ళ సంభాషణ, నిన్న జరిగిన విందును గురించి సాగింది.

"నిన్న సాయంత్రం నీవు బాగానే చేశావు. చార్లెట్, బింగ్లీ నిన్నే ముందు ఎన్నుకున్నాడు" అంది లిజ్జీ.

"అవును. అయితే అతను తనతో రెండోసారి డ్యాన్స్ చేసిన అమ్మాయి అంటేనే ఎక్కువ ఇష్టపడతాడనుకుంటాను."

"ఓ! జేన్ విషమయా? అవును. దాన్ని రెండో మారుకూడా ఆహ్వానించాడు గనుక నేనూ అలాగే అనుకుంటున్నాను. నేనూ ఈ విషయాన్ని గురించే వాళ్ళు మాట్లాడుకోవటం విన్నాను. వివరం తెలియదుగాని రాబిన్సన్ గురించి ప్రస్తావన వచ్చింది?"

"రాబిన్సన్, అతనూ మాట్లాడుకోవటం నేను అక్కడక్కడ విన్నాను. ఆ సంగతి మీతో చెప్పలేదా? రాబిన్సన్ అతన్ని మన విందులు, సమావేశాలు ఎలా ఉన్నాయని అడిగాడు. ఈ గదిలో ఎందరో సుందర యువతులు ఉన్నారని చెప్పాడు. అందరిలోకీ అందగత్తె ఎవరని రాబిన్సన్ అడిగాడు. ఈ ప్రశ్నకు బింగ్లీ తడుముకోకుండా 'మరెవరు, బెనెట్ గారి పెద్ద అమ్మాయే!' అన్నాడు."

"బాగుంది, చాలా బాగుంది. అయితేనేం, ఇదంతా ఎందుకూ కాకుండానే పోవచ్చు!"

"డార్సీ మంచివాడుకాదు. అనవసరంగా నిన్ను గురించి ఎంతమాట అన్నాడు!"

"ఆ విషయం పదేపదే చెప్పి లిజ్జీ మనసు పాడుచేయకు. ఆ మనిషి తరహాయే అంత అనుకో" అంది జేన్.

"అలాంటివాడు ఎవరినైనా చేరదీసినా అదీ వాళ్ళ దురదృష్టమే. మిసెస్ లాంగ్ చెప్పింది; డార్సీ ఆమె పక్కనే అనుకునే అరగంటసేపు కూర్చున్నాడట. కానీ ఒక్క సారైనా పెదవి విప్పి మాట్లాడలేదట." అంది చార్లెట్.

"ఆ విషయం మీకు నిర్ధారణేనా? లేక ఏమన్నా పొరపాటు ఉందా? డార్సీ ఆమెతో మాట్లాడటం నేను కళ్ళారా చూసినట్టు గుర్తు" అంది జేన్.

"అవును. చివరకు ఆమే అతన్ని నెదర్‌ఫీల్డు ఎలా ఉందని అడిగింది. అతను మాత్రం బదులు చెప్పకుండా కోపంగా చూశాడట."

"అతనెప్పుడూ తన ఆత్మీయులతో తప్ప ఇతరులతో మాట్లాడడని బింగ్లీ చెల్లెలు చెప్పింది. ఆత్మీయులతో మాత్రం హృదయం విప్పి మాట్లాడతాడట!" అంది జేన్.

"నాకు మాత్రం ఆ మాటలు నమ్మకం లేవు. అతనంత సరసుడే అయితే, లాంగ్‌తో మాట్లాడే ఉండేవాడు. అయితే ఒక కారణం మాత్రం కనిపిస్తోంది. లాంగ్‌కు గుఱ్ఱపు బగ్గీ లేదనీ, అందుకనే అద్దెబండిలో బాల్‌కు వచ్చిందనీ చాలామంది చెప్పారు. బహుశా అందుకే అతను ఆమెతో మాట్లాడలేదు.

"ఆమెతో మాట్లాడకపోయినా నాకంత బాధలేదు. అయితే లిజ్జీతో ఒకసారి డ్యాన్స్ చేసి ఉండవలసింది" అంది లూకా గారి అమ్మాయి.

"నేనే లిజ్జీ పరిస్థితిలో ఉంటే, అతను కోరినా అతనితో డ్యాన్స్ చేయను" అంది తల్లి.

"అవును. నువ్వు అతనితో ఎన్నడూ డ్యాన్స్ చేయకూడదు!"

"అతని అహం నాకు ఎక్కువ కోపం తెప్పించటం లేదు. అంత అందగాడు, గొప్ప కుటుంబీకుడు, ఐశ్వర్యవంతుడు. సకల సదుపాయాలు ఉన్నవాడు, తన పట్ల తనకే అంత ఆధిక్య భావం కలిగి ఉండటంలో ఆశ్చర్యం ఏముంది? నన్నడిగితే అహంభావం కలిగి ఉండటానికి అతనికి హక్కు ఉందంటాను. కాని నన్నలా అవమానపరచకపోతే, నేనతని అహంభావాన్ని క్షమించగలిగి ఉండేదాన్ని" అంది ఎలిజబెత్.

మేరీ ఇలా అన్నది: "అహం అనేది సర్వసాధారణమైన విషయం. నేను చదివిన అనేక పుస్తకాలలో అలాగే ఉంది. అహం, అందం - రెండూ విభిన్న భావాలు. మనను గురించి మనకు ఉండే భావం అహం. మనను గురించి ఇతరులకు ఉండాలని మనం కోరేది అందం. అంతే తేడా!"

"నేను డార్సీ అంత ధనికుడిని అయితే అహంభావం గురించి లక్ష్యపెట్టను. హాయిగా తిని తిరుగుతాను!" అన్నాడు లూకా గారి చిన్న అబ్బాయి.

"అప్పుడు అవసరమైన దానికంటే ఎక్కువ తాగుతావు. అలాగనుక నిన్ను చూస్తే, నీ

చేతిలో సీసా విసిరి గిరాటు వేస్తాను" అంది మిసెస్ బెనెట్.

అబ్బాయి అలా చేయరాదని వాదిస్తున్నాడు. ఆమె అలానే చేస్తానంటూంది. వాళ్ళు వెళ్ళిపోయేంతవరకూ ఇద్దరూ అలా వాదించుకుంటూనే ఉన్నారు.

6

లాంగ్‌బర్న్‌లో ఆడవాళ్ళు, తాము నెదర్‌ఫీల్డ్‌కి వెళ్లివచ్చాం కనుక నెదర్‌ఫీల్డ్ వాళ్ళు కూడా తమ ఇంటికి కులాసా కాలక్షేపానికి వస్తారని ఎదురు చూశారు. నెదర్‌ఫీల్డ్ వాళ్ళు అలా రానే వచ్చారు. మిసెస్ హార్ట్స్, మిస్ బింగ్లీలను గురించి బెనెట్ సతికి అదరాభిమానాలు పెరుగుతున్నాయి. పెద్ద అమ్మాయి లిద్దరూ, ఆ అక్కా చెల్లెళ్ళతో పరిచయం చేసుకుందాం అని తీర్మానించుకున్నారు. జేన్ ఈ ప్రతిపాదనను ఆహ్లాదంగా స్వీకరించింది. ఎలిజబెత్‌కు మాత్రం వీళ్ళు మాట్లాడుకొంటున్న ధోరణి నచ్చలేదు.

"పదిలో తొమ్మిది సందర్భాల్లో స్త్రీ తన నిజమైన ప్రేమానురాగాల కంటే ఎక్కువే ప్రదర్శిస్తుంది. బింగ్లీకి మీ అక్క అంటే ఇష్టమే. సందేహం లేదు. కానీ అంతటితో తృప్తిపడి ఆమె ఊరుకుంటే, వ్యవహారం ఇంక- ముందుకు నడవదు" అంది లిజ్జీతో చార్లెట్.

"మా అక్క స్వభావమే అంత. దానికి ప్రోత్సాహం, సాహసం తక్కువ. అయినంత మాత్రాన అతనూ మౌనంగా ఊరుకుంటాడా? మా అక్క ప్రేమను అతను గుర్తించడా?"

"ఈ విషయం గుర్తుంచుకో, లిజ్జీ, జేన్ స్వభావాన్ని గురించి నీకు తెలిసినంతగా అతనికి తెలియదు కదా!"

"అయితే, ఒక స్త్రీ తన వైపు మొగ్గివుండి, దాన్ని ప్రదర్శించటానికి సిగ్గుపడుతూ ఉంటే - పురుషుడు ఆమెను పట్టించుకోవద్దా?"

"కావచ్చు. అది పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. బింగ్లీ జేన్ తరచూ కలుసుకోవచ్చు. చుట్టూ ఎందరో మనుషులు ఉంటారు గనుక ప్రతిసారీ వాళ్ళకు స్వేచ్ఛగా మాట్లాడుకోవటానికి అవకాశం ఉండకపోవచ్చు. అందుచేత జేన్ జాగ్రత్తగా మెలగి అతన్ని ఆకర్షించేటట్టు ప్రయత్నించాలి. అతన్ని అలా ఆకట్టగలిగినప్పుడు, తీరుబడిగా ప్రేమించటానికి, తన ప్రేమను ప్రదర్శించటానికి అవకాశం వస్తుంది?

"నీ ఆలోచన బాగుంది. హాయిగా వివాహం చేసుకోమనటమే ధ్యేయం అయినప్పుడు ఇదేమార్గం. ధనికుడైన భర్తను పొందదలచుకుంటే, నేను ఇదేమార్గం అవలంబిస్తాను. అయితే జేన్ భావనలు వేరుకదా! దానికి ఇటువంటి సంగతులు తెలియవు. తన మనస్థితి, కారణా కారణాలు తెలుసుకునేంత ఇంగితజ్ఞానం కూడా లేదు. అతన్ని ఒక పక్షం రోజుల నుంచి ఎరుగుదును. మెరిటాన్‌లో అతనితో నాలుగుసార్లు డ్యాన్స్ చేసింది. ఒకనాడు ఉదయం అతని ఇంటిలోనే అతన్ని చూసింది. నాలుగుసార్లు అతనితో విందులో

పాల్గొంది. ఇంతమాత్రం చేత ఆమె అతని శీలాన్ని గమనించి గ్రహించలేదు."

"అతనితో విందులో పాల్గొన్నదంటే, భోజనాదికాలాలలో అతని అభిరుచులను గ్రహించిందన్నమాట. కానీ నాలుగు సాయంత్రాలు అతనితో కలిసి ఉందికదా. నాలుగు సాయంత్రాలంటే ఏం తక్కువ కాదు. ఈ లోపల ఎంత కథయినా తయారు చేసుకోవచ్చు."

"అవును. కానీ– వాళ్ళు ఈ ప్రయోజనాన్ని సాధించారా అని అనుమానం."

చార్లెట్ ఇలా అంది: "జేన్‌కు ఈ విషయంలో జయం కలగాలని నేను హృదయ పూర్వకంగా కోరుతున్నాను. త్వరలోనే ఆమె బింగ్లీని వివాహం చేసుకోగలుగుతుందని ఆశిస్తున్నాను. వివాహంలో సుఖం అనేది కేవలం అవకాశం మీద ఆధారపడి ఉండే విషయం. భార్యాభర్తలు ఒకళ్ళ స్వభావాన్ని ఒకళ్ళు తెలుసుకున్నంతమాత్రాన వాళ్ళ సుఖానికి ఏమీ అడ్డంకి లేదని అనుకోవటానికి లేదు. **జీవితంలో మన భాగస్వామికున్న లోటుపాట్ల గురించి ఎంత తక్కువగా తెలుసుకుంటే అంత మంచిది.**"

"నీ మాటలు వింటూంటే నవ్వు వస్తోంది చార్లెట్. కానీ అది అంత మంచిమార్గం కాదనుకుంటాను. నీవు మాత్రం ఇలా ప్రవర్తించవనుకుంటాను."

బింగ్లీ చెల్లెళ్ళ వంక ఎలిజబెత్ చూసింది కానీ, వాళ్ళ సంభాషణా వస్తువు తనేనని ఎరుగదు. డార్సీ తనను ముందు ఆమోదించలేదు. బాల్‌లో తన పట్ల కుసంస్కారం ప్రదర్శించాడు. కానీ, తర్వాత ఆమె నల్లని నేత్రాలలోని కాంతి అసాధారణమైనదని గ్రహించ నారంభించాడు. ఆమె ఆకారం ఆకర్షణీయంగా ఉందని గ్రహించసాగాడు. ఆమెలోని నిర్వికారత, నిరామయత అతన్ని ఆకర్షించసాగాయి. ఈ విషయం ఆమె గమనించనే లేదు. అతన్ని గురించి ఆమె పూర్వపు అభిప్రాయాలు మార్చుకోలేదు.

అతను ఆమెను గురించి ఇంకా తెలుసుకోవాలని ప్రయత్నించసాగాడు. ఆమె ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు రహస్యంగా వింటున్నాడు. అతనిలా చేస్తూ ఉండటం ఆమె గమనించింది.

"నేనిందాక కల్నల్ ఫోస్టర్‌తో మాట్లాడుతూంటే, డార్సీ పొంచి వింటున్నాడు. అతని ఉద్దేశం ఏమయి ఉంటుంది?" అనడిగింది ఎలిజబెత్ చార్లెట్‌ను.

"ఈ ప్రశ్నకు డార్సీ ఒక్కడే సమాధానం చెప్పగలడు."

"ఈసారి అలా చేశాడంటే, ఈ వ్యవహారం అంతుతేల్చుకుంటాను. అతని చూపులే వ్యంగ్యంగా ఉంటాయి. అతన్ని ఎక్కడికక్కడే తృణీకరించాలి."

ఇంతలోనే డార్సీ అటువైపు వస్తున్నాడు. అతనితో మాట్లాడమని చార్లెట్ ఆమెను ప్రోత్సాహపరిచింది. స్నేహితురాలి మాటలకు ఆలంబనగా తీసుకుని ఎలిజబెత్ అతన్ని ఇలా మాట్లాడించింది. 'ఇందాక ఫోస్టర్‌ను, మెరిటాన్‌లో గొప్ప బాల్ ఏర్పాటుచేయమని చెబుతూ, చాలా అసాధారణంగా మాట్లాడానా?'

"అవును. అలాంటి విషయాలలోనే ఆడవాళ్ళకి ఎక్కడలేని ఉత్సాహం ఉంటుంది."

"మీరు చాలా కఠినంగా మాట్లాడుతున్నారు."

మిస్ లూకా (చార్లెట్) అక్కడ నుంచి వెళ్ళబోతూ 'నేను వాద్యం తెరిచి వాయించబోతున్నాను. దానితో పాటు ఏం జరుగుతుందో తెలుసుగా' అంది ఎలిజబెత్‌తో.

"నీవు చాలా చిత్రమైన దానివి. అందరి ముందూ నన్నే ఆడి పాడమంటావు. కానీ నాకు గొప్ప విద్య ఏం వచ్చునని? సరే. కానీ నీ మాట ఎందుకు కాదనాలి" అంటూ డార్సీ వంక ఒకసారి చూసి వెనుకటికి ఒక సామెత ఉంది. బహుశాః అందరికీ తెలిసిందే. 'అన్నం చల్లారేంత వరకూ ఓపిక పట్టను' అని! ఆ సామెత ప్రకారమే వ్యవహరిస్తాను."

ఆమె సంగీత కచేరి గొప్పగా లేకపోయినా ఒక మాదిరిగా ఉంది. శ్రోతలు పాటలను ఒకటికి రెండుసార్లు పాడించుకున్నారు.

డార్సీ పరిస్థితి అంతటినీ గమనిస్తూ దూరంగా కూర్చున్నాడు. సర్ విలియం లూకా అతనితో ఇలా అన్నాడు. "నిజంగా ఈ బాల్ డ్యాన్సులు ఈ రోజుల్లో యువకులకు ఎంతో అవసరం డార్సీ! నేటి నాగరిక సమాజంలో ఇంతకు మించిన వినోదం లేదు."

"అవునండీ. అంత నాగరికం కాని సమాజంలో కూడా ఈ డ్యాన్స్‌లు ఉన్నాయి. ఈ రోజుల్లో ప్రతివాడికీ డ్యాన్స్ చేయటం వచ్చును!"

సర్ విలియం నవ్వాడు. "నీ స్నేహితుడు బాగా చేస్తాడు. నీకు కూడా ఈ విద్యలో ప్రావీణ్యం ఉందనుకుంటాను."

"మెరిటాన్‌లో డ్యాన్స్ చేశానుగా! మీరు చూసే ఉంటారు."

"అవును! నీకు పట్టణాలలో స్వంత భవనం ఉంది కదూ?"

డార్సీ నింపాదిగా ఇలా అన్నాడు. "గొప్ప కుటుంబాలతో పరిచయం ఏర్పడుతుందని, పట్టణంలోనే మకాం చేద్దామనుకొన్నాను."

ఇంతలో ఎలిజబెత్ అటువైపు వస్తోంది. విలియం గారికి బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. ఆమెను పిలిచి ఇలా అన్నాడు. 'ఏం లిజ్జీ, నీవు డ్యాన్స్ చేయకుండా ఖాళీగా ఉన్నావేం? డార్సీ ఈ అందాల భామ, డ్యాన్సులో భాగస్వామినిగా బ్రహ్మాండంగా ఉంటుంది. ఇంత అందం నీ కళ్ళముందు హరివిల్లులా విరిసివుండగా, నీవు డ్యాన్స్ చేయనని నిరాకరించటానికి వీల్లేదు" అంటూ ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకొని డార్సీకి అందించబోయాడు. డార్సీ ఆశ్చర్యపోతున్నాడు. అయితే ఇంతలో ఆమె తన చేతిని వెనక్కు లాక్కుంది. విలియంతో ఇలా అంది: "నాకిప్పుడు డ్యాన్స్ చేయాలని లేదు. నేను భాగస్వామికోసం వెదుకుతూ ఇటు వచ్చాననుకోకండి."

డార్సీ ఆమె చేతిని అందుకోవటానికి ప్రయత్నించాడు కానీ ఫలితం లేకపోయింది. ఎలిజబెత్ కృతనిశ్చయురాలై ఉంది. విలియం ప్రయత్నం విఫలమైంది.

"డ్యాన్స్ చేస్తున్నప్పుడు నీవు చాలా బాగుంటావు ఎలిజా! నీ నృత్యం చూడాలని ఉంది. నా మాట కాదనకు. ఈ పెద్దమనిషికీ ఏమీ అభ్యంతరం లేదు. ఒక్క అరగంట సేపు ఇద్దరూ మా కళ్ళకు ఆనందం కలిగించండి."

లిజ్జీ ఒకసారి చుట్టూ చూసి అక్కడ నుంచి వెళ్ళిపోయింది. డార్సీ ఆలోచిస్తూ నిల్చున్నాడు. ఇంతలో మిస్ బింగ్లీ అక్కడికి వచ్చి "నువ్వు దేన్ని గురించి పగటి కలలు కంటున్నావో నాకు తెలుసు" అంది.

"తెలియదనుకుంటాను."

ఈ సమాజంలో ఇటువంటి సాయంత్రాలు ఎన్ని గడపాలో అని చింతపడుతున్నావు. నా ఉద్దేశం కూడా అదే. నాకు పూర్వం ఎప్పుడూ ఇంత చిరాకనిపించలేదు. ఇక్కడి మనుషుల గొడవ, గందరగోళం, ప్రాముఖ్యం అంతా నాకు విసుగనిపిస్తోంది."

"నీ ఆలోచనంతా తప్పే. ఇప్పుడు నా మనస్సు ఈ వాతావరణానికి అంగీకార ప్రాయంగా ఉంది. సుందరమైన యువతి నేత్రద్వయం ప్రసరించే కాంతిని గురించి నేను ధ్యానిస్తున్నాను తెలుసా?"

మిస్ బింగ్లీ వెంటనే అతని ముఖంలోకి గుచ్చి చూసింది. ఇన్ని ఆలోచనలకు మూలకందం అయిన ఆ యువతి ఎవరో చెప్పమని కోరింది.

డార్సీ ఏమీ జంకు గొంకు లేకుండా "మిస్ ఎలిజబెత్ బెనెట్" అన్నాడు.

"ఎలిజబెత్ బెనెటా? నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆమె ఎంత కాలంగా నీ ఇష్టదేవత? ఇంతకూ నా విషయం ఏం చెబుతావు?" అనడిగింది.

"సరిగ్గా నేననుకున్న ప్రశ్నే అడిగావు. నీవిలా అడుగుతావని నాకు తెలుసు. ఆడవాళ్ళ ఆలోచనలు వాయువేగ మనోవేగాల కంటే ఎక్కువ వేగం కలవి. అనురాగం నుంచి ప్రేమగా మారతాయి. ప్రేమ నుంచి వివాహానికి జారతాయి అంతా ఒక్క క్షణంలో! నా సంతోషాన్ని నీవు ఆమోదిస్తావనుకుంటాను ఏం?"

"నీవు ఇదంతా సీరియస్‌గా చెబుతుంటే, మన వ్యవహారం ముగిసినట్టుగానే నేను భావిస్తాను. నీ అత్తగారు ఎంతో పరిపూర్ణమైన మనిషి. ఆమె కూడా, ఎప్పుడూ నీతోనే పెంబర్లేలో ఉంటుంది." ఆమె మాటలు నిర్లక్ష్యంగా విన్నాడు. ఆమె ఇలా మాట్లాడుతూ వినోదిస్తోంది. అతని గాంభీర్యం తిలకిస్తే అంతా భద్రంగానే ఉన్నట్టు భ్రమ కలిగింది.

7

బెనెట్‌కు సంవత్సరానికి రెండు వేల ఆదాయం వచ్చే ఎస్టేటు ఉంది. అయితే దాని నియమాల ప్రకారం మగశిశువు లేని కారణంగా ఆయన తదనంతరం దూరపు బంధువైన ఎవరో మగవాడికి చెందుతుంది.

లాంగ్‌బర్న్ గ్రామం మెరిటాన్‌కు ఒక మైలుదూరం ఉంటుంది. ఆడవాళ్ళకు అందుబాటులో ఉండేదూరం. వారానికి మూడు నాలుగుసార్లన్నా కనీసం తిరుగుతూ ఉంటారు. వాళ్ళలో చిన్నవాళ్ళు (కిట్టీ) కాథరైన్, లిడియాలు మరీ ఎక్కువగా తిరుగుతూ ఉంటారు. వీళ్ళు ఎప్పుడు తీరుబడి చిక్కితే అప్పుడు, ఎప్పుడు ఏమీ తోచకపోతే అప్పుడు, అలా షికారుగా వెళ్ళి వస్తూ ఉంటారు. ప్రస్తుతం మెరిటాన్‌లో గొప్ప సైనిక పటాలం విడిది ఉంది. అది ఈ శీతాకాలమంతా ఇక్కడే ఉంటుందట. దాన్ని గురించిన వార్తలే ఇప్పుడు గ్రామంలో నలుగురూ చెప్పుకుంటున్నారు. ఈ అక్కాచెల్లెళ్ళు మెరిటాన్ వెళ్ళినప్పుడల్లా తమ పిన్ని ద్వారా ఈ సైనికోద్యోగుల గురించిన విశేషాలు సేకరిస్తున్నారు. వాళ్ళ మకాములు ఇప్పుడు రహస్యంగా ఉండటం లేదు. సరాసరి ఉద్యోగులతో పరిచయం కూడా సులభంగానే ఉంది. ఇప్పుడు వాళ్ళ సంభాషణలలో ఎంతసేపూ సైనికోద్యోగులే మెదులుతున్నారు. బింగ్లీ భోగభాగ్యాలను గురించి కూడా వాళ్ళకు అంత లెక్కలోని విషయం అనిపించటం లేదు.

ఒక రోజు ఉదయం వాళ్ళ సంభాషణను వింటూ, తండ్రి- బెనెట్ ఇలా అన్నాడు:

"మీరు మాట్లాడుకుంటున్న దాన్నిబట్టి చూస్తే ఈ దేశంలోకెల్లా కొంటెపిల్లలు మీరే అనిపిస్తున్నారు. ఈ అనుమానం నాకు ఇదివరకే ఉండేది, కానీ ఇప్పుడు దృఢపడింది."

కిట్టీ ఏమీ బదులు పలకలేదు. లిడియా మటుకు కెప్టెన్ కార్టర్ అంటే తనకు ఇష్టమనీ, అతను లండన్ వెళ్ళేటప్పుడు తను ఎక్కడ పొంచి ఉండి చూస్తుందో- అన్నీ చెప్పింది.

మిసెస్ బెనెట్ "మీ పిల్లలని గురించి మీరే ఇలా చిలిపి వాళ్ళనీ, పెంకివాళ్ళనీ అనటం ఏమీ బాగాలేదు. నా పిల్లలు చిలిపివాళ్ళయితే, నేను జాగ్రత్తలో ఉండాలి కదా!" అంది.

"వాళ్ళు చాలా తెలివైన వాళ్ళు."

"ఇదుగో. ఈ విషయంలోనే నేను మీతో ఏకీభవించను. మన ఆఖరు అమ్మాయిల విషయంలో మటుకు మన అభిప్రాయాలు తారుమారుగా ఉన్నాయి."

"ఇటువంటి అమ్మాయిలు, తల్లిదండ్రుల్లా ఎందుకు ఆలోచిస్తారు? వాళ్ళూ మనంత వయస్సు వాళ్ళయ్యాక ఇలా ఆఫీసర్లను గురించి తర్కించుకోరని మట్టుకు ఘంటాపథంగా చెబుతాను. ఒకప్పుడు నా చిన్నతనంలో నేను ఎర్రకోటు కోసం ఎంతో హంగామా చేశాను. పోతే, మన అమ్మాయిలలో ఎవర్నయినా సంవత్సరానికి అయిదారు వేలు ఆదాయం వచ్చే కర్నల్ చేసుకుంటానంటే నేనేమీ అభ్యంతరం చెప్పను!"

విడియా అంది: "అమ్మా! పిన్ని ఒక కొత్త విషయం చెప్పింది. కెప్టెన్ కార్టర్ మొదట్లోలాగ ఇప్పుడు వాట్సన్ ఇంటివైపుకు అడపా దడపా వెళ్ళడం లేదట. క్లార్క్ లైబ్రరీలోనే ఎక్కువసేపు గడుపుతున్నాడట!"

మిసెస్ బెనెట్ సమాధానం చెబుదామనుకుంది. కానీ ఇంతలో నెదర్‌ఫీల్డ్ నుంచి

నౌకరు జేన్‌కు చీటీ ఒకటి పట్టుకు వచ్చాడు. మిసెస్ బెనెట్ కళ్ళు ఆనందంతో మిరుమిట్లుగొల్పాయి. కూతురు ఉత్తరం చదువుకుంటూంటే ఆమె ప్రశ్నల వర్షం కురిపించింది. 'ఆ ఉత్తరం ఎక్కడినించి? ఎవరు రాశారు? దేన్నిగురించి? జేన్, తొందరగా చెప్పవే! అబ్బ! ఎంతసేపు అలా నీలో నీవే చదువుకుంటావు. ఊ- చెప్పు."

"ఈ ఉత్తరం మిస్ బింగ్లీ దగ్గర్నుంచి" అంటూ జేన్ ఇలా చదివింది!

"ప్రియస్నేహితులారా!

చార్లెట్, నేనూ ఒంటరిగా ఉన్నాం. నీవు మాతోపాటు విందుకు రావాలని కోరుతున్నాం. మేమిద్దరం ఒంటరిగా ఈ రోజంతా గడపవలసి ఉండేట్టయితే, ఆజన్మాంతం ఇంక మాట్లాడుకోలేం. ఏమంటే ఇద్దరు ఆడవాళ్ళు జేరితే సాయంత్రం లోపల పోట్లాట తప్పదు. అందుచేత ఈ చీటీ అందిన వెంటనే మా ఇంటికి బయలుదేరిరా. మా అన్న, ఇతరులు ఆఫీసర్లతో భోజనం చేస్తారట- ఉంటాను."

-కారలైన్ బింగ్లీ

"ఆఫీసర్లతోనా! పిన్ని నాకు ఈ విషయమే చెప్పలేదే!" అంది లిడియా.

"గుఱ్ఱపు బగ్గీ తీసుకుపోనా?" అని అడిగింది జేన్.

"వొద్దు. గుఱ్ఱం మీద వెళ్ళు. ఏమంటే వాన వచ్చేటట్టుగా ఉంది. ఈ రాత్రంతా అక్కడే ఉండిపోవలసి వస్తుందేమో!"

"ఇది మంచి ఆలోచనే! అయితే వాళ్ళు ఇంటికి పంపుతామంటారేమో!" అంది ఎలిజా.

"ఓ! వాళ్ళు బింగ్లీ తాలూకు బగ్గీలో మెరిటాన్ వెడతారు. హార్స్‌కు స్వంతకోచీ లేదు."

"నేను బగ్గీలో వెళ్ళటమే మంచిదనుకుంటాను!" అంది జేన్.

"గుఱ్ఱాలను వదలటానికి వీలు లేదు. ఇవాళ పొలం పనులున్నాయి!" అంది తల్లి.

"అవును" అన్నాడు తండ్రి.

చివరకు జేన్ గుఱ్ఱం మీద స్వారీ చేస్తూ వెళ్ళటానికే నిశ్చయమయింది. తల్లి గుమ్మం దాకా వచ్చి సాగనంపింది. జేన్ అన్నట్టుగానే, ఇలా పది అడుగులు వేసిందో లేదో వర్షం ఆరంభమైంది. ఆమె చెల్లెళ్ళు విసుక్కున్నారు. కానీ తల్లి సంతోషించింది. వర్షం క్షణం విరామం లేకుండా కురుస్తూనే ఉంది. జేన్, నిశ్చయంగా, ఇంటికి తిరిగి రాలేదు!

వర్షం కురవటం తన ప్రయోజకత్వం వల్లనే అయినట్టు 'నా ఆలోచన బ్రహ్మాండంగా పనిచేసింది' అనుకుంది మిసెస్ బెనెట్ తనలో తనే చాలాసార్లు. మరురోజు ఉదయం ఫలహారాలు అయీ అవకుండా ఉన్న సమయంలో నెదర్ ఫీల్డ్ నుంచి నౌకరు మరో చీటీ పట్టుకు వచ్చాడు. ఆ చీటీ ఎలిజబెత్‌కు.

"లిజ్జీ,

ఈ ఉదయం నాకు ఒంట్లో ఏమీ బాగో లేదు. నిన్నంతా తడవటంవల్లే అనుకుంటా. ఇక్కడ అంతా పూర్తిగా జ్వరం తగ్గాకగాని ఇంటికి వెళ్ళటానికి వీల్లేదంటున్నారు. అదీగాక నేను బింగ్లీని చూడాలని వాళ్ళ కోరిక. అతను నన్ను కలుసుకున్నట్టు వింటే ఏమీ గాభరా పడకండి. జలుబు, తలనొప్పి తప్ప, నాకు ఇంకేమీ అనారోగ్యం లేదు - ఉంటాను!"

ఉత్తరాన్ని బిగ్గరగా చదవగా విని బెనెట్ "నీ కూతురుకు అనారోగ్యం ఏర్పడినా అది ముదిరి ఆమె మరణించినా ఇదంతా బింగ్లీకోసం వేటలో- అందునా నీ ఆజ్ఞానుసారం గానే - జరిగినదని అనుకోవచ్చు."

"నాకేం అటువంటి భయంలేదు. కేవలం జలుబు చేసినందువల్లే ఎవరూ చనిపోరు. ఆమెని అక్కడ ఎంతో జాగ్రత్తగా చూస్తారు. ఆమె అక్కడున్నన్నాళ్ళూ క్షేమంగానే ఉన్నదని మనం భావించుకోవచ్చు. మీరు గుఱ్ఱపు బగ్గీ తీసుకు వెళ్ళటానికి అనుమతిస్తే నేను వెళ్ళి అమ్మాయిని చూసి వస్తాను" అంది మిసెస్ బెనెట్.

ఎలిజబెత్‌కు చాలా ఆదుర్దాగా ఉంది. తను కూడా వెళ్ళి అక్కను చూడాలనుకుంది. బగ్గి దొరికినా, దొరక్కపోయినా తనకూ ఎలాగూ గుర్రపు స్వారి రాదు కనుక, కాలినడకన వెళదామనుకుంది. ఈ అభిప్రాయాన్ని పైకి చెప్పింది కూడా.

"ఈ బురదలో ఎలా నడిచి వెడతావు? అక్కడికి చేరుకున్నాక, నీవు చూడటానికి మనిషిలాగా ఉండవు!" అంది తల్లి.

"జేన్‌ను చూడటమే నాకు కావల్సింది. అందుకు నేను ఎలా ఉంటే ఏం?"

"అయితే బగ్గీ సిద్ధం చేయించమంటావా? అంతేనా నీవనేది?" అన్నాడు తండ్రి.

"నేననేది అదికాదు. నాకేం నడవటం కష్టం కాదు. మూడు మైళ్ళు. నా ఆతృత దృష్ట్యా లెక్కలోని దూరంకాదు. సాయంత్రం భోజనం సమయానికి తిరిగి వచ్చేస్తాను."

"మెరిటాన్ వరకూ నీకు తోడుగా వస్తాం" అన్నారు, కిట్టీ, లిడియా. లిజ్జీ సరే అంది. ముగ్గురూ కలిసి బయలుదేరారు. లిడియా మార్గమధ్యంలో ఇలా అంది. 'మనం కాస్త అడుగు ముందుగా వేస్తే, కెప్టెన్ కార్టర్ ప్రయాణ సన్నాహం చూడగలం."

మెరిటాన్‌లో వాళ్ళు విడిపోయారు. చెల్లెళ్ళిద్దరూ మెరిటాన్‌లో ఆఫీసర్ల భార్యలు ఉండే ఇంట్లో ప్రవేశించారు. ఎలిజబెత్ తన ప్రయాణాన్ని కొనసాగించింది. త్వరత్వరగా పొలాలు దాటుతోంది. చివరకు వాళ్ళ ఇల్లు కనుచూపు మేరలోకి వచ్చింది. ఈ సరికి ఆమె కాళ్ళు అలిసి సొలిసి నెప్పులు పుడుతున్నాయి.

ముందు ఆమెను అల్పాహారాల వసారాలోకి తీసుకు వెళ్ళారు. అక్కడ జేన్ తప్ప తతిమ్మా ఆడవాళ్ళంతా ఉన్నారు. ఆమె ఆకారం అక్కడి వాళ్ళందరికీ ఆశ్చర్యం గొలిపింది. ఈ దారుణ వాతావరణంలో మూడు మైళ్ళు నడిచి ఒంటరిగా ఇలా వచ్చిందంటే, ఇది ఈ అక్కాచెల్లెళ్ళిద్దరికీ అప్రతిష్ట. ఏమైతేనేం ఆమెను సగౌరవంగానే ఆదరించారు. వాళ్ళ

అన్న సభ్యతలో ఒక మెట్టు పైనే ఉన్నాడు. డార్సీ ఏమీ మాట్లాడలేదు. హార్ట్స్ అంతకన్నా నోరు మెదపలేదు. డార్సీ ఆమె ఇలా రాగలిగిన సాహసానికీ, రావలసిన అవసరానికి ఉన్న సంబంధాన్ని గురించి యోచిస్తున్నాడు. హార్ట్స్ తన ముందున్న భోజన పదార్థాలను గురించి ఆలోచిస్తున్నాడు.

అక్కను గురించి అడిగితే ఎవరూ జవాబు చెప్పలేదు. మిస్ బెనెట్ పడుకొని ఉంది. మెలుకువగానే ఉన్నా, జ్వరం ఉంది. లిజ్జీని జేన్ దగ్గరకు తీసుకు వెళ్లారు. జేన్ చెల్లెలును చూడటంతోటే ఎంతో సంబరపడింది. ఇద్దరూ కాసేపు కులాసా కబుర్లు చెప్పుకున్నారు.

అల్పాహారం అయిన తర్వాత అక్కాచెల్లెళ్ళు వాళ్ళ దగ్గరకు వచ్చారు. ఎలిజబెత్ వాళ్ళతో అనునయంగా మాట్లాడింది. అప్పుడుగాని ఆమెకు జేన్ అంటే ఎంత ప్రేమో వాళ్ళకు అర్థం కాలేదు. డాక్టర్ రోగిని చూసి వెళ్ళాడు. జలుబు తప్ప ఇంకేంలేదన్నాడు. విశ్రాంతి తీసుకోవాలని చెప్పి రెండు మందు మాత్రలు ఇచ్చాడు. డాక్టరు సలహా వెంటనే పాటించబడింది. తలనెప్పి ఎక్కువయింది. జ్వరం తీవ్రమయింది! ఎలిజబెత్ క్షణం కూడా అక్కను వదలి ఉండటం లేదు. తతిమ్మా ఆడవాళ్ళు కూడా గదిలోనే కూర్చుని ఉంటున్నారు. మగవాళ్ళు బయటికి వెళ్ళారు. వాళ్ళకు అంతకంటే, ఏమీ పని లేదు.

గడియారం మూడు గంటలు కొట్టింది. ఎలిజబెత్ తిరిగి వెళ్ళిపోవాలి. ఎంతో అయిష్టం మీద ఈ మాట పైకి చెప్పింది. మిస్ బింగ్లీ ఆమెను తన బగ్గీలో ఇంటికి పంపుతానంది. ఎలిజబెత్ ఎంతో బలవంతం చేసిన మీదట కానీ ఇందుకు ఒప్పుకోలేదు. అయితే చెల్లెలు వెళ్ళిపోవటానికి జేన్ అంగీకరించలేదు. మిస్ బింగ్లీ ఆమెను ఇక్కడే ఉండిపొమ్మని కోరింది. ఎలిజబెత్ ఇందుకు సంతోషంగా అంగీకరించింది. ఇది లాంగ్‌బర్న్‌లో చెప్పి అవసరమైన దుస్తులు తీసుకు రావటానికి నౌకరును పంపారు.

8

అయిదు గంటలకు ఇద్దరూ దుస్తులు మార్చుకున్నారు. ఆరున్నరకు ఎలిజబెత్‌కు భోజనానికి పిలుపు వచ్చింది. బింగ్లీ చెల్లెళ్ళు జేన్ పట్ల తమ సానుభూతి తెలిపి వెళ్ళిపోయారు. అంతటితో వాళ్ళు ఆ విషయమే మర్చిపోయినట్టు ఇతర సంభాషణల్లో పడ్డారు. బింగ్లీ జేన్ పట్ల ఎంతో ఆతురత కనబరుస్తున్నాడు. ఎలిజబెత్ పట్ల ఎంతో శ్రద్ధ చూపుతున్నాడు. తను పిలవని పేరంటానికి ఇక్కడికి ఎందుకు వచ్చిందని అందరూ అనుకుంటారేమోనని ఎలిజబెత్ మొదట భయపడింది. కానీ, ఈ ధోరణి చూసిన తరువాత తనను తాను సంబాళించుకుంది. జేన్‌కు అతని ధ్యాస తప్ప మరొకటి లేదు.

భోజనాలు అయిన తర్వాత, ఎలిజబెత్ సరాసరి తన అక్క దగ్గిరికి వెళ్ళింది. ఆమె అటు వెళ్ళగానే మిస్ బింగ్లీ ఆమె అలవాట్లను, వైఖరిని అసహ్యించుకుంటూ మాట్లాడ

సాగింది. ఆమెకు అహం, మొండితనం ఉన్నదంది. హుందాతనం, సుకుమారం ఏమీ లేవంది. మిసెస్ హర్ట్స్ కూడా ఇలాగే మాట్లాడింది. ఇంకా ఇలా అంది. "అతివేగంగా నడవగల శక్తి తప్ప ఇంక ఆమెలో చెప్పుకోదగ్గ ప్రత్యేకత ఏమీలేదు. ఈ ఉదయం ఆమె ఇక్కడికి వచ్చిన వైఖరి నేను మర్చిపోలేను. పూర్తిగా అడివి మృగంలా ఉంది."

"అసలు ఇక్కడికి రావడమే అసందర్భం! అక్కకు జలుబు చేసినంత మాత్రాన అలా జుట్టు విరబోసుకుని పొలాల వెంటపడి రావలసిందేనా?"

"ఆమె ముఖం చూశావా, ఎంత పీక్కుపోయి ఉందో! పోనీ, దుస్తులు చూశావా! మోకాళ్ళ వరకు మడ్డి! బురదలో కూరుకుపోయినట్టున్నాయి."

"నీవు చెబుతున్నది నిజమే కావచ్చు! కానీ ఇదేమీ దుర్భరంగా కనిపించటం లేదు నాకు. ఈ ఉదయం ఆమె గదిలోకి ప్రవేశించినప్పుడు, నా కళ్ళకు బాగానే కనిపించింది. ఆమె బురద దుస్తులు నా కంటికి ఆనలేదు" అన్నాడు బింగ్లీ.

"ఆ మురికి గుడ్డలు నీవైనా చూశావా డార్సీ? నీ సోదరే కనుక అలాంటి ప్రదర్శన చేస్తే నీవు సహించగలవా?" అంది మిస్ బింగ్లీ.

"ఎంతమాత్రం సహించలేను!"

"మూడు మైళ్ళూ ఒంటరిగా అలా నడిచి రావటం! ఇందులో ఆమె అభిప్రాయం ఏమిటి? స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే పేరుతో తన పల్లెటూరితనం ప్రదర్శించుకోవటమేగా!"

"ఇలా రావటంలో, ఆమెకు అక్క ఎడల ఉన్న అభిమానం కనిపిస్తోంది. అదే గమనార్హమైన విషయం" అన్నాడు బింగ్లీ.

"ఆమె చేసిన ఈ సాహసం వల్ల, ఆ కాంతులీనే నేత్రాల పట్ల నీ అభిమానం తగ్గిపోవటం లేదు గదా!" అంది దాదాపు రహస్యంగా, మిస్ బింగ్లీ- డార్సీతో.

"ఎంతమాత్రం కాదు. ఈ శారీరక శ్రమతో వాటి కాంతి మరింత ఎక్కువయింది. ఆ నేత్రాలు మరింత శోభాయమానంగా ఉన్నాయి" అన్నాడు డార్సీ. కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత హర్ట్స్ ఇలా అన్నాడు: "నాకు జేన్ అంటే ఎక్కువ అభిమానమే ఉంది. ఆమె మధురమైన యువతి. ఆమె జీవితం హాయిగా కుదుటబడాలని నేను కోరుతున్నాను."

"వాళ్ళ బాబాయి మెరిటాన్‌లో అటార్నీ అన్నట్టున్నావు కదూ?"

"అవును. వాళ్ళకు ఇంకో బాబాయి కూడా ఉన్నాడు. ఏదో మారుమూల పల్లెలో!"

"బ్రహ్మాండంగా ఉంది" – అక్క చెల్లెళ్ళు మనస్ఫూర్తిగా హాయిగా నవ్వుకున్నారు.

"అయితేనేం వాళ్ళను గురించి మనం చౌకగా అనుకోరాదు." అన్నాడు బింగ్లీ.

"అందువల్ల వాళ్ళకు గొప్ప సంబంధాలు రావు గదా!" అన్నాడు డార్సీ.

బింగ్లీ ఇందుకేమీ సమాధానం చెప్పలేదు.

తరువాత ఆ అక్కాచెల్లెళ్ళు జేన్ దగ్గరకు వెళ్ళి, కాఫీల వేళదాకా అక్కడే కూర్చున్నారు.

ఎలిజబెత్ అక్కను విడిచి ఉండటంలేదు. సాయంత్రం అక్క నిద్రపో నారంభించాక, తను లేచి ఇవతలి వసారాలోకి వచ్చింది. అక్కడే అందరూ కూర్చుని ఉన్నారు. పేకాటలోకి ఆమెను కూడా ఆహ్వానించారు. అయితే ఎలిజబెత్, అక్క అనారోగ్యాన్ని సాకుగా చెప్పి ఆటలోకి రాననీ అంతకన్నా కిందికి వెళ్ళి ఏదైనా పుస్తకం చదువుకుంటాననీ అంది.

హార్స్ట్ ఆమె వంక విచిత్రంగా చూసి "ఈ ఆట కంటే పుస్తకం చదవటమే బాగుంటుందా నీకు! ప్రత్యేకంగా ఉందే!" అన్నాడు.

"ఎలిజా బెనెట్‌కు చీట్లపేక అంటే అసహ్యం. ఆమెకు పుస్తకాలు చదవటమంటేనే ఇష్టం. అంతకంటే ఆమెకు మరో ఆనందం లేదు" అంది మిస్ బింగ్లీ.

"నేనంత పొగడ్తకు తగను. నేను గొప్పగా పుస్తకాలు చదివేదాన్ని కూడా కాదు. నాకింకా ఇంతకంటే చాలా విషయాల్లో ఆసక్తి, సంతోషం ఉన్నాయి."

"మీ అక్కకు సంరక్షణ చేయటంలో నీకు హాయి ఉన్నదనుకుంటాను. నీ చేతి చలువవల్ల ఆమె త్వరగా కోలుకుంటుందిలే" అన్నాడు బింగ్లీ.

ఎలిజబెత్ అతనికి హృదయాంతరంగంలో ధన్యవాదాలు సమర్పించింది. పుస్తకాల బల్ల దగ్గరకు వెళ్ళిన బింగ్లీ ఆమెకు తన పుస్తకాలన్నీ చూపాడు.

"నా దగ్గర ఎన్నో పుస్తకాలు లేవు. ఆలోచన అయితే ఉందిగానీ, వాటిని సేకరించటానికి ఓపిక లేకుండా పోతోంది.

ఎలిజబెత్ ఉన్న పుస్తకాలనే పరిశీలిస్తానంది.

"మా నాన్నగారు చాలా కొద్ది పుస్తకాలను మట్టుకే ఉంచారు. పెంబర్లేలో మీ లైబ్రరీ చాలా పెద్దది కదూ!" అంది మిస్ బింగ్లీ డార్సీతో.

"మా లైబ్రరీయా? ఎన్నో తరాలుగా సేకరిస్తున్న గ్రంథాలు! పెద్దది కాకపోవటమేం?"

"నీవు కూడా కొన్ని ఉత్తమ గ్రంథాలు పోగుచేశావు కదూ? ఎప్పుడూ పుస్తకాలు కొంటూనే ఉంటావు."

"ఈ రోజుల్లో కూడా పుస్తకాలయం విషయం అశ్రద్ధ చేసే వాళ్ళంటే నాకు అసహ్యం!"

ఎలిజబెత్ కొద్దిసేపు పుస్తకాలు తిరగేసి తరువాత పేకాట బల్ల దగ్గరకు వచ్చింది. బింగ్లీకి, అతని పెద్ద చెల్లెలికి మధ్య కూర్చుని ఆట గమనిస్తోంది.

మిస్ బింగ్లీ "మిస్ డార్సీ ఈ పాటికి బాగా పెద్దదై ఉండాలి. నా అంతపొడుగు ఎదిగిందా?" అని అడిగింది.

"ఎదిగిందనుకుంటాను. ఆమె ఇప్పుడు ఎలిజబెత్ అంత పొడుగు ఉంటుంది అనుకుంటాను. లేక మరికాస్త పొడుగు అయిందో!"

"నాకు ఆమెను చూడాలని ఉంది. ఆమె ఆకర్షించినంతగా నన్ను ఎవరూ ఆకట్టుకోలేదు. ఎంతమంచిది! ఎంత మంచిది! ఆమె పియానో వాద్యం మహా ఇష్టం."

"ఆడవాళ్ళు ఇన్ని విద్యల్లో ఎలా ఆరితేరుతున్నారో నాకు ఆశ్చర్యం." అన్నాడు బింగ్లీ.

"అంటే నీ ఉద్దేశం?"

"అందరూ- బల్లలకు రంగులు వేస్తారు, తలుపులకు తెరలు కూడా కుడతారు. పర్సులు అల్లుతారు. ఇంకా ఎన్నో కళలు నేర్చుకుంటారు. ఇంత ఓపిక వాళ్ళకెలా ఉందో!"

"అందరు ఆడవాళ్ళూ ఇంత నేర్పరులు కాదు. నాకు తెలిసినంతవరకూ, నీ వర్ణనకు సరిపోయే వాళ్ళు ఒక అరడజనుమంది మటుకు ఉన్నారు" అన్నాడు డార్సీ.

"అవును" అంది మిస్ బింగ్లీ.

"నేర్పరులైన స్త్రీలంటే మీకు గౌరవం ఉన్నదన్నమాట" అంది ఎలిజబెత్.

"అవును" అన్నాడు డార్సీ.

మిస్ బింగ్లీ వెంటనే అందుకుని ఇలా అంది: పరిపూర్ణమైన యువతి అంటే- ఆమెకు సంగీతం, ఆట-పాట, నటన మొదలైన లలిత కళలన్నీ వచ్చి ఉండాలి. ఆధునిక భావాలుండాలి. చక్కని నడక, బహుచక్కని కంఠస్వరం ఉచ్చారణ ఉండాలి."

"ఇన్నీ ఉండి ఆమె తన మనస్సును, ఎప్పటికప్పుడు విస్తృతమైన పుస్తక పఠనం వల్ల, పుష్టి చేసుకుంటూ ఉండాలి" అన్నాడు డార్సీ.

"అయితే నీ దృష్టిలో ఆరుగురే పరిపూర్ణ యువతులు ఉండటంలో ఆశ్చర్యంలేదు. అయితే వాళ్ళలో ఎవరినైనా నీవు చూశావా అని!" అంది లిజ్జీ.

"అయితే మీ ఆడవాళ్ళలోనే నీకు నమ్మకం లేదా?"

"నేనెప్పుడూ అలాంటి స్త్రీని చూడలేదు. అటువంటి సామర్థ్యం, అభిరుచి, అభినివేశం, అవయవ సౌష్టవం మిళితమై ఉన్న స్త్రీని నేను ఇంతవరకూ చూడలేదు."

మిసెస్ హర్ట్స్, మిస్ బింగ్లీ ఇద్దరూ ఆమెను కొట్టిపారేశారు. ఇటువంటి ఆడవాళ్ళను ఎందరినో తాము చూశామన్నారు. హర్ట్స్ అందరినీ కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండమన్నాడు. హడావుడి సద్దుమణిగాక, ఎలిజబెత్ గది ఒదిలి బయటకు వెళ్ళింది.

"ఎలిజా బెనెట్, తన జాతి వాళ్ళను తక్కువ చేసుకోవటం ద్వారా మగవాళ్ళను ఆకర్షిద్దామని ప్రయత్నిస్తోంది. నా ఉద్దేశంలో అది నీచమైన పని!" అంది మిస్ బింగ్లీ. అటు ఎలిజబెత్ బయటకు వెళ్ళీ వెళ్ళటంతో.

"ఆడవాళ్ళు పన్నే వలల్లో ఇటువంటి నీచాలు ఉంటూనే ఉంటాయి" అన్నాడు డార్సీ.

మిస్ బింగ్లీకి ఇతని జవాబు రుచించలేదు. అందుచేత సంభాషణ కొనసాగించలేదు.

ఎలిజబెత్ మళ్ళీ వాళ్ళ దగ్గరకు వచ్చి అక్క పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని చెప్పింది. ఆమెను వదిలి రాలేనని చెప్పింది. మరునాటికి జేన్ పరిస్థితి మెరుగనిపించకపోతే, డాక్టరును పిలిపిద్దామని నిర్ణయించారు చివరకు.

బింగ్లీకి చిరాగ్గా ఉంది. భోజనం తర్వాత అందరూ సంగీత కచ్చేరీలో కూర్చున్నారు.

రోగికీ ఆమె చెల్లెలుకూ సకల సౌకర్యాలు చేస్తూ, కనిపెట్టుకు ఉండమని పని మనిషితో బింగ్లీ మరీ మరీ చెప్పాడు.

9

ఎలిజబెత్ ఆ రాత్రంతా అక్కదగ్గరే గడిపింది. తెల్లవారిన తరువాత బింగ్లీ చెల్లెళ్ళు వచ్చారు. జేన్ పరిస్థితి ఏమీ బాగాలేదు. చూసి వెళ్ళమని తల్లికి కబురు చేయమంది ఎలిజబెత్. అలాగే వెంటనే మనిషిని పంపారు. ఉదయం ఫలహారాలు ముగిశాక, మిసెస్ బెనెట్ ఆఖరు అమ్మాయిలను ఇద్దరినీ వెంటబెట్టుకుని వచ్చింది.

జేన్‌కు ఏమైనా ప్రమాదంగా ఉంటే తల్లి చాలా భయపడేదే. అయితే ఆమె అనారోగ్యం అంత భయపడవలసిందేమీ కాదు. కనుక ఈ పరిస్థితే కొన్నాళ్ళు కొనసాగితే మంచిది అనుకొంది. ఏమంటే, తొందరగా ఆరోగ్యం కుదుటబడితే ఇక్కడి నుంచి ఇంటికి వెళ్ళి పోవాల్సి ఉంటుంది. వైద్యుడు కూడా రోగిని ఇప్పుడు కదల్చవద్దన్నాడు. కూతురును గురించి ఆమె గాభరా పడనందుకు, బింగ్లీకి ఊరట కలిగింది.

"అమ్మాయిని ఇప్పుడు తీసుకు వెళ్ళటం ప్రమాదకరం అంటున్నాడు వైద్యుడు. పిల్ల పూర్తిగా తేరుకునే వరకూ ఇక్కడే ఉండవలసి వచ్చేట్టుంది" అంది ఆమె బింగ్లీతో.

"ఇప్పుడు కదల్చటమా? ఎంతమాట! అటువంటి విషయమేమీ తలపెట్టకండి"

"ఈ ఇంట్లో మీ అమ్మాయికేమీ లోటురాదు" అని బింగ్లీ చెల్లెలు హామీ ఇచ్చింది.

"ఈ మంచితనానికి ఎంతో కృతజ్ఞురాలిని. ఇలాంటి సమయంలో మీ వంటి స్నేహితులు లేకపోతే, అమ్మాయి పరిస్థితి దిగజారిపోయేది! మీ మంచితనమే మా అమ్మాయిని కాపాడుతుంది. నెదర్‌ఫీల్డ్ అన్ని సదుపాయాలూ ఉన్న దివ్య భవనం. మీరు అద్దెకు రాసుకున్న కాలపరిమితి కొద్దే అయినా, తొందరపబడి దీన్ని విడిచి వెళ్ళకండి. ఈ ప్రాంతాలలో ఎక్కడా ఇంత గొప్ప ఇల్లులేదు."

"నేను అన్ని పనులూ హడావిడిగా చేస్తూ ఉంటాను. నెదర్‌ఫీల్డ్ విడిచి వెళ్ళిపోదలిస్తే ఆ పని అయిదు నిమిషాల్లో చేసేస్తాను. అయితే ప్రస్తుతానికి ఆ యోచనేమీ లేదులెండి."

"మీరలా అంటారనే నేననుకున్నాను" అంది ఎలిజబెత్.

"మీరు కూడా నన్ను మెచ్చుకుంటున్నారా?"

"అవును! మిమ్మల్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను."

తరువాత వాళ్ళు మనుషులను గురించి, మనస్తత్వాలను గురించి మాట్లాడుకున్నారు. తరువాత పల్లెలు, పట్టణాలు, వాటి బాగోగుల గురించి చర్చించారు. డార్సీ పట్టణాలలో ఉండే వైవిధ్యం పల్లెలలో లేదన్నాడు. మిసెస్ బెనెట్ అతనితో వాదనకు దిగింది.

డార్సీ "నా ఉద్దేశంలో – కవిత్వం అనేది ప్రేమకు ఆహారం వంటిది!" అన్నాడు.

నెదర్ ఫీల్డులో బింగ్లీ బాల్ పార్టీ ఇస్తానన్న విషయాన్ని లిడియా అతనికి గుర్తుచేసింది.

అతను "నేను అన్న మాట తప్పను. మీ అక్కకు పూర్తిగా ఆరోగ్యం చేకూరాక, అలాగే ఏర్పాటు చేస్తాను. ఏ తేదీన ఏర్పాటుచేయాలో నీవే చెబుదువుగాని" అన్నాడు.

ఈ జవాబుకు కూతుళ్ళ కంటే తల్లే ఎక్కువగా సంతోషించింది.

లిడియా! "అలాగే చేద్దాం! అప్పటికి కెప్టెన్ కార్టర్ కూడా తిరిగి వస్తాడు. మీరు పార్టీ ఇచ్చాక కూడా వాళ్ళు ఇవ్వకపోతే సిగ్గుచేటని చెప్పి, కర్నల్ పోర్టర్ చేత కూడా ఒక పార్టీ ఏర్పాటు చేయిస్తాను" అంది.

మిసెస్ బెనెట్, ఆమె కుమార్తెలు ఇంటికి వెళ్ళిపోయారు. డార్సీ, బింగ్లీ చెల్లెళ్ళూ బెనెట్ కుటుంబాన్ని గురించి రకరకాలుగా వ్యాఖ్యానించుకున్నారు. ఎలిజబెత్‌ని విమర్శిస్తున్నప్పుడు కూడా డార్సీ ఏమీ మాట్లాడలేదు.

10

ఈ రోజు కూడా నిన్నటిలాగానే గడిచింది. హర్ట్స్ సతి, మిస్ బింగ్లీ కొంతసేపు జేన్ గదిలో గడిపారు. సాయంత్రం ఎలిజబెత్ వాళ్ళతో పాటు డ్రాయింగ్ రూంలోకి వచ్చింది. ఇప్పుడు అక్కడ పేకాట జరగడం లేదు. డార్సీ ఉత్తరం రాసుకుంటున్నాడు. మిస్ బింగ్లీ అతని పక్కనే నిలబడి చూస్తోంది.

హర్ట్స్, బింగ్లీ చదరంగం ఆడుతున్నారు. హర్ట్స్ భార్య ఆట గమనిస్తోంది.

ఎలిజబెత్ కుట్టుపని తీసుకుంది. మిస్ బింగ్లీ, డార్సీల మాటలు వింటోంది.

డార్సీతో మిస్ బింగ్లీ అంది: "ఆహా! ఇటువంటి సుందరమైన ఉత్తరం చూశాక మిస్ డార్సీ ఎంత సంబరపడుతుందో కదా!"

అతనేమీ జవాబు చెప్పలేదు.

"నీవు చాలా వేగంగా రాయగలవు."

"పొరపాటు. నా రాత బహు ఆలస్యం."

"సంవత్సరానికి ఎన్ని ఉత్తరాలు రాస్తావు? అబ్బో– నాకు నీ చెల్లెల్ని చూడాలని ఉంది.

"ఈ మాట దానికి చెప్పాను."

"ఈ కలం నీకు ఇష్టం లేదనుకుంటాను? కాస్త బాగుచేసి ఇవ్వనా? నాకు కలాలు బాగుచేయటం చాలా బాగా చేతనవును."

"అక్కర్లేదులే. నా కలం నేనే బాగుచేసుకోగలను."

"ఇంత గుండ్రంగా రాయటం నీకెలా చేతనవుతోంది?"

అతనేమీ మాట్లాడలేదు.

"మీ చెల్లెలికి నేను చెప్పిన సంగతులు రాయడం మర్చిపోకు."

"ఈ ఉత్తరంలో చోటులేదు. ఈసారి రాస్తాలే."

"అలా కుదరదు. నేను ఆమెను చూసే చాలా కాలం అయింది. నీవెప్పుడు ఆమెకు ఇలాగే సుదీర్ఘమైన, సుందరమైన ఉత్తరాలు రాస్తూ ఉంటావా?"

"అవును. సుదీర్ఘమైనవే రాస్తాను. అయితే అవి సుందరమో, కాదో నాకు తెలియదు."

"సాధారణంగా పెద్ద పెద్ద ఉత్తరాలు రాసేవాళ్ళు బాగానే రాస్తారు."

తరువాత బింగ్లీ, ఎలిజబెత్‌లు ఈ సంభాషణలో జోక్యం కలిగించుకున్నారు. సంభాషణ వేడి ఎక్కిన తర్వాత దాన్ని ఆపేసి సంగీతంలో పడ్డారు.

బింగ్లీ చెల్లెళ్ళు పాటలు పాడుతున్నారు. ఎలిజబెత్ ఊరికే కూర్చుండలేక పియానో బల్ల మీద ఉన్న సంగీత గ్రంథాలు తిరగవేస్తోంది. డార్సీ ఆమె వంకే తదేకంగా చూస్తున్నాడు. ఈ విషయం ఆమె గమనించ లేదు. కొన్ని ఇటాలియన్ పాటలు పాడాక డార్సీ ఎలిజబెత్ దగ్గరకు వచ్చి "మిస్ బెనెట్, ఒక పాటకు డ్యాన్స్ చేద్దామా?" అనడిగాడు.

ఆమె చిరునవ్వు నవ్వింది కానీ, బదులు పలకలేదు. డార్సీ మళ్లీ అడిగాడు.

"మీ ప్రశ్న వినపడింది. అయితే ఏం జవాబు చెప్పాలో వెంటనే నిర్ధారించుకోలేక పోయాను. నేను సరేనని జవాబు చెప్పటం మీకు ఇష్టమని నాకు తెలుసు. నా అభిరుచిని కించపరుద్దామని మీ భావన. ఆ విషయం నేను ఎరుగుదును. నాకు ఇప్పుడు డ్యాన్సు చేద్దామని లేదు. మీ ఇష్టం, ఇక నన్ను ఎలా కించపరచాలో ఆలోచించుకోండి."

"నాకు అటువంటి ఆలోచనలు లేవు." అనిమాత్రం అనగలిగాడు డార్సీ. అతడు ఆమె మాటలకు కాస్త బేజారయాడు. మిస్ బింగ్లీ అంతా గ్రహించింది. జేన్‌కు ఎంత త్వరగా నయమవుతుందా ఎంత త్వరగా ఎలిజబత్ ఇక్కడ నించి వెళ్ళిపోతుందా, అని ఆమె ఆలోచిస్తోంది. డార్సీ మనసులో లిజ్జీ పట్ల ద్వేషం పెంచడానికి ప్రయత్నిస్తోంది మిస్ బింగ్లీ. వాళ్ళిద్దరూ ఒంటరిగా నడిచి వెడుతున్నప్పుడు ఆమె ఇలా అంది! 'లిజ్జీతో నీ వివాహం అయాక, అత్తగారికి కొన్ని సూచనలు ఇవ్వు. ఆమెను అతివాగుడు తగ్గించు కోమను. తరువాత, నీ మరదళ్ళు సైనికోద్యోగుల వెంట తిరగకుండా జాగ్రత్తపడు. నీ భార్య నిర్లక్ష్యాన్ని, అహంభావాన్ని తగ్గించడానికి ఏమన్నా ఉపాయాలు ఉంటే చూడు?"

"అయిందా? నా గృహస్థ జీవితానికి నీ సలహాలు. ఇంకా ఏమైనా ఉన్నాయా?"

"నీ భార్య చిత్రంమటుకు ఎవరిచేతా రాయించకు. ఏమంటే ఎంత గొప్ప చిత్రకారుడు కూడా ఆ కాంతులీనే కళ్ళకు న్యాయం చేకూర్చలేడు."

"వాటి భావాన్ని చెప్పటం తేలిక కాదు. కానీ ఆ రంగు, ఆకారం, కనుబొమ్మల తీరు, అబ్బ! అదంతా చూడవలసిందేగాని... "

– ఈసరికి, ఎదురుగా మిసెస్ హర్ట్స్, ఎలిజబెత్ వస్తూ వీళ్ళను కలుసుకున్నారు.

తమ మాటలన్నీ వాళ్ళు విన్నారేమోనన్న భయంతో మిస్ బింగ్లీ 'మీరిలా షికారుగా

వస్తారనుకోలేదు' అంది ఖంగారుగా.

"మాతో చెప్పకుండా బయలుదేరారేం?" అంది అక్క. అంటూనే ఆమె ఎలిజబెత్ చేయి వదలి డార్సీ చేతిని పుచ్చుకుని ముందుకు వెళ్ళసాగింది. ఈ చర్య డార్సీకి కష్టం అనిపించింది. పైగా ఆ పైదారిన ముగ్గురి కంటే ఎక్కువ మంది నడవటానికి వీలులేదు. డార్సీ 'ఈ దారిన మనమందరం వెళ్ళలేం. అటువైపు వెడదాం పదండి' అన్నాడు.

అయితే ఎలిజబెత్‌కు ఇక్కడ ఉందామని ఎంతమాత్రం లేదు. నవ్వుతూ ఇలా అంది: "ఒద్దు, ఒద్దు. మీరు ఉన్నచోటే ఉండండి. మీ గ్రూపు ఎంతో బాగుంది. దానిలో నాలుగో మనిషి కలిస్తే బాగుండదు. నేను వెడతాను సెలవు" అంటూ ఎలిజబెత్ పరుగుతీసింది, ఇంక ఒకటి రెండు రోజులలో ఇంటికి వెళ్ళిపోవచ్చు అనుకుంటూ.

11

భోజనాలయ్యాక ఆడవాళ్ళు బయటకు వెళ్ళి కూర్చున్నారు. ఎలిజబెత్ అక్క దగ్గరకు పరుగెత్తింది; ఆమెకు చలి తగలకుండా తలకు కట్టుకట్టి, బయటకు తీసుకు వచ్చింది. ఆమె స్నేహితురాళ్ళు ఇద్దరూ ఆనందంగా జేన్‌కు స్వాగతం ఇచ్చారు. ఎలిజబెత్ వాళ్ళను ఎప్పుడూ అంత ఉత్సాహంగా చూడలేదు. వాళ్ళు వినోద కథలను తు.చ. తప్పకుండా అప్పజెప్పగలరు. హాస్య రసాన్ని పోషిస్తూ మాట్లాడగలరు. హాయిగా నవ్వగలరు.

మగవాళ్ళు వచ్చిన తర్వాత, అందరి ధ్యాసా జేన్ మీది నించి మరలింది. మిస్ బింగ్లీ కళ్ళు డార్సీ వైపు తిరిగాయి. టీ అయిన తరువాత, హార్స్ట్ మరదలకు పేకాట గుర్తుచేశాడు. డార్సీకి పేకాట ఇష్టంలేదని ఆమెకు తెలుసు. కనుక హార్స్ట్ ప్రతిపాదన తోసిపుచ్చింది. హార్స్ట్ ఇక చేసేదేమీలేక సోఫా మీద వాలుగా పడుకుని నిద్రపోసాగాడు. డార్సీ ఏదో పుస్తకం తీసుకున్నాడు. మిస్ బింగ్లీ అంతే చేసింది, మిసెస్ హార్స్ట్ తన ఉంగరాలతో ఆడుకుంటూ మధ్య మధ్య అన్నగారు జేన్‌తో మాట్లాడుతూ ఉండగా, తనూ మాటలు కలుపుతోంది.

మిస్ బింగ్లీ తన పుస్తకం చదవకుండా డార్సీ ఎంతవరకు చదివాడో గమనిస్తోంది. ఆమె అతన్ని మాటల్లోకి దింపలేకపోతోంది. ఆమె ఏదేని ప్రశ్న అడిగినా అతను జవాబు చెప్పి తరువాత చదువుకుంటున్నాడు. చివరకు ఆమె అంది: సాయంత్రం ఇలా గడపటం ఆనందంగా ఉంది. చదవటాన్ని మించిన వేడుక మరొకటి లేదు. నా స్వంతానికే ఒక ఇల్లంటూ ఉంటే దానిలో బ్రహ్మాండమైన గ్రంథాలయం నెలకొల్పుతాను.

ఆమె మాటలకు ఎవరూ బదులు చెప్పటం కానీ, వ్యాఖ్యానించడం కానీ చేయలేదు. ఆమె ఒకసారి ఒళ్ళు విరుచుకుని గది నాలుగు మూలలా చూసింది. ఇంతలో జేన్‌తో బింగ్లీ బాల్ సంగతి చెప్పడం చూసి ఇలా అంది. "ఏం నెదర్‌ఫీల్డ్‌లో బాల్ ఏర్పాటు

చేయటం గురించి ఆలోచిస్తున్నావా? అలా నిశ్చయించటానికి ముందు ఇక్కడ అందరినీ అడగడం మంచిదంటాను. మనలో కొందమందికి బాల్ వేడుక కాదనుకుంటాను."

"ఓహో! డార్సీ విషయమా నీవనేది? అతనికి అంత ఇష్టం లేకపోతే ఇంట్లోకి వెళ్ళి పడుకుంటాడులే. పండుగ అయిపోగానే అందరికీ ఆహ్వానాలు పంపేస్తా" అన్నాడు బింగ్లీ.

"మరో రకంగా ఏర్పాటుచేస్తే మన బాల్సు ఇప్పటి కంటే వేడుకగా ఉంటాయి. డ్యాన్స్‌లకు బదులు సంభాషణలు ఏర్పాటు చేయాలి! అప్పుడు అందరికీ హాయిగా ఉంటుంది" అని మిస్ బింగ్లీ తాను కూర్చున్న చోటునుంచి లేచి అటు ఇటు తిరిగింది. ఆమె స్వతహాగా అందమైనది. హుందాగా నడుస్తుంది. అయితే డార్సీ మటుకు కదలకుండా తన పనిలోనే నిమగ్నమై ఉన్నాడు. మిస్ బింగ్లీ మరో ఆలోచన చేసింది. ఎలిజబెత్ వంక తిరిగి "మిస్ ఎలిజా బెనెట్, ఒకసారి నా మాదిరే గదంతా కలయ తిరుగు. ఎప్పుడూ ఒకే మాదిరిగా కూర్చుంటే శరీరం కొయ్యబారుతుంది" అంది.

ఎలిజబెత్ ఆశ్చర్యపోయింది. అయితే వెంటనే ఆమె చెప్పినట్టు చేసింది. డార్సీ ఒకసారి అటువైపు చూసి చేతిలోని పుస్తకాన్ని మూసేశాడు. అతన్ని తమతో పాటు రమ్మని మిస్ బింగ్లీ ఆహ్వానించింది. అయితే అతను రానన్నాడు. ఆమెకు అతని తత్త్వమేమీ అర్థంకాలేదు. ఎలిజబెత్‌ను "నీకేమైనా అర్థమయిందా?" అనడిగింది.

"ఉహు. అయితే ఒకటి. అతను మన పట్ల కర్కశంగా ఉండదలచుకున్నాడు. అతన్ని నిరాశపరిచే మార్గం ఏమిటంటే ఏ విషయం కూడా అతన్ని అడక్కుండా ఉండటమే."

తరువాత వాళ్ళు ఇద్దరూ డార్సీని గురించి అతని స్వభావాన్ని గురించి మాట్లాడుకున్నారు. చివరకు ఎలిజబెత్ డార్సీలో తనకేమీ లోపాలు కనిపించటం లేదంది. ఆమె వెలిబుచ్చిన అభిప్రాయం డార్సీ విన్నాడు. దానికతడు అంగీకరించలేదు.

"అయితే మీలో ఉన్న లోపమల్లా ఏమిటంటే, అందరినీ అసహ్యించుకోవటం."

డార్సీ నవ్వుతూ "నీ లోపం ఏమిటంటే అందరినీ కావాలని తప్పుగా అర్థం చేసుకోవటం!" అన్నాడు.

సంభాషణలో తనకు స్థానం లేకపోవడంతో విసుగెత్తిపోయి మిస్ బింగ్లీ "రండి కాస్సేపు సంగీతం పాడుకుందాం. హర్ట్సను లేపనా?" అంది. డార్సీ కొద్దిసేపు సాలోచనగా కూర్చున్నాడు. ఎలిజబెత్ పట్ల తను ఎక్కువ శ్రద్ధ చూపుతున్నానా అని భయపడసాగాడు.

12

అక్కా చెల్లెళ్ళు అనుకున్న ప్రకారం, ఎలిజబెత్ మరునాడు ఉదయం తల్లికి ఉత్తరం రాసింది. ఈరోజు బగ్గీ పంపితే ఇద్దరం ఇంటికి తిరిగివస్తామని రాసింది. అయితే మిసెస్ బెనెట్, వచ్చే మంగళవారం వరకూ అమ్మాయిలు అక్కడే ఉండాలని ఆశించింది. లిజ్జీకి

అది ఏమాత్రం సంతోషం కలిగించలేదు. ఆమె జేన్‌ను, బింగ్లీ వాళ్ళ బగ్గి ఇవ్వగలడేమో కనుక్కోమని కోరింది. చివరకు వాళ్ళు మరునాడు వెళ్ళటానికి ఏర్పాటయింది.

బింగ్లీ మరునాడు ఈ అక్కాచెల్లెళ్లు వెళ్ళిపోతారని తెలుసుకుని చాలా విచారించాడు. మిస్ బెనెట్‌ను ఇంకా ఇక్కడే ఉంచేందుకు ప్రయత్నించాడు. జేన్ పూర్తిగా కోలుకోలేదనీ ఇప్పుడు ప్రయాణం మంచిది కాదేమోనని అన్నాడు.

డార్సీకి పెద్ద బాధ అనిపించినట్టు లేదు. అతను ఎలిజబెత్ ఇక్కడ ఉండవలసినన్నాళ్ళు ఉన్నదనుకున్నాడు. ఆమె తనను బాగా ఆకర్షించింది. మిస్ బింగ్లీ ఆమె పట్ల క్రూరంగా ప్రవర్తించింది. తనను కూడా పూర్వం కన్నా ఆమె ఎక్కువగా బాధిస్తోంది. తను ఇప్పుడు తన మనసు తెలియనివ్వకూడదు అనుకున్నాడు. శనివారమంతా ఆమెతో పది మాటలు కూడా మాట్లాడలేదు. అరగంటపాటు ఇద్దరూ ఒకచోటే ఒంటరిగా ఉన్నా అతను పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు కానీ, ముఖమెత్తి పలుకరించలేదు.

ఆదివారం ఉదయం, బెనెట్ కూతుళ్ళు, ముందు ఏర్పాటైన ప్రకారమే, తమ ఇంటికి వెళ్ళిపోయారు. ఇంటికి చేరుకున్నాక తల్లి వాళ్ళను ఆహ్వానించలేకపోయింది. ఆమెకు వాళ్ళ రాకే ఆశ్చర్యం కలిగించింది. వాళ్ళు ఏదో పెద్ద పొరపాటు చేశారని ఆమె అభిప్రాయపడింది. తండ్రి మట్టుకు వాళ్ళ రాకకు చాలా సంతోషించాడు.

మేరీ తన గదిలో కూర్చొని పుస్తకాలు చదువుకుంటోంది. కిట్టీ, లిడియాలు ఎన్నెన్నో కొత్త సంగతులు చెప్పసాగారు. పోయిన బుధవారం నుంచి సైన్యంలో ఎన్నెన్నో మార్పులు జరిగాయి. ఎంతోమంది ఆఫీసర్లు వాళ్ళ బాబాయితో విందు చేశారు. ఎవరో రహస్యం చెప్పారు. అదేమిటంటే- కర్నల్ ఫోస్టర్ త్వరలోనే వివాహం చేసుకుంటాడట!

13

మరునాటి ఉదయం అల్పాహారాల సమయంలో బెనెట్ భార్యతో ఇలా అన్నాడు. “ఈరోజు భోజనానికి మంచి ఏర్పాట్లు చేయండి. మనకో గొప్ప అతిథి రావచ్చును.”

“ఏమిటి మీరనేది? ఎవరు వస్తున్నారు? ఒకవేళ చార్లెట్ లూకా వస్తోందా?”

“నేను చెబుతున్న మనిషి మగవాడు, పెద్దమనిషి, కొత్తవాడు.”

మిసెస్ బెనెట్ కళ్ళు మిలమిల మెరిశాయి. “పెద్ద మనిషి- కొత్తవాడూనా? అయితే ఇంకెవరు? మిస్టర్ బింగ్లీ. అంతేగా? ఏం జేన్! నాతో మాటమాత్రంగానైనా చెప్పావు కావేం? బింగ్లీ వస్తున్నాడంటే నాకు ఎంతో ఆనందంగా ఉంది. అయితే ఇవాళ ఇంట్లో ఒక్క చేప అయినా లేకుండా పోయిందే, ఏదీ నౌకర్ని పిలువు. బజారుకు పంపుతాను.”

“వస్తున్నవాడు బింగ్లీ కాదు. అతన్ని నేను కూడా ఇంతవరకూ చూడలేదు.”

ఈ మాటతో అందరికీ ఆశ్చర్యం కలిగింది. భార్య, కూతుళ్ళూ బెనెట్‌ను ప్రశ్నల

వర్షంతో ముంచెత్తారు. అందరి ఆసక్తినీ రగుల్కొలిపిన తర్వాత బెనెట్ నింపాదిగా ఇలా అన్నాడు: "నెల రోజుల క్రితం నాకొక ఉత్తరం వచ్చింది. పదిహేను రోజుల క్రితం దానికి జవాబు రాశాను. అది చాలా సునిశితమైన వ్యవహారం. అతి జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంతకూ ఆ వస్తున్నవాడు, నా దాయాది- కోలిన్స్. నా తదనంతరం అతనే నా ఆస్తినంతటినీ స్వాధీనపరచుకుని, మిమ్మల్ని ఈ ఇంటిలో నించి వెళ్ళగొడతాడు."

"అలాంటి మాటలనకండి. నేను వినలేను. ఆ మనిషిని గురించి దయచేసి మాకేమీ చెప్పకండి. మీ ఎస్టేటు మీ పిల్లలకు కాకుండా పోయేట్టు చేయకండి. నేనే, మీ స్థితిలో ఉన్నట్టయితే, ఈ ఏర్పాటు పూర్వమే చేసి ఉండేదాన్ని."

జేన్, ఎలిజబెత్‌లు ఆమెకు న్యాయశాస్త్రాన్ని గురించి నచ్చచెప్పటానికి ప్రయత్నించారు. పూర్వపు ప్రయత్నాలలాగే ఇది కూడా వ్యర్థమైంది. అయిదుగురు అమ్మాయిలు ఉండగా, ఆయన తదనంతరం, ఈ ఎస్టేటంతా వాళ్ళకు కాక, మరెవరో, ముక్కూమొహం తెలియని మనిషికి ఎందుకు చెందాలో ఆమెకు అర్థంకాలేదు.

బెనెట్ ఇలా అన్నాడు: "ఇది చట్టం. కోలిన్స్ ఎస్టేటు స్వాధీనపరచుకోవటాన్ని ఎవరూ అడ్డుకోలేరు. అయితే అతని ఉత్తరం నువ్వు కనక వింటే నీ కోపమంతా కరిగిపోతుంది."

"నాకీ కబుర్లేమీ చెప్పకండి. అతను మీకు ఉత్తరం రాయటమే దుర్మార్గం, దారుణం. నాకు ఇటువంటి దొంగ స్నేహితులంటే ఎంతో మంట, అసహ్యం. అతనూ, తండ్రి మాదిరే మీతో పోట్లాడుతూ ఉండగూడదూ? ఈ స్నేహం దేనికి?"

"ముందు ఈ ఉత్తరం విను; తరువాత మాట్లాడుదువు గాని –

హన్స్‌ఫర్డ్, కెంట్
15, అక్టోబర్.

ప్రియమైన అయ్యా,

మీకు మా తండ్రిగారికి ఉన్న పోట్లాట నాకు పూర్వం ఎంతో చికాకు కలిగిస్తూ ఉండేది. అయితే మా తండ్రి మరణానంతరం, ఈ వైరుధ్యానికి అంతు కనిపెడదామని ఆలోచించాను. అయితే మా తండ్రిగారు జీవితాంతం ఎవరితో అయితే విరోధంగా ఉన్నారో ఆ వ్యక్తితో నేను ఆయన చచ్చిపోయిన వెనువెంటనే సఖ్యం ఏర్పర్చుకుంటే, వారి ఆత్మకు ఎంతమాత్రం శాంతి ఉండదని తలపోశాను. ఈ విషయమై నేను ఇప్పుడొక నిర్ధారణకు వచ్చేశాను. గత ఈస్టర్ నుంచి నాకు రైట్ ఆనరబుల్ లేడీ కాథరైన్ ప్రాపు దొరికింది. అప్పటి నుంచి ఈ చర్చిలోనే ఉండి, ఉద్యోగరీత్యా నాకు పరిచయం ఉన్న అన్ని కుటుంబాలలోనూ శాంతిని సుస్థిరం చేయటానికి ప్రయత్నిస్తున్నాను. ఈ ప్రయత్నంలోనే ఒకసారి మిమ్మల్ని సందర్శించాలని అనుకుంటున్నాను. మీకు ఇబ్బంది

లేకపోతే, నవంబరు 18వ తేదీ సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మీ ఇంటికి వస్తాను. శనివారం రాత్రి వరకు అక్కడే ఉంటాను. సమక్షంలోనే అన్ని విషయాలు మాట్లాడుకుందాం. మీ భార్యకు, అమ్మాయిలకు నా శుభాశీస్సులు తెలపండి."

మీ శ్రేయోభిలాషి, స్నేహితుడు
విలియం కోలిన్స్

ఉత్తరం మడిచిపెడుతూ, 'ఈవేళ నాలుగు గంటలకు ఈ శాంతిదూత మన ఇంటికి వస్తాడన్నమాట. అతని ధోరణి చూస్తే మర్యాదస్తుడులా ఉన్నాడు' అన్నాడు బెనెట్.

"అమ్మాయిల విషయంలో అతనేదైనా పేచీలు తెస్తే నేను ఊరుకోను." అంది తల్లి.

"అతని ఉద్దేశం ఏమిటో కానీ, రావటంలో మంచి ఆలోచనే ఉండొచ్చు" అంది జేన్.

"అతను ఎలాంటివాడో కాని అతని ఉత్తరంలో ఓ వింత ధోరణి ఉంది" అంది లిజ్జీ.

"ఏమో, అతన్ని కలుసుకోవటానికి నేను తహ తహ లాడుతున్నాను." అన్నాడు బెనెట్.

కాథరైన్, విడియాలకు ఇదేమీ ఆసక్తికరంగా తోచలేదు.

మిసెస్ బెనెట్ కోపం మటుకు చాలావరకు తగ్గిపోయినట్టుంది. ఆమె విందుకు ఏర్పాట్లు చూస్తూ ఉండటం చూసి తండ్రి కూతుళ్ళు ఆశ్చర్యపడసాగారు.

కోలిన్స్ సరిగ్గా నాలుగు గంటలకు వచ్చాడు. అందరూ అతనికి స్వాగతం చెప్పి లోనికి తోడుకొని వచ్చారు. ఆడవాళ్ళ హడావిడేగానీ, మిస్టర్ బెనెట్ ఏమంత మాట్లాడటం లేదు. కోలిన్స్ పొడుగరి, పాతికేళ్ళ యువకుడు, గంభీరుడు. అతి సామాన్యమైన అలవాట్లు. కూర్చుని ఎక్కువసేపు కాకముందే మిసెస్ బెనెట్‌ను, ఆమె అయిదుగురు కూతుళ్ళను అభినందించసాగాడు. వాళ్ళ అందచందాలను గురించి పొగిడాడు.

"నీవు చాలా మంచివాడివి. దయగలవాడివి కూడా అనుకుంటాను, కాకపోతే అందమైన నా అమ్మాయిల గతి అధోగతే." అంది మిసెస్ బెనెట్.

"మీరు ఎస్టేటు వ్యవహారం మాట్లాడుతున్నట్టున్నారు."

"అవును. ఆ వ్యవహారం మా అమ్మాయిలకు దుఃఖహేతువని మీరు కూడా ఒప్పుకుంటారు. అయితే నేను, నిన్ను తప్పుపడుతున్నాననుకోకు. ఏ ఎస్టేటు, ఎవరికి పోతుందో తెలియకుండా పోయింది."

"మీ కష్టాలు నాకు తెలుసునమ్మా! ఈ విషయాన్ని గురించి నేను ఎంతైనా చెప్పగలను. నాకూ మీరంటే ఎంతో అనురాగం ఉంది. ప్రస్తుతానికి ఒక్క ముక్క చెబుతాను... "

అతను వాక్యం పూర్తిచేయకుండానే భోజనానికి పిలుపు వచ్చింది. అమ్మాయిలు ఒకళ్ళ ముఖం చూసి ఒకళ్ళు నవ్వుకున్నారు. కోలిన్స్ అమ్మాయిలను మటుకే మెచ్చుకోలేదు. హాలు, డైనింగ్‌రూం, ఫర్నిచర్, అన్నిటినీ అతిగా మెచ్చుకున్నాడు. అతని మెచ్చుకోలు

మిసెస్ బెనెట్ హృదయానికి హత్తుకుంది. భోజన పదార్థాలను కూడా మెచ్చుకున్నాడు. ఇంత బాగా వంట చేసిన అమ్మాయిలకు అభినందనలు తెలిపాడు. అయితే తల్లి అడ్డువచ్చి తమకు వంట మనిషిని పెట్టుకోగల స్థోమత ఉందనీ, అమ్మాయిలు ఇంటి వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోవలసిన అవసరం లేదనీ చెప్పింది. అతను తన పొరపాటును సవరించుకుంటూ తొందరపడి అన్నందుకు క్షమాపణ చెప్పుకున్నాడు. ఆమె మనసు కష్టపెట్టినందుకు క్షమించమన్నాడు. ఆమె తనకేమీ కష్టం కలగలేదని చెబుతూనే ఉంది. కానీ అతను పావుగంటవరకు అలా క్షమాపణ చెబుతూనే ఉన్నాడు.

14

భోజన సమయంలో బెనెట్ ఏమీ మాట్లాడలేదు. అయితే నౌకర్లందరూ వెళ్ళిపోయిన తర్వాత అతిథితో లేడీ కాథరైన్ గురించి అడిగాడు. అంతే. వెంటనే అతిథి అందుకొని లేడీ కాథరైన్‌ను పొగుడుతూ ధారాపాతంగా మాట్లాడాడు. ఆమె వంటి ఉదాత్తమైన మనిషిని, ధర్మపరురాలను తను ఎరగనన్నాడు. ఆమెను గురించి అందరూ గర్విష్టి అంటారుగానీ తనకు అలా అనిపించదన్నాడు. ఆమె తనతో ఎంతో మర్యాదగా, మాట్లాడుతుందన్నాడు. ఆమె తనకు అన్ని సదుపాయాలు కలుగజేస్తోందన్నాడు. చర్చిలో తను చేస్తున్న మార్పులను ఆమోదించటమే కాక తాను కూడా స్వయంగా ఆలోచించి కొన్ని చెబుతున్నదట. తనను త్వరలోనే మంచి కన్యను చూసుకుని వివాహమాడమన్నదట.

"అయితే చాలా మర్యాదస్తురాలేనన్నమాట. ఆమె ఉండేది మీ నివాసానికి చేరువనేనా?" అని అడిగింది మిసెస్ బెనెట్.

"నా నివాసానికి, ఆమె ఉండే రోసింగ్స్ భవనానికి ఒకటే సందు అడ్డు."

"ఆమె విధవరాలు అన్నారు కదూ! ఏమైనా పిల్లలా?"

"ఒక్కతే ఆడపిల్ల. ఆమె రోసింగ్స్ భవనానికీ, ఇంకా వెలలేని ఆస్తికీ వారసురాలు."

"ఓ! అయితే ఆ అమ్మాయి బాగా అందంగా ఉంటుంది? ఎలా ఉంటుంది. కాస్త వివరంగా చెప్పండి" అంది మిసెస్ బెనెట్ తల ఊపుతూ.

"ఆ అమ్మాయి అందంగానే ఉంటుంది. అభిజాత కుటుంబంలో పుట్టిన పిల్లకు ఉండవలసిన లక్షణాలన్నీ ఆమెకు ఉన్నాయి. అయితే ఆమె ఆరోగ్యం మటుకు సరిగ్గా ఉండదు. అదే ఆమెలోని గొప్ప లోపం."

"అయ్యో, పాపం, అలాగా!"

"ఆ అనారోగ్యం వల్లనే ఆమె తరచుగా పట్టణంలో తిరుగలేకపోతుంది. నేను చాలాసార్లు లేడీ కాథరైన్‌తో ఇలా అంటాను 'మీ అమ్మాయి ఓ రాకుమారి అవటానికిగాను ఈ భూమిమీద పుట్టింది'. ఇటువంటి మాటలు చెబితే ఆడవాళ్ళు ఎంతో పొంగిపోతారు."

"మీరు చెబుతున్నది నిజమే. మీరు పొగడ్తలతో మనుషులను ఆకట్టుకోవటంలో నేర్పరుల్లా కనిపిస్తున్నారు. అయితే ఈ పొగడ్తలన్నీ, అప్పటికప్పుడు ఆశువుగా చెప్పారా, లేక ముందే తయారు చేసుకుంటారా?"

"దాదాపు పరిస్థితులను బట్టి ఆశువుగా చెబుతుంటాను. అప్పుడప్పుడు వాటిని గురించి ఆలోచిస్తూ సాధారణంగా పనికి వచ్చే వాక్యాలు కొన్ని తయారుచేస్తూ ఉంటాను."

బెనెట్‌కి కోలిన్స్‌పై ఏర్పడిన చులకన భావం కనిపించకుండా అతను చెబుతున్నదంతా వింటూ గంభీరంగా కూర్చున్నాడు. టీ టైముకు బెనెట్ అతిథిని డ్రాయింగ్ రూమ్‌కు తీసుకు వెళ్ళాడు. టీ అయిపోయిన తరువాత, కోలిన్స్‌ను ఏదో పుస్తకం బిగ్గరగా చదివి అందరికీ వినిపించమన్నాడు. కోలిన్స్ వెంటనే అందుకు అంగీకరించాడు. అయితే తీరా పుస్తకం అందుకుని, దాన్ని ఒకసారి అటు ఇటు తిరగేసి 'ఇటువంటి నవలలు నేనెప్పుడూ చదవను' అన్నాడు. మరికొన్ని పుస్తకాలు చూపించారు. చివరకు అతను 'ఫోర్‌డైస్ గారి ఉపదేశాలు' అనే మత గ్రంధాన్ని ఎంచుకున్నాడు.

అతను పుస్తకం తెరవగానే లిడియా నోరుతెరచి ఆవలించింది. అతను మూడు పుటలు చదివిన మీదట ఇలా అంది. "అమ్మా, నీకు తెలుసా బాబాయి ఫిలిప్స్, రిచర్డ్‌ను ఇంట్లోంచి వెళ్ళగొడతానన్నాడు. అలాంటి పక్షంలో ఆ కుర్రాడిని కల్నల్ ఫోర్స్ట్‌గారు సాకుతానన్నాడు. ఈ మాట శనివారంనాడు పిన్నే చెప్పింది నాకు. డెన్నీ పట్టణం నుంచి ఎప్పుడు తిరిగి వస్తాడో కూడా కనుక్కుంటాను."

లిడియాను అక్కలిద్దరూ నోరుమూసుకోమన్నారు. కోలిన్స్‌కు కోపం వచ్చింది. పుస్తకం అవతల పెట్టేసి "ఇటువంటి మంచి మంచి పుస్తకాలంటే ఆడవాళ్ళు ఎప్పుడూ ఎందుకు దూరంగా ఉంటారో నాకు అర్థంకాదు. ఈ పుస్తకాల వల్ల ఎంత ప్రయోజనమో వాళ్ళకు అర్థం కాదేమో! సరే మీకు విసుగ్గా ఉంది కనక ఆపేస్తాను."

మిసెస్ బెనెట్ ఆమె కూతుళ్ళు అభ్యంతరం చెప్పలేదు.

15

కోలిన్స్‌కి జీవితంలో వికాసమన్నది తారసపడలేదు. అతని చదువు వల్ల అది అబ్బలేదు. చదువురాని లోభి అయిన తండ్రి పెంపకం వల్ల అతని జీవితం ఇలా తయారైంది. లేడీ కాథరైన్ కృపావిశేషం వల్ల ఇతని ప్రస్తుత పరిస్థితి ఏమీ లోపం లేదు.

ఇప్పుడు మంచి ఇల్లు చెప్పుకోదగ్గంత ఆదాయం ఉన్నది కనుక అతను వివాహం చేసుకుందామనుకున్నాడు. లాంగ్‌బర్న్ కుటుంబంతో రాజీ చేసుకొని ఒక భార్యను ఎన్నుకుందాం అనుకుంటున్నాడు. ఈ ఏర్పాటు బాగుంటుందని, ఎస్టేటు వారసత్వం విషయంలో కూడా బెనెట్ ఇందుకు తప్పకుండా సమ్మతిస్తాడని అతని ఆలోచన.

అమ్మాయిలను చూసిన తర్వాత కూడా అతని ఆలోచన మారలేదు. జేన్ సుందర ముఖారవిందం అతన్ని ఆకట్టుకొంది. అయితే ఆ మర్నాడు ఈ ఎన్నిక మార్చుకోవలసి వచ్చింది. మిసెస్ బెనెట్‌తో మాటల సందర్భంలో జేన్‌కు సంబంధం దాదాపు స్థిరపడిందని తెలుసుకున్నాడు. అంచేత అతను తన ఎన్నికను జేన్ నుంచి లిజ్జీకి మార్చుకొన్నాడు. లిజ్జీ కూడా జేన్ తరువాత అంత అందగత్తెగానూ కనిపించింది అతనికి.

లిడియా మెరిటాన్‌కు వెడతానంది. మేరీ తప్ప అందరూ ఆమెతో వెడతాం అన్నారు. కోలిన్స్‌ను వాళ్ళకు తోడుగా వెళ్ళమన్నాడు బెనెట్. ఆయనకు ఎలాగైనా ఈ కోలిన్స్‌ను వదిలించుకుని హాయిగా తన గదిలో కూర్చుని పుస్తకాలు తిరగేయాలని ఉంది. కోలిన్స్ కూడా ఆయన కోరిక మన్నించి అమ్మాయిలతో షికారు వెళ్ళటానికి అంగీకరించాడు.

మెరిటాన్ చేరుకున్నారు. ఆఖరు అమ్మాయిల కళ్ళు ఆఫీసర్ల కోసం వీధుల వెంట వెతకసాగాయి. ఇంతలో వాళ్ళ దృష్టి, ఒక ఆఫీసరు సరసనే నడుస్తున్న యువకుడి మీద పడింది. ఆ ఆఫీసరు డెన్నీ, ఇతని రాకను గురించే లిడియా కనుక్కోవాలని ఆదుర్దా పడుతోంది. అయితే ఈ కొత్త వ్యక్తి ఎవరా అని అందరూ ఆశ్చర్యపోయి చూడసాగారు. కిట్టీ లిడియాలు ఎదురుగా ఉన్న దుకాణంలో ఏదో కొనుక్కోవాలనే మిషతో రోడ్డుకు అడ్డంగా నడిచి ముందుకు వెళ్ళారు. వాళ్ళు అలా పేవ్‌మెంట్ మీదికి చేరుకోగానే అదృష్టం కొద్దీ, ఆ ఇద్దరూ వెనక్కు తిరిగి వచ్చి సరిగ్గా వీళ్ళను కలిశారు. డెన్నీ సరాసరి వీళ్ళతో మాట్లాడి, తన స్నేహితుడు 'వికం'ను పరిచయం చేశాడు. అతను కూడా సైన్యంలో పనిచేస్తున్నాడట. వాళ్ళు నలుగురూ అలా మాట్లాడుకుంటూ ఉండగా, బింగ్లీ, డార్సీలు గుర్రాల మీద స్వారీ చేస్తూ అటుపక్క వచ్చారు. బింగ్లీ ఇప్పుడు తాము లాంగ్‌బర్న్‌కు వెడుతున్నామని, జేన్ ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకోవాలని ఆతురతగా ఉన్నదనీ చెప్పాడు. డార్సీ కొత్త వ్యక్తి (వికం) ముఖంవంక విచిత్రంగా చూశాడు. వాళ్ళు ఇద్దరూ ఒకరి ముఖంలోకి ఒకళ్ళు విచిత్రంగా చూసుకోవటం ఎలిజబెత్ గమనించింది. ఇద్దరి ముఖాలు రంగుమారాయి. కొన్ని క్షణాల తరువాత వికం డార్సీకి అభివాదం చేశాడు. డార్సీ ఈ అభివాదానికి బదులు చెప్పాడు. దీని అర్థం ఏమిటో!

మరు నిమిషంలో, బింగ్లీ స్నేహితుడితో పాటు సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఫిలిప్స్ ఇంటివరకూ అమ్మాయిల వెంట నడిచారు డెన్నీ, వికం, ఇద్దరూ. లిడియా వాళ్ళను కూడా లోనికి రమ్మని ఎంతగా చెబుతున్నా వినకుండా బజారులోనే సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. మిసెస్ ఫిలిప్స్ అమ్మాయిలను ఆనందంగా లోపలకు తీసుకు వెళ్ళింది. జేన్ అనుకున్న దానికంటే ముందుగానే పూర్తి ఆరోగ్యాన్ని పొంది ఇంటికి తిరిగి వచ్చినందుకు తన సంతోషం వెలిబుచ్చింది. కోలిన్స్‌ను అందరికీ పరిచయం చేశారు. కుటుంబంలోని వారంతా పరస్పరం ఉభయ కుశలోపరి చెప్పుకున్నారు.

ఇంటికి తిరిగి వెళుతూండగా డార్సీకి, వికంకు కలిగిన కలవరపాటును గురించి జేన్‌తో ఎలిజబెత్ చెప్పింది. ఆమె కూడా అటువంటి ప్రవర్తనను గురించి ఏమీ చెప్పలేకపోయింది. కోలిన్స్ ఇంటికి వచ్చిన తరువాత, మిసెస్ బెనెట్‌తో ఫిలిప్స్ కుటుంబాన్ని గురించి తెగ పొగిడాడు. లేడీ కాథరైన్, ఆమె కూతురు తరువాత అంత అందమైన మనిషి మిసెస్ ఫిలిప్స్ మాత్రమే అని ప్రకటించాడు.

16

అయిదుగురు అమ్మాయిలూ, కోలిన్స్ బగ్గీ ఎక్కి మెరిటాన్ ప్రయాణమయ్యారు. వాళ్ళు వెళ్ళేసరికి 'వికం' కూడా ఆహ్వానాన్ని అంగీకరించి అక్కడికి చేరుకున్నాడు.

కోలిన్స్ తీరుబడిగా కూర్చుని గదంతా కలయజూశాడు.

ఇక్కడ కూర్చుంటే సాక్షాత్తు రోసింగ్స్‌లో కూర్చున్నట్టే ఉన్నదన్నాడు. అప్పుడు మిసెస్ ఫిలిప్స్ రోసింగ్స్ భవనం ఎలా ఉంటుందో, దాని వైభవం ఏమిటో, దాని యజమాని ఎవరో అడిగి తెలుసుకుంది. లేడీ కాథరైన్‌ను గురించి కోలిన్స్ చెప్పగలిగినంతా చెప్పాడు. మధ్యమధ్య తన నివాసాన్ని గురించి ఊదరకొట్టాడు. అందరూ ముఖ్యంగా మిసెస్ ఫిలిప్స్ సాదరంగా వింటున్నారు. బెనెట్ కూతుళ్ళకు ఈ కబుర్లు చికాగ్గా ఉన్నాయి.

ఇంతలో మగవాళ్ళు కూడా డ్రాయింగ్ రూంలోకి వచ్చారు. వికం గదిలో అడుగుపెట్టాడు. ఆడవాళ్ళందరి కళ్ళు అతని మీదనే వాలాయి. అతను కుర్చీలన్నీ పరికించి చివరకు ఎలిజబెత్ పక్కన ఆసీనుడయ్యాడు.

వాతావరణం చలిచలిగా ఉండటాన్ని గురించి, వర్ష ఋతువును గురించి సంభాషణ సాగిపోతోంది. వికం, ఇతర ఆఫీసర్లు ఉండటంవల్ల కోలిన్స్ ప్రాముఖ్యం తగ్గినట్టు ఉంది. యువతులు అతన్ని గురించి ఏమీ మాట్లాడటమే లేదు. మధ్యమధ్యలో అతనే మిసెస్ ఫిలిప్‌తో జోక్యం కలిగించుకుని మాట్లాడుతున్నాడు. ఆమె అతనికి అవసరమైన కాఫీ, ఇతర పానీయాలు సమకూరుస్తోంది.

పేకాటకు బల్లలు సిద్ధం చేసిన మీదట, కోలిన్స్ "నాకు ఈ ఆటలు అంతగా తెలియవు. అయితే వీటిని నేర్చుకోవాలని ఆసక్తి మటుకు ఉంది" అన్నాడు.

వికం ఆట ఆడలేదు కానీ, ఎలిజబెత్ లిడియాల మధ్య కూర్చున్నాడు. మొదట లిడియా వికంతో మాటలు పెట్టుకుని కూర్చుంది. కానీ తరువాత ఆటలో మునిగి పోయింది. ఎలిజబెత్‌తో మాట్లాడుతూ కూర్చున్నాడు వికం. అతను చెప్పేదంతా ఆమె వింటూ కూర్చుంది. అయితే డార్సీతో అతనికి ఉన్న పరిచయం ఎలా అయిందీ, దాని పూర్వచరిత్ర ఏమిటి అనే విషయాలు తెలుసుకోవటానికి ఆమె మనస్సు ఉద్రుత లూగుతోంది. ఈ ఉత్సాహాన్ని ఆమె తనలోనే ఆపుకోలేక బయటపెట్టేసింది.

"డార్సీ అక్కడ ఎన్నాళ్ళుగా ఉంటున్నాడు?" అని వికం అడిగాడు.

"నెల రోజుల నుంచి" అని బదులు చెప్పింది.

"అతనికి సంవత్సరానికి పదివేలు ఆదాయం వస్తుంది. అతన్ని గురించి నా కంటే ఎక్కువగా తెలిసినవాడు నీకు దొరకడు. నాకు చిన్నతనం నుంచి ఆ కుటుంబంతో ఒక ప్రత్యేకమైన సంబంధం ఉంది."

ఎలిజబెత్ ఆశ్చర్యపోయి అతని వంక చూసింది.

"నీకు ఆశ్చర్యంగా ఉంటుంది, ఎలిజబెత్. నిన్న మేమిద్దరం కలుసుకున్న తీరుచూసిన మీదట నీకు అలాగే ఉంటుంది. ఇంతకూ డార్సీతో నీకు బాగా పరిచయం ఉందా?"

"ఆ! నాలుగు రోజుల పాటు మేమిద్దరం ఒక ఇంట్లోనే ఉన్నాం. అతను బొత్తిగా కలుపుగోలు మనిషికాడు. కలిసిమెలిసి ఉండే స్వభావం కాదు అతనిది!"

"అతని స్వభావం మీద నా అభిప్రాయం చెప్పటానికైతే నాకు హక్కులేదుగానీ- నాకు అతన్ని గురించి చాలా తెలుసు. అయితే అతన్ని గురించిన అభిప్రాయాన్ని మటుకు నీవెక్కడా బహిరంగపరచకు. ఇక్కడ ఉన్న వాళ్ళంతా మీ కుటుంబీకులే కదా!"

"నెదర్ ఫీల్డ్‌లో తప్ప నేను ఈ మాటలు ఇంకెక్కడా అనను. అతనంటే ఎవరూ ఇష్టపడరు. అందరికీ అతని అహంభావం పట్ల విసుగు. అతన్ని గురించి మంచిగా మాట్లాడేవాళ్ళు మీకు ఒక్కళ్ళు తగలరు."

వికం కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండి "నాకు విచారమనిపిస్తోంది. ప్రపంచం అతని ఐశ్వర్యాలను చూసి కన్ను మూసుకుంది. అతని వైఖరి చూసి అందరూ భయపడతారు. కొద్ది పరిచయం ఉంటే చాలు; అతను దుర్మార్గుడని తెలిసిపోతుంది" అన్నాడు వికం.

తరువాత మళ్ళీ మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు అతను "ఈ ప్రాంతంలో ఎక్కువ రోజులు ఉండదనుకుంటాను" అన్నాడు.

"అతను ఇక్కడ ఉండటం వల్ల మీ కార్యక్రమానికి ఏమైనా ఆటంకం ఏర్పడుతుందా?"

"లేదు, లేదు. డార్సీ నన్ను తరిమివేయలేడు. నన్ను చూడటం ఇష్టం లేకపోతే అతనే వెళ్ళిపోతాడు. మాకిప్పుడు అంత స్నేహం లేదు. అతని తండ్రి ఎంతో గొప్పవాడు. విశ్వసనీయుడు. నా శ్రేయోభిలాషి. డార్సీ కనిపిస్తే నాకు లెక్కలేనన్ని స్మృతులు గుర్తొస్తాయి. అతను తండ్రికి తగని కొడుకైనా అతన్ని క్షమిస్తాను!"

ఎలిజబెత్ శరీరమంతా చెవులు చేసుకుని వింటోంది. అయితే గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేసి విసిగించటం సభ్యతకు విరుద్ధమని అప్పటికి మిన్నకుండిపోయింది.

వికం సాధారణ విషయాలను గురించి మాట్లాడసాగాడు. మెరిటాన్, ఇరుగు పొరుగులు, ఇక్కడి సమాజం, మనుషులు, మంచితనం గురించి మాట్లాడుతున్నాడు.

"నాకు మంచి సంఘం కావాలి. నేను నిరాశా నిస్పృహలలో తేలియాడిన మనిషిని.

నాకు ఉద్యోగం, సంఘం రెండూ కావాలి. నాకు ఏకాంతం పనికిరాదు. అసలు నేను చిన్నప్పుడు పెరిగిన పద్ధతిలో, చర్చి నా వృత్తి అయివుండవలసింది. నేను చర్చి సేవకోసమే పెంచబడ్డాను. అయితే నా జీవన విధానం ఇప్పుడు మారిపోయింది."

"అలాగా!"

"డార్సీ తండ్రి పెంపకంలో నేను అలా కావలసినవాడినే. ఆయనే నా సంరక్షకుడు. ఆయన దయకు నేను జీవితాంతం కృతజ్ఞుడినే. ఆయన నాకు ఎన్నో సంపదలు ఇద్దామని ఆశించాడు. అయితే ఆయన జబ్బుపడినప్పుడు అంతా తారుమారు అయింది."

"అలా ఎలా జరుగుతుంది? వీలునామాను కాదనటం ఎవరికి సాధ్యం? మీరు న్యాయశాస్త్రరీత్యా ఏమీ ప్రయత్నించలేదా?"

"అదేమీ లాభం లేకపోయింది. డార్సీ నాకు చిల్లిగవ్వయినా ఇవ్వకుండా అంతా తనే స్వాధీనం చేసుకున్నాడు. ఏమైనా డార్సీ, నేను విభిన్న తత్వాల మనుషులం."

"ఈ విషయం ఎంతో వింతగా విడ్డూరంగా ఉంది. తను చేసిన పనికి ఎవరైనా, అతన్ని నడిరోడ్డుమీద అవమానించినా తప్పులేదు.

"ఒక రోజు- ఏనాటికైనా ఆ పని జరిగే తీరుతుంది. అందుకు సందేహం లేదు. అయిత్రే ఆ పని నేను మాత్రం చేయలేను. అతని తండ్రిమీదున్న గౌరవం అడ్డొస్తొంది."

ఎలిజబెత్ అతనికి అటువంటి ఉదాత్తమైన ఆలోచనలు ఉన్నందుకు గౌరవించింది.

"అయితే అతనంత క్రూరంగా ఎలా ప్రవర్తించగలిగాడు" అనడిగింది.

"నేనంటే అతనికి ఉన్న అయిష్టానికి కారణం అసూయ. అతని తండ్రి గనుక నన్ను కొద్దిగా తక్కువ ప్రేమతో చూసినట్టయిత్రే డార్సీ నన్ను నెత్తిన పెట్టుకు మోసేవాడేమో! తండ్రిగారి ప్రేమానురాగాలు కొడుక్కు కోపకారణం అయినాయి. చిన్నప్పటి నుంచి ఇదే సంగతి. తండ్రి నన్ను మిన్నగా చూడటాన్ని అతను సహించగలిగేవాడు కాదు."

"డార్సీ ఇంత చెడ్డవాడని నేను ఊహించలేకపోయాను. అతనంటే నాకూ ఇష్టం లేదు. అయినా ఇంత దారుణం అనుకోలేకపోయాను. మనుషులంటే అతనికి ఏవగింపు అనుకొన్నాను కానీ ఇంత దారుణానికీ, దుర్మార్గానికీ దిగుతాడనుకోలేదు."

"మేమిద్దరం ఒకే చర్చిలో పుట్టాం. ఒకే తోటలో పెరిగాము. ఒకే ఊరిలో తిరిగాం. ఇద్దరం ఒకటిగానే వ్యవహరించాం. నా తండ్రి, మీ బాబాయి ఫిలిప్స్ చేసినలాంటి ఉద్యోగమే చేసి దాన్ని డార్సీ తండ్రికి వదిలేసి, తరువాత తను లెంబర్లే తోటను పెంచుతూ ఉండేవాడు. వాళ్ళిద్దరూ ఆంతరంగిక స్నేహితులు. నా సంరక్షణ భారం వహిస్తానని నా తండ్రి చనిపోయేముందు, డార్సీ తండ్రి వాగ్దానం చేశాడు. ఈ ప్రకారం ఆయన నా తండ్రి పట్ల తన కృతజ్ఞత తెలుపుకుందామనుకున్నాడు."

"అంత అవినీతిపరుడు, నిజాయితీ లేనివాడు అయిన డార్సీకి ఎంత అహంభావం!"

"అహంభావమే అతని అలంకారం."

"అయితే ఈ గర్వం అతనికి ఎప్పుడైనా మంచి చేసిందా?"

"ఆ! అహంభావం వల్లనే అతనికి కొంత మంచితనం, ఔదార్యం అలవడ్డాయి. బీదవాళ్ళకు సహాయం చేయటం రైతు కష్టనష్టాలు తొలగించటం చేస్తుంటాడు. తండ్రిగారి గొప్ప తలుచుకుంటేనే అతనికి గర్వం. అతనికొక చెల్లెలు కూడా ఉంది. ప్రపంచంలోకల్లా గొప్ప అన్నగా పేరు పొందాలని అతని భావం. ఆమె సంరక్షణ భారం అతనిదే."

"మిస్ డార్సీ ఎటువంటిది?"

"ఆమె మంచిదే. అయితే ఈ అమ్మాయి కూడా లక్షణాలలో అన్నను పోలినదే. అతి గర్విష్టి. చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఆమెను ఆడిస్తూ నేను రోజంతా గడుపుతూ ఉండేవాడిని. అయితే ఇప్పుడేముంది? ఆమె ఇప్పుడు నాకేమీ కాదు. పదిహేనో, పదహారో సంవత్సరాల వయస్సు ఉంటుంది. తండ్రిగారు పోయినప్పటి నుంచి లండన్‌లోనే ఉంటుంది. అక్కడ ఆమెతో పాటు ఒక నర్స్ ఉండి ఆమె చదువు వ్యవహారాలు చూస్తూ ఉంటుంది."

"బింగ్లీతో అతనికి ఎంతో స్నేహం, చనువు. ఇటువంటి మనిషిని బింగ్లీ ఎలా చేరదీశాడో అర్థంకాదు. వాళ్ళిద్దరికీ స్నేహం ఎలా కుదిరిందో! మీకు బింగ్లీ తెలుసా?"

"ఉహు. తెలియదు."

"అతను చాలా మంచివాడు. అందగాడు. గౌరవనీయుడు. అతనికి డార్సీ విషయం ఆసాంతం తెలిసి ఉండదు."

"అంతే అయివుంటుంది. అయితే డార్సీకి ఊసరవెల్లిలా ఆకారాలు మార్చటం బాగా చేతనవును. అవసరమైతే ఎటువంటి పని చేయడానికైనా సంసిద్ధుడవుతాడు."

ఇంతలో పేకాట పూర్తయింది. వాళ్ళంతా మరో బల్ల దగ్గరకు వెళుతున్నారు. కోలిన్స్, తను ఆటలో ఓడిపోయినా తనకేమీ లెక్కలేదని చెప్పాడు. లేడీ కాథరైన్ ధర్మమా అని తనకు ఇటువంటి చిన్న విషయాలను లెక్కచేయకపోవటం అబ్బిందన్నాడు.

వికం రెండు క్షణాలు కోలిన్స్ వంక చూసి, ఎలిజబెత్‌తో రహస్యంగా "మీ చుట్టానికి కాథరైన్‌తో సన్నిహిత సంబంధం ఉందా?" అనడిగాడు.

"లేడీ కాథరైన్ గురించి నాకేమీ తెలియదు. ఆమె పేరైనా నేను వినటం మొదలుపెట్టింది మొన్న ఉదయం నుంచే" అంది ఎలిజబెత్.

"ఆమె కూతురు గొప్ప ఐశ్వర్యాన్ని పొందుతుంది. ఆమె కుటుంబమూ డార్సీ కుటుంబమూ తమ ఆస్తులను కలుపుకుంటారని వినికిడి!"

ఇది విని ఎలిజబెత్ నవ్వుకుంది. ఆమెకు మిస్ బింగ్లీ జ్ఞాపకం వచ్చింది. పాపం, ఆమె శ్రమ అంతా వృథా అవుతుందన్నమాట.

"తెలివితేటలు కలదనీ, సూక్ష్మగ్రాహి అని ఆమెకు పేరు. అయితే ఇదంతా ఆమె

సిరిసంపదల మూలంగా వచ్చినవే అనుకుంటాను.” అన్నాడు వికం.

అలా సాయంత్రం భోజనాల సమయం వరకు వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఇంటికి వెడుతున్నంతసేపూ ఎలిజబెత్ మనస్సు వికంను గురించిన ఆలోచనలతో నిండిపోయింది.

17

మరునాడు ఎలిజబెత్- తనకు వికంకు జరిగిన సంభాషణ గురించి జేన్‌కు చెప్పింది. జేన్ ఈ సంభాషణ అంతా ఓపికగా విని నివ్వెరపోయింది. డార్సీ ఇంత దుర్మార్గుడు, కర్కశుడు ఎలా అవగలడో ఆమెకు అంతుపట్టటం లేదు. అయితే వికం అబద్ధం చెబుతాడా? “ఆ ఇద్దరూ కూడా ఏదో విషయంలో దగాపడి ఉంటారు. అయితే ఇద్దరినీ కొందరు తప్పుడు అభిప్రాయాలు కలిగించి డొంకదారుల్లో పెట్టి ఉంటారు. వాళ్ళను విడదీసిన పరిస్థితులకు ఇద్దరివీ దోషం, తప్పు ఉండి ఉంటాయి” అంది ఆమె.

“అదే అయివుంటుంది. అయితే, జేన్, మధ్యవాళ్ళు అలా ఎందుకు చేసి ఉంటారు?”

“డార్సీ అటువంటి పనిచేసి ఉన్నాడంటే ఆశ్చర్యం వేస్తోంది. మానవత్వం ఉన్న వాడెవడూ అటువంటి పని చేయలేదు. అతని ఆత్మమిత్రులు కూడా సహించలేని పనిచేశాడు. వాళ్ళను కూడా అతను మోసగించాడా? ఎలా సాధ్యం?”

“బింగ్లీని అలా మోసగించటం సాధ్యమంటే నాకు నమ్మశక్యం గాకుండా ఉంది. అంతే జరిగి ఉంటుంది. లేకపోతే వికం ఇంత కట్టుకథను ఒక్క నిమిషంలో సృష్టించలేడు. పోనీ, డార్సీని ఇదంతా నిరూపించమను. వికం అబద్ధం చెప్పలేదని నాకు నమ్మకం.”

“మొత్తం మీద ఈ కథంతా వింటే ఏమనుకునేందుకూ తోచదు.”

“క్షమించు, ఏమనుకోవాలో తోస్తుంది.”

ఇంతలో ఎవరో వచ్చారని చెప్పి నౌకరు వాళ్ళను పిలుచుకు వెళ్ళింది. వచ్చిన వాళ్ళు, బింగ్లీ, అతని చెల్లెళ్ళు. చాలా రోజులుగా ఎదురుచూస్తున్న నెదర్‌ఫీల్డ్ బాల్‌కు వీళ్ళను ఆహ్వానించటానికి స్వయంగా వచ్చారు. బాల్ వచ్చే మంగళవారం జరుగనున్నది. ఇద్దరు చెల్లెళ్ళూ తమ ప్రియస్నేహితురాలు జేన్‌ను చూడగలిగినందుకు ఎంతో సంతోషించారు. తాము విడిపోయి ఎన్నో యుగాలు అయినట్టు అనిపిస్తోందన్నారు. ఇంట్లో తతిమ్మా వాళ్ళతో, వీళ్ళు అంతగా మాట్లాడలేదు. మిసెస్ బెనెట్‌ను సాధ్యమైనంతవరకు తప్పించుకు తిరిగారు. లిజ్జీతో కూడా ఎక్కువగా మాట్లాడలేదు. కాస్సేపట్లోనే వాళ్ళు వెళ్ళిపోయారు.

నెదర్‌ఫీల్డ్‌లో జరుగబోయే బాల్‌ను గురించి ఈ ఇంట్లో ఆడవాళ్ళంతా హడావుడిగా చెప్పుకుంటున్నారు. మిసెస్ బెనెట్ ఈ పార్టీ తన పెద్దకూతురు గౌరవార్థమే చేస్తున్నారనుకుంటూంది. బింగ్లీ స్వయంగా వచ్చి పిలవటం ఆమెను మరింత

సంబరపరిచింది. ఎలిజబెత్ వికంతో నృత్యం చేయవచ్చుననీ, డార్సీని గురించిన ఇంకా తెలుసుకోవచ్చుననీ అనుకుంది. కిట్టీ లిడియాలకు కూడా విందంటే సంబరమే కదా! మేరీ కూడా ఈ బాల్ అంటే తనకేం అయిష్టం లేదంది.

కోలిన్స్‌ను, "విందుకు నృత్యానికీ తప్పకుండా వస్తావు కదూ" అని లిజ్జీ అడిగింది.

"ఇటువంటి పెద్దమనిషి ఇచ్చే బాల్‌లో ఏమీ తుచ్ఛము ఉండదనుకుంటాను. నా మటుకు నేనూ నృత్యం చేస్తాను. ఈ సందర్భంలో నీ పట్ల నా అనురాగాన్ని తెలియపరచటానికి మొదటి రెండు డ్యాన్సులు నీతోనే చేస్తాను ఎలిజబెత్."

ఎలిజబెత్ మొదటి డ్యాన్సులు వికంతో చేద్దామనుకుంది. అయితే ఆ స్థానంలో ఇప్పుడు కోలిన్స్ ప్రతిపాదన ఉంది. ఆమె హతాశువు అయింది. అయినా ఆమె కోలిన్స్ ప్రతిపాదనను అంగీకరించింది. కోలిన్స్ ఇలాంటి ప్రతిపాదన చేసి ఉండకపోతేనే బాగుండేది. కానీ ఇప్పుడు తను చేయగలిగిందేమీ లేదు.

నెదర్ ఫీల్డ్ బాల్ గురించి మాట్లాడుకునే అవకాశం లేకపోయినట్టయితే, బెనెట్ కూతుళ్ళకు ఈ రోజులన్నీ నిరామయంగా ఉండేవి. ఏమీ తోచేది కాదు. ధారాపాతంగా వాన కురుస్తూ ఉండటం వల్ల, కాథరైన్ లిడియాలు మెంటాన్ వెళ్ళి రావటానికి అవకాశం లేదు. ఎవరికీ ఏమీ తోచని పరిస్థితులలో ఇది మంచి చర్చనీయాంశమే దొరికింది. ఈ బాల్ గురించే కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళు శుక్రవారం, శనివారం, ఆదివారం, సోమవారం గడిపేశారు. మంగళవారం నాడే బ్రహ్మాండమైన బాల్!

18

ఎలిజబెత్ నెదర్‌ఫీల్డ్ భవనంలోని డ్రాయింగ్ రూం ప్రవేశించింది. అక్కడ కూర్చుని ఉన్న వాళ్ళందరి వంక చూసింది. వికం వచ్చాడో లేదో తెలుసుకోటానికి. అతను వచ్చి ఉండకపోవచ్చునన్న అనుమానమే ఆమెకు తగలలేదు. ఆమె ఈ రోజు మామూలు కంటే ఎక్కువగా అలంకరించుకుంది. అయితే ఏం లాభం? ఇక్కడ కూర్చుని ఉన్న వాళ్ళలో వికం లేడు. లిడియా డెన్నీని అడుగగా వికం ఏదో తొందరపనిమీద నిన్న పట్టణానికి వెళ్ళాడనీ, ఇంతవరకూ తిరిగి రాలేదనీ చెప్పాడు. పైగా 'ఇప్పుడే అంత ముంచుకుపోయే తొందరపని ఏమి వచ్చిందో నాకు అర్థంకాదు. ఇక్కడికి వచ్చే వాళ్ళలో ఎవరినైనా చూడటం ఇష్టంలేక, బహుశా ఈ ఎత్తువేసి ఉంటాడు' అన్నాడు.

ఇటువంటి పరిస్థితికి మూలకారకుడైన డార్సీ మీద ఆమెకు విపరీతమైన కోపం వచ్చింది. అందుచేతనే, అతను వేసిన కుశల ప్రశ్నలకు తిన్నగా, మర్యాదగా సమాధానం చెప్పలేకపోయింది. బింగ్లీ అంటే కూడా ఆమెకు కొద్దిపాటి కోపం ఏర్పడింది.

ఈ సాయంత్రం ఆమె ఆశలన్నీ అడియాసలు అయినట్టున్నాయి. తన విచారమంతా

చార్లెట్ లూకాతో చెప్పుకుని, కొంత బరువు తగ్గించుకుంది. ఇంతలో కోలిన్స్ వచ్చాడు, నృత్యం ఆరంభమైంది. మొదటి రెండు వరుసలు ఆమె కోలిన్స్‌తో డ్యాన్స్ చేసింది. అతను సరిగా అడుగు వేయలేకపోయాడు. కొన్ని కొన్ని చోట్ల తప్పులు చేశాడు. డ్యాన్స్ నుంచి ఇవతల పడేంతవరకు ఎలిజబెత్‌కు చిరాకనిపించింది.

తరువాత ఎలిజబెత్ ఒక ఆఫీసరుతో డ్యాన్స్ చేసింది. డ్యాన్స్‌లన్నీ అయిన తరువాత చార్లెట్ లూకా దగ్గర కూర్చుని కబుర్లలో పడింది. అనుకోకుండా, డార్సీ ఆమె దగ్గరకు వచ్చి పలకరించాడు. ఒకసారి కరస్పర్శ చేసి వెళ్ళిపోయాడు.

చార్లెట్ ఇలా అంది: 'పోను పోను, నీవు డార్సీ అంటే ఇష్టపడతావులే!

"అలా జరిగితే, అంతకన్నా దురదృష్టం ఇంకేమీ ఉండదు. హేయపడటానికి నిర్ణయించుకున్న మనిషిని ఇష్టపడటమా? నాకటువంటి దురదృష్టం పట్టదనుకుంటాను."

తిరిగి డ్యాన్సులు ఆరంభమైనాయి. డార్సీ ఆమె జంట కోరాడు. చార్లెట్ వారిస్తున్నా, ఎలిజబెత్ అంగీకరించింది. డ్యాన్స్ జరుగుతున్నంతసేపూ ఇద్దరూ ఎక్కువగా మాట్లాడు కోలేదు. ఎలిజబెత్ అతన్ని కవ్వించింది. చివరకు ఆమె ఎలాగో సంభాషణను 'వికం' మీదికి తీసుకు వెళ్ళింది. అతన్ని గురించి డార్సీ ఇలా అన్నాడు. "అతనికొక వరప్రసాదం ఉంది. అదేమంటే ఎన్నో గొప్ప గొప్ప స్నేహాలు నిమిషమాత్రంలో సంపాదిస్తాడు. అయితే వాటిని నిలుపుకోవటం మట్టుకు చేతకాదు."

"అతను మీ స్నేహాన్ని కోల్పోవటంతో నిజంగా ఎంతో దురదృష్టవంతుడు. ఈ కోల్పోయిన పద్ధతి, అతన్ని జీవితాంతం బాధపెడుతూ ఉంటుంది" అంది ఎలిజబెత్.

డార్సీ జవాబు చెప్పలేదు. విషయం మార్చాలనుకున్నాడు. ఇంతలో విలియమ్ లూకా అటువైపు వచ్చాడు. డార్సీ ఎలిజబెత్‌ల నృత్యాన్ని అభినందిస్తూ ఇలా అన్నాడు. "ఆహా! ఇటువంటి నృత్యం ఇంతవరకూ నేనెక్కడా చూడలేదు. ఏమి సొగసు, ఏమి హొయలు!"

విలియం వెళ్ళిపోయిన కొన్ని నిమిషాలకు కానీ డార్సీ తేరుకోలేదు. అతను బింగ్లీ. జేన్‌లు చేస్తున్న బాల్ డ్యాన్స్ చూస్తూ ఉండిపోయాడు. తిరిగి యథాప్రపంచంలోకి రాగానే "విలియం గారి రాకతో మనం మాట్లాడుతున్న విషయం మరిచిపోయాను" అన్నాడు.

"మనమసలు మాట్లాడుకోవటమే లేదు. రెండు మూడు విషయాలు ప్రస్తావించు కున్నాం కానీ ముగించలేదు. ఇక ముందు ఏ విషయం ప్రస్తావిస్తామో మనకే తెలియదు."

అతను నవ్వుతూ "పుస్తకాలను గురించి మాట్లాడుకుందాం" అన్నాడు.

"పుస్తకాలా? మనం ఒకే రకం పుస్తకాలు చదివి ఉండమనుకుంటాను."

"అలాగా! అలా అయితే మన అభిప్రాయ భేదాలను గురించి తర్కించుకోవటానికి మంచి అవకాశం!" అన్నాడు.

"వద్దు బాల్ రూమ్‌లో పుస్తకాల ప్రసక్తి ఏమిటి?"

"వర్తమానం నీ మనస్సును అతలాకుతలం చేస్తున్నది కదూ?" అన్నాడు డార్సీ.

"అవును. మీ విషయం, పూర్వం ఎప్పుడో చెప్పినట్టున్నారు. ఒకసారి ఏర్పడిన అభిప్రాయాన్ని ఎంత క్లిష్ట పరిస్థితిలోనైనా మార్చుకోనని, అయితే ఆ అభిప్రాయం ఏర్పరచుకోవటంలో ఎంతో జాగ్రత్తగా ప్రవర్తిస్తారు కదూ."

"అవును" అన్నాడు డార్సీ గంభీరంగా.

"అయితే ఎప్పుడూ అసూయ చేత అంధకారంలో పడిపోరు కదా!"

"పడిపోననుకుంటాను."

"ఎప్పుడూ తమ అభిప్రాయాలు మార్చుకునివాళ్ళు ఏ విషయమైనా మొదటితడవే నిర్ధారణగా తీర్పు చెప్పుకోగలరు."

"ఇంతకూ నీవడుగుతున్న ప్రశ్నలన్నీ దేనికి?"

"ఊరికే మీ వ్యక్తిత్వాన్ని గురించి తెలుసుకోవటానికి."

"ఎంతవరకు తెలుసుకున్నావు?"

ఆమె తల 'ఊపి ఏమీ తేల్చుకోలేకపోతున్నాను. మిమ్మల్ని గురించి విభిన్నమైన విషయాలు వింటున్నాను' అంది.

"ఇటువంటి సమయంలో నీవాపని చేయటం మంచిది కాదనుకుంటాను. ఇద్దరికీ శ్రేయస్కరం కాదు."

"ఇప్పుడు కాకపోతే నాకు వేరే మరో అవకాశం రాకపోవచ్చు!"

"సరే. అయితే అలాగే కానీ."

ఆమె ఇంకేమీ మాట్లాడకుండా అక్కడి నించి వెళ్ళిపోయింది.

ఇంతలో మిస్ బింగ్లీ ఆమె ఉన్న చోటికి వచ్చి ఇలా అంది: 'అయితే నీవు వికం అంటే చాలా అనురాగం చూపుతున్నావన్నమాట. మీ అక్క నాకు సంగతంతా చెప్పింది. ఈ విషయంలో, స్నేహరీత్యా నీకు కొన్ని యదార్థ విషయాలు చెబుతాను, విను. డార్సీ అతన్ని అగౌరవపరిచాడని, అవమానపరిచి ఇంటినించి వెళ్లగొట్టించాడని చెప్పే కథంతా శుద్ధ అబద్ధం. పైపెచ్చు డార్సీ అతనంటే ఎంతో దయతో చూసేవాడు."

ఎలిజబెత్ కోపంగా 'మీరు ఇప్పుడు చెప్పినవన్నీ అతను నాకు మొదటి రోజే చెప్పాడు. ఈ సంగతులేవీ నాకు తెలియనివి కాదు. అతను నా దగ్గర ఏమీ దాచలేదు" అంది.

"క్షమించు. తెలిసిన విషయాలు చెప్పకుండా ఉండటం మంచిది కాదని వచ్చాను." అంటూ మిస్ బింగ్లీ ఓరచూపు చూస్తూ వెళ్ళిపోయింది.

ఎలిజబెత్ తనలో తాను 'మోటు మనిషి! పోచుకోలు మాటలు చెప్పి నా మనసు విరుద్దామనుకుంది. తెలివితక్కువతనం తప్ప ఇంకేం లేదు' అనుకుంది. తర్వాత "వికంను గురించి ఏమేం తెలుసుకున్నావో చెబుతావా?" అని జేన్‌ని అడిగింది.

"అంతగా ఏమీ తెలుసుకోలేదు. బింగ్లీకి అతన్ని గురించి పూర్తిగా తెలియదు. అయితే బింగ్లీకి డార్సీ పట్ల ఎంతో గౌరవం ఉన్నది. వికం పట్ల మంచి అభిప్రాయం లేదు."

"అయితే బింగ్లీకి వికంతో పరిచయమే లేదా?"

"లేదు. మెరిటాన్‌లో ఆ వేళ చూడటమేగానీ అంతకు ముందు అతన్ని ఎరుగడు!"

"అయితే ఈ స్నేహితులు ఇద్దర్ని గురించి మనం ఇంటి దగ్గర ఏర్పరచుకున్న అభిప్రాయాలు మార్చుకోనవసరం లేదు."

జేన్‌కు ఎలిజబెత్ వాదన నచ్చింది.

ఇంతలో బింగ్లీ అక్కడికి వచ్చాడు. ఎలిజబెత్ మిస్ లూకా దగ్గరకు వెళ్ళింది. కోలిన్స్ కూడా అక్కడికి వచ్చాడు. "ఈ గదిలో నా యజమానురాలికి దగ్గర బంధువెవరో ఉన్నారని ఇప్పుడే విన్నాను. వారిని కలుసుకుని గౌరవంగా అభివాదాలు చేయాలి. నయమే. సమయానికే తెలుసుకో గలిగాను. ఆయన నా ఆలస్యాన్ని అన్యథా భావించడు అనుకుంటాను" అన్నాడు కోలిన్స్.

"అయితే డార్సీ దగ్గరకు వెళ్ళి నిన్ను నీవే ఎరుకపరచుకుంటావా?"

"తప్పకుండా! ఇంతకు ముందే కలుసుకోనందుకు క్షమాపణ చెప్పుకుంటాను. అతను లేడీ కాథరైన్‌కు అతి దగ్గర చుట్టం అట కదా!"

ఎలిజబెత్ అతన్ని ఆపాలని ప్రయత్నించింది. ఎవరూ పరిచయం చేయకుండా, తనంతట తనే వెళ్ళి మాట్లాడితే, డార్సీ కోప్పడతాడని చెప్పింది. అయినా కోలిన్స్ తన దృఢ నిశ్చయాన్ని మరల్చుకోలేదు. సరాసరి డార్సీ దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు.

కొద్దిసేపు డార్సీతో మాట్లాడి వచ్చి కోలిన్స్ ఎలిజబెత్‌తో ఇలా అన్నాడు: 'డార్సీ నన్ను చూసి ఎంతో సంతోషించాడు. లేడీ కాథరైన్ ఎప్పుడూ తక్కువ తరగతి మనుషులను చేరదీయదనీ, అందుచేత నేను గొప్పవాడినే అయివుంటాననీ' అన్నాడు.

ఎలిజబెత్ అతను చెబుతున్న మాటలు శ్రద్ధగా వినడం లేదు. జేన్ బింగ్లీల వంక దృష్టి మరల్చింది. వాళ్ళ ఆనందాన్ని చూసి ఆమె శరీరం కూడా పులకరించుతోంది. ఇప్పుడు బింగ్లీ చెల్లెళ్ళంటే కూడా ఆమెకు అనురాగం గానే ఉంది.

మిసెస్ బెనెట్ తన పెద్ద కుమార్తె అదృష్టాన్ని చూసి సంబరపడుతోంది. భోజనాల దగ్గర తల్లి, ఎలిజబెత్ పక్క పక్కనే కూర్చున్నారు. తల్లి బిగ్గరగా మాట్లాడుతూ ఉంటే ఎలిజబెత్ 'ఉస్ నింపాదిగా మాట్లాడు. డార్సీ వింటాడు' అంది.

"ఏం, మనం డార్సీని చూసి ఎందుకు భయపడాలి? అతనంటే మనం ప్రత్యేకమైన మర్యాద ఎందుకు చూపాలి? అతనికి ఇష్టంలేని విషయాలు ఎందుకు మాట్లాడగూడదు?"

"అబ్బబ్బ! అలా వేగిరపడకు అమ్మా! డార్సీకి కోపం కలిగిస్తే మనకేమన్నా ఒరిగేది ఉందా? పైగా అతని స్నేహితుడికి కూడా కోపం రావచ్చు."

కూతురు ఎంత చెప్పినా లాభం లేకపోయింది. ఆమె అదే స్థాయిలో చెప్పుకుపోతోంది. ఎలిజబెత్ సిగ్గుపడిపోయింది. మధ్య మధ్య భయంగా డార్సీ వంక చూస్తోంది. అతను మటుకు గంభీరంగా తమ వంకే చూస్తున్నాడు.

చివరకు ఎలాగైతేనేం మిసెస్ బెనెట్ చెప్పవలసినదంతా చెప్పింది. భోజనాలు అయినాక సంగీతం అన్నారు. మేరీ శ్రోతల కోరికపై పాటలు పాడింది. ఆమె పాడుతున్నంతసేపూ, ఎలిజబెత్ ఆమె వంకే చూస్తోంది. మేరీ కంఠస్వరం నీరసంగా ఉంది. రెండో పాట తరువాత బెనెట్, ఎలిజబెత్ అందించిన సైగ ప్రకారం, 'చాలా బాగా పాడావు! ఇక నీవు విశ్రాంతి తీసుకుని తతిమ్మా అమ్మాయిలకు అవకాశం ఇవ్వు!' అన్నాడు. మేరీ ఈ మాటలు విననట్టు నటించింది.

ఇంతలో కోలిన్స్ అందుకుని ఇలా ఉపన్యాసం ఇచ్చాడు: 'నాకే గనుక సంగీతం వచ్చినట్టయితే, నేనూ నాలుగు పాటలు పాడి అందరికీ ఆనందం కలుగజేసి ఉండేవాడిని. అయితే నా ఉద్యోగ ధర్మం వల్ల నాకు సంగీతాభ్యాసానికి అవకాశం తక్కువ. అందరూ నవ్వారు. ఇంత చక్కగా మాట్లాడగలిగి నందుకు మిస్టర్ బెనెట్ అతన్ని అభినందించాడు.

మిసెస్ బెనెట్, లేడీ లూకాకు కోలిన్స్ తెలివితేటలను గురించి జనాంతికంగా చెప్పింది. కోలిన్స్ లిజ్జీ పక్కనే కూర్చుని మాటలతో వేధించుకు తినసాగాడు. ఇలా చాలాసేపు అయిన తరువాత మిస్ లూకా వచ్చి కోలిన్స్‌తో కబుర్లు పెట్టుకుంది. ఎలిజబెత్‌కు అప్పుడు ఎంతో హాయి అనిపించింది.

డార్సీ ఎలిజబెత్‌కు దూరంలో నిలుచుని ఆమెను గమనిస్తున్నాడు. ఆమె వికంను గురించి ఏమనుకుంటుందో, తనను గురించి ఏమనుకుంటుందో అని ఆలోచిస్తున్నాడు.

పార్టీ ముగిసింది. అందరూ వెళ్ళిపోయిన తరువాత ఒక పావుగంటకు పైగా మిసెస్ బెనెట్ తాలూకు గుఱ్ఱపు బగ్గీ రాలేదు. ఈ సమయం వాళ్ళకు, ఇక్కడి వాళ్ళు తాము ఎంత తొందరగా వెళ్ళాలని కోరుకుంటున్నారో స్పష్టపరిచింది. హర్ట్స్ సతి, ఆమె చెల్లెలు నోరైనా మెదపలేదు. మిసెస్ బెనెట్ మాట్లాడటానికి ప్రయత్నించినా వాళ్ళు కొనసాగ నివ్వలేదు. డార్సీ అసలేమీ మాట్లాడలేదు. మిస్టర్ బెనెట్ కూడా నిశ్శబ్దంగా ఉండి ఈ తమాషా అంతా చూస్తున్నాడు. బింగ్లీ, జేన్‌లు ఒక చోట నిలుచున్నారు. తతిమ్మా వాళ్ళతో సంబంధం లేకుండా వాళ్ళు ఇద్దరూ ఏకాంతంగా మాట్లాడుకుంటున్నారు. ఎలిజబెత్ ఏమీ మాట్లాడటం లేదు. ఆఖరుకు అతివాగుడు లిడియా కూడా నీరసంగా కూర్చుంది.

చివరకు ఇంటికి వెళుతూ, మిసెస్ బెనెట్ బింగ్లీ కుటుంబమంతా త్వరలోనే లాంగ్ బర్న్ వచ్చి తమను ఆనందింపచేస్తారని ఆశిస్తున్నానన్నది. బింగ్లీ మరునాడు తను లండన్ వెళుతున్నాననీ, తిరిగి వచ్చిన తర్వాత అలాగే వస్తామనీ అన్నాడు.

మిసెస్ బెనెట్ పూర్తి సంతృప్తి పొందింది. మూడు నాలుగు నెలలలో తన కుమార్తె

నెదర్‌ఫీల్డ్‌లో స్థిరపడుతుందని ఆమెకు నమ్మకం. ఇంకో అమ్మాయిని కోలిన్స్‌కు ఇవ్వవచ్చు. బింగ్లీ అంత గొప్పవాడు కాకపోయినా, అతనికి ఎలిజబెత్ అంటే ఉన్న అనురాగానికి, ఆమెను కోలిన్స్‌కు ఇవ్వటానికి ఆమెకేమీ అభ్యంతరం కనిపించలేదు.

19

మరునాడు లాంగ్‌బర్న్‌లో మరొక అద్భుత దృశ్యం. కోలిన్స్ తన ప్రతిపాదనకు తుదిరూపం ఏర్పరచి బయలుపరిచాడు. భోజనాలు అయినతర్వాత, మిసెస్ బెనెట్, ఎలిజబెత్, కిట్టీ ఒక చోట ఉండగా చూసి ఇలా అన్నాడు: "నేను ఎలిజబెత్‌తో ఏకాంతంగా మాట్లాడాలి. ఈ మాటలు మీ కుటుంబానికి ఎంతో శ్రేయస్సు చేకూరుస్తాయి. కనుక నాకు ఆ అవకాశం ఇస్తారా?"

ఎలిజబెత్ మాట్లాడకముందే తల్లి అందుకుని "ఓ! తప్పకుండా అలాగే మాట్లాడండి. ఎలిజబెత్‌కు ఏమీ అభ్యంతరం ఉండదనుకుంటాను. రా కిట్టీ పైకిపోదాం" అంది.

"అమ్మా నువ్వు వెళ్ళనవసరం లేదు. ఇంట్లో ఎవరూ వినగూడని మాటలు కోలిన్స్ నాకేమీ చెప్పనవసరం లేదు. నేనే వెళ్ళిపోతున్నాను."

"అదేమిటి లిజ్జీ! ఎక్కడికీ వెళ్ళవద్దు. ఎక్కడున్నావో అక్కడే ఉండు. కోలిన్స్ చెప్పదలచుకున్నదేమిటో విను." అంది.

ఎలిజబెత్ ఇక అభ్యంతరం చెప్పలేకపోయింది. మిసెస్ బెనెట్, కిట్టీ మేడమీదికి వెళ్ళగానే కోలిన్స్ ఆరంభించాడు: "నా మాట నమ్ము, ఎలిజబెత్ మంచి ఉద్దేశంతో చెబుతున్నాను. నా భావిజీవితానికి తోడూనీడగా నిన్ను ఎంచుకొన్నాను. అసలు నీలాటి వ్యక్తిని వెదుక్కోవటం కోసమే నేను ఇక్కడికి వచ్చాను. నా పని నెరవేరింది."

ఎలిజబెత్‌కు నవ్వు వచ్చింది. అతనింకా ఇలా చెప్పుకుపోయాడు. "ఇక నేను వివాహం చేసుకోవడానికి కారణాలు చెబుతాను. నాబోటి మత సంబంధమైన ఉద్యోగి వివాహం చేసుకోవటం ఎంతో ఉచితమైన విషయం. రెండు: ఇందువల్ల నాకు సుఖం మరింత చేకూరుతుందనే నమ్మకం. మూడు, నా పోషకురాలు ఇచ్చిన సలహా ప్రకారం వ్యవహరించటం నా ధర్మం. ఆమె, రెండు మూడు సార్లు నేను అడగకముందే, నన్ను వివాహం చేసుకోమని ఆదేశించింది. నాబోటి సత్పురుషుడు తగిన స్త్రీని ఎన్నుకుని వివాహం చేసుకోవాలని ఆమె నేను ఇక్కడికి వచ్చేముందు కూడా చెప్పింది. మంచి స్త్రీని, తెలివిగలదానిని, అందగత్తెను, ఇంటి విషయాలలో పొదుపుగా ఉండగలదానిని, చూసి ఎంచుకోమని ఆమె ఆదేశం. ఇటువంటి స్త్రీని చూసిందే తడవుగా హెన్స్‌ఫోర్డ్‌కు తీసుకు వస్తే తాను కూడా చూసి ఆమోదముద్ర వేస్తానన్నది. ఆమె మంచితనం ఉదార స్వభావం స్వయంగా అనుభవం ఉంటే తప్ప నీవు తెలుసుకోలేవు. సరే, ఈ విధంగా నేను వివాహం

చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చాను. ఇంతకూ మరో విషయం ఏమిటంటే మీ నాన్న గారి మరణానంతరం ఈ ఎస్టేటంతా నాకు చెందుతుంది. అయితే ఇది ఇంకా ఎన్నో సంవత్సరాల తరువాత మాట అనుకో. నేను లాంగ్ బర్న్‌లోని ఆయన కూతుళ్ళలో ఎవరో ఒకరిని వివాహం చేసుకుని, ఆ ఆస్తి సంక్రమణ జరిగేట్టయితే దాని తీవ్రతను తగ్గించవచ్చు. నా ఉద్దేశం ఇది. నాకు భోగభాగ్యాలంటే నిర్లక్ష్యం. మన వివాహం అయిన తర్వాత, ఇక ఆస్తిపాస్తులను గురించి నేనేమీ పేచీలు పూచీలు పెట్టుకోను."

అతని ధోరణికి అడ్డురావటం ఇప్పుడు తప్పనిసరి అయింది.

"చాలా తొందరపడి చెప్పుకుపోతున్నారు. నేనింతవరకు ఏమీ జవాబు చెప్పలేదని మరచిపోతున్నారు. ఇప్పటికైనా, ఇంకా ఆలస్యం కాకుండా, నన్ను జవాబు చెప్పనివ్వండి. మీరు నాయందు చూపుతున్న దయకు నా వందనాలు. అయితే మీ కోరికను మన్నించలేకపోవటం తప్ప నేనింకేమీ చేయలేని స్తితిలో ఉన్నాను."

"యువతుల మనోభావాలు కనిపెట్టటం నాకు తెలుసు. వారు కాదంటే అవుననీ, అవునంటే కాదనీ! మనసులో మాటను యథాతథంగా బయటికి చెప్పెయ్యటమంటే ఆడవాళ్ళకు చాలా కష్టం! మనసులో ఎంత ఇష్టం ఉన్నా, పైకి మటుకు మూడు నాలుగుసార్లు ప్రతిపాదనలు తిరస్కరిస్తారు. అందుచేత ఇప్పుడు నీ మాటలకు నేనేం భయపడవలసిన అవసరం లేదనుకుంటాను."

"నేను ఇంత స్పష్టంగా చెప్పిన తరువాత కూడా మీరు ఇలా అంటారేమిటి? మీరు ఊహిస్తున్న యువతుల వంటి దాన్ని కాదు నేను. నేనేదైనా మాట అంటే బాగా ఆలోచించే అంటాను. దానికి ఇంక చేర్పులు మార్పులు ఉండవు. మనమిద్దరం వివాహం చేసుకుంటే, మీరు నన్ను సుఖపెట్టలేరు. నేను మిమ్మల్ని సుఖపెట్టలేను."

"లేడీ కాథరైన్‌కు నీవు నచ్చుతావు. ఈసారి ఆమెను కలుసుకున్నప్పుడు నీ వినయవిధేయతలు, పొదుపరితనం, ఇతర సద్గుణాల గురించి పొగిడి చెబుతాను"

"నా గురించి అంతగా పొగడటం కేవలం అనవసరం. నా మంచి చెడ్డలు నాకే తెలుసు. నేను చెప్పినదంతా నిజం. మీరు జీవితాంతం సుఖంగా ఉండాలి. సిరిసంపదల తో తులతూగాలి. అందుకనే మిమ్ములను నేను చేపట్టకపోవటం. ఇంక ఈ విషయం ఇంతటితో ఆపేయండి" అంటూ లేచి ఆ గదిలోంచి వెళ్ళబోయింది.

కోలిన్స్ గంభీరంగా ఇలా అన్నాడు: "ఈసారి ఈ ప్రస్తావన నీ దగ్గర తీసుకువచ్చినప్పుడు అనుకూలమైన జవాబు వస్తుందని ఆశిస్తాను. నీ మొరటు మాటలకు నాకు కోపం వచ్చినా, మీ ఆడవాళ్ళంతా ఇంతే కనుక, ఊరుకుంటున్నాను."

"మీ ధోరణి విచిత్రంగా ఉంది. నేను ఇంత చెప్పిందీ మీకు అర్థంకాదా? అయితే నా తిరస్కృతిని ఏ పద్ధతిలో వెలిబుచ్చాలో అర్థం కావడం లేదు."

"నీ తలిదండ్రులు నా ప్రతిపాదనను తప్పకుండా అంగీకరిస్తారు."

ఎలిజబెత్ మరేమీ జవాబు చెప్పలేకపోయింది. నిశ్శబ్దంగా బయటకు వెళ్ళిపోయింది.

20

ఎలిజబెత్ అలా తలుపు తెరుచుకుని బయటకు వెళ్ళి పోగానే మిసెస్ బెనెట్ లోపలకు వచ్చి కోలిన్స్‌ను అభినందించింది. అయితే జరిగినదంతా విన్న తరువాత ఆమెకు ఎంతో బాధ కలిగింది. లిజ్జీ అలా నటిస్తున్నదా? "సరేలే, కోలిన్స్, నీవేం బెంగపెట్టుకోకు. ఎలిజబెత్‌ను నేను దారికి తీసుకు వస్తాను. దానితో ఈ విషయం ఇప్పుడే ప్రస్తావిస్తాను, దానికి మొండి పట్టుదల ఎక్కువ. తనకెంత తోస్తే అంతేకాని ఇతరుల సలహా పాటించదు. తన మంచే తనకు తెలియనంత మూర్ఖురాలు." అంది మిసెస్ బెనెట్.

"ఆమె, మీరు చెబుతున్నంత మూర్ఖురాలు, మొండిపట్టు కలదీ అయితే కేవలం సుఖం కోసమే వివాహం అనుకునే నా బోటి వాడికి ఎంతమాత్రం ఇల్లాలుగా పనికిరాదు. అందుచేత మీ ప్రయత్నానికి ఆమె దారికి రాకపోతే మీరు వదిలేయండి."

"నా అభిప్రాయాన్ని మీరు సరిగా అర్థం చేసుకోలేదు. లిజ్జీ కేవలం ఇటువంటి విషయాలలోనే తలబిరుసుగాని, ఇతర వ్యవహారాల్లో మంచిదే, వ్యవహర్తే. ఇప్పుడు నేను వాళ్ళ నాన్న చేతనే చెప్పించి దాన్ని ఒప్పిస్తానుగా." అంటూ భర్త గది వైపు పరుగెత్తింది.

"ఎలిజబెత్ కోలిన్స్‌ను చేసుకోనని చెబుతోంది. మీరు త్వరగా కలుగజేసుకోకపోతే, అతను తన మనసు మార్చుకుంటాడు., లేవండి– రండి" అంది భర్తతో.

బెనెట్ తన పుస్తకం నుంచి దృష్టి మరల్చి ఆమె వంక చూశాడు.

"నాకేం అర్థం కాలేదు. నువ్వు చెబుతున్నది ఏమిటి?" అన్నాడు.

ఆమె మళ్ళీ ఇందాకటి మాటలే అంది.

"అయితే ఇప్పుడు నేనేం చేయను? ఇందులో నా ప్రమేయం ఏముంది?"

"లిజ్జీతో మాట్లాడండి. కోలిన్స్‌ను పెళ్లి చేసుకు తీరాలని చెప్పండి."

"సరే దాన్ని పిలువు, నా అభిప్రాయం చెబుతాను."

ఎలిజబెత్‌కు పిలుపు వెళ్ళింది.

ఆమె వస్తూండగానే, తండ్రి "రా, అమ్మా రా, ఒక ముఖ్యమైన విషయం చెప్పటానికి నిన్ను పిలిచాను. కోలిన్స్ నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడట కదా? నిజమేనా?" అన్నాడు.

ఆమె అవునని తలఊపింది.

"అతన్ని నీవు తిరస్కరించావటగా!"

"అవును."

"సరే, బాగానే ఉంది. మీ అమ్మమటుకు ఈ సంబంధం అయితీరాలని

పట్టుపడుతోంది ... ఏం అంతేకాదూ?"

"అవును. లేకపోతే దాని ముఖం నేను ఇక ఈ జన్మలో చూడను."

"ఇప్పుడు గొప్ప క్లిష్ట పరిస్తితి ఏర్పడింది. నీవు కోలిన్స్‌ను వివాహం చేసుకోకపోతే మీ అమ్మ నీ ముఖం చూడదు. ఒక వేళ చేసుకుంటే నేను నీ ముఖం చూడను."

ఎలిజబెత్ నవ్వింది. తల్లికి నిరాశతో పాటు పట్టరాని కోపం వచ్చింది.

"ఇలా మాట్లాడటంలో మీ ఉద్దేశం ఏమిటి?"

"నా ఉద్దేశం నేను చెప్పనే చెప్పానుగా!"

ఇంతమాత్రంతో మిసెస్ బెనెట్ ఈ విషయాన్ని వదిలిపెట్టలేదు. ఎలిజబెత్‌తో ఎన్నోసార్లు మాట్లాడింది. ఆమెను బ్రతిమాలింది. భంగపడింది. చివరకు బెదిరించింది కూడా. ఎలిజబెత్ మటుకు తన నిశ్చయాన్ని మార్చుకోదలచలేదు.

కోలిన్స్ జరిగిన సంగతులన్నీ మనస్సులో నెమరు వేసుకొంటున్నాడు. ఈ కుటుంబం ఇలా క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుని ఉండగా చార్లెట్ లూకా ఒక రోజు కులాసాగా గడుపుదామని ఇక్కడికి వచ్చింది. లిడియా ఆమెను వసారాలోనే కలుసుకుని, ఈ గొడవంతా చెవిని వేసింది. మిసెస్ బెనెట్ కూడా ఇదే గొడవ చెప్పి, స్నేహితురాలిని మంచి దోవలో పెట్టమని కోరింది. ఇంతలో జేన్, లిజ్జీలు వాళ్ళ దగ్గరకు వచ్చారు.

మిసెస్ బెనెట్ "చూడు, అది ఎంత నిర్లక్ష్యంగా ఇదంతా తనకేమీ సంబంధం లేనట్టు ఉన్నదో. ఇదుగో చూడు, లిజ్జీ ఇలా నీవు ప్రతి ప్రతిపాదననూ తోసిపుచ్చావంటే ఆఖరుకు నీకు మొగుడే దొరక్కుండా పోతాడు. నీ తండ్రి చచ్చిపోయిన తర్వాత నీ పోషణ భారం ఎవడు వహిస్తాడో నీకేమీ తెలియకుండా ఉంది. ఈ రోజు నుంచి నీకూ నాకూ ఏమీ సంబంధం లేదు. ఇక నీ ముఖం నేను చూడను. నీతో మాట్లాడను."

కూతుళ్ళందరూ ఈ మాటలు దిగ్భ్రాంతులై విన్నారు. ఇంతలో కోలిన్స్ అక్కడికి వచ్చాడు. ఎలిజబెత్ గదిలోంచి బయటకు వెళ్ళింది. జేన్ కిట్టీ ఆమె ననుసరించారు. లిడియా మటుకు అక్కడే నిలుచుంది. చార్లెట్ కూడా అక్కడే ఉంది.

"ఇంక ఈ విషయాన్ని మరచిపోదాం. దీన్ని గురించి మాట్లాడవద్దు. మీ కూతురితో పోట్లాట పెట్టుకోవద్దు. నా కోసం మీ కుటుంబంలో కలతలు ఏర్పడవద్దు. నా ప్రతిపాదన వదులుకుంటాను. నా పొరపాటు ఉంటే క్షమించండి." కోలిన్స్ మిసెస్ బెనెట్‌తో అన్నాడు.

21

కోలిన్స్ ప్రతిపాదనను గురించి మాట్లాడుకోవటం దాదాపు అయిపోయినట్టే. అయితే ఎలిజబెత్ మటుకు, తల్లి కోపానికి గురవుతోంది. కోలిన్స్ ఆమెతో మాట్లాడటం లేదు. అసలు ఆమె ఉన్న చోటికి రాకుండానే జాగ్రత్త పడుతున్నాడు.

ఆ సాయంత్రమంతా అతనికి మిస్ లూకాతో బాతాఖానీతో సరిపోయింది.

మరునాడు భోజనాలయిన తరువాత అందరూ మెరిటాన్ వెళ్ళి వికం వచ్చాడో లేదో కనుక్కుందామనీ, నెదర్‌ఫీల్డ్ బాల్‌కు అతను రానందుకు సంతాపం తెల్పుదామనీ అనుకున్నారు. పట్టణంలో అడుగుపెట్టగానే వాళ్ళకు వికం ఎదురయ్యాడు. పిన్నిగారి ఇంటిదాకా సాగనంపాడు. ఎలిజబెత్‌తో మటుకు తను కావాలనే బాల్‌కు రాలేదన్నాడు.

ఎలిజబెత్ అతని ధోరణికి సంతోషించింది. వాళ్ళు ఆ విషయాన్ని గురించి విపులంగా మాట్లాడుకోవచ్చు. దారిపొడుగునా వికం ఎలిజబెత్‌తో మాటాడుతూనే ఉన్నాడు. అతను ఇలా రావటం వల్ల రెండు ప్రయోజనాలు ఉంటాయని ఆమె అనుకుంది. ఒకటి తనస్థాయి పెరుగుతుంది. రెండు, అతన్ని తల్లిదండ్రులకు పరిచయం చేయవచ్చును.

వాళ్ళు ఇంటికి రాగానే, జేన్‌కు ఒక ఉత్తరం ఇచ్చారు. అది నెదర్‌ఫీల్డ్ నించి వచ్చింది. జేన్ ఉత్తరం చదివి, మడిచిపెట్టి యథాప్రకారం సంభాషణలో పాల్గొనసాగింది. కానీ ఎలిజబెత్‌కు ఆ ఉత్తరంలో విషయాలు ఏమిటా అనే కుతూహలం హెచ్చుసాగింది. వికంతో మాట్లాడటం కంటే ముందు అవే తెలుసుకోవాలనే తీవ్రకాంక్ష! అతనూ, అతని స్నేహితుడు సెలవు తీసుకుని వెళ్ళిన తర్వాత జేన్ మేడ మీదికి వెడుతూ ఎలిజబెత్ వంక రమ్మని చూసింది. ఇద్దరూ తమ గదిలోకి చేరుకున్నాక, జేన్ ఉత్తరం తెరచి 'బింగ్లీ చెల్లెలు కారలైన్ దగ్గర నుంచి. ఈ ఉత్తరంలో సంగతులు నాకు విస్మయం కలిగిస్తున్నాయి. ఈ సరికి వాళ్ళు అందరూ నెదర్ ఫీల్డ్ ఖాళీచేసి వెళ్ళిపోయి ఉంటారు. పట్టణానికి వెళుతున్నారట. ఇక తిరిగి రారట! విను. చదువుతాను' అంటూ చదవనారంభించింది.

మొదటి వాక్యం, తాము అన్నగారితో కలిసి పట్టణానికి వెళ్ళిపోతున్నామని. తరువాత వాక్యాలు ఇవి: "ఈ ప్రాంతం వదిలిపోవటమంటే నాకు ఎందుకూ విచారం లేదుగానీ, నీ వంటి స్నేహితురాలిని విడిచి వెడుతున్నామే అని బాధగా ఉంది. అయితే అనతికాలంలోనే మనకు తిరిగి కలుసుకునే భాగ్యం కలిగి, విడిపోలేనంత అనుబంధం ఏర్పడుతుందని ఆశిస్తాను. అంతవరకు మటుకు నా ఉత్తరాలకు జవాబులు రాస్తూ ఉండు."

ఎలిజబెత్‌కు ఇందులో విచారించవలసిన సంగతేమీ కనిపించలేదు. కొద్దిసేపు ఆలోచించి ఇలా అంది. వాళ్ళు వెళ్ళిపోవటానికి ముందు, నీవు చూడలేకపోవడం నిజంగా దురదృష్టం. అయితే బింగ్లీ వాళ్ళతో పాటు లండన్‌లోనే ఉండిపోడుగా!"

"కారలైన్ ఇలా రాసింది. చదువుతాను విను: "మా అన్న చెప్పటం, లండన్‌లో తన పని మూడు నాలుగు రోజుల్లో అయిపోతుందని, అయితే ఇలా జరుగుతుందని మేం అనుకోటం లేదు. మా స్నేహితులు చాలామంది ఈ సరికే అక్కడికి చేరుకున్నారు. దీని భావం, బింగ్లీ శీతాకాలమంతా ఇక్కడికి తిరిగి రాడనేగా!" అంది జేన్.

"అది కేవలం మిస్ బింగ్లీ ఉద్దేశం."

"అలా ఎందుకనుకోవాలి? ఇంతకూ నాకు బాధ కలిగిస్తున్న విషయం నీకు వినిపించనేలేదు, ముందుంది విను: "డార్సీ చెల్లెలిని చూడాలని ఆరాటపడుతున్నాడు. నిజం చెప్పాలంటే ఆమెను తిరిగి చూడటం మాకు ఇష్టమే లేదు. జార్జియానా డార్సీ అమిత సొగసుగత్తె. సందేహం లేదు. ఆమె త్వరలోనే మాకు వదిన గారు కాబోతుంది. ఈ విషయం నీకు చెప్పినట్టు గుర్తులేదు. మా అన్నకు ఆమె అంటే ఇప్పటికీ అతి అనురాగం. మా బంధువర్గం అందరికీ కూడా ఈ సంబంధం ఇష్టమే. అందుకని ఈ విషయంలో నా సొంత అభిప్రాయం ఎలా ఉన్నా, నేను అడ్డుపడటం దేనికి?"

"ఈ వాక్యానికి అర్థం ఏమిటంటావు, తన అన్నని చేసుకొనే వాంఛ ఉన్నట్టయితే ఇప్పటికైనా కళ్ళు తెరవమని చెబుతోందన్న మాట! అదేగా ఆమె అభిప్రాయం!"

"ఉండవచ్చును. నాకు వేరుగా తోస్తోంది. చెప్పమంటావా?"

"ఊ!"

"రెండు ముక్కలు చెబుతాను. బింగ్లీ నిన్ను ప్రేమిస్తున్నాడని ఆమె ఎరుగును. అయితే అతను మిస్ డార్సీని వివాహం చేసుకోవాలని ఆమె కాంక్ష. అతన్ని పట్టణంలోనే ఉంచేయటానికే ఆమె వెళ్ళింది. అతనికి నీ వంటే లక్ష్యం లేదని చెప్పటానికే ఈ ఉత్తరం!"

జేన్ తలఊపింది.

"నిజం, జేన్! నా మాట నమ్ము! మీ ఇద్దరినీ చూసిన వాళ్ళు ఎవ్వరు కూడా అతను నిన్ను ప్రేమించటం లేదని చెప్పలేరు. పోతే ఇక ఆమె అభిప్రాయం! మనం వాళ్ళతో సరితూగే ఐశ్వర్యవంతులం కాదు; ఒక ప్రయత్నంతో మిస్ డార్సీని అన్నకు అంటగడితే, రెండో ప్రయత్నంలో డార్సీని తాను పొందవచ్చును."

"నీ వాదం బాగానే ఉంది. కానీ దీనికి పునాది అనేది ఉన్నదా అని. కారలైన్ ఈ విషయంలో ఆత్మవంచన చేసుకుంటోందనుకుంటాను."

"అవును. అదీ నీకే లాభం!"

"అయితే మట్టుకు? అతని బంధువర్గం, చెల్లెళ్ళూ అందరూ మరో అమ్మాయిని చేసుకుంటే బాగుంటుందనే ఊహలో ఉన్నప్పుడు నేను అతన్ని చేసుకుని సుఖపడగలనా."

"అది నీ అంతట నీవు తేల్చుకోవలసిన విషయం. బాగా ఆలోచించిన మీదట అతని భార్య అవటం కంటే, అతని చెల్లెళ్ళ కోరికలకు అంతరాయం కలిగించటం నీకిష్టం లేకుంటే అతన్నే ప్రక్కకు నెట్టివేయి మరి!"

జేన్ నీరసంగా నవ్వి "ఎంత తేలికగా అన్నావు!" అంది. ఆ తరువాత "అతను ఈ శీతాకాలమంతా ఈ చాయలకే రాకపోతే మర్చిపోతాడేమో! ఆరు నెలలలో వెయ్యి సంఘటనలు జరుగుతాయి" అంది.

అయితే బింగ్లీ వంటి స్వంత అభిప్రాయాలు గల మనిషి. చెల్లెళ్ళ మాటలు విని

ఇక్కడికి రాకుండా ఉంటాడా? ఎలిజబెత్ జేన్‌కు ఈ విషయాన్నే గట్టిగా చెప్పింది.

తల్లితో ఆ కుటుంబం లండన్ వెళ్ళారన్న విషయం తప్ప పైవేమీ వారు చెప్పలేదు.

22

బెనెట్ కుటుంబం లూకా ఇంట విందుకు వెళ్ళింది. ఆ రోజంతా మిస్ లూకా కోలిన్స్ వాచాలత్వం వింటూ గడిపింది. ఎలిజబెత్ ఆమెకు ధన్యవాదాలు తెలిపింది.

మరునాడు కోలిన్స్ ఇంట్లో ఎవరికీ తెలియకుండా లూకా లాడ్జికి బయలుదేరాడు. చార్లెట్ లూకా పాదాల మీద పడి తనకు ప్రేమభిక్ష ప్రసాదించమని వేడుకొందామని అతని కాంక్ష! ఈ వ్యవహారం తనకు అనుకూలంగా ముగిసేంతవరకూ పైవాళ్ళకి ఎవరికీ తెలియగూడదనే అభిప్రాయంతో ఇలా చెప్పకుండా బయలుదేరాడు.

మిస్ లూకా అతన్ని ఆదరంగా ఇంటిలోకి తీసుకు వెళ్ళింది. ఇద్దరూ అన్ని విషయాలు చర్చించుకుని అంగీకారానికి వచ్చారు. తరువాత లూకా అతన్ని తన తల్లిదండ్రుల దగ్గరకు తీసుకు వెళ్ళి వారి ఆశీర్వాదం కూడా కోరింది. వాళ్ళు ఆనందంగా దీవించారు. కోలిన్స్ ప్రస్తుత పరిస్థితి వాళ్ళకు ఎంతో శ్రేయోదాయికంగా కనిపించింది. తాము ఇవ్వబోయే ఆస్తిగాక బెనెట్ మరణానంతరం చేరబోయే ఎస్టేటు- తమ కూతురు సుఖపడటానికి ఇంతకంటే గొప్ప అవకాశం ఉండదు. చార్లెట్ ఇప్పుడు ఎంతో ఉల్లాసంగా ఉంది. కోలిన్స్ చురుకైనవాడు కాదు. అతనితో అనుబంధం ఇబ్బందే. అయినా అతను తన భర్త! మగవాళ్ళను గురించి వివాహాన్ని గురించి ఆమెకు పెద్ద పట్టింపులేమీ లేవు. తనకు ఎంతో స్నేహపాత్రురాలైన ఎలిజబెత్ ఈ సంబంధాన్ని గురించి వింటే అమితాశ్చర్య పడుతుంది. తనను నిందిస్తుందేమో కూడా! అయితేనేం? తనుమాత్రం దీన్ని వదులుకో గూడదు. ఈ విషయం ముందుగా తనే ఆమెతో చెప్పాలి. అందుకని కోలిన్స్‌తో లాంగ్‌బర్న్‌కు వెళ్ళాక ఇక్కడ జరిగిన సమాచారం ఎంతమాత్రం సూచన మాత్రంగానైనా సరే చెప్పవద్దని హెచ్చరించింది.

తెల్లవారు జామునే అతని ప్రయాణం కనుక, రాత్రిపూటే అందరి దగ్గర సెలవు తీసుకోనారంభించాడు. మిసెస్ బెనెట్ అమిత మర్యాదగా అతనికి తీరుబడి అయినప్పుడల్లా, లాంగ్‌బర్న్ వచ్చి తమ ఆతిథ్యం పొంది వెడుతూండమని కోరింది. అతను ఈ ఆహ్వానానికి కృతజ్ఞత తెలిపి అలాగే చేస్తానన్నాడు.

బెనెట్ అతన్ని లేడీ కాథరైన్‌కు కోపం రాకుండా వ్యవహరించమని మందలించాడు.

అమ్మాయిలంతా ఎవరి గదిలోకి వాళ్ళు వెళ్ళారు. మిసెస్ బెనెట్ అతను త్వరలోనే తిరిగి వస్తాడని, తన చిన్న కూతుళ్ళలో ఎవరినైనా వివాహం చేసుకుంటానంటాడనీ ఊహించుకొంది. అయితే మరునాడు ఈ ఆశలన్నీ అడియాసలని ఆమెకు స్పష్టపడింది.

భోజనాలయ్యాక విశ్రాంతిగా కూర్చున్న సమయంలో మిస్ లూకా వచ్చి, ఎలిజబెత్‌తో రహస్యంగా మాట్లాడుతూ నిన్నటి రోజు జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

ఎలిజబెత్‌కు, ఒకటి రెండు రోజులుగా, కోలిన్స్ తన స్నేహితురాలితో ప్రేమ సరసాలు ఆరంభించాడా అని అనుమానం కలిగింది. అయితే చార్లెట్ ఈ అనుబంధాన్ని ప్రోత్సహిస్తోందని ఇప్పుడు తెలుసుకునేసరికి ఆమెకు ఉద్రేకం ఎక్కువయింది. 'కోలిన్స్‌ను చేసుకుంటావా? ... అసంభవం, చార్లెట్ - అసంభవం' అని అరిచింది.

మిస్ లూకా 'ఏమిటది ఎలిజబెత్? కోలిన్స్ ఏ ఆడదాని సదభిప్రాయానికీ పాత్రుడు కాడంటావా? నీవు కాదంటే - ఇక అతని బ్రతుకు అంతేనా?' అంది. అప్పటికి ఎలిజబెత్ మామూలు స్థితికి రాగలిగింది. వాళ్ళ అనుబంధం తనకూ శ్రేయోదాయకం అనీ వాళ్ళ భావిజీవితం ఎంతో హాయిగా ఉల్లాసంగా ముచ్చటగా జరగాలని కోరుతున్నాననీ అంది.

"నీకీవార్త ముందు ఆశ్చర్యంగానే ఉంటుంది. నాకు మొదటి నుంచీ ప్రేమలో గొప్ప విశ్వాసం లేదు. నాకు కావలసిందల్లా మంచి ఇల్లు, వసతి. కోలిన్స్ వ్యక్తిత్వం, సాంఘిక స్థాయి, జీవన ప్రమాణాన్ని బట్టి చూస్తే నేను వివాహానంతర జీవితం కావాలనుకున్న విధంగానే గడపగలనని అనుకుంటున్నాను.

ఎలిజబెత్ 'నిస్సందేహంగా అంతే' అంది. తరువాత కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చుని, వాళ్ళు ఇంట్లోకి వెళ్ళిపోయారు. చార్లెట్ ఎక్కువ సేపు కూర్చోలేదు. ఎలిజబెత్ చాలాసేపు ఆలోచించిన మీదట ఇది ఎంతమాత్రం పొసగని జంట- అనుకుంది. కోలిన్స్ మూడు రోజులలో మూడు వివాహ ప్రస్తావనలు చేశాడు. చార్లెట్ కోలిన్స్ భార్యగా ఊహిస్తేనే ఎంతో దుర్భరం అనిపిస్తోంది! ఆమె అతనితో సుఖపడలేదు అనుకొంది ఎలిజబత్.

23

ఎలిజబెత్, అక్కాచెల్లెళ్ళు, తల్లి అందరి మధ్యా కూర్చుని నిన్న చార్లెట్ తనతో చెప్పి వెళ్ళిన సంగతులు చెప్పనా వద్దా అని ఆలోచిస్తూ ఉండగా సర్ విలియం లూకా వచ్చాడు. ఆయన కోలిన్స్ చార్లెట్‌లకు వివాహం స్థిరపడి పోయినట్టేనని చెప్పాడు. మిసెస్ బెనెట్ "బహుశా నీవు పొరపాటుగా విని ఉంటావు. సరిగ్గా అర్థం చేసుకోలేదేమో" అంది.

"విలియం గారూ! కోలిన్స్ మా అక్క ఎలిజబెత్‌ను వివాహం చేసుకోగోరుతున్నాడు" అంది లిడియా. విలియం లూకా స్వతహాగా శాంత స్వభావుడు. అయినా ఆయన కొంచెం తబ్బిబ్బయ్యాడు. అప్పుడు ఎలిజబెత్ కలుగజేసుకుని ఆయన చెబుతున్న విషయం అక్షరాలా నిజమేనని, నిన్ననే చార్లెట్ తనతో ఈ విషయం చెప్పిందనీ అన్నది. జేన్ ఎలిజబెత్‌లు ఈ సంబంధం మంచిదనీ ఇద్దరూ సుఖపడతారనీ- ఏమేమో ఇలాగే మంచి మాటలు చెబుతున్నారు. విలియం వెళ్ళిపోయేదాకా మిసెస్ బెనెట్ తన ఆవేశాన్ని

అపుకుంది. ఆయన అటు కదలగానే ఆమె గొల్లుమంది: మొదటిది, ఇదంతా నిజంకాదు. రెండు, వాళ్ళు కోలిన్స్‌కు మాయమాటలు చెప్పి బుట్టలో వేసుకున్నారు. మూడు, వాళ్ళిద్దరూ ఎన్నటికీ సుఖంగా ఉండలేరు. నాలుగు, ఈ సంబంధం చిట్లిపోతుంది.

ఆమె వారం రోజుల వరకు ఎలిజబెత్‌ను చివాట్లు పెడుతూనే ఉంది. విలియం దంపతులతో కూడా మొరటుగానే మాట్లాడింది. మిసెస్ లూకా తన గొప్పదనాన్ని ప్రదర్శించుకునే నిమిత్తం ఇది వరకటి కంటే తరచుగా లాంగ్‌బర్న్ వస్తోంది.

పోతే చార్లెట్ ఎలిజబెత్‌లు పూర్వం మాదిరి చనువుగా హృదయాలు విప్పి మాట్లాడుకోలేకపోతున్నారు. బింగ్లీ వెళ్ళి వారం రోజులయింది.

జేన్ కారలైన్ ఉత్తరానికి జవాబు రాసింది. మరో ఉత్తరం ఎప్పుడు వస్తుందా అని ఆత్రంగా రోజులు లెక్కబెడుతోంది. కోలిన్స్ కులాసాగా చేరినట్టు బెనెట్ పేర ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో లేడీ కాథరైన్ తన వివాహానికి సమ్మతి తెలిపిందనీ, సాధ్యమైనంత త్వరలోనే ముహూర్తం నిర్ణయించుకోమన్నదనీ రాశాడు. ఇందునిమిత్తం అతను త్వరలోనే ఇక్కడికి వస్తానని కూడా రాశాడు.

అతను మళ్ళీ రావటం, ఈసారి మిసెస్ బెనెట్‌కు అంత సంతోషకరం కాదు. 'లూకా ఇంటికిపోక అతను ఇక్కడెందుకు రావాలి?' అని భర్తతో అంది కూడా.

బింగ్లీని గురించి వార్తలేమీ లేవు. ఎలిజబెత్‌కు కూడా భయం వేసింది. బింగ్లీ ఇద్దరు చెల్లెళ్ళ తీవ్ర ప్రయత్నాలు, డార్సీ అనునయ వాక్యాలు, మిస్ డార్సీ అందచందాలు – వీటికి కట్టుబడిపోయి బింగ్లీ ఇటు రాలేకపోతున్నాడేమో!

జేన్ విపరీతంగా బాధపడుతోంది. అయితే ఆ బాధను పైకి వ్యక్తపరచదు.

కోలిన్స్ వస్తానని రాసిన రోజునే లాంగ్ బర్న్‌కు చేరుకున్నాడు. అతనికి ఇప్పుడు మొదటిసారి ఇచ్చినంత ఘనస్వాగతం ఇవ్వలేదు. అతను ప్రేమ వ్యవహారంలో చిక్కుకుని, రోజులో ఎక్కువ భాగం లూకా ఇంటి దగ్గర గడుపుతున్నాడు.

మిసెస్ బెనెట్ స్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. వివాహం గురించిన ఏమాట అయినా ఆమెను చిరాకు పరుస్తోంది. మిస్ లూకాను చూడటమే ఆమెకు దుస్సహంగా ఉంది. ఆమె భర్తతో అంది: "చార్లెట్ లూకా ఈ ఇంటికి యజమానురాలై, నన్ను నా కూతుళ్ళను ఇక్కడ నుంచీ తరిమి నా స్థానాన్ని తను ఆక్రమించుకుంటుంది."

"అటువంటి చింతపెట్టుకోకు. ఎప్పుడూ మంచినే ఆశిద్దాం. మంచినే కోరుకుందాం. నేనే అతని కంటే ఎక్కువ కాలం జీవిస్తాననుకోరాదూ?" అన్నాడు బెనెట్.

ఈ జవాబు ఆమెకంత తృప్తికరంగా అనిపించలేదు. అదే ధోరణిలో అంది: "ఈ ఎస్టేటంతా వాళ్ళకు చెందటం నేను సహించలేను. అయిదుగురు అమ్మాయిలకు కాకుండా, ఎవడో, దారినపోయే కోలిన్స్ ఈ ఎస్టేటంతా కొల్లగొట్టడం సహించలేను."

24

మిస్ బింగ్లీ నుంచి ఉత్తరం వచ్చింది. అన్ని సందేహాలు తీరిపోయాయి. ఉత్తరంలో మొదటి వాక్యం తామంతా శీతాకాలానికి లండన్‌లో స్థిరపడిపోయినామని, చివరి వాక్యం తన అన్నగారు హేర్ట్‌ఫోర్డ్‌షైర్ నుంచి వచ్చేటప్పుడు అందరి దగ్గర సెలవు తీసుకో లేకపోయాడనీ, ఇందుకు ఏమీ అనుకోవద్దనీ.

జేన్ ఆశలన్నీ అడుగంటాయి. ఉత్తరంలో ఎక్కువ భాగం మిస్ డార్సీ అందచందాలను గురించిన వర్ణనే. ఇద్దరి మధ్యా ఆత్మీయత, ఆప్యాయత ఎక్కువవుతున్నాయని రాసింది. జేన్ ఈ ఉత్తరంలో సంగతులన్నీ ఎలిజబెత్‌కు తెలియపరచింది. ఆమె నిశ్శబ్దంగా వింది.

ఒకటి రెండు రోజులు గడిచాయి. తల్లి కూతురిని నెదర్‌ఫీల్డు యజమానులు తిరిగి రావటాన్ని గురించి తరిచి తరిచి అడుగుతోంది. ఎలిజబెత్‌తో "అమ్మ ఈ విషయం తొందరగా మరిచిపోయేట్టు లేదు. అయినా కొద్ది రోజుల్లో ఆమె బింగ్లీని గురించి ఆలోచించటమే మానేస్తుందేమోలే. ఆమె ఈ ప్రస్తావన తీసుకు వచ్చినప్పుడల్లా నాకు వణుకు పుడుతోంది" అంది. ఎలిజబెత్ ఏమీ మాట్లాడలేదు.

జేన్ చిరాగ్గా ఇలా అంది. "బింగ్లీని నేను మరచిపోవచ్చు, అతన్ని గురించి నాకు ఉండే జ్ఞాపకమల్లా అతను నాకు పరిచయుడైన స్నేహితుడని మటుకే. అంతకంటే నా కేమీ బాధలేదు. అతన్ని గురించి నాకు ఆశగానీ, భయంగానీ, అసహ్యంగానీ లేదు. కొద్దిరోజులు పోతే నేను పూర్వం మాదిరిగానే తయారవుతాను."

"జేన్! నిజంగా నీవు మంచిదానివి. మధురమైన మనిషివి. దేవతలాంటి దానివి. ఇప్పుడు నీకేం చెప్పాలో నాకు అర్థం కావటం లేదు."

"నీవు మంచిదానివి కనుక నీకు అలాగే అనిపిస్తుంది. ఈ గొడవలో నాకేదన్నా మతి చెడిపోతుందేమోనని నీవు భయపడుతున్నావు. అదేం జరగదులే, బెంగపెట్టుకోకు. నేను నిజంగా ప్రేమించేవాళ్ళు కొంతమంది ఉన్నారు. ఈ మధ్య రెండు సన్నివేశాలు తటస్థపడినాయి. ఒకటి నీకు చెప్పను. రెండోది చార్లెట్ వివాహ ప్రసక్తి, ఏ కోణంలోంచి చూసినా ఈ వివాహానికి అర్థం పర్థం లేదు."

"ఇటువంటి ఆలోచనలు మనసులోకి రానీయకు. అవి నీ సుఖాన్ని పాడుచేస్తాయి."

"అలాగే! కోలిన్స్ సంకుచిత బుద్ధి కలవాడు. మోసగాడు కూడా! అతన్ని వివాహం చేసుకునే స్త్రీ సూటిగా ఆలోచించలేదు."

"వాళ్ళు వివాహం అయిన తరువాత సుఖంగా జీవితం గడపగలరేమో! అప్పుడే నీ అభిప్రాయం మార్చుకోవలసివస్తుంది. ఈ పరిస్థితుల్లో మనం ఎవరినీ తప్పుపట్టకూడదు."

"బింగ్లీ ఆలోచనల గురించి నేనేమీ చెప్పలేనుగానీ కొంతమంది తమకు తెలియ

కుండానే తప్పు చేస్తారు. ఆలోచనలేకపోవటం, ఇతరుల ఆలోచనలు ఎలా ఉంటాయో తెలుసుకోకపోవటం, దృఢమైన నిశ్చయం లేకపోవటం ఇవన్నీ అందుకు దారితీస్తాయి."

"అయితే ఈ సందర్భంలో ఇటువంటి పొరపాటు జరిగిందంటావా?"

"ఇలా చెప్పుకుంటూ పోతే, నీ ఉద్దేశంలో మంచివాళ్ళు గొప్పవాళ్ళూ అయిన వాళ్ళ లోపాలు బయడపెడతాను. అందుచేత ఇక ఇక్కడితో ఆపేద్దాం."

"అయితే అతని చెల్లెళ్ళ పట్టుదల ఎక్కువగా ఉందంటావా?"

"అవును."

"నేను నమ్మలేకుండా ఉన్నాను. వాళ్ళు అలా ఎందుకు చేస్తారు? అతని సుఖం కోరవచ్చు. అంతేగాని అతని అభిరుచుల మీద ప్రయోగాలు ఎందుకు చేస్తారు?"

"అదే పొరపాటు. వాళ్ళు అతని సుఖాన్ని కోరటంతో ఆగరు. అతని సిరిసంపదలు ఎక్కువ కావటం భోగభాగ్యాలు అధికం కావటం కూడా వాళ్ళకు కావలసిన విషయమే. బాగా డబ్బు ఉన్న అమ్మాయి అతన్ని పెళ్ళి చేసుకోవాలని వాళ్ళు కోరవచ్చును."

"వాళ్ళు మిస్ డార్సీని సమర్థిస్తున్నారంటే అందుకు నీవనుకుంటూన్న కారణం కాక మరొకటి ఉండవచ్చు. వాళ్ళు నన్ను ఎరిగింది కొద్దికాలమే కదా. మిస్ డార్సీని చిన్నప్పటి నుంచి ఎరుగుదురు. వాళ్ళకు ఆమె అంటేనే ఎక్కువ ఆత్మీయత ఉండొచ్చు. అయితే అన్నగారిని వాళ్ళు వ్యతిరేకించరు. అతను ఆప్యాయత చూపిస్తూ ఉంటే, వాళ్ళు మమ్మల్ని వేరు చేయాలని ప్రయత్నించరు. ఆప్యాయత ఉందని అనుకోవడం నా తప్పే కావచ్చు. నాకు ఈ ఆలోచనే అసౌకర్యంగా ఉంది.. దీనితోనే నా మనస్సు వికలమవుతుంది."

ఎలిజబెత్ అక్క చెబుతున్నమాట కాదనలేకపోయింది. ఇప్పటి నుంచి బింగ్లీ పేరు వాళ్ళ సంభాషణలో అతి అరుదుగా వినిపించింది. మిసెస్ బెనెట్ ఇంకా ఎదురు చూస్తోంది. కనీసం వేసవి కాలం రావటంతోనైనా బింగ్లీ కళ్ళపడతాడని ఆశిస్తోంది.

వికం ఆస్థి వ్యవహారాలు, డార్సీ అతన్ని ఎలా మోసం చేసిందీ– ఇప్పుడు నగరంలోని ప్రజలంతా విచ్చలవిడిగా చెప్పుకుని ఆశ్చర్యపోతున్నారు. ఈ వివరాలన్నీ తెలియకుండానే తాము డార్సీని అసహ్యించుకున్నందుకు అభినందించుకుంటున్నారు.

25

ఇలా ఒక వారం రోజులు గడిచాయి. శనివారంనాడు కోలిన్స్ తన పెళ్ళి కూతురితో వెళ్ళిపోతాడు. అతను లాంగ్‌బర్న్ వచ్చి అందరి దగ్గర సెలవు తీసుకున్నాడు.

తరువాత సోమవారంనాడు, మిసెస్ బెనెట్ తమ్ముడు మరదలు వచ్చారు. వాళ్ళు ప్రతి క్రిష్టమస్‌కు లాంగ్‌బర్న్ వస్తూనే ఉంటారు. మిస్టర్ గార్డినర్ పెద్ద మనిషి, గౌరవనీయుడు, చదువుకున్నవాడు, సుస్వభావుడు. గుణగణాలలో ఆయనకు, ఆయన

అక్కకు పోలిక లేదు. ఆయన వ్యాపారి. గార్డినర్ భార్య మిసెస్ బెనెట్ కంటే, మిసెస్ ఫిలిప్స్ కంటే చాలా చిన్నది, తెలివిగలది, అనుకూలవతి. లాంగ్‌బర్న్‌లో మేనగోడళ్ళకి ఈమె అంటే ఎంతో ఇష్టం. ముఖ్యంగా పెద్దమ్మాయిలు ఇద్దరికీ ఈమె దగ్గర ఎంతో చనువు, గౌరవం. మిసెస్ గార్డినర్ రాగానే తను తెచ్చిన బహుమతులు అందరికీ పంచిపెట్టి కొత్త కొత్త పోకడలను, ఫ్యాషన్లను వివరించింది. తర్వాత అందరూ చెప్పే కబుర్లు వింటూ కూర్చుంది. మిసెస్ బెనెట్ కష్టాలు చెప్పుకుపోతోంది. తన అమ్మాయిలు ఇద్దరూ ఈ మధ్య పెళ్ళి చేసుకోబోయి విఫలమయారు. ఇదీ మనోవేదన.

"నేను జేన్‌ను నిందించను, ఏమంటే దానికి చేతనైతే అవకాశం దొరికితే అది బింగ్లీని చేపట్టగలదు, ఆకట్టుకోగలదు. కానీ లిజ్జీ విషయం ఏమిటి? ఆ పాటికి అది సవ్యంగా ఉన్నట్టయితే హాయిగా కోలిన్స్ భార్య అయి కూర్చునేది. అతను, పాపం ఈ గదిలోనే దాన్ని చేసుకుంటానని కోరాడు. అయితే ఎలిజబెత్ ఒప్పుకోలేదు. దీని ఫలితం ఏమిటంటే- లేడీ లూకా నా కంటే ముందుగా ఒక అమ్మాయి వివాహం చేసి వేస్తోంది! ఈ ఎస్టేటు ఆయన మరణానంతరం మనకు ఏమీకాకుండా పోతుంది.

మిసెస్ గార్డినర్ ఎలిజబెత్‌తో ఒంటరిగా ఉన్నప్పుడు ఇలా అంది: "జేన్‌కు అటువంటి మంచి సంబంధం కుదరటం అదృష్టం. అయితే అది అలా చెయ్యి జారిపోయిందా! బింగ్లీ జేన్‌ని మర్చిపోయి తిరగటం విచారకరం."

"చెల్లెళ్ళ మాటలు విని ప్రేమించిన మనిషిని మర్చిపోవటమే మరీ దారుణం!"

"బింగ్లీ అంత ఇదిగా ప్రేమించాడా?"

"అవును. మరొకళ్ళ మీద ధ్యాసే ఉంచలేదు. బాల్‌లో ఇద్దరు ముగ్గురు స్త్రీలు దగ్గరకు చేరినా మాట్లాడలేదు. నా మటుకు నేనే రెండుసార్లు పలకరించి జవాబు పొందలేక పోయాను. ఇదంతా ప్రేమ పరధ్యానంకాక మరేమిటి?" అంది లిజ్జీ.

"అవును పాపం, జేన్! దాన్ని తలచుకుంటే నాకు విచారమనిపిస్తుంది."

"ఇప్పుడు బింగ్లీ, అతని స్నేహితుడు డార్సీ దగ్గర ఉన్నాడు. బింగ్లీకి అతనికి ఎంతో స్నేహం. ఒకళ్ళను విడిచి మరొకళ్ళు నిమిషమైనా ఉండరట!"

జేన్‌ను వాళ్ళ అత్త తమతోపాటు లండన్ రమ్మన్నది. వాతావరణం మారితే మనసు స్థిమితపడుతుందని చెప్పింది. జేన్ ఈ ప్రతిపాదనకు అంగీకరించింది. గార్డినర్లు వారం రోజుల పాటు లాంగ్‌బర్న్‌లో ఉన్నారు. లూకాలతో, ఫిలిప్స్‌లతో, ఆఫీసర్లతో రోజులన్నీ హడావుడిగా గడిచిపోయాయి. ఈ వారం రోజులలోను ఎప్పుడూ ఎవళ్ళో అతిథులు ఉంటూనే ఉన్నారు. వికం తరచూ వచ్చాడు. వికం ఎలిజబెత్‌లను మిసెస్ గార్డినర్ రహస్యంగా ఒక కంట కనిపెడుతోంది. పది, పన్నెండు సంవత్సరాల క్రితం, ఆమె తన వివాహానికి ముందు పెంబర్లేకి దగ్గరలో ఉంది. అలా వికంతో కొద్ది పరిచయం ఉంది.

మిసెస్ గార్డినర్‌కు పెంబర్లేలో డార్సీ తండ్రి– అందరూ తెలుసు. వికంతో కొంతసేపు అక్కడి పరిస్థితులను గురించి చర్చించింది.

26

ఎలిజబెత్ ఒంటరిగా దొరికినప్పుడు అవకాశం చూసుకుని మిసెస్ గార్డినర్ ఇలా మందలింపుగా చెప్పింది. "నీది అతి సునిశితమైన మనస్సు లిజ్జీ. అందుకనే నేనీ విషయం చెప్పటానికి జంకుతున్నాను. వికంను నీవు దూరంగా ఉంచటం మంచిది. నీవు అతనికోసం గంగవెర్రులు ఎత్తే పరిస్థితి ఏర్పడకుండా చూసుకో. నీ తండ్రిగారు నీవెంత చెబితే అంతకదా! అందుచేత నీవు అతనికి కష్టం కలిగించగూడదు."

"అలాగే అత్తా. ప్రస్తుతం నేను వికంను ప్రేమించలేదు. అంతవరకు రూఢి. అయితే అతను అందరికంటే యోగ్యుడు, మంచివాడు అనుకొంటున్నా. అయినా, నేను మాత్రం మీకు ఎవరికీ, ఇష్టంలేని పని చేయను. తొందరపడను." అంది, లిజ్జీ.

"అతను తరచూ ఇక్కడికి వస్తూ ఉండటాన్ని అరికట్టు. అతన్ని ఆహ్వానించకు."

"అలాగే! కానీ ఈ వారం మీరు వచ్చారు కనుకనే అతన్ని అన్నిసార్లు ఆహ్వానించాం. నా విషయం నీకు పూర్తి హామీ ఇస్తున్నాను. సరేనా?"

ఆమె అత్త సంతోషించింది. ఇద్దరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళారు.

గార్డినర్ దంపతులు, జేన్ వెళ్ళిపోయిన తరువాత కోలిన్స్ హేర్ట్‌ఫోర్డ్‌షైరుకు వచ్చాడు. అతను లూకాల ఇంట దిగటంతో, మిసెస్ బెనెట్‌కు ఇబ్బంది లేకుండా పోయింది. గురువారంనాడు వివాహం. బుధవారంనాడు మిస్ లూకా ఇక్కడికి వచ్చి సెలవు తీసుకు వెళ్ళింది. ఎలిజబెత్ ఆమెను బయటవరకు సాగనంపింది. కిందికి దిగిన తర్వాత చార్లెట్ ఇలా అంది: "నీ ఉత్తరాలే ఇంక నాకు ఆధారం, లిజా!"

"తప్పకుండా రాస్తుంటానులే."

"మరో కోరిక. వచ్చి నన్ను చూస్తావా?"

"మనం తరచూ హేర్ట్‌ఫోర్డ్‌షైరులోనే కలుసుకోగలమనుకుంటాను."

"కొన్నాళ్ళు కెంట్ వదిలి రావటానికి వీలుండదేమో! హన్స్‌ఫోర్డ్ వస్తానని మాటివ్వు."

అలా వెళ్ళటంలో తనకేమీ ఆనందం లేదని తెలిసినా, ఆమె మాట ఇచ్చింది.

'మా నాన్న మార్చిలో అక్కడికి వస్తారు. ఆయనతో నీవు రావచ్చు." అంది చార్లెట్.

ఎలిజబెత్ ఊహించినట్టుగానే చార్లెట్ అన్ని విషయాల మీద తన అభిప్రాయాలు రాస్తోంది. ఆమె ఉత్తరం రాసిన పద్ధతి చూస్తే ఎంతో హాయిగా, కులాసాగా, విరామంగా ఉన్నట్టు అనిపిస్తోంది. ఎలిజబెత్ తను వెళ్ళి చూడడమే తరువాయి అనుకుంటూంది.

లండన్ కులాసాగా చేరుకున్నట్టు చెల్లెలికి జేన్ ఉత్తరం రాసింది. జేన్ ఒక వారం

రోజులవరకు కారలైన్, బింగ్లీని చూడలేదు. అత్త రేపు వాళ్ళుండే పేటకు వెళ్ళాలని అనుకుంటోందనీ, వీలుంటే తను కూడా వెళ్తాననీ రాసింది.

అక్కడికి వెళ్ళి వచ్చిన తరువాత జేన్ మరో ఉత్తరం రాసింది. మిస్ బింగ్లీని కలుసుకున్నదట. ఆ వివరాలన్నీ రాసింది: "నన్ను చూడగానే కారలైన్ ఎంతో సంబర పడింది. ముందు ఉత్తరం ముక్క రాయకుండా అకస్మాత్తుగా లండన్ వచ్చేసినందుకు నొచ్చుకుంది. నేను ఆమె అన్నను గురించి విచారించాను. ఆయన కులాసాగానే ఉన్నాడట. ఏదో గొడవల్లో డార్సీతో కలిసి తిరుగుతున్నాడట. ఆవేళ మిస్ డార్సీ అక్కడకే భోజనానికి వస్తుందని తెలిసింది. నేను అక్కడ ఎంతోసేపు ఉండలేకపోయాను. కారలైన్, మిసెస్ హర్స్ట్ బయటకు వెడుతున్నారు. వాళ్ళు ఏదో ఒక రోజు ఇక్కడికి వస్తారు!"

నాలుగు వారాలు గడిచాయి. జేన్ బింగ్లీని చూడలేకపోయింది. పదిహేను రోజుల పాటు ఎదురుచూస్తూ కూర్చున్నది. చివరకు ఒకనాడు సాయంత్రం మిస్ బింగ్లీ వచ్చింది. కొద్దిసేపే కూర్చుని వెళ్ళింది. ఆమె వైఖరిలో మార్పుచూసి, జేన్ ఇక తాను ఆత్మవంచన చేసుకోగూడదనుకుంది. ఎలిజబెత్‌కు ఇలా ఉత్తరం రాసింది: "మిస్ బింగ్లీ నా పట్ల చూపుతున్న అనురాగం అంతా కపటం అని నీవు అంటే పూర్వం నేను నమ్మలేదు. అది నిజమేనని ఇప్పుడు నిర్ధారణ అయింది. కారలైన్ నిన్న మటుకే ఇక్కడికి వచ్చింది. ఈ పదిహేను రోజుల్లో ఒక్క ఉత్తరం, ఒక్క సందేశం, ఒక్క కబురైనా ఆమె నుంచి రాలేదు. నిన్న అయినా ఆమె పూర్తి ఇష్టంతో వచ్చినట్టు లేదు. ఇన్నాళ్ళు రాలేకపోయినందుకు కారణం, క్షమాపణ లేకపోగా– మళ్ళీ వస్తానని మాటమాత్రంగానైనా అనలేదు. ఇంక ఈ స్నేహానికి స్వస్తి చెప్పాలని తీర్మానించుకున్నాను. ఆమె అన్నక్కూడా నా విషయం ఏమీ పట్టినట్టు లేదు. లేకపోతే మేం ఇదివరకే ఎన్నడో కలుసుకుని ఉండేవాళ్ళం. అతనికి నేను ఈ నగరంలోనే ఉన్నట్టు తెలిసే ఉండాలి. అయితే ఎందుకు రాలేదో తెలియదు!"

ఈ ఉత్తరం ఎలిజబెత్‌కు బాధ కలిగించింది. జేన్ ఈ ఊబిలోంచి తేరుకున్నందుకు సంతోషించింది. బింగ్లీ త్వరలో మిస్ డార్సీని వివాహం ఆడతాడని ఊహించింది.

మిసెస్ గార్డినర్ ఈమధ్య రాసిన ఉత్తరంలో వికంను గురించి ఏమైనా ఉంటే రాయమంది. ఎలిజబెత్ జవాబు రాస్తూ, అతనిప్పుడు మరెవరి వెంటో తిరుగుతున్నాడని రాసింది: "నేను ప్రేమపాశంలో ఇరుక్కోలేదని, నాకు నిర్ధారణ అయింది. ఒక వేళ అలా జరిగినట్టయితే ఇప్పుడు అతనికి చెడు కోరేదాన్ని! అయితే ఇప్పుడు అదేంలేదు."

27

మార్చిలో ఎలిజబెత్ హాన్స్‌ఫోర్డు వెళ్ళాలి. మొదట ఆమె ప్రయాణానికి సుముఖంగా లేదు. అయితే చార్లెట్‌ను నిరుత్సాహపరచటం ఇష్టంలేక వెళ్ళాలనుకుంది. చార్లెట్‌ను

చూసికూడా చాలా రోజులైంది. కోలిన్స్ అంటే ఇప్పుడు వెనకటి చికాకు లేదు. ప్రయాణం ఎలిజబెత్, చార్లెట్ తండ్రి విలియం, చెల్లెలు మేరియాతో కలిసి. బాధ ఏమిటీ అంటే తండ్రిని వదలి ఉండటమే. ఆయనకు అమ్మాయి కనిపించపోతే తోచదు.

ఉదయమే బయలుదేరారు. మధ్యాహ్నానికల్లా గార్డినర్ ఇంటికి చేరుకోగలిగారు. జేన్ వాళ్ళకోసం ఎదురుచూస్తూ కిటికీ దగ్గరే నిలబడి ఉంది. అందరూ క్షేమసమాచారాలు చెప్పుకున్నారు. తరువాత వికంను గురించి చర్చ వచ్చింది. అతను ఈ మధ్యనే కొంత సంపద కలిగిన మిస్ కింగ్‌తో తిరుగుతూ ఉండటాన్ని గురించి మాట్లాడుకున్నారు.

వాళ్ళు విడిపోయే ముందు వేసవికాలం ఎక్కడ గడవటం అనే ప్రశ్న చర్చకు వచ్చింది.

"ఎక్కడికి వెళ్ళటమో ఇంకా నిర్ధారించుకోలేదు. బహుశా లేక్స్‌కు వెడతామేమో!" అంది అత్త. ఎలిజబెత్‌కు సంతోషం కూర్చేవార్త. లేక్స్ వాతావరణం ఆమెకు ఇష్టం.

28

హన్స్‌ఫోర్ట్‌కు తిరిగే సందు చేరుకోగానే అందరు చర్చికోసం వెదకనారంభించారు. అలా చూడగా చూడగా చివరకు చర్చి కనుచూపు మేరలోకి వచ్చింది. రోడ్డు మీదికి తోట, తోట మధ్య ఇల్లు. కోలిన్స్, చార్లెట్‌లు గుమ్మంలో నిలుచుని స్వాగతం చెప్పారు. బండి ఆగింది. ఇంట్లోకి వెళ్ళటానికి సన్నని రాతిరోడ్డు మీద కొద్దిదూరం నడవాలి. అందరూ బగ్గీ దిగారు. చార్లెట్ స్నేహితురాలిని అమితానందంతో కౌగిలించుకుంది. కోలిన్స్ ప్రత్యేకించి ఆమెకు ఇల్లంతా చూపించాడు. తనను తిరస్కరించినందువల్ల తను ఏం కోల్పోయిందో చూపించాడు. ఆమె చూసిన దాన్నంతటినీ మెచ్చుకుంది. తను కోల్పోయినందుకు మటుకు విచారపడలేదు. ఇల్లు చిన్నదే అయినా సదుపాయాలూ, సౌకర్యాలూ బాగున్నాయి. దీనికంతటికీ ఎలిజబెత్ చార్లెట్‌నే పొగిడింది. కోలిన్స్‌ను మరిచిపోతే ఇక్కడ నిజంగా ఎంతో సదుపాయంగా ఉంది. చార్లెట్ హాయిగా కనిపిస్తోంది. ఆమె తరచూ ఇలా కోలిన్స్‌ను మరిచిపోతూ ఉంటుందేమో అనిపించింది.

భోజనాల సమయంలో కోలిన్స్ అన్నాడు: "నీవు లేడీ కాథరైన్‌ను వచ్చే ఆదివారం చర్చిలో చూడగలవు. ఆమెను మెచ్చుకుంటావనీ, ఆమెతో పరిచయం ఏర్పడినందుకు సంతోషిస్తావనీ నేను వేరే చెప్పనవసరం లేదు. ఆమె నిన్ను ఎంతో ఆదరిస్తుంది. మీరు ఈ ఊళ్ళో ఉన్నన్నాళ్ళూ అన్ని విందులకు, సభలకు మిమ్మల్ని ఆహ్వానిస్తుంది. ఆమె చార్లెట్‌ను ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా చూసుకుంటోంది. వారానికి కనీసం రెండు మార్లయినా మేము రోసింగ్స్‌లో భోజనం చేస్తాం. భోజనానంతరం ఎప్పుడూ మమ్మల్ని కాలినడకన ఇంటికి రానివ్వదు. గుఱ్ఱపు బగ్గీలో పంపిస్తుంది. ఆమె గుఱ్ఱపు బగ్గీలలో ఒకటి ఎప్పుడూ మా కోసం సిద్ధంగా ఉంటుంది."

మరునాడు మధ్యాహ్నం, లిజ్జీ తన గదిలో ముస్తాబవుతోంది. కింది నించి ఎవరో వడివడిగా పైకి పరుగెత్తుకుంటూ వస్తూ తనను పిలుస్తున్నారు. తలుపు తెరిచేసరికి, రొప్పుతూ, రోజుతూ వచ్చిన మరియా కనిపించింది.

"ఎలిజా! త్వరగా కిందికిరా, త్వరగా రావాలి. ఊ పద! చూడాల్సిన దృశ్యం."

ఎలిజబెత్ కిందికి వచ్చి తోట ద్వారం దగ్గర నిలిచి బయటకు చూడగా ఇద్దరు ఆడవాళ్ళు నిలుచుని మాట్లాడుకుంటున్నారు. "ఇదేనా చూడవలసినది? నేనింకా పందులు తోటలో చొరబడ్డాయేమోనని అనుకున్నాను. ఇక్కడ చూస్తే లేడీ కాథరైన్, ఆమె కూతురు తప్ప ఇంకెవ్వరూ లేరు!" అంది.

మరియా 'ఆమె కాథరైన్ కాదు. మిసెస్ జెన్‌కిన్సన్. వాళ్ళతో పాటే ఉంటూ ఉంటుంది. ఆ అమ్మాయేమో కాథరైన్ కూతురు' అంది.

"చార్లెట్ ఆమెను అలా రోడ్డు మీదే ఎందుకు ఉండనిచ్చింది. లోపలకు పిలవదేం?"

"ఎప్పుడూ రాదట. ఆమె లోపలికి వచ్చిందంటే కల్పవృక్షం దిగివచ్చిందన్నమాటే!"

"ఆమె అందంగానే ఉంది! అవును. డార్సీకి సరిగ్గా జంట కలుస్తుంది. అతనికి తగిన భార్య అవుతుంది" అంది ఎలిజబెత్.

కోలిన్స్, చార్లెట్ ఇద్దరూ గుమ్మం దగ్గరే నిలబడి వాళ్ళతో మాట్లాడుతున్నారు.

చివరకు- మాట్లాడుకోవలసిందంతా అయిపోయిన తర్వాత వాళ్ళు బగ్గీ ఎక్కి వెళ్ళిపోయారు. వీళ్ళు ఇంటిలోకి వచ్చారు. కోలిన్స్ ఇంట్లో ఇద్దరమ్మాయిలను చూసి, వారి అదృష్టాన్ని పొగడసాగాడు. చార్లెట్ కాథరైన్‌గారి ఇంట విందుకు మన కుటుంబం అందరికీ ఆహ్వానం వచ్చిందని చెప్పింది. విందు మర్నాడే.

29

ఈ ఆహ్వానంతో కోలిన్స్ విజయం పూర్తయింది. తన మాటలు నిజమని చూపించాడు. తన అధికారిణి వైభవాన్ని వీళ్ళకు ప్రదర్శించాడు. ఇంకే కావాలి!

"ఆదివారంనాడు మధ్యాహ్నం మమ్మల్ని టీకి పిలిచినట్టయితే నాకు ఇంత ఆశ్చర్యం అనిపించదు. అయితే, మీరు వచ్చిన మరునాడే మననందరినీ అక్కడికి భోజనానికి రమ్మని స్వయంగా పిలిచి వెళతారని ఎవరు కలగన్నారు?" అన్నాడు కోలిన్స్.

"నాకేం ఆశ్చర్యం అనిపించటం లేదు. గొప్ప వాళ్ళ లక్షణాలవి" అన్నాడు విలియం.

రెండో రోజు వాళ్ళు ముస్తాబులు అవుతూండగా కోలిన్స్ రెండు మూడు సార్లు గుమ్మం వరకు వచ్చి వేళ మించిపోతుందనీ, తొందరగా రావాలని హెచ్చరించాడు.

వాతావరణం అనుకూలంగా ఉండటాన అరమైలు ఉద్యానవనం పక్కగా నడిచారు. ఉద్యానవనం ఎంతో వైభవంగా ఉంది. చివరకు వాళ్ళు కాథరైన్ భవనానికి చేరుకున్నారు.

మెట్లు ఎక్కి హాల్లో ప్రవేశిస్తూ ఉండగా, మరియా భయంతో అడుగులు తడబడింది. సర్ విలియం కూడా మామూలుగా కనిపించటం లేదు. ఎలిజబెత్ మామూలుగా ఉంది. ఆమె తన ఉత్సాహాన్ని కోల్పోలేదు.

సేవకులు వాళ్ళను లేడీ కాథరైన్, ఆమె కూతురు, మిసెస్ జెన్‌కిన్సన్ కూర్చుని ఉన్న గదిలోకి తీసుకు వెళ్ళారు. లేడీ కాథరైన్ వీళ్ళకు స్వాగతం చెబుతూ లేచి నిలబడింది. మిసెస్ కోలిన్స్ పరిచయాలు చేసే పని తనకే ఉండాలని ముందు భర్తతో ఏర్పాటు చేసుకుంది. ఆమె అందరినీ సవ్యంగా పరిచయం చేసింది.

సర్ విలియం ఈ దివ్యభవనాన్ని ఆశ్చర్యంతో తిలకిస్తూ కూర్చున్నాడు. ఎలిజబెత్ ఆ స్త్రీలను గమనిస్తూ కూర్చుంది. లేడీ కాథరైన్ పొడుగ్గా, దృఢంగా ఉంది. ఆమెను చూస్తూంటే ఒకప్పుడు గొప్ప అందగత్తే అయి ఉంటుందనిపిస్తోంది. ఆమె మాటలన్నీ హుందాగా, అధికారంతో ఉన్నాయి. స్వాగతం చెప్పటంలో కూడా తక్కువ స్థాయి వాళ్ళకు చెప్పినట్టే ఉంది. ఆమె కూతురు బక్కపలచగా, పీలగా ఉంది. ఈమె ముఖకవళికలు గంభీరంగా, ప్రత్యేకంగా ఉన్నాయి. ఆమె అతినింపాదిగా లోస్థాయిలో మాట్లాడుతోంది. పోతే జెన్‌కిన్సన్ గురించి ప్రత్యేకంగా చెప్పవలసింది ఏమీలేదు.

విందు ఎంతో ఘనంగా ఉంది. కోలిన్స్ ముందే చెప్పినట్టు, ఎందరో సేవకులూ, ఎన్నెన్నో రకాల ప్లేట్లూ! సర్ విలియం, కోలిన్స్ చెబుతున్న ప్రతి మెచ్చుకోలుకు వంతపాట పాడుతున్నాడు. ఆడవాళ్ళంతా డ్రాయింగ్ రూంలోకి వచ్చి లేడీ కాథరైన్ చెబుతున్నది వింటూ కూర్చున్నారు. కాఫీ వేళవరకు ఆమె అలా చెబుతూనే ఉంది. అన్ని విషయాల మీద తన అభిప్రాయాలు ఏకరువు పెడుతోంది. చార్లెట్ గృహకృత్యాలను గురించి సవివరంగా అడిగి తెలుసుకుంది. ఎన్నో సలహాలు చెప్పింది.

ఆమె మధ్య మధ్య మరియా, ఎలిజబెత్‌లను కూడా ప్రశ్నలు వేసింది. ఎలిజబెత్‌నే ఎక్కువ ప్రశ్నలు వేసింది. ఆమె అక్కాచెల్లెళ్ళు ఎందరో అడిగింది. ఆమె కంటే పెద్దవాళ్ళు ఎందరు, చిన్నవాళ్ళు ఎందరు, ఎందరికి వివాహాలు అయినాయి, అందరూ అందంగా ఉంటారా లేదా, ఎంతవరకు చదువుకున్నారు- అన్న విషయాలన్నీ అడిగి తెలుసుకుంది. చివరకామె ఇలా అంది: "మీ నాన్న ఎస్టేటు ఆయన తదనంతరం కోలిన్స్‌కు వస్తుంది. పాపం! నీ పరిస్థితి నాకు విచారంగా ఉంది. నీకు ఆట, పాట వచ్చునా?"

"కొద్దిగా!"

"అయితే ఎప్పుడో ఒకసారి మాకు వినిపించు. మా సంగీతవాద్యం గొప్పది. ఒకరోజు దాన్ని వాయించి చూడు... ఇలా చెబుతూనే ఉంది.

టీ సమయానికి మగవాళ్ళంతా వచ్చి అక్కడ చేరారు. పేకాట బల్లలు పరిచారు. లేడీ కాథరైన్, సర్ విలియం, కోలిన్స్ దంపతులు, నలుగురూ ఆట ప్రారంభించారు. కాథరైన్

కుమార్తె, ఎలిజబెత్, మరియా, జెన్‌కిన్సన్ ఒక చోట చేరారు. ఆటను గురించి తప్ప ఇతర సంభాషణ ఏమీ సాగలేదు. ఆటలైన తరువాత, గుఱ్ఱపు బగ్గీ సిద్ధం అయింది. బండి ఇట్లా బయలుదేరి రోడ్డుమీదికి వచ్చిందో లేదో, కోలిన్స్ ఎలిజబెత్‌ను రోసింగ్స్ గురించి నీ అభిప్రాయం ఏమిటని అడిగాడు. చార్లెట్‌కోసం, ఆమె పొగిడింది. అయితే ఈ పొగడ్త ఆమెకు కొద్దిగా ఇబ్బందిగానే ఉంది.

30

సర్ విలియం హాన్స్‌ఫోర్డ్‌లో వారంరోజులు మటుకే ఉన్నాడు. అటువంటి భర్తను, అటువంటి ఇరుగు పొరుగును పొందటం అదృష్టమేననీ నిర్ధారించుకున్నాడు.

సర్ విలియంను, రోజూ ఉదయం కోలిన్స్ ఊళ్ళోకి తీసుకు వెళ్ళి వింతలు వినోదాలు చూపించేవాడు. ఆయన వెళ్ళిపోయిన తరువాత కోలిన్స్ తన పని చూసుకోవటంలో మునిగిపోయాడు. అతనికి ఎంతసేపూ తోటపనీ, చదువు, రాతపనీ సరిపోయేవి. ఈ పనులతో అతను రోడ్డుపక్కనున్న ముందు హాల్లో ఉండేవాడు. ఆడవాళ్ళు కూర్చునే గది ఇంటికి వెనుక భాగాన ఉంది. ఎలిజబెత్ మొదట, చార్లెట్ ఇంటి మధ్య గదిని కూర్చునే చోటుగా ఎందుకు ఉపయోగించటం లేదా అని ఆశ్చర్యపడింది. ఆ గది విశాలమైనది, హాయిగా ఉంటుంది కూడా! అయితే ఇక్కడ కూర్చున్నట్టయితే, కోలిన్స్ కూర్చునే చోటికి దగ్గరవుతుంది. అతను తరచూ వచ్చి ఇక్కడే బైఠాయిస్తాడు. ఎలిజబెత్‌కు చార్లెట్ వెనుక గది ఎంచుకోవటంలోని అంతరార్థం బోధపడింది.

రోజూ కోలిన్స్ లేడీ కాథరైన్ దగ్గరకు వెళ్ళి వస్తూండేవాడు. ఆమె అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి అన్నీ చూసి వెడుతూండేది. ఏమైనా సలహాలు, ఆజ్ఞలు ఇస్తూ ఉండేది.

విందుకు రోసింగ్స్‌కు పిలవటం పదిహేను రోజులకొకసారి జరుగుతూనే ఉంది. వాళ్ళకు మరో కార్యక్రమమేమీ లేదు. ఎలిజబెత్ కులాసాగా కాలం గడుపుతోంది. బయట వాతావరణం బాగుంటుంది. కనుక ఎక్కువ సేపు తోటలో గడుపుతోంది. చార్లెట్‌తో గంటల తరబడి కులాసాగా సంభాషణ సాగిస్తోంది.

ఇలా ఆమె వచ్చిన తరువాత పదిహేను రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. ఈస్టర్ సమీపిస్తోంది. ఈ పండుగకు డార్సీ ఇక్కడికి వస్తాడన్నారు. లేడీ కాథరైన్ అతన్ని గురించి ఆప్యాయంగా మాట్లాడింది. ఒకనాడు అతను రానే వచ్చాడు. తనతోపాటు, తన బాబాయి కొడుకు, కల్నల్ ఫిట్ విలియంను కూడా తీసుకు వచ్చాడు.

ఎలిజబెత్ కళ్ళకు డార్సీ ఇదివరకు తను చూసినప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. మామూలుగా హుందాగా అభివందనలు తెలిపాడు. ఎలిజబెత్ కూడా ఏమీ మాట్లాడకుండానే ప్రత్యభివాదం చేసింది.

కల్నల్ ఫిట్ విలియమ్ అందరితో పూర్వపరిచయం ఉన్నట్టుగానే మాట్లాడసాగాడు. డార్సీ మటుకు కోలిన్స్ ఒక్కడితోనే- అదీ తోట విషయం మటుకే మాట్లాడాడు. తరువాత చాలాసేపటివరకు మాటామంతీ లేకుండా కూర్చున్నాడు. చివరకు ఎలిజబెత్‌ను ఆమె కుటుంబంలో వాళ్ళంతా ఆరోగ్యంగా ఉన్నారా అని అడిగాడు. ఆమె మామూలుగా అతనికి జవాబు చెప్పింది. ఒక్క క్షణం ఆగి మా అక్క జేన్ మూడు నెలలుగా లండన్‌లోనే ఉంటుంది. మీరెప్పుడైనా ఆమెను అక్కడ చూశారా?" అని అడిగింది.

అతను కంగారుగా తనకు జేన్‌ను చూడగల భాగ్యం పట్టింది కాదని జవాబు చెప్పాడు. ఇక ఈ విషయాన్ని ఎవరూ కొనసాగించలేదు. తరువాత వాళ్ళిద్దరూ లేచి వెళ్ళారు.

31

కల్నల్ ఫిట్ విలియం గురించి ఎంతో ఘనంగా చెప్పుకున్నారు. రోసింగ్స్‌లో జరుగబోయే విందుల్లో అతనెంతో సందడి కూరుస్తాడని అనుకున్నారు.

ఆ సాయంత్రం విందుకి వాళ్ళందరూ లేడీ కాథరైన్ డ్రాయింగ్ రూం చేరుకున్నారు. ఆమె వాళ్ళకు మామూలు ధోరణిలోనే స్వాగతం చెప్పింది. ఆమె ఎక్కువ సేపు డార్సీతోనే సంభాషిస్తూ కూర్చుంది.

కల్నల్ వాళ్ళనందరినీ తిరిగి చూడగలిగినందుకు సంతోషం వ్యక్తపరిచాడు. రోసింగ్స్‌లో ఏ పరిణామమైనా సరే అతనికి ఆనందదాయకంగా ఉన్నట్టుంది. లిజ్జీ అతనికి నచ్చింది. అతను ఆమె సరసనే కూర్చున్నాడు. ప్రయాణాలు, మజిలీల గురించి కొత్త పుస్తకాలు, సంగీతం గురించి మాట్లాడుతున్నాడు. లేడీ కాథరైన్ అతని ధోరణి పసికట్టి 'ఏం మాట్లాడుతున్నావు విలియం. మిస్ బెనెట్‌కు ఏదో చెబుతున్నావే, అదేమిటో నా చెవిని కూడా పడనీ!' అంది.

"మేం సంగీతాన్ని గురించి ముచ్చటించుకుంటున్నాం" అన్నాడు.

"సంగీతాన్ని గురించా? అయితే బిగ్గరగానే మాట్లాడు. ఆ విషయాన్ని గురించి మాట్లాడటమంటే నాకెంతో ఇష్టం. నా కంటే సంగీతంలో అభిరుచి ఉన్నవాళ్ళు ఇంగ్లండు మొత్తం మీద ఎంతోమంది ఉండరు. నేనేగనుక సంగీతం నేర్చుకున్నట్టయితే గొప్ప విద్వాంసురాలిని అయివుండేదాన్ని. నీ చెల్లెలు జార్జియానా ఎలా ఉంది డార్సీ?"

డార్సీ తన చెల్లెలి ప్రావీణ్యాన్ని గురించి గొప్పగా మాట్లాడాడు.

"నాకు సంతోషంగా ఉంది. ఇంకా బాగా అభ్యాసం చేయమను." అంది కాథరైన్.

"అభ్యాసం విడవకుండానే చేస్తూ ఉంటుంది."

"అభ్యాసం కూసువిద్య అన్నారు! అందులో సంగీతం విషయంలో ఈ సామెత మరింత నిజం. మిసెస్ కోలిన్స్‌ను రోజూ ఇక్కడికి వచ్చి అభ్యాసం చేసుకోమంటున్నాను."

కాఫీలు అయిన తరువాత కల్నల్ ఎలిజబెత్‌కు సంగీతం విషయం గుర్తుచేశాడు. ఆమె వాద్యం ముందు కూర్చుంది. అతను ఆమెకు దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చున్నాడు. లేడీ కాథరైన్ ఒక పాట సగం వరకు విని తరువాత యథాపూర్వకంగా డార్సీతో మాట్లాడుతూ కూర్చుంది. కొంతసేపైన తరువాత డార్సీ అక్కడి నించి లేచి పియానో వంక వచ్చాడు. ఎలిజబెత్‌కు ఎదురుగా సుదూరంలో నిలుచున్నాడు. ఎలిజబెత్ అతన్ని చూస్తోంది. కొంతసేపయ్యాక అతనివంక నవ్వుతూ చూస్తూ 'నన్ను భయపెడదాం అనుకున్నావా- ఇలా వచ్చి నిలుచుని విను. నేనేం అంత తేలికగా భయపడను' అంది.

"నిన్ను పూర్వమే ఎరుగుదును గనుక ఎరువు తెచ్చుకున్న అభిప్రాయాలతో వినోదాన్ని పొందటానికి ప్రయత్నించటం నీకు అలవాటని నాకు తెలుసు!" అన్నాడు డార్సీ.

ఎలిజబెత్ హృదయ పూర్వకంగా నవ్వింది. 'డార్సీకి నా గురించి బాగా తెలుసు. అయన్ను అడగండి. నా మాట ఒకటీ నమ్మటానికి వీలులేదని చెబుతాడు. నా వ్యక్తిత్వాన్ని ఇలా విచ్చలవిడిగా చదివేసినట్టు చెప్పివేయగల మనిషిని కలుసుకోవటం నిజంగా నా దురదృష్టం' అంది కల్నల్‌తో.

తరువాత వాళ్ళు ముగ్గురూ స్వభావాల గురించి, గుణగణాల గురించి కొద్దిసేపు కీచులాడుకున్నారు. ఇంతలో లేడీ కాథరైన్ ఏం మాట్లాడుతున్నారంటూ వచ్చింది. ఎలిజబెత్ వెంటనే పాట వాయించటం మొదలుపెట్టింది. లేడీ కాథరైన్ కొద్దిసేపు విని, డార్సీతో ఇలా అంది! 'మిస్ బేనెట్ బాగా అభ్యాసం చేసి, మంచి లండన్ గురువు దగ్గర నేర్చుకుంటే ఇలా వాయించదు. ఆమెకు స్వరజ్ఞానం ఉంది. అయితే ఏన్ అంత తెలివైనది కాదనుకో. ఏన్‌కే గనుక ఆరోగ్యం తిన్నగా ఉంటే సంగీతంలో నిధి అయేది' అంది.

ఎలిజబెత్ డార్సీ వంక చూసింది.

లేడీ కాథరైన్ సంగీత వాయిద్యాల గురించి, అభిరుచుల గురించి అలా ఇంకా మాట్లాడుతోనే ఉంది. శ్రోతల కోరికపై, ఎలిజబెత్ తమను ఇంటికి తీసుకు వెళ్ళటానికి గుర్రపు బగ్గీ వచ్చే వరకు అలా వాయిస్తూనే కూర్చుంది.

32

ఎలిజబెత్ మరునాడు ఉదయం ఒంటరిగా కూర్చుని జేన్‌కు ఉత్తరం రాస్తోంది. మిసెస్ కోలిన్స్, మరియా బజారు పనిమీద వెళ్ళారు. ఎవరో వచ్చి తలుపు తట్టారు. బగ్గీ వచ్చిన అలికిడి కాలేదు. అందుచేత లేడీ కాథరైన్ కాదనుకుంది, రాస్తున్న ఉత్తరం దాచి, లేచి వెళ్ళి తలుపు తెరిచింది. మిస్టర్ డార్సీ! ఆశ్చర్యం. డార్సీ ఒక్కడే గదిలోకి వచ్చాడు.

అతను కూడా ఆమె వంటరిగా ఉండటం చూసి ఆశ్చర్యపోయినట్టున్నాడు. అందరూ ఉన్నారనుకుని వచ్చినందుకు క్షమించమన్నాడు.

వాళ్ళిద్దరూ కూర్చున్నారు. ఆమె రోసింగ్స్‌ను గురించి కుశల ప్రశ్నలు వేసింది. కాసేపయ్యాక "పోయిన నవంబరు మీరంతా ఎంత అకస్మాత్తుగా నెదర్‌ఫీల్డ్ విడిచి వెళ్ళారు! అన్నట్టు మిస్టర్ బింగ్లీ, అతని చెల్లెళ్ళు అందరూ కులాసాయేనా?" అని అడిగింది.

"కులాసాగానే ఉన్నారు."

"బింగ్లీకి తిరిగి నెదర్‌ఫీల్డ్ తిరిగి రావాలనే తలంపే లేదట కదూ?"

అతనలా అంటూ ఉండగా నేనెప్పుడూ వినలేదు. అయితే అతను ముందు ముందు బహుకొద్దికాలం మటుకే అక్కడ గడుపుతాడనుకుంటాను.

"అలా అయితే అతనా ఇంటిని పూర్తిగా ఖాళీ చేయటం మంచిది. ఏమంటే మాకు నికరంగా ఉండే ఒక పొరుగు ఏర్పాటు అవుతుంది. అయితే - ఇదంతా అతని ఇష్టాయిష్టాలతో కూడిన పనిగా!" అంది ఎలిజబెత్.

"ఏదైనా మంచి బేరం వస్తే అలాగే ఇచ్చేస్తాడు."

మళ్లీ డార్సీయే మాటాడాడు: "ఈ ఇల్లు చాలా సదుపాయంగా ఉంది. లేడీ కాథరైన్ ముందు కోలిన్స్ ఇక్కడికి వచ్చినప్పుడు అతనికి చాలా సాయం చేసింది."

"అవును."

"కోలిన్స్ భార్యను ఎన్నుకోవటంలో కూడా అదృష్టవంతుడే!"

"ఔను. అతన్ని వివాహం ఆడటానికి ఒప్పుకునే స్త్రీ, అందులోనూ వివాహానంతరం అతన్ని సుఖపెట్టగలిగే స్త్రీ దొరకటం సంతోషించవలసిన విషయమే. నా స్నేహితురాలు తెలివి తేటలూ సమయోచిత పరిజ్ఞానమూ ఉన్న మనిషి! ఇద్దరిదీ అనుకూల దాంపత్యం."

"ఆమె పుట్టినింటికి ఇంత చేరువలో స్థిరపడటం చాలా అదృష్టం!"

"ఎంత చేరువ? యాభై మైళ్ళు ఉంటుంది."

"మంచి రోడ్డుంటే యాభై మైళ్ళు ఒక దూరమేనా? ఒక పూటలోపు ప్రయాణం."

"అయినా కోలిన్స్ దంపతులు ఎప్పుడూ ఆమె పుట్టింటికి రాలేదు- ఇంతవరకూ!"

'నీవు ఎప్పుడూ లాంగ్‌బర్న్‌లోనే ఉండలేవులే! నీకా హక్కేం లేదు' అన్నాడు డార్సీ.

ఎలిజబెత్ ఆశ్చర్యపోయి చూసింది. అతను బల్లమీద వార్తాపత్రిక తీసుకుని చదువుతూ నింపాదిగా 'నీకు ఇక్కడ ఎలా ఉంది. బాగా ఉందా' అనడిగాడు.

తరువాత ఆ గ్రామాన్ని గురించి కొంతసేపు మాట్లాడుకున్నారు. ఇంతలో చార్లెట్ ఆమె సోదరి వచ్చారు. చార్లెట్ ఆశ్చర్యంగా చూసింది. డార్సీ తను ఎలా పొరపాటుపడి లోనికి వచ్చిందీ చెప్పాడు. తరువాత కొద్దిసేపు కూర్చుని, తన దారిన తను వెళ్ళిపోయాడు.

'దీని అర్థం ఏమై ఉంటుంది? ఎలిజా, బహుశా అతను నిన్ను ప్రేమిస్తున్నాడేమో! మామూలుగా అయితే అతనెప్పుడూ ఇంత చొరవగా ఇలా రాడు' అంది చార్లెట్.

అతను ఏమీ తోచక కేవలం కాలక్షేపం కోసం ఇటు వచ్చాడేమోనని అనుకున్నారు.

డార్సీ, కల్నల్‌లు రోజూ ఉదయం ఇటువైపు రావటం పనిగా పెట్టుకున్నారు. జంటగానో, ఒంటరిగానో వచ్చి వెడుతూ ఉండేవాళ్ళు. అప్పుడప్పుడు లేడీ కాథ్రైన్ కూడా వాళ్ళతో వచ్చేది. అయితే డార్సీ అందరికన్నా ఎక్కువసార్లు ఇక్కడికి ఎందుక్కు వస్తున్నాడో ఎవరికీ అర్థం కాలేదు. చార్లెట్‌కు అతనితో ఎలా వ్యవహరించటమో అర్థం కాలేదు. అతను ఎలిజబెత్ వంక ఎక్కువ సేపు చూస్తూ ఉండేవాడు.

లిజ్జీతో ఈ విషయం ఒకటి రెండుసార్లు కదిపింది. కానీ ఆమె నవ్వి ఊరుకునేది. లిజ్జీ కల్నల్ ఫిట్ విలియంను చేసుకుంటే సుఖపడుతుందని చార్లెట్ భావించసాగింది.

33

ఎలిజబెత్ పార్కులో తిరుగుతున్నప్పుడు చాలాసార్లు డార్సీ ఎదురుపడ్డాడు. మొదటి సారి కనిపించినప్పుడు ఇలా విహరించటం తనకు సరదా అని ఆమె చెప్పింది. అయినా అతను, ఎదురుపడటం ఎందుకు మానటంలేదు? కనుక ఇది యాదృచ్ఛికం అనటానికి వీల్లేదు. ఏదో విచిత్రమైన పరిణామమే జరగనున్నది. ఎదురుపడినవాడు తన దారిని తానుపోక, ఆమెతో సంభాషణ పెంచి ఆమెను అనుసరిస్తున్నాడు.

ఒక రోజు ఆమె జేన్ దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని చదువుకుంటూ అటూ ఇటూ పచార్లు చేస్తోంది. ఈసారి డార్సీకి బదులు, కల్నల్ ఫిట్ విలియం ఎదురువచ్చాడు. ఉత్తరం దాచేసి బలవంతాన ముఖంమీదికి చిరునవ్వు తెచ్చుకుని ఇలా అంది. "మీరీ దారిన నడవటం నేనెప్పుడూ చూడలేదు."

"ఊరికే పార్కంతా చుడుతున్నాను. నీవు చాలా దూరం వెడుతున్నావా?"

"లేదు! వెనక్కు తిరుగుదామనుకుంటున్నాను" అంది.

"అయితే మీరు శనివారంనాడు కేంట్ వదిలి వెడతారా?' తిరిగి తనే అడిగింది.

'డార్సీ తిరిగి వాయిదా వేయకపోతే అలాగే జరుగుతుంది. అంతా అతని ఇష్టం."

"అతనంతా కులాసా పురుషుడు. తను ఆ క్షణంలో ఎలా కోరుకుంటే అలా చేస్తాడు."

ఆ తరువాత ఇద్దరూ కులాసాగా కొంతసేపు మాట్లాడుకున్నారు.

"బహుశా డార్సీ మిమ్మల్ని కేవలం కాలక్షేపం కోసమే ఇక్కడికి తెచ్చాడనుకుంటాను. అతను జీవితాంతం తోడుగా ఉండేందుకు వివాహం ఎందుకు చేసుకోవటం లేదో నాకు అర్థంకాదు. అయితే ఇప్పుడతనికి చెల్లెలి బాధ్యత ఉంది కదూ?" అంది.

"లేదు. మిస్ డార్సీ పోషకత్వంలో మా ఇద్దరిదీ సంయుక్త బాధ్యత!"

"అలాగా! ఆహా ఏం సంయుక్త పోషకులు! ఆమెలోనే కనుక డార్సీల తత్వం ఉన్నట్టయితే తన స్వంతదారినే తను వెడుతుంది."

వాళ్ళ సంభాషణలో బింగ్లీని గురించి, అతని చెల్లెళ్ళను గురించి ప్రసక్తి వచ్చింది.

కల్నల్ ఇలా అన్నాడు: "డార్సీకి బింగ్లీకి మంచి స్నేహం అని నేను విన్నాను. అయితే బింగ్లీని నేనెప్పుడూ చూడలేదు. ఒకసారి డార్సీ చెప్పాడు: ఒక స్నేహితుడికి అంతయోగ్యం కాని వివాహం చేసుకోబోయే స్థితిలో వారించి ఉపకారం చేశానని. ఆ స్నేహితుడు బింగ్లీయే అనుకుంటాను. అయితే అతను నాకు పేర్లుగానీ, ఊళ్ళుగానీ చెప్పలేదు."

"డార్సీ అసలు తను ఎందుకు జోక్యం కలిగించుకున్నాడో చెప్పాడా?"

"ఆ యువతికి వ్యతిరేకంగా ఏవో బలమైన కారణాలు ఉన్నాయుట!"

"అయితే అతను వాళ్ళిద్దర్నీ ఎలా వేరుపరిచారట?"

"అతను నాకీ వివరాలన్నీ చెప్పలేదు. పైన చెప్పిన విషయాలు మటుకే చెప్పాడు."

లిజ్జీ ఏమీ బదులు చెప్పకుండా నడుస్తోంది. ఆమె హృదయం ఉద్రేకంతో ఉడికి పోతోంది. ఆమెను కొద్దిసేపు గమనించి, ఏమిటంత ఆలోచనగా ఉన్నావు అన్నాడు కల్నల్.

"మీరు చెప్పిన విషయమే. డార్సీ ఎందుకు జోక్యం కలిగించుకున్నాడు?"

"ఏమో మనకేం తెలుసు?"

ఇంటికి చేరుకున్నాక ఆమె అన్ని సంగతులు పునరాలోచించుకుంది. డార్సీ చెప్పిన విషయం తన కుటుంబానికి సంబంధించినదే అయివుండాలి. సందేహం లేదు. అతనే బింగ్లీ జేన్ ఎడబాటుకు కారణం. అతని అహంభావమే ఈ దుఃఖానికి కారణం. జేన్ దురదృష్టానికి ఎంతగానో వగచింది. ఆమెకు ఈ ఆలోచనలతో తలనొప్పి వచ్చింది. సాయంత్రానికల్లా అది విపరీతం అయింది. డార్సీని చూట్టం ఇష్టంలేక, రోసింగ్స్‌కు వెళ్ళటం మానేసింది. లేడీ కాథరైన్ కోపపడుతుందేమోనని భయపడ్డాడు కోలిన్స్.

34

వాళ్ళందరూ వెళ్ళిన తరువాత, జేన్ లండన్ వెళ్ళినప్పటి నించి తనకు రాసిన ఉత్తరాలను ఎలిజబెత్ చదువుతూ కూర్చొంది. వాటిలో డార్సీ మీద ఏమి ఫిర్యాదులేదు. గతించిన దానికేమీ ప్రతీకార వాంఛలేదు. అవి కేవలం జేన్ తాలూకు సంక్షోభ హృదయాన్ని చిత్రిస్తున్నాయి. ఎల్లుండితో తన రోసింగ్స్ మజిలీ పూర్తవటం నిజంగా అదృష్టమే. పదిహేను రోజుల లోపునే తిరిగి తను జేన్‌ను కలుసుకుంటుంది.

ఆమె ఇలా ఆలోచించుకుంటూ ఉండగా ఎవరో తలుపుతట్టిన శబ్దం వినవచ్చింది. బహుశా కల్నల్ ఫిట్ విలియం అనుకుంది. తీరా తలుపులు తీసి చూస్తే ఎదురుగా డార్సీ నిలబడి ఉన్నాడు. అతను ఆమె ఆరోగ్యాన్ని గురించి అడిగాడు. లిజ్జీ ఆశ్చర్యపోయింది. కొన్ని నిమిషాల నిశ్శబ్దం తరువాత ఆమెకు దగ్గరగా వచ్చి డార్సీ ఇలా అన్నాడు:

"నేను అనవసరంగా నాలో నేను దహించుకు పోతున్నాను. నీతో ఒక్క ముక్క చెప్పనీ. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను ఆరాధిస్తున్నాను."

ఆమె నివ్వెరపోయి చూసింది. ముఖ కవళికలు మార్పుచెందాయి. మిన్నువిరిగి మీద పడిపోయింది. అతను తన ప్రేమను గురించి ధారావాహినిగా మాట్లాడాడు.

ఆమెకు అతనంటే ఎంత కోపం, అసహ్యం ఉన్నప్పటికీ ఈ పరిస్థితిలో అతన్ని ఏమీ అనలేకపోయింది. చివరికామె అంది: ఇటువంటప్పుడు మామూలుగా కృతజ్ఞతా పూర్వక వాక్యాలు పలకాలి. కానీ నేను ఇటువంటి అభిప్రాయం మీకు ఉన్నదని ఎరుగను. అలా కోరుకోలేదు కూడా. మీకు బాధ కలిగిస్తే క్షమించండి."

డార్సీ ఆమె జవాబు విని ఆశ్చర్యపడ్డాడు. అతని ముఖం కోపంతో ఎర్రబారింది. అతని మనస్సు అతలాకుతలం అవటం స్పష్టంగా కనిపిస్తోంది. పెదిమలు వణుకుతూ మాట్లాడలేకపోయాడు. చివరకు తమాయించుకుని ఇలా అన్నాడు. 'నా ప్రేమను ఎందుకు తిరస్కరిస్తున్నావో తెలుసుకోవచ్చా?"

"నేను కూడా మీరు, మీ సాంఘిక స్థాయికీ మీ అహానికీ తగని విధంగా నన్ను ఎందుకు వివాహం ఆడగోరుతున్నారో, నన్ను ఎందుకు అవమానించ దలుచుకున్నారో తెలుసుకోవచ్చా? నాకు కూడా ఆలోచనలు, ఆవేదనలు ఉంటాయని ఎరుగుదురా? నేను అత్యంత ప్రేమ పాత్రంగా చూసుకునే మా అక్క సౌఖ్యాన్ని కావాలని చేజేతులా నాశనం చేసిన మనిషిని, ఎలా వివాహం చేసుకోవటానికి అంగీకరిస్తాననుకున్నారు?"

ఆమె ఈ మాటలు అంటూ ఉండగా డార్సీ ముఖం రంగుమారింది. అయితే ఉద్రేకం తక్కువ. ఆమె ధోరణికి అడ్డుతగలకుండా చెప్పేదంతా వింటూ నిల్చున్నాడు.

"వాళ్ళిద్దరినీ విడదీయటానికి మీకేం అధికారం ఉంది? మా అక్క జీవితాన్ని నిరాశలో ముంచే హక్కు మీకెవరిచ్చారు?" పోనీ, ఈ పని మీరు చేయలేదని చెప్పగలరా?"

అతనిలా జవాబు చెప్పాడు: 'అతన్నీ మీ అక్కనూ వేరు చేయటానికి నా శాయశక్తులా పని చేశాను. ఈ విషయాన్ని మభ్యపెట్టటం నాకు ఇష్టం లేదు. అయితే ఇందులో నేను నా మీద కంటే అతని మీదే ఎక్కువ దయతో ప్రవర్తించాను."

"ఇదొక్కటే కాదు, మీరంటే నాకు అయిష్టం ఏర్పడటానికి కారణం. ఈ సంఘటనకు పూర్వమే, మిమ్మల్ని గురించి నేనో అభిప్రాయానికి వచ్చాను. వికం చెప్పిన వృత్తాంతంతో మీ వ్యక్తిత్వమంతా నాకు తెలిసివచ్చింది. ఈ విషయమై మీరేం చెప్పుకోగలరు?

"ఆ గొడవలో నీకు పూర్తిగా పరిచయం లేకపోయినా మాట్లాడుతున్నావు."

"అతని బీదరికానికి కారణం మీరు. అతని జీవితం పాడుకావటానికి కారణం మీరు."

"నా గురించి నీ ఉద్దేశమంతా ఇదేనన్నమాట. సరే, ఇంత విశదీకరించి నాకు చెప్పినందుకు ధన్యవాదాలు." అంటూ వెళ్ళబోతున్నవాడల్లా వెనక్కు తిరిగివచ్చి "నేను మొదటి నుంచి గర్విష్టిగా, అహంపూరితుడుగా కనిపించకుండా నిన్ను దేవతవని పొగిడి పూజించి ఉన్నట్టయితే ఈ తప్పులన్నీ సమసిపోయి ఉండేవి. అంతేనా?"

"పొరబడుతున్నారు డార్సీ. మీరు ఏ రకంగా చెప్పినా ఒకటే. మీరు పెద్దమనిషి తరహాగా చెప్పినా నా జవాబు మటుకు ఇదే!"

"చెప్పింది చాలు ఎలిజబెత్, నీ కాలం వృథా చేసినందుకు క్షమించు. నీ భవిష్యత్ ఆరోగ్యానికి, నా భాగ్యానికి నా శుభాకాంక్షలు స్వీకరించు" అంటూ వెళ్ళిపోయాడు.

ఎలిజబెత్ అతను ఇంటిముందు గుమ్మం కూడా తెరుచుకుని రోడ్డుమీదికి వెళ్ళిపోవటం చూసింది. ఆమె మనస్సు ఇప్పుడు బాధతో భారంగా మూలుగుతోంది. నీరసంగా ఒకచోట కూలబడి అరగంట వరకు ఏడ్చింది.

ఆశ్చర్యం! డార్సీ నుంచి తనకు వివాహ ప్రసక్తి రావడం! కొన్ని నెలలుగా అతను తనను ప్రేమిస్తూ ఉండడం! ఈ ప్రేమ మూలంగా పెళ్ళి చేసుకుంటాననడం! స్నేహితుడి పెళ్ళికి అడ్డువచ్చిన కారణాలే తన పెళ్ళికి తొలగిపోవడం! వికంను గురించి అతను ప్రదర్శించిన వైఖరి! లేడీ కాథరైన్ గుఱ్ఱపు బగ్గీ చప్పుడు వినిపించే దాకా ఆమె ఇలాగే కూర్చుంది. చార్లెట్ దృష్టినించి తప్పించుకోటానికి తన గదిలోకి దాదాపు పరిగెత్తింది.

35

తెల్లవారి లేచాక కూడా మరో విషయం ఆలోచించలేకపోతోంది. పార్కు రోడ్డునే నడిస్తే మళ్ళీ డార్సీ ఎదురుపడతాడేమోననే భయంతో పక్కరోడ్డు మీదుగా నడిచింది.

కెంట్‌లో ఉన్న ఐదు వారాలుగా ఉద్యానవనంలోని చెట్లు రకరకాల మార్పులు పొందుతూ ఉండటం గమనిస్తోంది. ఆమె గేటు దాటి పార్కులోకి వెడదామనుకుంది. అయితే దూరంగా ఎవరో వస్తున్నట్టు కనిపించింది. ఎవరా మనిషి? డార్సీ కాదుగదా అని బెదిరింది. వెనక్కు తిరిగి వడివడిగా నడవ సాగింది. అయితే ఆమె నాలుగడుగులు వేసేలోపే, అతను దగ్గరగా వచ్చి ఆమెను పిలిచాడు. ఆమె నిలబడింది. డార్సీ ఎదురుగా వచ్చి నిలుచున్నాడు. అతని చేతిలో ఉత్తరం ఉంది. ఆమెతో 'నీ కోసం ఇందాకటి నుంచి పార్కులో కాచుకుని ఉన్నాను. దయచేసి ఈ ఉత్తరం చదువుతావా?' అన్నాడు. ఇలా అంటూ అతను ఉత్తరాన్ని ఆమె చేతిలో పెట్టి వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

ఎలిజబెత్ ఆదుర్దాతో కవరు తెరిచింది. నాలుగైదు పేజీల ఉత్తరం కనిపించింది. రోసింగ్స్‌లో ఉదయం ఎనిమిది గంటలకు రాసినట్టుగా పైన సూచించి ఉంది. ఆమె నింపాదిగా నడుస్తూ ఉత్తరాన్ని చదువుకోసాగింది.

"ఈ ఉత్తరాన్ని రాయటంలో, నా ఉద్దేశం నిన్ను బాధపెట్టటం కాదు. వివరంగా నా పరిస్థితిని మనవి చేసుకోవటం. ఇది చదివి అర్థం చేసుకుంటే మన భావిజీవితం సంతోషదాయకం అవుతుంది. అందుచేత దయచేసి ఈ ఉత్తరాన్ని చదివి ఆ పైన నీ ఇష్టం వచ్చినట్టు చేయమని నిన్ను వేడుకొంటున్నాను.

"రాత్రి నా మీద నీవు రెండు రకాలైన ఆరోపణలు చేశావు. ఈ రెంటికీ సంబంధం లేకపోయినా అవి ఒక దానికంటే ఒకటి గొప్పవి. మొదటిది- బింగ్లీని నీ అక్క నుంచి వేరు చేశానని. రెండవది, వికం భవిష్యత్తును నాశనం చేసి అతన్ని బజారుపాలు చేశానని. ఈ రెండు ఆరోపణలకు నా సంజాయిషీ ఇచ్చుకుంటాను. "నేను హేర్ట్‌ఫోర్క్‌షైరులో ఉన్నది కొద్దికాలమే. బింగ్లీ మీ అక్క అంటే తీవ్రమైన అభిమానంగా ఉంటున్నాడన్న విషయం నాకు ఆరోజు, నెదర్‌ఫీల్డ్ బాల్ రోజున మటుకే తెలిసింది. అంతకు ముందే నేను వాళ్ళిద్దరూ వివాహం చేసుకోబోతున్నారన్న విషయం విన్నాను. ఆ క్షణం నించి నేను నా స్నేహితుడిని జాగ్రత్తగా పరిశీలించాను. మీ అక్కను కూడా పరిశీలించాను. స్వతహాగా ఆమెలో స్పందన ఉన్నట్టు నాకనిపించలేదు. మీ అక్కను గురించి నా కంటే నీకు ఎక్కువ తెలుసు కనుక ఈ విషయంలో నేను అనుకున్నది నిజమో కాదో నీకే తెలియాలి. ఆమె సాత్వికంగా, మంచిగా కనిపించినప్పటికీ, ఆమె హృదయం మటుకు అంత తేలిగ్గా స్పందించేదిగా నాకనిపించలేదు.

"నెదర్‌ఫీల్డ్ నించి బింగ్లీ వెళ్ళాక నేను చేసిన పని చెబుతాను. బింగ్లీ చెల్లెలికి కూడా, అన్నగారు మీ అక్కను చేసుకోవటం ఇష్టంలేదు. మా ఇద్దరి ఆలోచనలు ఒకటిగానే ఉండటంతో, మేం కలిసి ఒక పథకం తయారుచేశాం. దాని ప్రకారం మేమందరం లండన్ వెళ్ళి బింగ్లీని కలుసుకున్నాం. అక్కడ నేను ఈ వివాహం జరిగేట్టయితే, ఏర్పడే కొన్ని ఇబ్బందులను గురించి అతనికి చెప్పాను. అయితే ఒక విషయంలో మటుకు నా చర్య నాకే సంతృప్తికరంగా లేదు. అదేమిటంటే, మీ అక్క పట్టణంలోనే ఉన్నట్టు బింగ్లీకి తెలియనివ్వలేదు. నాకు, అతని చెల్లెలికి మటుకే ఈ విషయం తెలుసు. బింగ్లీకి ఈ క్షణం వరకు కూడా తెలియదు. ఈ విషయంలో ఇంతకంటే నేను చెప్పగలిగిందేమీ లేదు. నేను మీ అక్క హృదయానికి బాధ కలిగించివుంటే, అది నాకు తెలియకుండా జరిగిన పని.

"పోతే రెండో ఆరోపణ: వికం విషయం, ముందు అతనికి మా కుటుంబంతో ఉన్న పూర్తి సంబంధం చెబుతాను. వికం తండ్రిగారు మా నాన్నగారి ఎస్టేటు వ్యవహారాలన్నీ చూస్తూ ఉండేవారు. ఆయనంటే మా నాన్న గారికి అప్యాయత మెండు. ఆ ప్రేమను, అనురాగాన్ని కొడుకు మీద కూడా సమానంగా చూపారు. సందేహం లేదు. స్వంత తండ్రిలాగ అతని ఖర్చులన్నీ భరించారు. అతన్ని మత సాంప్రదాయమైన విషయాల్లో దింపి గొప్పవాడిని చేద్దామనుకున్నారు. ఐదు ఏళ్ల క్రితం మా నాన్నగారు చనిపోయారు. ఆయన వీలునామాలో వికంకు సాధ్యమైనంత వరకు సహకారం చేయమని, అతన్ని జీవితంలో ఒక స్థానంలో కుదురుకుందుకు అవకాశం ఇమ్మని సిఫారసు చేశారు. ఇదిగాక వెయ్యి పౌన్లకు మరో పట్టా ఉంది. వికం తండ్రి కూడా మా నాన్నగారు పోయిన కొద్దిరోజులకే చనిపోయాడు. ఆ తరువాత వికం తనకు చర్చి సంబంధమైన పని చేసే

ఉద్దేశం లేనట్టు నాకు తెలియపరిచాడు. అందుచేత తనకు మా నాన్న గారు రాసిన వీలునామా ప్రకారం వచ్చే అన్ని హక్కులు వదులుకుని- కేవలం మూడు వేల పౌన్ల రొక్కం తీసుకుని వెళ్ళిపోతానన్నాడు. దానికి నేను అంగీకరించాను. దీనితో మా ఇద్దరి మధ్య సంబంధం తెగిపోయింది. పట్టణంలో అతను సోమరిపోతుగా, దేశదిమ్మరిగా కాలం గడిపాడు. ఇలా మూడేళ్లలో డబ్బులన్నీ ఖర్చుచేశాడు. కొంతకాలం తర్వాత మళ్ళీ చర్చి సర్వీస్ చేస్తాననీ, అందుచేత వెనకటి వీలునామా అమలుపరుద్దామనీ రాశాడు. ఈ కోరికను నేను కాదన్నాను. నన్నతను ఇతరుల దగ్గర తిడుతూ ఉన్నాడని విన్నాను. అతనికీ నాకు ప్రత్యక్ష సమావేశం జరగనే లేదు.

"మరో విషయం: ఒక సంవత్సరం క్రితం మా చెల్లెలు కాన్వెంట్ స్కూలు నించి ఇంటికి వచ్చేసింది. ఈ వికం పెరటిదారిన ఆమె మనస్సులో ప్రవేశించి, ఆమెకు తనంటే ప్రేమ ఏర్పడేట్టు తంటాలుపడ్డాడు. పదిహేను సంవత్సరాలైనా నిండని నా చెల్లెలు నేను వెళ్ళినప్పుడు ఈ సమాచారం దాపరికం లేకుండా చెప్పింది. అప్పుడు నా మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో నీకు వేరే చెప్పనవసరం లేదనుకుంటాను. ముప్పైవేల పౌన్ల ఖరీదు చేసే నా చెల్లెలు ఆస్తికి గాలం వేశాడన్నమాట వికం!

"మా ఇద్దరికీ సంబంధించినంతవరకూ జరిగింది ఇది. ఇప్పుడు నేను- వికం పట్ల ఎంత క్రూరంగా, కర్కోటకంగా ఉన్నానో నీవే ఆలోచించుకోవచ్చును.

అయితే అతను నీకు ఏ తప్పుడు అభిప్రాయాలు, దుర్భ్రమలు కలిగించాడో నాకు తెలీదు. నీకు ఇంతకు ముందు మా ఇద్దరితోనూ పరిచయం లేదు కనుక, మొట్టమొదటిగా విన్న వికం వాదమే సజావుగా తోచవచ్చును. ఇప్పుడు ఉన్న యదార్థమంతా ఈ ఉత్తరంలో రాశాను. వీటికి సాక్ష్యం కావాలంటే, ఫిట్ విలియం ఉన్నాడు. తరువాత నీ ఇష్టం. ఈ ఉత్తరం నీ చేతులలో పెడుతున్నాను. దేవుడు నిన్ను ఆశీర్వదించుగాక!

ఫిట్ విలియం డార్సీ."

36

డార్సీ ఉత్తరం చదువుకున్న మీదట ఆమె భావాలు వర్ణనాతీతం. తన అక్క విషయంలో అతని ఆలోచనలన్నీ పొరపాటే. వాటికి ఏమీ అర్థంపర్థంలేదు. పోగా, జరిగిపోయిన దానికి డార్సీ తన విచారం, పశ్చాత్తాపం వెలిబుచ్చటం లేదు. అతని ధోరణి పెడసరంగా లేకపోయినా, చిరాగ్గా ఉంది. అదంతా గర్వం, అహంభావం.

వికం వ్యవహారం ఆలోచిస్తే ఆమెకు చాలా ఆశ్చర్యం. చివరకు భయం కూడా కలిగాయి. ఆమెకు ఏమనుకోవటానికీ తోచలేదు. 'ఇదంతా అబద్ధం! నమ్మటానికి వీల్లేని

చెత్త!' అని కొట్టి పారేద్దాం అనుకుంది. అయితే ఉత్తరం అంతా చదివిన మీదట, తనకు తెలియని విషయాలు చాలా కనిపించాయి.

ఉత్తరాన్ని పదే పదే చదివింది. వికం తనకు చెప్పినదంతా గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ, ఈ వాక్యాలు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. ఆమె ఎటూ పూర్తిగా తేల్చుకోలేకపోయింది. వికం మిస్ కింగ్‌కి దగ్గరవడం గుర్తొచ్చింది.

ఇక డార్సీ జేన్ బింగ్లీని ప్రేమిస్తున్నట్టు ఎరుగనంటాడు. చార్లెట్ చెప్పిన విషయాలు గుర్తు వచ్చాయి. జేన్ మనోభావాలు పైకి ప్రస్ఫుటంగా కనిపించనిమాట నిజమే!

ఇంటికి రాగానే, రోసింగ్స్ నించి ఇద్దరు పెద్దమనుషులు వచ్చి వెళ్ళారని చెప్పారు. డార్సీ రెండు నిమిషాలు కూర్చుని సెలవు తీసుకోవటానికి వచ్చాడు. ఫిట్ విలియం ఆమె రాకకోసం ఎదురుచూస్తూ ఒక గంటవరకు చార్లెట్‌తో కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు. ఎలిజబెత్ ఇద్దరూ తనకు కనబడనందుకు సంతోషించింది. ఇప్పుడామె కల్నల్‌ను గురించి ఆలోచించటమే లేదు. ఆమె ఆలోచనా విషయం, ప్రస్తుతానికి ఆ ఉత్తరం ఒక్కటే.

37

మరునాడు ఉదయం డార్సీ, కల్నల్ ఇద్దరూ రోసింగ్స్ వదిలి వెళ్ళారు. కోలిన్స్ దారిలో ఎదురుచూస్తూ ఉండి వాళ్ళను సాగనంపాడు. తరువాత అతను రోసింగ్స్‌కు వెళ్ళి లేడీ కాథరైన్‌ను చూసి వచ్చాడు. ఆమెకు మనసంతా చికాకుగా ఉన్నదనీ, ఏమీ తోచటం లేదనీ, అందుచేత అందర్నీ ఆక్కడికి భోజనానికి రమ్మనీ కబురు తెచ్చాడు.

రోసింగ్స్ పార్టీలో మొదటి ప్రస్తావన వెళ్ళిపోయిన యువకులను గురించి జరిగింది. లేడీ కాథరైన్ "నాకు ఏమీ తోచడం లేదు. వీళ్ళు వెళ్ళిపోవడం నాకు తీరని లోటుగా కనిపిస్తోంది. వాళ్ళక్కూడా అంతే! కల్నల్ కంటే డార్సీయే ఈ సంవత్సరం ఎక్కువ విచార పడుతున్నాడు. అతనికి రోసింగ్స్‌తో సంబంధం అంతకంతకు పెరుగుతోంది" అంది.

భోజనాలైన తరువాత లిజ్జీతో ఆమె ఇలా అంది. "నీవేదో విచారంగా ఉన్నట్టున్నావు. అప్పుడే ఇంటికి వెళ్ళిపోదామనుకుంటున్నావాయేం? మరి కొన్నాళ్ళ పాటు ఉండి వస్తానని మీ అమ్మకు ఉత్తరం రాయి. మిసెస్ కోలిన్స్‌కు నీ జతతో బాగా కాలక్షేపం అవుతుంది?"

"మీ ప్రేమానురాగాలకు ధన్యవాదాలు! కానీ నేను వచ్చే శనివారం అక్కడ ఉండాలి!"

"ఏమైనా, రెండు నెలలైనా ఉంటావనుకున్నాను. చార్లెట్‌తో కూడా ఈ మాటే చెప్పాను, నీవు రాకముందు. మళ్ళీ ఇంతటితో రావటానికి పడదు కదా. మీ అమ్మగారికి ఉత్తరం రాస్తే మరో పదిహేను రోజుల వరకూ కాదనరేమో!"

"మా నాన్న ఒప్పుకోరు. వారం రోజుల క్రితమే, ఆయన వెంటనే రమ్మని రాశారు!"

"మీ అమ్మ ఒప్పుకుంటే, నాన్నగారి విషయం అంత ఆలోచించవలసిందేముందీ.

ఆడపిల్లల విషయం ఎప్పుడూ తల్లిదేగానీ, తండ్రికేం సంబంధం? నీవింకా ఇక్కడ ఉంటానంటే జూన్ మాసారంభంలో నాతోపాటు లండన్ తీసుకు వెడతాను, అక్కడొక వారం రోజుల పాటు ఉంటాను. వాతావరణం బాగుంటే, మీ ఇద్దర్ని కూడా తీసుకు వెడతాను. లేకపోతే నీ ఒక్కదాన్నే!"

"మీరు దయాస్వరూపిణులు. కానీ నేను ముందు అనుకున్న ప్రకారమే కానివ్వండి!"

చివరకు వాళ్ళు బయలుదేరబోయే ముందురోజు సాయంకాలం కూడా లేడీ కాథరైన్ ప్రయాణం సంగతులే అడుగుతోంది. ప్రయాణ సన్నాహాలు ఎలా చేసుకోవాలి అనే విషయంపై ప్రసంగించింది. మరు సంవత్సరం కూడా ఇలాగే హాన్స్‌ఫోర్ట్ రమ్మంది.

38

శనివారం ఉదయం కోలిన్స్ ఎలిజబెత్ ఫలహారాల గదిలోకి అందరికంటే కొన్ని నిమిషాలు ముందుగా వచ్చారు. ఈ అవకాశం తీసుకుని అతను వీడ్కోలు సందర్భంగా లిజ్జీతో లాంఛనప్రాయమైన సొద మాటలు చాలా మాట్లాడాడు. లేడీ కేథరిన్‌ను మరో వంద సార్లు పొగిడాడు. ఆమె దయనూ ఆమె ఆతిధ్యాన్నీ ఆమె మంచితనాన్నీ పొగిడాడు. ఆమెకి అతిధుల్ని పరిచయంచేసిన తమ మంచితనాన్నీ పొగుడుకున్నాడు. చివరిగా ఇలా అన్నాడు: "ఎలిజబెత్, నీకు కూడా వివాహం సమకూరి విశేషమైన సంతోషం కలగాలని కోరుతున్నాను. నాకు, చార్లెట్‌కు ఒకే మనస్సు, ఒకే ఆలోచన. మా ఇద్దరి మనస్తత్వం లోనూ చెప్పుకోదగిన పోలికలున్నాయి. మేమిద్దరం మా కోసమే పుట్టినట్టున్నాం."

ఎలిజబెత్ అతను వైవాహిక జీవితంలో సుఖపడటం అదృష్టమనీ, ఈ అదృష్టం అందరికీ రాదనీ అంది. పాపం, చార్లెట్! ఎటువంటి పరిస్థితులలో చిక్కుకుంది! అయితే, ఈ చిక్కుకోవటం- అన్నీ తెలిసి ఉండగానే, కళ్ళు తెరుచుకుని ఉండగానే జరిగింది.

చివరకు- బండి సిద్ధమై వచ్చింది. ట్రంకు పెట్టెలు తాళాలు వేసి దానిలో వేశారు. చివరిసారి ఆప్యాయంగా కౌగలించుకున్నాక స్నేహితురాళ్ళు విడిపోయారు. కోలిన్స్ వాళ్ళను బండివరకు అనుసరించాడు. ఆమె ఇంట్లో అందరికీ తన ధన్యవాదాలు, శుభాకాంక్షలు అప్పజెప్పమని చెబుతూ నడుస్తున్నాడు.

చివరకు బండి వేగంగా నడవసాగింది.

కొన్ని నిమిషాల నిశ్శబ్దం తరువాత మరియా "గుడ్ గాడ్! మనం వచ్చి ఒక రోజో, రెండు రోజులో అయినట్టుంది. అబ్బ! ఎన్ని సంగతులు జరిగాయి!" అంది.

"అబ్బో! ఎన్నో జరిగాయి" అంది లిజ్జీ నిట్టూరుస్తూ.

"తొమ్మిదిసార్లు రోసింగ్స్‌లో భోజనం చేశాం. రెండుసార్లు అదనంగా టీ తాగాం. ఎన్నో కొత్తలు, వింతలూ అక్కడ ఇంటిదగ్గర చెప్పవలసిన సంగతులు ఎన్నో ఉన్నాయి."

"నేను దాచుకోవలసినవి ఎన్నో ఉన్నాయి" అనుకుంది లిజ్జీ మనసులో.

తతిమ్మా ప్రయాణం ఎక్కువ మాటలు లేకుండానే జరిగింది. హాన్స్‌ఫోర్ట్ వదలిన నాలుగు గంటలకు వాళ్ళు గార్డినర్ ఇంటి ముందుకు చేరుకున్నారు. అక్కడ కొద్ది రోజులు గడపాలని ఆలోచన. జేన్ బాగానే ఉన్నట్టు కనిపించింది. డార్సీ ప్రతిపాదన గురించి అక్కకు చెప్పకుండా లిజ్జీ ఉండలేకపోయింది. ఈ విషయాన్ని దాచుకోవటం ఆమెకు సబబు అనిపించలేదు. అయితే ఇదంతా చెప్పటం మొదలుపెడితే బింగ్లీ గురించి ప్రసక్తి వస్తుందనీ, అప్పుడు తన అక్కకు బాధ కలిగించవలసి వస్తుందనీ భయపడింది.

39

మే నెల రెండో వారం. బెనెట్‌గారి అమ్మాయిలు ఓ హోటల్లో మాటాడుకుంటున్నారు.

లిడియా అంది: "పది పదిహేను రోజుల్లో ఆఫీసర్లంతా వెళ్ళిపోతున్నారు."

"అలాగా?" అంది ఎలిజబెత్.

"అవును బ్రైటాన్ దగ్గర విడుస్తున్నారు. ఈ వేసవిలో మనందరినీ అక్కడికి తీసుకు వెళ్ళమని నాన్నతో చెబుదామనుకుంటున్నాను. ఇందువల్ల డబ్బు ఖర్చుకాదు. అమ్మ కూడా ఒప్పుకుంటుంది! లేకపోతే, ఇక్కడ వేసవి ఎంత దుర్భరంగా ఉంటుందో, ఆలోచించండి."

లిడియా బల్ల దగ్గర కూర్చుంటూ 'ఇప్పుడు నీకో శుభవార్త. అదేమిటో తెలుసా? బ్రహ్మాండమైన వార్త! మనకందరికీ ఇష్టమైన వ్యక్తిని గురించిన వార్త!" అంది.

జేన్ లిజ్జీ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. వెయిటర్‌ను ఇంకేమీ పనిలేదని పంపివేశారు. లిడియా నవ్వుతూ ఇలా అంది. 'వెయిటర్ వినకుండా వాడిని పంపేశారు! వాడికి ఇవన్నీ వినటమే పననుకున్నారాయేం? ఇప్పుడు నేను చెబుతున్న దానికంటే అతిదారుణమైన, విషయాలు అతను ఎన్నో విని ఉంటాడు. పోనీలే, వీడు అందంగాలేడు. వెళ్ళిపోవటమే మంచిది. ఇక నేను చెప్పబోయే వార్త వికం గురించి, అతను మిస్‌కింగ్‌ను వివాహం చేసుకునే ప్రమాదం లేదు. వచ్చిన ప్రమాదమల్లా నీకే! ఆమె లివర్‌పూల్‌లో వాళ్ళ మామయ్య దగ్గరకు వెళ్ళింది. వికం సురక్షితంగానే ఉన్నాడు."

"మేరీ కింగ్ కూడా సురక్షితంగానే ఉంది." అంది ఎలిజబెత్.

"అతనంటే ఇష్టపడేట్టయితే, అలా వెళ్ళిపోయి ఆమె గొప్ప పొరపాటే చేసింది."

"నా ఉద్దేశం ఇద్దరి వైపు నుంచి కూడా గాఢమైన అనురాగం లేదనే!" అంది లిజ్జీ.

"అతని విషయం నేను చెప్పగలను. ఆమెను గడ్డిపరకగానైనా లక్ష్యపెట్టేవాడు కాదు."

ఎలిజబెత్ ఈ మాటలు విని చాలా బాధపడింది. ఈ పరిణామాలు ఆమెకు ఆశ్చర్యాన్ని కూడా కలిగిస్తున్నాయి. అందరూ ఫలహారం చేయటం అయింది. పెద్దవాళ్ళు బిల్లు చెల్లించారు. బగ్గీకి పురమాయించారు.

"మనమంతా ఎంత ఉల్లాసంగా గడిపాం! ఇక, మీరు మేం లేకుండా చూసిన వింతలు విశేషాలు వినిపించండి. మీకు ఎవరైనా మంచి మగవాళ్ళు కనిపించారా? ఏమైనా మాట్లాడుకున్నారా? మీ ఇద్దర్లో ఎవళ్ళో ఒకళ్ళన్నా కనీసం, ఇంటికి వచ్చేసరికి, మొగుణ్ణి సంపాయించుకు వస్తారనుకున్నాను. చూస్తూ ఉండు. జేన్ కొద్దిరోజుల్లోనే ముసలమ్మ అయిపోతుంది. ఆమెకప్పుడే ఇరవై మూడేళ్ళు. నాకే గనుక అంత వయసు వరకూ వివాహం అవకుండా ఉంటే, నేను సిగ్గుతో కుమిలిపోతాను. మొన్న ఫిలిప్స్ పిన్ని చెప్పింది ఎవళ్ళకు వాళ్ళే మొగుళ్ళను సంపాదించుకోవాలని..." ఇలా లిడియా చెబుతూ కూర్చుంది.

ఎలిజబెత్ అశ్రద్ధగా వింటోంది. అయినా ఆమెకు మధ్యలో వికం పేరు వినిపిస్తూనే ఉంది. ఇంటి దగ్గర వాళ్ళకు స్వాగతం బ్రహ్మాండంగా ఏర్పాటు చేయబడింది. మిసెస్ బెనెట్ ఆనందం వర్ణించతరంకాదు.

ఆ రోజు భోజనాల గది జనంతో కిటకిటలాడిపోయింది. దాదాపు లూకా ఇంటిలో వాళ్ళంతా మరియాతో కలిసి హన్స్‌ఫోర్ట్‌లో సమాచారాలు తెలుసుకోవటానికి వచ్చారు. మొత్తంమీద మిసెస్ బెనెట్‌కు చేతినిండా పని!

"ఓ! మేరీ. నీవు కూడా మాతోపాటు వచ్చి ఉండవలసింది. ఎంతో కులాసాగా హాయిగా జరిగిపోయింది." అంది మరియా.

మధ్యాహ్నం లిడియా తతిమ్మా అమ్మాయిలతో మెంటాస్‌కు నడిచి వెళ్ళటానికి ఆయత్తమైంది. ఎలిజబెత్ వద్దంది. బెనెట్‌గారి అమ్మాయిలు ఒక పూటయినా ఆఫీసర్ల వేట లేకుండా ఉండలేరని అందరూ అంటారంది. రెండో కారణం ఏమిటంటే, వికం కనిపిస్తాడేమోనని ఆమె భయం! సాధ్యమైనంతవరకు వికంను చూడకుండా ఉండటం మంచిది. పది పదిహేను రోజులు ఓపికపడితే వాళ్ళంతా ఎలాగూ వెళ్ళిపోతున్నారు.

ఇంటి దగ్గిర కొద్ది నిమిషాలు కూర్చునేసరికే, విడియా ఇందాక సత్రంలో సూచించిన బ్రైటన్ పథకాన్ని గురించి తల్లిదండ్రులు చర్చించుకోవటం వినిపించింది. తండ్రికి ఈ చర్య ఎంతమాత్రం ఇష్టంలేదని లిజ్జీ వెంటనే గ్రహించింది. అయితే ఆయన జవాబులు అస్పష్టంగా, వెటకారంగా ఉన్నాయి. తల్లి మధ్య మధ్య అనంగీకారాన్ని ఎదుర్కొంటున్నా, చివరకు తనకే విజయం చేకూరుతుందనే దృఢ నిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తోంది.

40

జేన్కు జరిగిన సంఘటనలు వివరించే కార్యక్రమాన్ని ఎంత త్వరగా ఆరంభిద్దామా అని ఎలిజబెత్‌కు ఆరాటంగా ఉంది. జేన్ ప్రమేయం ఉన్న అన్ని విషయాలు చెప్పేయాలి. ఆమెకు ఆశ్చర్యం కలుగుతుంది. మరునాడు ఉదయం ఎలిజబెత్ తనకు డార్సీకి జరిగిన ముఖ్య సంఘటనలను వివరించింది.

ఇదంతా విన్నమీదట, జేన్‌కు ఆశ్చర్యం కలగటానికి మారుగా, చెల్లెలి పట్ల జాలి, సానుభూతి కలిగాయి. ఎలిజబెత్ డార్సీని తిరస్కరించటంతో అతనికి ఎంత నిరాశ, నిస్పృహ కలిగిందోనని ఆమె ఆరాటపడసాగింది.

"అంత నిరాఘాటంగా జయం పొందుతానని అతననుకోవటం పొరపాటు. అయితే అతనికి ఎంత నిరాశ కలిగి ఉంటుందో ఆలోచించు."

"కావచ్చు" అంది ఎలిజబెత్. 'అతన్ని తలుచుకుంటే నాకూ విచారంగానే ఉంది. అతనికి మనమంటే ఉన్న ఇతర భావనలు కొన్ని నాకు కోపం తెప్పిస్తున్నాయి. అతన్ని తిరస్కరించినందుకు, నీవు నన్ను నిందించవు గదూ?'

"నిన్ను నిందిస్తానా? లేదు!"

"లేదు. నీకు తోచిన ముక్కలు నీవు చెప్పావు. అందులో తప్పేముంది?" అంది జేన్.

తరువాత లిజ్జీ అతని ఉత్తరాన్ని గురించి చెప్పింది. జార్జి వికంకు సంబంధించినంత వరకు ఉత్తరంలో భాగాలను అప్పజెప్పింది. జేన్ దిగ్భ్రాంతికి గురయింది. ఈ విషయంలో పొరపాటు ఎక్కడ జరిగి ఉంటుందా అని ఆమె ఆలోచించసాగింది.

ఎలిజబెత్ "ఇద్దరికీ రాజీ కుదర్చటానికి ప్రయత్నించటం కేవలం అనవసరం. దండగ కూడా! ఇద్దరిలో ఏ ఒక్కళ్ళనో తీసుకో. వాళ్ళతోనే తృప్తిపడు. నా మటుకు నేను, డార్సీ చెప్పిన కథనే నమ్మదలచుకున్నాను. నీ ఇష్టం, నీవు ఎలా చేసినా సరే!"

కొంతసేపటి వరకు జేన్ ఏమీ మాట్లాడలేకపోయింది.

"వికం ఇంత దుర్మార్గుడని నేను భావించలేకపోతున్నాను. సరే. పాపం, ఎలిజా! డార్సీ ఎంత నిరాశపడిపోయాడో గదా!" అంది జేన్.

"నిన్ను చూశాక నా విచారం, కోపం అన్నీ కరిగిపోయాయి." అంది లిజ్జీ.

తరువాత వాళ్ళు ఇద్దరూ డార్సీ వికంల స్వభావాలను గురించి చర్చించుకున్నారు. ఎలిజబెత్ తను ఆ ఉత్తరం చదివింది మొదలు ఇప్పటివరకూ తనలో కలిగిన భావపరిణామాలన్నీ చెప్పింది.

"మనం వికం స్వభావాన్ని గురించి మనకు తెలిసిన వాళ్ళతో నిజం చెప్పేద్దామా?"

"అటువంటి అవకాశం మనకు రాకపోవచ్చు. అయినా నీ ఉద్దేశం ఏమిటి?"

"మనం అలా చేయగూడదనుకుంటాను. డార్సీ నాకు తెలియటం కోసమే ఈ ఉత్తరంలో అతన్ని గురించి ఇంత వివరంగా రాశాడు గానీ ఇదంతా ప్రచారం కోసం కాదు. అయినా ఇక్కడి వాళ్ళందరికీ డార్సీ అంటే కోపం. వికం కూడా కొద్ది రోజుల్లో ఇక్కడినుంచి వెళ్ళిపోతాడు. తరువాత కొన్నాళ్ళకు ఈ వ్యవహారాలన్నీ ఎలాగూ బయటపడతాయి. అప్పుడు అందరి కంటే ముందుగా మనకు తెలిసినందుకు మనం గర్వపడవచ్చు. ఇప్పుడు దాన్ని గురించి నేను ఎవరికీ ఏమీ చెప్పను." అంది ఎలిజబెత్.

పదిహేను రోజులుగా ఎలిజబెత్‌కు హృదయభారం అనిపిస్తున్న ఈ రెండు విషయాలు అక్కకు చెప్పడంతో, ఆమెకిప్పుడు మనస్సు చాలా హాయిగా, కులాసాగా ఉన్నట్టుంది. అయితే ఆమె డార్సీ ఉత్తరంలోని మొదటి భాగాన్ని అక్కకు చెప్పలేకపోయింది. చెప్పి ఆమె మనసును కలతబెట్ట సాహసించలేకపోయింది.

ఇప్పుడు ఆమెకు జేన్ పరిస్థితిని పూర్తిగా పరిశీలించగల అవకాశం కలిగింది. జేన్ కులాసాగా లేదు. బింగ్లీ పట్ల అనురాగంతో కొట్టుమిట్టాడుతోంది.

లిజ్జీకి డార్సీ ఉత్తరం కంఠతా వచ్చేసింది. ఆమె ప్రతి వాక్యాన్ని పదేపదే చదివింది. అతని పట్ల తను ప్రవర్తించిన విధం సరికాదనే సంశయం ఆమెను పీడిస్తోంది.

ఒక రోజు ఎలిజబెత్‌తో వాళ్లమ్మ ఇలా అంది. జేన్ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి? ఇంతకూ జేన్ లండన్‌లో అతన్ని కలుసుకున్నట్టే లేదు. ఇక మీద ఆమె అతన్ని కలుసుకునేందుకు గానీ, వాళ్ళిద్దరికీ వివాహం అయ్యేందుకు గానీ అవకాశం లేదనుకుంటాను. అతను మళ్ళీ నెదర్‌ఫీల్డ్‌కు వస్తాడని ఎవరూ చెప్పటం లేదు. నేను అందరినీ కనుక్కున్నాను."

"అవును. అతను నెదర్‌ఫీల్డ్‌లో ఇంక కాలుమోపుతాడని నాకు కూడా నమ్మకం లేదు."

"నేనే జేన్ స్థితిలో ఉన్నట్టయితే అతన్ని అలా వదిలేసే దాన్ని కాదు. పోనీ... జేన్, ఇప్పుడు గుండె బద్దలై చనిపోతుందా అని అనుమానంగా ఉంది నాకు. అప్పుడు గానీ అతనికి తన పొరపాటు ఏమిటో తెలిసిరాదులాగా ఉంది!"

ఆమె మాటలు ఎలిజబెత్‌కు ఏమాత్రం నచ్చలేదు. అందుకనే జవాబు చెప్పకుండా కూర్చుండిపోయింది: తల్లి ఇలా కొనసాగించింది. అయితే కోలిన్స్ దంపతులు పరమానందంగా సుఖపడుతూ ఉన్నారన్నమాట. చార్లెట్ పొదుపరిగానే ఉంటుంది. సంపాదనలో సగం వరకు మిగల్చగలుగుతుందని అనుకుంటాను."

"అవును!"

"సంపాదనలో కొద్దిభాగమే ఖర్చు పెట్టుకుంటారు. ఎప్పుడూ డబ్బుకోసం ఇబ్బంది పడరు. మీ నాన్న పోయిన తరువాత లాంగ్‌బర్న్ ఆక్రమించుకోవటానికి వస్తారు."

"ఈ విషయాన్ని గురించి వాళ్ళు నాతో ఏమీ అనలేదు."

"అనరు! అంటేనే ఆశ్చర్యపడవలసిన విషయం! వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటారు."

41

వాళ్ళు ఇంటికి తిరిగివచ్చి వారం రోజులు దాటిపోయాయి. రెండోవారం ఆరంభమయింది. సైనికులు ఈ వారంలోనే ఈ ప్రాంతం వదలివెడతారు. అందుకని యువతులంతా హడావిడిగా ఉన్నారు. బెనెట్ గారి పెద్ద అమ్మాయిలు మటుకు

ఇంటిపట్టునే ఉండి తమలో తాము ఆలోచించుకుంటున్నారు. అప్పుడప్పుడూ కిట్టీ, లిడియాలు వాళ్ళతో ఎకసెక్కాలు ఆడుతున్నారు.

"ఇక మా గతియేమిటి? ఇప్పుడు మేమేం చేయాలి?" అనుకుంటున్నారు లిజ్జీ, జేన్‌లు.

"నీవు ఎలా నవ్వగలుగుతున్నావు లిజ్జీ?"

వారి తల్లి కూడా ఈ విచారంలో పాలుపంచుకుంటూ ఉంది. పాతిక సంవత్సరాల క్రితం తను కూడా అటువంటి పరిస్థితిలో ఉన్నప్పుడు ఏం చేసిందో గుర్తుకు తెచ్చుకుంటూ ఉంది. "కల్నల్ మిల్లర్ దళం వెళ్ళిపోయినప్పుడు రెండు రోజుల పాటు నిద్రాహారాలు మాని ఏడుస్తూ కూర్చున్నాను. నా గుండెలు మాడి మసి అవుతాయనుకున్నాను" అంది.

"ఇప్పుడు నా హృదయం బద్దలవుతుందేమో అనిపిస్తూంది" అంది లిడియా.

"బ్రైటస్ వెళ్ళగలిగితేనా!" అంది మిసెస్ బెనెట్.

"బ్రైటస్ వెళ్ళగలిగితే బాగానే ఉంటుంది. కానీ నాన్నకు ఇష్టం లేదుగా!"

"కొన్నాళ్ళు సముద్రం గాలి పీలిస్తే, సముద్ర స్నానం చేస్తే నా ఆరోగ్యం కుదుటపడుతుందేమో!"

"అది నాకు కూడా మంచిదని ఫిలిప్స్ పిన్ని చెప్పింది" అంది కిట్టీ.

లాంగ్‌బర్న్‌లో తరచూ వినవచ్చే దీనాలాపాలు ఇటువంటివి. ఎలిజబెత్ వీటికి దూరంగా ఉందామనుకుంది. కానీ సిగ్గులో తన ఆనందమంతా మరుగుపడుతోంది. తమ కుటుంబం గురించి డార్సీ అభ్యంతరాలు నిజమేననిపిస్తున్నాయి.

లిడియా విచారం కొద్దిసేపట్లోనే తొలగిపోయింది. కల్నల్ ఫోర్ట్సు భార్య ఆ అమ్మాయిని తమతో పాటు బ్రైటస్‌కు రమ్మని ఆహ్వానించింది. ఫోర్ట్సు భార్య కూడా చిన్నదే. ఇటీవలనే వివాహం అయింది. లిడియాకూ తనకూ స్వభావాలలో పోలికలు కనిపించాయి. మూడు నెలల తరువాత వాళ్ళు ఆత్మీయులైన స్నేహితురాళ్ళయ్యారు.

ఈ సందర్భంలో లిడియా హడావిడి, ఫోర్ట్సును మెచ్చుకునే తీరు, మిసెస్ బెనెట్ సంతోషం, కిట్టీ అసూయ ఇవన్నీ వర్ణించనలవికాదు. లిడియా సంతోషంతో గంతులు వేస్తోంది. కిట్టీ మారుమూల గదిలో కూర్చుని ఏడుస్తోంది. ఫోర్ట్సుగారి భార్య నన్ను పిలవక దాన్నెందుకు పిలవాలి? వాళ్ళిద్దరికీ మధ్య స్నేహం ఉంటేమటుకేం నన్ను పిలవడానికి? పైగా దానికంటే నాకే ఎక్కువ అధికారం ఉంది. నేను దానికంటే రెండేళ్ళు పెద్ద!"

ఎలిజబెత్ జేన్‌లు ఆమెను ఓదార్చటానికి ప్రయత్నించారు. కానీ లాభం లేకపోయింది. ఎలిజబెత్ ఈ సమాచారమంతా తండ్రికి చెప్పింది. తండ్రి తన అభిప్రాయం చెప్పాడు. "లిడియాకు ఎప్పుడో ఒకప్పుడు బజారున పడేంతవరకు నిద్రపట్టదు."

"లిడియా ఇలాంటి పని చేస్తుందని నీకు అనుమానంగా ఉన్నప్పుడు ఈ విషయంలో నీ నిశ్చయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పివేయరాదా నాన్నా!"

"లిడియా ఒట్టి లేకిపిల్లలా తయారవుతోంది! ఆమె వెళ్ళకపోతే, ఇక్కడ మనకు శాంతి ఉండదు. అందుకని లిడియాను బ్రైటన్ వెళ్ళనీ. కల్నల్ ఫోర్ట్స్ మంచివాడు. ఆమెకేమీ అపాయం రానీడు. అలా వెళ్ళి రావటం కూడా దానికో అనుభవం అవుతుంది!"

ఈ జవాబుతో ఎలిజబెత్ తృప్తిపడవలసి వచ్చింది. కానీ ఆమె స్వంత అభిప్రాయం మటుకు అలాగే ఉంది. ఊరికే తర్జనభర్జనలు చేసి కాలయాపన జరిపేతత్వం కాదు ఎలిజబెత్‌ది. తను చేయగలదంతా చేసి ఊరుకుంటుంది.

ఎలిజబెత్ తండ్రితో మాట్లాడి వచ్చిన వివరాలు మటుకు లిడియాకు, తల్లికి తెలిసినట్టయితే పెద్ద అంతర్యుద్ధం జరిగేదే! లిడియా ఊహాశక్తికి బ్రైటన్ వెళ్ళిరావటం అంటే స్వర్గసుఖాన్ని అనుభవించటం అన్నట్టుగా ఉంది. కనీసం ఆరుగురు ఆఫీసర్లనైనా తను ఆకట్టుకుంటాననుకుంది. ఆమె తల్లి ఆలోచన కూడా ఇంతే!

అందరూ జరిగినదంతా మరిచిపోతున్నారు. లిడియా వెళ్ళేరోజు దగ్గరవుతున్న కొద్దీ హడావిడి ఎక్కువవుతోంది. ఎలిజబెత్ ఇప్పుడు వికంను ఆఖరు పర్యాయం చూడవలసి ఉంది. రెజిమెంట్ మెరిటాన్ నుంచి వెళ్ళిపోయే రోజున వికం, తతిమ్మా ఆఫీసర్లతో పాటు లాంగ్‌బర్న్‌లో భోజనం చేశాడు. మాటల సందర్భంలో ఎలిజబెత్‌ను హాన్స్‌ఫోర్ట్‌లో ఎలా గడిచిందని అడిగాడు. ఆమె కల్నల్ ఫిట్ విలియం, డార్సీలు మూడు వారాలపాటు రోసింగ్స్‌లో గడిపి వెళ్ళారని కూడా చెప్పింది. ఫిట్ విలియం నీకు తెలుసా? అని కూడా అడిగింది. అతడు ఆశ్చర్యపడ్డట్టు చూశాడు. ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాడు. ఒక్క క్షణం ఏదో జ్ఞప్తికి తెచ్చుకున్నట్టు నటించి, చిరునవ్వు తెచ్చుకుని ఇదివరకు ఎప్పుడో చాలాకాలం కిందట ఆయనను చూశానని చెప్పాడు.

కొద్దిసేపయ్యాక నిర్లక్ష్యంగా అడిగాడు: "వాళ్ళు ఎన్నాళ్ళున్నారన్నావు, రోసింగ్స్‌లో?"

"దాదాపు మూడు వారాలపాటు!"

"నీవు తరచూ వాళ్ళను చూస్తూ ఉండేదానివా?"

"ఆ! ప్రతిరోజూ కలుసుకునే వాళ్ళం!"

"వాళ్ళిద్దరి స్వభావాలలోనూ ఏమీ పోలికలేదు!"

"అవును. అయితే డార్సీ స్నేహం మీద అభివృద్ధి పొందే మనిషి!"

"నిశ్చయంగా!" అతనిలా అడిగాడు: "ఎందులో అభివృద్ధి పొందాడు. మాటల్లోనా, చేతల్లోనా? ఇదివరకటికంటే మృదువుగా సరదాగా మాట్లాడుతున్నాడా?"

"మీ అభిప్రాయం సరికాదనుకుంటాను!"

ఆమె మాటలకు సంతోషించాలో, ఏడవాలో అర్థంకాకుండా విన్నాడు వికం.

"అభివృద్ధి పొందాడంటే, నా ఉద్దేశం అతనేమో మార్పు చెందాడని కాదు. అతన్ని అర్థం చేసుకోవటంలోనే నేను ముందుకు రాగలిగానని!" అంది ఆమె.

వికంలో ఆదుర్దా, గందరగోళం పెరగ సాగాయి. కొన్ని నిమిషాలపాటు నిశ్శబ్దంగా ఉన్నాడు. ఆమె వంక తిరిగి తరువాత ఇలా అన్నాడు:

"నాకు అతని గురించి ఉన్న అభిప్రాయం ఏమిటో తెలుసుగా నీకు! అక్కడ వాళ్ళ అత్త దగ్గర ఉన్నప్పుడు, ఆమె అంటే భయంచేత మర్యాదగా, మప్పితంగా చక్కగానే ఉంటాడు. ఇదంతా లేడీ కాథరైన్ కుమార్తెను వివాహం చేసుకోవటానికి ఎత్తు!"

ఎలిజబెత్ నవ్వకుండా ఉండ లేకపోయింది. ఎంతసేపూ వికం, తన సానుభూతిని ఆకట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాడని గ్రహించింది.

భోజనాలైన తరువాత, లిడియా మిసెస్ పోర్ట్సతో కలిసి మెరిటాన్ వెళ్ళింది. అక్కడి నించి తెల్లవారు జామునే బయలుదేరి బ్రైటన్ వెళ్ళిపోతారు. కుటుంబంలోంచి లిడియా వేరుగా వెళ్ళటం విచారకరంగా గాక హడావిడిగా, సరదాగా జరిగింది. కిట్టీ ఒక్కతే కన్నీరు కార్చింది. కానీ ఈ కన్నీటికి కారణం అసూయ, విసుగు, ఉడుకుమోతుతనం!

మిసెస్ బెనెట్ కూతుర్ని హృదయపూర్వకంగా ఆశీర్వదించింది.

42

ఎలిజబెత్ తన కుటుంబ పరిస్తితిని గురించి ఆలోచిస్తోంది. యవ్వనానికి అందానికి లోబడిపోయి ఆమె తండ్రి వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం అయిన తరువాత కానీ ఆయనకు తన భార్య లేకి మనస్తత్వం, బలహీనత తెలిసిరాలేదు. వాళ్ళ జీవితంలో గౌరవం, హుందాతనం, సంస్కారం, విశ్వాసం అనేవి శాశ్వతంగా తొలగిపోయాయి. గృహస్త జీవితంలో ఆనందాలు, సుఖాల గురించి ఆయన ఆలోచనలన్నీ తలకిందులు ఐనాయి. ఆయనకు పల్లె వాతావరణం, పుస్తకాలు అంటే మక్కువ.

భర్తగా ఆయన ఎంత సుఖపడుతున్నాడో ఎలిజబెత్‌కు తెలుసు. ఈ విషయం తలచుకుంటే ఆమెకు బాధ కలుగుతుంది.

వికం వెళ్ళిపోయిన తర్వాత ఆమె చాలా సంతోషించింది. ఇప్పుడు గ్రామంలో సైనికోద్యోగుల హడావిడి లేదు. అంతా ప్రశాంతంగా ఉంది. ఇంట్లో అక్క, తల్లి మనశ్శాంతిలేక కొట్టుమిట్టాడుతున్నారు. కిట్టీ ఇంకా ఏడుస్తూనే ఉంది కానీ ఒకటి రెండు రోజుల్లో మామూలుగా తయారవవచ్చు.

లిడియా తరచూ ఉత్తరాలు రాస్తూ ఉంటాననీ, వివరంగా అన్ని సంగతులు తెలియ పరుస్తూ ఉంటాననీ చెప్పింది. కానీ, ఉత్తరాలు అంత తొందరగా రావడంలేదు, వచ్చిన వాటిలోనైనా ఎక్కువ వివరాలు ఉండటం లేదు. అభిరుచిదాయకమైన విషయాలేమీ ఆమె అసలే రాయదు.

ఆమె వెళ్ళిన పదిహేను రోజులకో, మూడు వారాలకో, లాంగ్‌బర్న్‌లో ఆరోగ్యం

కులాసాతనం, హుషారు తిరిగి కనిపించసాగాయి. శీతాకాలంకోసం పట్టణానికి వెళ్ళిన వాళ్ళంతా తిరిగి ఇళ్ళకు చేరుకున్నారు. వేసవి కాలానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మిసెస్ బెనెట్ మామూలు గృహకృత్యాలలో మునిగి తేలుతోంది.

నెలనుంచీ ఎదురుచూస్తోన్న గార్డినర్ దంపతులు, వాళ్ళ నలుగురు పిల్లలు లాంగ్‌బర్న్ రానే వచ్చారు. ఎనిమిది, ఆరు సంవత్సరాల అమ్మాయిలు; తరువాత ఇద్దరు కుర్రవాళ్ళు, చిన్నపిల్లలిద్దరినీ జేన్ దగ్గరకు తీసి ముద్దులు ముచ్చట్లు చేస్తోంది. గార్డినర్లు ఒక రాత్రిపూటమటుకే లాంగ్‌బర్న్‌లో ఉండి, మర్నాడు ఉదయం ఎలిజబెత్‌ను కూడా తీసుకుని తమ ప్రయాణం కొనసాగించారు.

లాంబటన్ పట్టణంలో గార్డినర్ తన బాల్యం గడిపాడు. ఇంకా అక్కడ తన చిన్ననాటి మిత్రులు కొందరు ఇప్పటికీ ఉన్నారని విన్నాడు. అక్కడికి కూడా వెళ్ళి వాళ్ళను సందర్శించి వద్దామనుకున్నాడు. లాంబటన్‌కు పెంబర్లేకు దూరం అయిదు మైళ్ళ కంటే ఎక్కువ ఉండదు. లాంబటన్‌కు దారిని గురించి ఆలోచిస్తూ గార్డినర్ పెంబర్లే కూడా చూసి వద్దామని కోరిక వెలిబుచ్చాడు. ఆయన భార్య కూడా సమ్మతించింది. ఎలిజబెత్‌ను ఒప్పించటం కోసం ఆమె ఇలా అంది! "పెంబర్లే గురించి ఇదివరకే విని ఉన్నావు కదూ! వికం తన బాల్యమంతా దాదాపు అక్కడే గడిపాడుగా! ఆ స్థలాలన్నీ చూసి వద్దాం."

వికం లిజ్జీ మనసు నుంచి దూరమయ్యాడన్న సంగతి మిసెస్ గార్డినర్‌కి తెలియదు. ఎలిజబెత్‌కు ఆమె ప్రతిపాదన చిరాకనిపించింది. తనకు పెంబర్లేలో ఏం పని ఉంది? పెద్ద పెద్ద ఇళ్ళు, భవనాలు చూసి చూసి విసుగెత్తిపోయిందని చెప్పింది. అయితేనేం, మిసెస్ గార్డినర్ ఒక పట్టాన వదిలిపెట్టలేదు, చివరకు ఆమె పట్టుదలే నెగ్గింది. పెంబర్లే చూస్తూ ఉండగా, నిస్సంశయంగా డార్సీ ఎక్కడో ఒకచోట కనిపిస్తాడు. ఈ మాట తలచుకోవటానికే ఆమెకు దుస్సహంగా ఉంది. అటువంటి సాహసం చేయటం కంటే అత్తతో ఈ విషయం ముందే స్పష్టంగా చెప్పటం మంచిదేమో. అయితే ఇందుకు కూడా అభ్యంతరాలు ఉన్నాయి. రాత్రి, నిద్రపోవటానికి ముందు, పని మనిషిని పెంబర్లే సంగతులు ఏమిటని అడిగింది. ఆమె ద్వారా డార్సీ కుటుంబం ప్రస్తుతం ఇక్కడ లేరని తెలుసుకున్న మీదట ఆమె భయాలన్నీ మంచులా విడిపోయాయి. ఆమె మనస్సు ఇప్పుడు తేలికపడింది. మరునాడు ఉదయం పెంబర్లే వెళ్ళటాన్ని గురించి అత్త మళ్ళీ అడిగినప్పుడు, నిర్లక్ష్యంగా తను ఎక్కడికి రావటానికైనా సిద్ధమేనని చెప్పింది.

43

పెంబర్లే అడవులను చూస్తూ ఉంటే, ఎలిజబెత్‌కు మొదట గాభరా అనిపించింది. తీరా పొలిమేరదాటి ఊళ్ళో ప్రవేశిస్తుండగా ఆమెకు ఎక్కడలేని ఆనందం కలిగింది.

ఎలిజబెత్‌కు హాయిగా సంభాషణ ప్రారంభించాలని ఉంది. అంతా అద్భుతంగా, శోభాయమానంగా ఉంది. ఒక అరమైలు పైకి వెళ్ళారు. మైదానం గడిచిపోయింది. పెంబర్లే గృహం కనిపిస్తోంది. లోయకు ఆవలిపక్క ఉంది. పెద్ద రాతి భవనం. బాగా ఎత్తున, చుట్టూ సురక్షితంగా ఉన్న కొండలతో ఆ భవనం చూడటానికి ముచ్చటగా ఉంది. ముందుగా చక్కని సెలయేరు ప్రవహిస్తోంది. ఎలిజబెత్ ఈ దృశ్యాన్ని చూసి సంబరపడింది. ఇంత ప్రకృతి సౌభాగ్యాన్ని ఆమె ఇంతవరకు ఎక్కడా చూసి ఉండలేదు.

వాళ్ళు కొండ దిగి వంతెన దాటారు. గుమ్మం దగ్గరకు బగ్గీ నడిపించుకు వెళ్ళారు. ఆ ఇంటిని సమీపిస్తూ ఉండగా, యజమాని ఎక్కడ తారసపడతాడోనన్న ఎలిజబెత్ భయం మళ్ళీ ఆమెను ఆవహించింది. బహుశా నిన్న పనిమనిషి చెప్పిన సంగతి అబద్ధమేమో! ... వాళ్ళు బగ్గీ దిగి హాలులోకి నడిచి వెళ్ళారు.

కొంతసేపు ఎదురు చూడగా, ఇంటి గవర్నెస్ వచ్చింది. ఆమె బాగా ముసలిది. ఆమె వెంట వాళ్ళు భోజనాల గదిలోకి వెళ్ళారు. ఆ గది విశాలమైనది. అన్ని ఏర్పాట్లతో కూడినది! ఎలిజబెత్ దాన్ని ఒక మారు పరిశీలించి చూసి, కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది. ఇక్కడి నుంచి చూడటానికి చుట్టూ ఉన్న దృశ్యం ఎంతో మనోహరంగా ఉంది. ఈ దృశ్యం ఒక్కొక్క గదికి ఒక్కొక్క రకంగా మారుతోంది. ఒక్కొక్క భంగిమ వింత సోయగాన్ని ప్రభవిస్తోంది. భవనంలోని గదులు విశాలంగా ఉన్నాయి, వాటిలోని ఫర్నిచర్ స్వంతదారు సౌభాగ్యాన్ని చెప్పక చెపుతున్నది.

"ఈ ఇంటికి నేను యజమానురాలు కావలసిన దానిని. ఈ గదులలో నిత్యమూ నేను తిరుగాడవలసిన దానిని. ఎవరో కొత్త మనిషిలా వీటిని చూడటంకాక, అనుభవించవలసిన మనిషిని నేను! కానీ అలా జరగటానికి ఎంతమాత్రం వీలులేదు ఇలా ఆలోచించుకోసాగింది ఎలిజబెత్.

ఈ ఆలోచనలు కొంతవరకు ఆమెను విచారం నుంచి పశ్చాత్తాపం నుంచి కాపాడగలిగాయి! గవర్నెసుని నిజంగా యజమాని ఇంట్లో లేడా అని అడుగుదాం అనుకుంది, కానీ సాహసం చేయలేకపోయింది. ఏమైతేనేం, వాళ్ళ మావయ్యా ఈ ప్రశ్న వేయనే వేశాడు. జవాబు వచ్చే లోపల ఆమె భయంతో వణికిపోయింది.

"ఊళ్ళో లేరు. అయితే రేపు వస్తారనుకుంటున్నాం. ఆయనతో కూడా మిత్రబృందం పెద్దపెట్టున వస్తారు" తమ ప్రయాణం ఒక రోజు ఆలస్యం కాకపోవడం నిజంగా ఎంత అదృష్టం అనుకుంది ఎలిజబెత్.

అత్త ఒక చిత్రాన్ని చూపించింది. ఎలిజబెత్ దగ్గరగా వెళ్ళి చూసింది. ఆ అది వికం చిత్రం. 'ఎలా ఉంది' అని అడిగింది అత్త నవ్వుతూ. ఈ చిత్రం పూర్వం ఇక్కడే ఉండే ఓ యువకుడిదనీ, ఇప్పుడతను యుద్ధంలో చేరిపోయాడనీ గవర్నెస్ చెప్పింది.

మిసెస్ గార్డినర్, ఎలిజబెత్‌ని చూసి చిరునవ్వింది. ఎలిజబెత్ మాటాడలేదు.

మిసెస్ రేనాల్డ్- గవర్నెస్ పేరు ఇదే- మరోచిత్రం వంక చూపుతూ 'ఈ చిత్రం మా యజమానిది. ఈ రెండు కూడా దాదాపు ఒకే కాలంలో తయారుచేయబడినాయి. ఇప్పటికి సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం!' అంది.

మిసెస్ గార్డినర్ చిత్రం వంక చూస్తూ 'మీ యజమాని సర్వాంగ సుందరుడని విన్నాను. అయితే లిజ్జీ, మనం విన్నది ఈ చిత్రం చూసి నిజమా కాదా చెప్పు' అంది.

మిసెస్ రేనాల్డ్ "ఈమెకు డార్సీ తెలుసునా?" అని అడిగింది.

ఎలిజబెత్ తానే అందుకుని 'కొద్దిగా తెలుసు!" అంది.

"మరి- ఆయన సుందరాకారుడని అనుకోవడం లేదా?"

"అవును. చాలా అందగాడు."

"అంత అందగాడు మరిలేదనుకుంటాను. మేడమీద, ఇంతకంటే బ్రహ్మాండమైన చిత్రం ఉంది ఆయనది. ఈ గది, చనిపోయిన డార్సీ గారిది. ఆయన కాలం నుంచి ఈ చిత్రాలు ఇక్కడే ఉన్నాయి. ఆయనకు ఇవంటే ప్రాణం."

రెనాల్డ్ వాళ్ళకు ఎనిమిది సంవత్సరాల ప్రాయంలోని మిస్ డార్సీ చిత్రం చూపించింది.

"మిస్ డార్సీ కూడా అన్నగారికి మల్లేనే అందంగా ఉంటుందా?" అని అడిగాడు మిస్టర్ గార్డినర్.

"అవును! అంత అందగత్తె ఈ భూప్రపంచంలో మరి ఉండదు. ఆమె రోజంతా ఆడుతూ పాడుతూ ఉంటుంది. పక్క గదిలో ఆమెకోసం తెప్పించిన కొత్త వాద్యం ఉంది. దీన్ని ఆమెకోసం అన్నగారు తెప్పించారు. ఆమె కూడా రేపు వస్తుంది!"

"సంవత్సరంలో ఎక్కువకాలం, మీ యజమాని ఇక్కడే గడుపుతాడా?"

"లేదు. సగం రోజులు మటుకే ఇక్కడ ఉంటారు. మిస్ డార్సీమటుకు ఎప్పుడూ వేసవిలో ఇక్కడికి దిగుతుంది."

"మీ యజమానికి వివాహం అయితే, ఆపైన ఎక్కువ రోజులు ఇక్కడే ఉంటాడేమో!"

"అవును. కానీ ఆ సుముహూర్తం ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఆయనకు తగిన అమ్మాయి ఎప్పుడు దొరుకుతుందో మరి!" అంది రేనాల్డ్.

గార్డినర్ దంపతులు చిరునవ్వు నవ్వారు.

తరువాత రెనాల్డ్ డార్సీని గురించి పొగుడుతూ కొంతసేపు మాట్లాడింది. గార్డినర్ కలుగజేసుకుని "ఇటువంటి మంచి యజమాని ప్రాపున ఉండగలగటం నిజంగా మీ అదృష్టం. ఇటువంటి వాళ్ళు ఎందరో ఉండరు గదా!" అన్నాడు.

"అవునవును! ఈ ప్రపంచంలో ఎవరూ ఇంతమంచి వాళ్ళు, ఇంత నిగర్వులు దొరకరు."

ఎలిజబెత్ ఆమె వంక తేరిపారజూచింది. ఈమె డార్సీ గురించేనా నిగర్వుడని మాట్లాడుతున్నది అనుకుంది.

"ఆయన తండ్రి చాలా గొప్పవాడు" అన్నది మిసెస్ గార్డినర్.

"అవును. కొడుకు కూడా తండ్రివంటివాడే. ఆయనలాగే బీదల పట్ల దయాళువు."

ఎలిజబెత్ విన్నది. ఆశ్చర్యపడింది. సంశయపడింది. రేనాల్డ్ మరే విషయాన్ని గురించీ మాట్లాడలేదు. చిత్రాలను గురించి, గదుల వైశాల్యం గురించి, ఫర్నీచరు వెల గురించి ఊరికే చెప్పుకుపోతోంది. "ఆయన, ఈ రోజుల్లో ఉండే కుర్రకారు– స్వార్థం తప్ప ఇంకేం ఆలోచించలేని వాళ్ళ మోస్తరు కాదు. ఆయనను గురించి ప్రతి నౌకరు, పాలికాపు ఇదే అభిప్రాయం వెలిబుచ్చుతారు. కొందరు ఆయనకు గర్వం ఎక్కువ అంటారు. కానీ నాకు మాత్రం ఆయనలో గర్వమనేదే కనిపించదు. తతిమ్మా కుర్రకారులాగా పోచుకోలుగా తిరగడు గనుక, అందరూ అలా అనుకుంటారేమో!"

"ఆహా! యజమానిని గురించి ఎంత గొప్పగా చెప్పింది" అనుకుంది ఎలిజబెత్.

వాళ్ళు నడుస్తూ ఉండగా మిసెస్ గార్డినర్ నింపాదిగా ఇలా అంది: "అన్నీ మంచిగానే చెప్పింది గానీ దీనికీ వికం పట్ల అతని ప్రవర్తనకు లంగరందటం లేదు."

"బహుశా మనం గతంలో విన్నదంతా సరికాకపోవచ్చు."

మేడమీది గదులు చూడటానికి వెళ్ళారు. పెద్ద పెద్ద పడక గదులు. గొప్ప గొప్ప చిత్రాలు వేలాడదీసి ఉన్నాయి. వాటిలో కళ ఎలిజబెత్‌కు ఏమాత్రం తెలియదు.

ఇక్కడ కుటుంబ చిత్రాలు చాలా ఉన్నాయి. అయితే కొత్తగా చూసే వాళ్ళకు ఇందులో అంత అభిరుచి కనిపించదు. ఎలిజబెత్ ఎరిగిన ముఖాలు కనిపిస్తాయేమోనని చూసింది. చివరకు, చిరునవ్వు ఒలకబోస్తున్న మిస్టర్ డార్సీ చిత్రం కనిపించింది. ఈ చిత్రం ముందు ఎన్నో నిమిషాలు నిలబడి ఆలోచించింది. రేనాల్డ్ చెప్పటం, ఈ చిత్రం పెద్ద డార్సీ గారు బతికుండగా తీసినదని!

ఇల్లంతా చూడటం అయిన తర్వాత రేనాల్డ్ దగ్గర సెలవు తీసుకుని కిందికి వచ్చేశారు. తోటమాలి హాలు గుమ్మం దగ్గర తారసపడ్డాడు.

నదీ మార్గంగా ఉన్న పచ్చిక మీద ఇరవై అడుగులు వేశాక, ఎలిజబెత్ వెనక్కి తిరిగి చూసింది. ఆమె మేనమామ, మేనత్త కూడా ఆగారు. మావయ్య ఈ భవనం ఎప్పుడు కట్టారో చూస్తూ ఉండగా, దాని యజమానే ఆకస్మాత్తుగా రోడ్డు మీద వస్తూ కనిపించాడు.

ఇద్దరికీ దూరం ఇరవై గజాల కంటే ఎక్కువ ఉండదు. తప్పించుకోవటానికి కూడా వీలవనంత ఆకస్మికంగా తలవని తలంపుగా జరిగింది ఈ సంఘటన. వాళ్ళ కళ్ళు కలుసుకున్నాయి. ఇద్దరి చెంపలు ఎర్రబారాయి. అతను నిర్ఘాంతపోయి నిమిషం పాటు ఉన్నచోటే నిలబడిపోయాడు. తరువాత కోలుకుని అందరి మధ్యకు వచ్చి గౌరవ

పురస్సరంగా ఎలిజబెత్‌తో మాట్లాడాడు. ఆమె పక్కకు తప్పుకుందుకు ప్రయత్నించి, వీలుకాక చివరకు అలాగే నిలుచుని అతనితో మాట్లాడింది. గార్డినర్ దంపతులు ఇతనే డార్సీ అని అనుమానించి, నిర్ధారణ చేసుకున్నారు. అతను ఎలిజబెత్‌తో మాట్లాడుతూ ఉండగా ఒక పక్కకు ఒదిగి నిలుచున్నాడు. ఆశ్చర్యం, కంగారు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖం ఎత్తి డార్సీ వంక సూటిగా చూడలేకపోతోంది. అతనడిగే ప్రశ్నలకు ఏం సమాధానాలు చెప్పాలో తోచటం లేదు. లోగడ తను కలుసుకున్న దానికి, ఇప్పటి అతని వైఖరికి ఎంతో వ్యత్యాసం ఉంది. ఆమె లాంగ్‌బర్న్ ఎప్పుడు వదిలిందీ అడిగాడు. డెర్బీషైర్‌లో ఎన్నాళ్ళు ఉండేదీ అడిగాడు.

మాట్లాడటం అయిన తర్వాత, కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా నిలుచున్నాడు. ఏదో గుర్తు తెచ్చుకున్నట్టు అభినయించి, సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక గార్డినర్ దంపతులు తిరిగి ఆమె దగ్గరకు వచ్చారు. అతని ఆకారాన్ని పొగుడుతూ మాట్లాడారు. కానీ ఎలిజబెత్‌కు ఒక్క మాట కూడా వినబడటం లేదు. ఆమెను సిగ్గు, అలసట ముంచెత్తుతున్నాయి. ఆమె అక్కడికి రావటం ఎంతో దురదృష్టం అనుకొంది. ప్రపంచంలో ఇంతకంటే అస్తవ్యస్తపు పని మరొకటి ఉండదు. ఓ! తను ఎందుకు వచ్చిందసలు? అతను మటుకు అనుకున్న దానికంటే ఒక రోజు ముందుగా ఎందుకు రావాలి? తాము పది నిమిషాలు ముందుగా వెళ్ళిపోయినట్టయితే, అతనికంట పడకుండా ఉండేవాళ్ళు. అతనప్పుడే గుఱ్ఱపు బగ్గీ దిగి వస్తున్నాడు. ఆమె ఈ కలుసుకోవటాన్ని గురించి చాలా పరితాపపడింది. బాగా మారిపోయిన అతని ప్రవర్తనకు అర్థం ఏమిటి? అతను ఆమెతో మాట్లాడటమే ఆశ్చర్యం! అతను ఎప్పుడూ ఇంత సామాన్యంగా కనిపించలేదు. ఆమెకు అంతకుముందు తెలిసిన డార్సీకీ ఈ డార్సీకీ ఎక్కడా పొంతన లేదు.

వాళ్ళు ఈసరికి నది పక్కగా నడుస్తున్నారు. అడుగు ముందుకు వేసినకొద్దీ పల్లానికి వెడుతున్నారు. ఎలిజబెత్ పెంబర్లే గృహాన్ని గురించి ఆలోచిస్తుంది. ఈ క్షణంలో అతనేమని అనుకుంటున్నాడో! తనను గురించి అతనేమనుకుంటున్నాడో తెలుసుకోవాలని ఉంది. తనను చూడటం వల్ల అతనికి బాధ కలిగిందా లేక సంతోషం కలిగిందా-అర్థంకాదు. ఎలిజబెత్ పరధ్యానంగా ఉన్నదని గార్డినర్స్ అనసాగారు. ఈ ఆలోచన నుంచి విడివడి యథాప్రకారంగా తయారవాలని ఆమె ప్రయత్నించింది. వాళ్ళు అనేక విషయాలను గురించి మాట్లాడుకుంటూ నడిచి వెడుతున్నారు. వాళ్ళు తోటలో నడుస్తూ ఉండగా డార్సీ మళ్ళీ వచ్చాడు. ఎలిజబెత్ ఈమారు మరీ ఆశ్చర్యపోయింది. అయినా ఈసారి దృఢంగా, ప్రశాంతంగా మాట్లాడాలనుకుంది. కొన్ని క్షణాల వరకు అతను వేరేదారిన వెడతాడని భ్రమించింది. కానీ అతను వాళ్ళ దగ్గరకే వచ్చాడు.

మిసెస్ గార్డినర్ కొంచెం వెనగ్గా నిలబడింది. డార్సీ ఎలిజబెత్‌తో తన బంధువులను పరిచయం చేయమన్నాడు. అతనీమాదిరిగా అడుగుతాడని ఆమె అనుకోలేదు. తనలో తాను నవ్వుకుంది. అంత అహం ఉన్నవాడు తన బంధువులను ఎందుకు పరిచయం చేసుకో చూస్తున్నాడో తెలియదు.

పరిచయం చేసింది. తనకు వారికీ బంధుత్వం తెలిపింది. అతని ముఖ కవళికలు ఎలా మారాయో తెలుసుకుందామని ఒకసారి అతని ముఖం వంక చూసింది. డార్సీ గార్డినర్‌తో సంభాషణ ప్రారంభించాడు. సంభాషణ చేపలు పట్టటం మీదికి దొర్లింది. డార్సీ ఎంతో మర్యాదగా మాట్లాడుతున్నాడు.

ఇద్దరు ఆడవాళ్ళు చేతులు చేతులు కలుపుకుని ముందు నడుస్తున్నారు. వెనగ్గా మగ వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. ఇలా కొంతదూరం నడిచాక మిసెస్ గార్డినర్ ఎలిజబెత్ చేయి వదిలి భర్త చేయి పుచ్చుకుంది. డార్సీ ఎలిజబెత్ సరసకు చేరాడు.

మిసెస్ గార్డినర్ మాటల సందర్భంలో డార్సీ మరునాడు కానీ రాడని తెలిసినట్టు చెప్పింది. డార్సీ ఇందుకు జవాబు చెబుతూ, బింగ్లీ అతని చెల్లెళ్ళు రేపు ఇక్కడికి రాబోతున్నారని చెప్పాడు. "ఈ పార్టీలో మరోవ్యక్తి కూడా ఉంది. ఆమె మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటోంది కూడా! మీరు లాంటన్‌లో ఉండగా నా చెల్లెల్ని మీకు పరిచయం చేయనా!" అనడిగాడు.

ఈ అరగంట ఆమెకు ఎంతో ఆశ్చర్యం అనిపించింది.

కొంతదూరం నడిచిన మీదట ఎలిజబెత్ డార్సీలకు దాదాపు పావు మైలు వెనగ్గా ఉన్నారు గార్డినర్ దంపతులు.

డార్సీ "ఇప్పటికీ బాగా అలిసిపోయి ఉంటావు. ఇంట్లోకి వెళ్ళి విశ్రాంతి తీసుకుందువు గానీ పద!" అన్నాడు. కానీ ఆమె తనకేమీ అలసటగా లేదంది. ఇద్దరూ పచ్చిక మీదే నిలబడ్డారు. ఇటువంటి సమయంలో ఎంతో మాట్లాడుకోవలసింది ఉంటుంది. నిశ్శబ్దం భయంకరమనిపిస్తుంది. ఆమె మాట్లాడదామనుకుంది. కానీ సాహసం చేయలేకపోతోంది. గార్డినర్లు చేరువకు వచ్చాక డార్సీ మళ్ళీ, ఇంటిలోనికి వెడదాం అన్నాడు. కానీ వారు వద్దని వారించారు. డార్సీ వాళ్ళందరినీ బగ్గీ ఎక్కించి ఇంటివైపు నడిచాడు. అతను భారంగా ఇంటిలోనికి వెళ్ళటం ఎలిజబెత్ గమనించింది.

అతను వెళ్ళిపోయిన తరువాత, అతన్ని గురించి మాట్లాడుకోనారంభించారు. "అనుకున్న దానికన్నా ఎంతో గొప్పవాడు! ఏం మర్యాద! ఏం పెద్దమనిషి తరహా! ఆహాహా" అన్నాడు గార్డినర్.

"అతనిలో ఎంతో హుందాతనం ఉంది. ఇందాక రేనాల్డ్ చెప్పిందంతా నిజం! ఇతనిలో గర్వమనేది మచ్చుకైనా లేదు" అంది మిసెస్ గార్డినర్.

"అతను మనతో ఎంత గౌరవంగా మాట్లాడాడు! నిజానికి అతను మనను కన్నెత్తి చూడవలసిన అవసరం ఏమిటి? అతనితో ఎలిజబెత్ పరిచయం బ్రహ్మాండంగా ఉంది!"

"అవును. లిజ్జా. ఇతను వికం అంత అందగాడు కాదేమో గానీ, ఇతన్ని గురించి మంచిగా ఎందుకు చెప్పలేకపోయావు?" అనడిగింది మిసెస్ గార్డినర్.

ఎలిజబెత్ క్షమాపణలు చెప్పుకుంది. ఇవాళ కనిపించినంత ఆనందంగా హుషారుగా అతను ఇదివరకెన్నడూ అగుపడలేదంది.

"ఇతన్ని చూసిన మీదట, వికం చెప్పిన కథంతా నిజమని నాకు తోచటం లేదు. ఇంత మంచివాడు అటువంటి నీచపు పని ఎందుకు చేస్తాడు? పైగా అతను ఎంతో ఉదారుడుగా కనిపిస్తున్నాడు."

ఎలిజబెత్ ఏమీ మాట్లాడలేదు. తనలో తాను ఆలోచించుకుంటూంది. ఇంతకంటే ఆమెకు చేయగలదేమీ కనిపించలేదు. అతని చెల్లెలితో కూడా పరిచయం ఏర్పడవచ్చు!

44

ఎలిజబెత్, డార్సీ తన చెల్లెలిని పెంబర్లే వచ్చిన మరునాడే లాంటన్ తీసుకు వస్తాడనుకొంది. అందుకనే ఆ రోజు ఉదయం, మజిలీ చేసిన సత్రాన్ని ఒదిలి మరెక్కడికీ పోరాదనుకొంది. కానీ, ఆమె ఆలోచన తప్పయింది. తాము లాంటన్ వచ్చిన ఉదయమే వాళ్ళిద్దరూ- అన్నా చెల్లెళ్లిద్దరూ - వచ్చారు. ఆ ఉదయాన్నే రోడ్డు మీద వస్తున్న బగ్గీలో డార్సీ, అతని పక్క యువతి కనిపించారు. ఎలిజబెత్ ఆ దృశ్యాన్ని చూసి ఎంతో ఆనందించింది. గార్డినర్ దంపతులు కూడా ఆశ్చర్యపోయారు. అతనింత ప్రేమగా ఇక్కడికి రావటం ఎలిజబెత్ కోసమేనని వారికి అనిపించింది. ఈ ఆలోచన వాళ్ళ బుర్రలో మెదులుతూ ఉండగా ఎలిజబెత్ బుర్రలో గందరగోళాలు నాట్యం చేస్తున్నాయి.

ఆమె కిటికీ దగ్గర్నుంచి కదిలింది. బయటకు కనబడకుండా- గదిలో పచార్లు చేస్తూ గుండె ధైర్యం తెచ్చుకుంటూంది.

చివరకు డార్సీ, అతని చెల్లెలు లోనికి వచ్చారు. పరిచయం చేయటం అయింది. జార్జియానా (మిస్ డార్సీ) తన కంటే ఏమీ అందగత్తె కాకపోవటం గమనించి నివ్వెరపోయింది. లాంటన్‌లో అందరూ చెప్పటం, మిస్ డార్సీకి కూడా గర్వం ఎక్కువని! కాని ఎలిజబెత్‌కి ఆమెకు సిగ్గు ఎక్కువ అనిపించింది. ఆమె నుంచి జవాబు రాబట్టడం ఎంతో కష్టంగా ఉంది.

మిస్ డార్సీ పొడుగరి. ఎలిజబెత్ కన్నా పొడుగు. ఆమె డార్సీ కన్నా అందగత్తె కాదు. ఆమె ముఖంలో సంతోషం తాండవిస్తూ ఉంటుంది. ఆమెను గురించి ఊహించిన దాని కంటే ఆమె రూపం, అలవాట్లు ఎంతో హాయిగా ఉండటంతో ఎలిజబెత్ సంబరపడింది.

బింగ్లీ కూడా రాబోతున్నాడని డార్సీ చెప్పాడు. ఇంతలోనే అతని అడుగుల సవ్వడి వినిపించింది. ఒక క్షణంలో అతను గదిలోకి రానేవచ్చాడు. ఎలిజబెత్‌కు అతనంటే ఉన్న కోపమంతా కరిగిపోయింది. బెనెట్‌ల కుటుంబాన్ని గురించి వారి క్షేమ సమాచారాల గురించి బింగ్లీ సాదరంగా అడిగి తెలుసుకున్నాడు. అతను కూడా పూర్వం కంటే ఎక్కువ హుషారుగా, హాయిగా ఉన్నాడు. గార్డినర్ దంపతులు ఇతన్ని కలుసుకోటానికి ఎంతో సంతోషించామన్నారు. డార్సీ ఎలిజబెత్‌లను ఒక కంట కనిపెడుతున్నారు. ఎలిజబెత్ తనను తాను సంభాళించుకొంది గానీ డార్సీకి అది చేతకావటం లేదు.

ఎలిజబెత్‌కు బోలెడంత పని అగుపిస్తోంది. వీళ్ళందరి మనోభావాలను తెలుసుకోవాలి తన భావాలను గుదిగుచ్చుకోవాలి. పరిస్థితులకు అతుక్కుపోయి ప్రవర్తించాలి. ఇది చేతనవుతుందో లేదో అనుమానంగా ఉంది. బింగ్లీ సిద్ధంగానే ఉన్నాడు. జార్జియానా కుతూహలంగా ఉంది. డార్సీ కృతనిశ్చయుడై ఉన్నాడు. అందరూ సంతోషానికి దాపునే ఉన్నారు. అందుచేత ఎలిజబెత్ తాను గెలుపొందుతాననే అనుకుంది.

బింగ్లీని చూడగానే ఆమెకు అక్క జేన్ గుర్తుకు వచ్చింది. ఈ విషయం ఆమె వింటే ఎంత సంబరపడుతుంది! ఇప్పుడాతనికి, జేన్ స్థానంలో మిస్ డార్సీ నిలబడి ఉంది. వాళ్ళిద్దరూ ప్రత్యేకించి మాట్లాడుతున్నది, పరస్పర హావభావాలు ప్రకటించుకుంటున్నది ఏమీ లేదు. ఈ విషయం ఎలిజబెత్ తొందరగానే నిర్ధారించుకోగలిగింది.

అందరూ తమ తమ ధోరణులలో మునిగి ఉండగా చూసి బింగ్లీ నింపాదిగా లిజ్జీతో ఇలా అన్నాడు: "మిమ్మల్నందరినీ చూసి చాలా కాలం అయింది. ఎనిమిది నెలలు! నవంబరు ఇరవై ఆరో తేదీ తరువాత నెదర్‌ఫీల్డ్‌లో అందరం బాల్‌డ్యాన్స్‌లు చేసినతరువాత తిరిగి కలుసుకోలేదు!"

ఎలిజబెత్ అతని జ్ఞాపకానికి సంతోషించింది. తరువాత అతను ఆమె అక్క చెల్లెళ్ళందరూ లాంగ్‌బర్న్‌లోనే ఉన్నారా అని అడిగాడు. అతనడిగే ప్రశ్నలలో ఏమంత చెప్పుకోదగ్గ అర్థంలేదుగానీ వాటి ధోరణిలో మటుకు గొప్ప భావం ఉన్నది.

డార్సీ కూడా అందరితో కలుపుగోలుగా మాట్లాడుతున్నాడు. ఎలిజబెత్ మధ్య మధ్య అతన్ని గమనిస్తోంది. వీళ్ళంతా అరగంటవరకు ఇక్కడే గడిపారు. తరువాత వెళ్ళిపోతాం అంటూ లేచారు. డార్సీ అతని చెల్లెలు ఇద్దరూ కలిసి, గార్డినర్లను వారు ఈ ప్రాంతం వదిలి వెళ్ళేలోపుగా ఒకమారు పెంబర్లే వచ్చి విందారగించి వెళ్ళవలసిందిగా కోరారు. మిసెస్ గార్డినర్ ఈ ఆహ్వానం ముఖ్యంగా ఎలిజాను ఉద్దేశించినదే అన్న అభిప్రాయంతో ఆమె వంక చూసింది. అయితే ఎలిజబెత్ ముఖం పక్కకు తిప్పుకుంది, మిసెస్ గార్డినర్ భర్తకు కూడా ఈ సమావేశం ఇష్టమే కనుక అలాగే వస్తామని చెప్పింది. రేపుకాక ఎల్లుండి ఈ విందుకు ముహూర్తం పెట్టారు.

తిరిగి ఒక రోజులోనే ఎలిజబెత్‌ను చూసే భాగ్యం కలుగుతున్నందుకు బింగ్లీ సంతోషం వ్యక్తపరిచాడు. అతనింకా ఆమెతో చాలా మాట్లాడాలని హెర్ట్‌ఫోర్డ్‌షైరు కబుర్లు చెప్పించుకు వినాలని అన్నాడు. ఎలిజబెత్ ఇదంతా తన అక్కను గురించి వివరాలు వినాలనే కుతూహలమేనని నిర్ధారణ చేసుకుంది.

అయితే ఆమె గార్డినర్ దంపతుల ప్రశ్నలకు భయపడవలసిన అవసరం లేదు. డార్సీతో తనకు అంత పరిచయం ఉన్నట్టుగా, వాళ్ళు ఇంతకు ముందు ఎరగరు. అదీగాక అతనామెను ప్రేమిస్తూ ఉన్నాడని వాళ్ళకు నిర్ధారణ కూడా అయింది. వాళ్ళకు ఈ విషయమై ఆలోచించుకోవలసింది తెలుసుకోవలసింది బోలెడంత ఉంది!

డార్సీకి సంబంధించినంతవరకు ఏమీ పొరపాటులేదు. అతని మర్యాద, గొప్పతనం, అన్నీ వాళ్ళకు సజావుగా సందర్భశుద్ధిగా కనిపించాయి. మొత్తంమీద అతను ఎంతో మంచివాడనీ, అందరిపట్ల దయగా ఉంటాడనీ నిశ్చయానికి వచ్చారు.

ఈ సాయంత్రం, ఎలిజబెత్ ఆలోచనలన్నీ ఇదివరకెన్నడూ లేనంతగా పెంబర్లే మీదికి మళ్ళాయి. రాత్రి పూట కూడా వాళ్ళను గురించి ఆలోచిస్తూనే నిద్రపోకుండా కూర్చుంది. ఆమెకు డార్సీ అంటే అసహ్యం ఇదివరకే మటుమాయం అయింది. అతనంటే ఇప్పుడు కొత్తగా గౌరవం ఏర్పడుతున్నది కూడా! ఆమె మనసులో అతనిపట్ల కృతజ్ఞత ఏర్పడింది. కేవలం ఒకసారి ఆమెను ప్రేమించినందుకే కాదు, ఇంకా తననే ప్రేమిస్తూ ఉన్నందుకు, ఇంకా ప్రేమిస్తూ ఉండటానికి సిద్ధపడినందుకు! తను తిరస్కరించి నందుకు అతనికేమీ కోపం లేదు. ఆగర్భశత్రువుగా భావించి, తనను చూడకుండా వైదొలగిపోవలసినవాడు, ఇలా పరిచయాన్ని పెంచుకోవటానికి ప్రయత్నించటం, తనను తన వారిని ఎంతో గౌరవంగా పలకరించటం, తన చెల్లెలిని తీసుకు వచ్చి పరిచయం చేయటం... అహంభావంతో మునిగిపోయిన మనిషిలో ఇంత మార్పు రావటం, ఆమెకు ఆశ్చర్యాన్ని కాక కృతజ్ఞత కలిగిస్తూంది. దీనికంతటికీ మూలకారణం ప్రేమ. అవధులు తెలియని ప్రేమ. అనిర్వచనీయమైన ప్రేమానురాగాలు!

మిస్ డార్సీ అంత ఆప్యాయంగా వచ్చి తమను సందర్శించి వెళ్ళటాన్ని గురించి ఆ సాయంత్రం లిజ్జీ, మిసెస్ గార్డినర్ మాట్లాడుకున్నారు. మరునాడు ఉదయం తాము పెంబర్లే వెళ్ళి ఆమెను ఆప్యాయంగా ఆదరించాలని నిశ్చయించుకున్నారు.

45

మిస్ బింగ్లీ తన పట్ల కనపరుస్తూ వచ్చిన అయిష్టతకు అంతటికీ అసూయే కారణం అని నిర్ధారణకు వచ్చింది ఎలిజబెత్. పెంబర్లేలో ఆమె ఎలా ప్రవర్తిస్తుందో!

ఆ ఇంటికి చేరుకోగానే నౌకరు వారినందరినీ లోనికి తీసుకు వెళ్ళాడు. హాలులో

కిటికీలు గోడంత పొడుగునా ఉన్నాయి. బయటి దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

గదిలో మిస్ డార్సీ కూర్చుని ఉంది. ఆమెతో పాటు మిసెస్ హార్స్ట్, మిస్ బింగ్లీ ఉన్నారు. జార్జియానా వారిని సాదరంగా లోనికి ఆహ్వానించింది. సిగ్గుచేత ఆమె ధారాళంగా మాట్లాడలేకపోయింది. మిసెస్ హార్స్ట్, మిస్ బింగ్లీలు వారిని లాంఛనప్రాయంగా పలకరించారు. అందరూ కూర్చున్నాక కొంతసేపు నిశ్శబ్దం పరిపాలించింది.

ఎలిజబెత్, మిస్ బింగ్లీ తనను గమనిస్తున్నట్టు గ్రహించింది. మిస్ డార్సీతో ఏం మాట్లాడాలన్నా ముందు ఈమె దృష్టిని ఆకర్షించవలసి వస్తోంది. ఆమె ఆలోచనలే ఆమెకు సరిపోతున్నాయి. ఎక్కువగా మాట్లాడవలసింది కూడా కనిపించటం లేదు. ఏ క్షణంలోనైనా ఎవరో ఒకళ్ళు మగవాళ్ళు, గదిలో ప్రవేశించవచ్చునని ఎదురు చూస్తూంది. ఇంటి యజమాని కూడా వారితో పాటు లోనికి వస్తాడేమోనని ఆమె ఆశిస్తోంది, భయపడుతోంది కూడా. ఇది ఆశయో లేక భయమో ఆమెకు నిర్ధారణగా తెలిసి రావటం లేదు. మిస్ బింగ్లీ కంఠస్వరం వినకుండా ఒక పావుగంటసేపు కూర్చున్నాక, ఆమే ఇంటి వారి ఆరోగ్యాన్ని గురించి అడిగింది. ఎలిజబెత్ సమానమైన నిర్లక్ష్యంతో ధైర్యంగా జవాబు చెప్పింది. ఆపైన ఇంకో ముక్కకూడా అనలేదు.

ఇంతలో నౌకర్లు ఫలహారాల పళ్ళేలతో ప్రవేశించారు. అందరి ముందు ఆ పళ్ళాలు ఉంచి వెళ్ళారు. ఇప్పుడిక మాట్లాడే అవసరం లేదు. ఫలహారం చేయవచ్చు.

ఇంతలో డార్సీ లోనికి రానేవచ్చాడు. ఎలిజబెత్ జాగ్రత్తగా ప్రవర్తించాలని ప్రయత్నించింది. అయితే డార్సీ లోనికి వచ్చిన దగ్గర నుంచి అందరి దృష్టీ వాళ్ళ ఇద్దర్నీ గమనించటానికే ఆయత్తమయింది. డార్సీ ఎక్కువగా తన చెల్లెలికి ఎలిజబెత్‌కూ పరిచయం పెంచటానికి ప్రయత్నించాడు. మిస్ బింగ్లీకి ఈ చర్య అసూయ కలిగించింది. ఆమెకు కోపం కూడా వచ్చింది. తన వికారాన్ని బయటపెడుతూ ఆమె ఇలా అంది: 'ఎలిజా! మెంటాన్‌లో ఉన్న సైనిక దళాలన్నీ తరలిపోయాయి కదూ. ఇది మీ కుటుంబానికి నిజంగా తీరనిలోటే!'

"డార్సీ ఉండగా ఆమె 'వికం' పేరు ఉచ్చరించటానికి సాహసించదు. కానీ ఆమె అనదలచుకున్నది ఏమిటో ఎలిజబెత్ గ్రహించకపోలేదు. ఆమె మాట్లాడుతూ ఉండగా డార్సీ అదో రకంగా చూశాడు. అతని చెల్లెలు గాభరా పడింది. తలపైకి ఎత్తలేకపోయింది. అయితే అందరూ కొద్దిసేపటిలోనే స్థిమితపడ్డారు.

వాళ్ళు తిరుగు ప్రయాణంలో బగ్గీ ఎక్కుతూ ఉండగా మిస్ బింగ్లీ ఎలిజబెత్ ఆకారాన్ని ప్రవర్తనను, దుస్తులను గురించి, తను ఏమేమి అనవచ్చునో ఆలోచించుకుంటోంది. కానీ, జార్జియానా ఆమెతో చేరలేదు. అన్నగారి పక్కనే నిలుచుని స్నేహితుల వద్ద సెలవు తీసుకుంటూంది. డార్సీ తిరిగి వచ్చిన తర్వాత, మిస్ బింగ్లీ అతనితో ఇలా అంది: 'ఎలిజా

బెనెట్ ఇప్పుడు బాగా చిక్కిపోయినట్టు కనిపిస్తోంది. శీతాకాలంలో మనం చూసినప్పటికీ, ఇప్పటికీ ఇంతమార్పు ఆమెలో ఎలా వచ్చిందో అర్థంకాదు!

డార్సీ ఈ మాటలకు అంత లక్ష్యపెట్టే మనిషి కాదు. ఎలిజబెత్‌లో తనకు మటుకు పెద్ద మార్పేమీ కనిపించలేదన్నాడు. ఆమె తిరిగి ఇలా కొనసాగించింది. "నా మటుకు నాకు ఆమెలో ఇప్పుడు అందమన్నదే కనిపించటం లేదు. ఆమె ముఖమంతా పాలిపోయినట్టుంది. ఎక్కడా కళా, కాంతి లేదు. ఆ వైఖరి ఏమీ హాయిగా లేదు. ఒకప్పుడు గొప్పగా ఉన్నాయనుకున్న ఆమె కళ్ళలో ఇప్పుడు చెప్పుకోవలసిందేమీ కనిపించటం లేదు. ప్రత్యేకంగా మొత్తం మీద ఆమె ఆకారం నాకేమీ బాగుండలేదు.

డార్సీ ఎలిజబెత్‌ను ప్రేమిస్తున్నాడని మిస్ బింగ్లీ ఎరుగును. అయితే అసూయాపరులు ఎప్పుడూ తెలివైన పనులే చేయరు. అందుకనే ఆమె డార్సీని వలలో వేసుకోటానికి చేసే పనులన్నీ తప్పుగా చేస్తోంది. అతను మటుకు నిశ్శబ్దంగా ఉన్నాడు. ఆమె కొనసాగించింది: "మనం మొదట ఎలిజాని హెర్ట్‌ఫోర్డ్‌షైరులో కలుసుకున్నప్పుడు ఆమె అందం అద్వితీయమని భావించావు. నెదర్‌ఫీల్డ్‌లో ఒక రాత్రి ఆమె అందాన్ని గురించి గొప్పగా మాట్లాడావు గుర్తుందా? తరువాత తరువాత ఆమె నిన్ను మరీ ఎక్కువగా ఆకర్షించి నట్టుంది. ఆమెను ఒకప్పుడు నీవు సర్వాంగసుందరి అని భావించావు!" అంది.

డార్సీ సూటిగా అన్నాడు: "ఊ! ఆమెను తొలిసారి చూసినప్పటినుంచీ ఇప్పటి వరకూ నేను ఒకే అభిప్రాయంతో ఉన్నాను. ఆమె రూపవతి, సౌందర్యరాశి. ఆమెలో అద్వితీయమైన శోభ ఉంది." అని గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు. అతన్ని కవ్వించి అతని అభిప్రాయాన్ని రాబట్టినందుకు ఏడుస్తూ కూర్చొంది, మిస్ బింగ్లీ.

46

లాంటన్ వచ్చిన దగ్గర్నుంచి, జేన్ వద్ద నుంచి ఒక్క ఉత్తరమైనా రాకపోవటం ఎలిజబెత్‌కు ఎంతో నిరాశ కలిగిస్తోంది. ఈ నిరాశ రోజురోజుకూ ఎక్కువవుతోంది. రెండు రోజులు ఇలా గడిచాక, మూడవ రోజు ఆమె దగ్గర్నుంచి– ఒకే మారు రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒక ఉత్తరం తప్పు చిరునామా రాసిన కారణంగా ఎక్కడికోపోయి చివరకు ఇక్కడికి చేరుకుంది.

వాళ్ళు ఎక్కడికో షికారు వెడదామనుకుంటూ ఉండగా ఈ ఉత్తరాలు వచ్చాయి. గార్డినర్లు ఆమెను ఏకాంతంగా ఉత్తరాలు చదువుకోమని తమ దారిన తాము వెళ్ళారు. అయిదు రోజుల క్రితం రాసిన తప్పు చిరునామా ఉత్తరం ముందు చదవాలి. ఉత్తరంలో మొదట అక్కడి సమావేశాలు, విందులు, వినోదాల గురించి ఉంది. ఉత్తరంలో చివరి భాగంమటుకు ఆమె వేదనను, బాధను వ్యక్తపరుస్తున్నట్టుంది.

"ఈ ఉత్తరం రాస్తుండగా, బొత్తిగా అనుకోని విధంగా ఒక దారుణమైన విషయం జరిగింది. మరేం భయపడకు, మేమంతా కులాసాగానే ఉన్నాం. నేను చెప్పబోయే ఈ దారుణం, పాపం చిన్న చెల్లెలు లిడియా గురించి! మేమంతా నిద్రపోతూ ఉండగా, అర్ధరాత్రి పన్నెండు గంటలకు, కల్నల్ ఫోర్ట్స్ దగ్గర్నుంచి తంతి వచ్చింది. దానిలోని సంగతి - లిడియా, వికంతో స్కాట్లాండ్‌కు వెళ్ళిపోయిందని, ఇక మా ఆశ్చర్యాన్ని నీవే ఊహించుకో. కిట్టీకి మటుకు ఈ వార్త అంత ఆశ్చర్యం కలిగించలేదు. నాకు మటుకు చాలా విచారంగా ఉంది. ఎంత అసందర్భమైన జంట! అమ్మ విచారంలో మునిగి ఉంది. మనను గురించి వికం అన్నమాటలు మనం పైకి చెప్పకపోటమే మంచిది. వాళ్ళు శనివారం రాత్రి పన్నెండు గంటలకు లేచిపోయారట. కల్నల్ ఫోర్ట్స్ వెంటనే ఇక్కడికి వస్తున్నానని తెలియపరిచాడు. లిడియా ఆయన భార్యకు ఓ చిన్న చీటీ రాసిపెట్టి వెళ్ళిందట. దానిలో తమ కార్యక్రమం వివరించిందిట..."

ఉత్తరం చదివిన తర్వాత ఏమీ ఆలోచించకుండా ఆమె రెండో ఉత్తరాన్ని తీసుకుంది.

"ఈ పాటికి నేను హడావుడిగా రాసిన ఉత్తరం నీకు అందే ఉంటుంది. ఈ ఉత్తరమన్నా జాగ్రత్తగా రాద్దామనుకుంటున్నాను. అయితే అంత విరామం లేదు. లిడియా, వికంల దాంపత్యం ఎంత హాస్యాస్పదమైనదైనప్పటికీ అసలు వాళ్ళకు వివాహం అయిందా అని మాకు అనుమానంగా ఉంది. వాళ్ళు నిజంగా స్కాట్లండ్ వెళ్ళినట్టు లేదు. కల్నల్ ఫోర్ట్స్ నిన్న వచ్చాడు. లిడియా రాసిన చీటీలో తాము గ్రెట్నా గ్రీక్ వెడుతున్నామని రాసిందట. వికం స్నేహితుడు డెన్నీ మటుకు అసలు విడియాను వివాహమే చేసుకోడని చెబుతున్నాడట. ఫోర్ట్స్ ఈ మాటలు విని భయపడి వాళ్ళను పట్టుకోవటానికి బయలుదేరాడు. వాళ్ళు ఆయనకు చిక్కకుండా పరుగెత్తారట. ఏమనుకోవటానికి నాకేమీ తోచటం లేదు. ఇక వాళ్ళను పట్టుకోగల అవకాశం ఏమీ దొరకక ఫోర్ట్స్ లాంగ్‌బర్న్ వచ్చాడు. ఇక్కడికి వచ్చి తన విచారమంతా వెళ్ళబోశాడు పాపం. అయితే ఫోర్ట్స్ దంపతులను మనం తప్పుపట్టి ప్రయోజనం ఏమిటి? వికం నమ్మకస్తుడు కాదని ఫోర్ట్స్ కూడా అంటున్నాడు. నాన్నగారు చాలా కంగారు పడుతున్నారు. అమ్మ చికాకు చెప్పటానికి వీల్లేదు. ఈ దుర్భర దృశ్యాలు చూడనవసరం లేకుండా నీవైనా కొంతదూరంలో ఉన్నందుకు సంతోషంగా ఉంది. నీకు వీలైతే, ఇతరత్రా ప్రతికూలం కాకపోతే, వెంటనే తిరిగి రావటానికి ప్రయత్నించు. నాకు ఇలా రాయడానికి కలం ముందుకు రావటం లేదు. అందర్నీ వెంటనే బయలుదేరి రమ్మని రాయవలసిన తరుణం ఇది! కల్నల్ ఫోర్ట్స్ రేపు సాయంకాలం బ్రైటన్ వెళ్ళిపోతానంటున్నాడు. అందుకని ఇప్పుడు మామయ్య అండ, సహకారం తప్పనిసరి కావాలి. ఆయనే మనకు ఇప్పట్లో దైవ సమానుడు. నాకు ఆయన పట్లనే విశ్వాసం ఉంది. ఈ విషయాలన్నీ ఆయనకు ఎరుకపరుచు..

“ఓ! మావయ్య ఎక్కడ?” అంటూ ఎలిజబెత్, ఉత్తరం పూర్తిచేసి కూర్చున్న చోటి నుంచి ఎగిరి గంతువేసింది. ఆమె అలా గుమ్మం దగ్గరికి వచ్చేసరికి, అప్పుడే తలుపు తెరుచుకుని మిస్టర్ డార్సీ ప్రవేశించాడు. ఆమె పాలిపోయిన ముఖం చూసి అతను నివ్వెరపోయాడు. అతను మాట్లాడే లోపుగానే ఆమె తొందరపాటుగా “క్షమించండి. నేనిప్పుడు వెళ్ళిపోవాలి. ముందు మా మావయ్య ఎక్కడున్నాడో తెలుసుకోవాలి.” అంది.

“ఏమిటీ? ఏం జరిగింది? ఒక్క నిమిషం స్థిమితంగా ఉండు. నీ అంతట నీవే వెళ్ళలేవు. నేనో, నౌకరో వెళ్ళి గార్డినర్‌ను పిలుచుకు వస్తాంలే” అన్నాడు డార్సీ.

ఎలిజబెత్ సంశయించింది. ఆమె కాళ్ళు వణుకుతున్నాయి. ఆమె పరిస్థితి అతనికి మరీ అధ్వాన్నంగా అనిపించింది. “ఏమిటిది? కాస్త నింపాదిగా కూర్చో. ఉండు, మీ పని మనిషిని పిలుస్తాను. ఒక గ్లాసు వైన్ తాగు, నెమ్మదిస్తుంది” అన్నాడు.

“అక్కర్లేదు. నేను కులాసాగానే ఉన్నాను. నాకేం అనారోగ్యం లేదు. లాంగ్‌బర్న్ నుంచి ఇప్పుడే ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలోని వార్తలకు నా మనస్సు సంక్షోభపడుతోంది. అంతే!” అంటూ ఆమె కళ్ళనీరు పెట్టుకుంది. కొన్ని నిమిషాల వరకు ఏమీ మాట్లాడలేకపోయింది. డార్సీ కూడా ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. చివరకు ఆమే ఇలా అంది: “ఇప్పుడే జేన్ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అందులోని దారుణ వార్తను ఎవరి ముందు దాచటానికి వీల్లేదు. మా ఆఖరి చెల్లెలు– లిడియా, స్నేహితులను బంధువులను అందరినీ వదిలిపెట్టి, వికంతో లేచిపోయింది. వాళ్ళిద్దరూ నేరుగా బ్రైటన్ నుంచే పారిపోయారు. అతన్ని గురించి మీకు అంతా తెలుసుగా! లిడియా దగ్గర డబ్బులేదు, ఏమీలేదు. దాని బ్రతుకు చివరకు బండలవుతుంది!”

డార్సీ ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. ఆమె రుద్ధకంఠంతో ఇలా కొనసాగించింది. “ఇలా జరగకుండా నేను అడ్డుపడి ఉండవలసింది, నాకు అతని సంగతి తెలుసు. అతన్ని గురించి నేను తెలుసుకున్నది కొంచెం భాగం మటుకే. అతని శీలాన్ని గురించి ఇంట్లో వాళ్ళకి గనుక చెప్పి ఉన్నట్టయితే ఈ దారుణం జరిగేది కాదు.”

“నాకు చాలా విచారంగా ఉంది! కానీ... ఇదంతా నిజమేనా?”

ఆ! వాళ్ళు ఆదివారం రాత్రే పారిపోయారు. లండన్ దాకా వెంటాడారు. కానీ దొరకలేదు. వాళ్ళు మటుకు స్కాట్లండ్ వెళ్ళి ఉండరు.

“వాళ్ళను తీసుకు రావటానికి ఏం ప్రయత్నం చేశారు!”

“మా నాన్న లండన్ వెళ్ళారు. జేన్ ఇప్పుడు రాసిన ఉత్తరంలో మా మామయ్యని వెంటనే రమ్మని రాసింది. మేం వెళ్ళిపోవాలి. అంతా అరగంటలో వెళ్ళితీరాలి. వెళ్ళీ కూడా చేసేదేమీ లేదని నాకు తెలుసు. అయినా వెళ్ళాలి. అటువంటి మనిషిని పట్టుకోవటం ఎట్లా? నాకేమీ ఆశ కనిపించటం లేదు.”

డార్సీ మౌనంగా తల ఊపాడు.

"అతను ఎలాంటివాడో నాకు తెలిసివచ్చినప్పుడు అందరికీ చెప్పివేస్తే బాగుండేది. కానీ పొరపాటు చేశాను."

డార్సీ జవాబు చెప్పలేదు. ఆమె మాటలు వింటున్నట్టే లేదు. ఏదో ధ్యానంలో గదిలో అటు ఇటు తిరుగుతున్నాడు. అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి. ముఖం గంభీరం అయింది. ఎలిజబెత్ అతన్ని గమనించింది. అతని స్థితిని అర్థం చేసుకుంది. ఆమె శక్తి క్షీణిస్తోంది. అటువంటి కుటుంబ దౌర్బల్యం ముందు ఏదైనా క్షీణించవలసిందే!

"ఈ అనుకోని పరిణామం వల్ల మీరు ఇవాళ పెంబర్లే వచ్చి మా చెల్లెలిని చూడలేరు."

"అవును- మిస్ డార్సీకి నా క్షమాపణలు తెలపండి. అర్జంటు వ్యవహారం మీద మేం ఇంటికి తిరిగి వెళ్ళిపోవలసి వచ్చిందని చెప్పండి. సాధ్యమైనంత కాలం ఈ విషయాన్ని దాచడానికి ప్రయత్నించండి. అయితే ఎంతో కాలం నిలవదనుకోండి!

అతను అలాగే హామీ ఇచ్చాడు. ఆమె సంక్షోభానికి తన విచారం తెలియపరిచాడు. ఇంట్లో అందరికీ శుభాకాంక్షలు తెలపమని, సెలవు తీసుకు వెళ్ళాడు. ఎలిజబెత్ ఈ మాదిరిగా తామిద్దరూ కలుసుకోవలసి వచ్చినందుకు విచారపడింది.

ఎలిజబెత్ అంచనా తప్పుకాదు! జేన్ రెండో ఉత్తరం చదివిన మీదట, లిడియాను వికం వివాహం చేసుకుంటాడనే ఆశ కూడా ఆమెకు అంతరించింది.

ఎలిజబెత్‌కు వెంటనే ఇంటికి వెళ్ళిపోవాలని ఉంది. జేన్‌తో పాటు ఈ విచారాన్ని, దుఃఖాన్ని పంచుకోవాలని ఉంది. తండ్రి ఊళ్ళోలేడు. తల్లి విచారంలో కూలబడింది.

నౌకరు కబురు అందుకుని ఎలిజాకు ఆరోగ్యం ఏం తల్లకిందులయిందోనని భయపడుతూ గార్డినర్లు పరుగెత్తుకు వచ్చారు. ఎలిజా మామూలుగానే ఉండటం చూసి కుదుటపడ్డారు. ఎలిజా ఉత్తరాలలోని వార్తలు వారికి అందజేసింది. ఆయన తన చేతనైనంత సహాయం చేస్తానన్నాడు. ఎలిజబెత్, ఆయన ఇలా అంటాడని ముందుగా ఎరిగికూడా ఆయనకు కృతజ్ఞత తెలియపరిచింది. ఆమె కన్నీరు మున్నీరుగా కూర్చుని ఉంది. ప్రయాణాన్ని గురించి త్వరత్వరగా నిర్ధారణలు చేసుకున్నారు.

"అయితే పెంబర్లే ఆహ్వానం ఏం చేసేట్టు?" అంది మిసెస్ గార్డినర్. "జాన్ చెప్పాడు. నీవు మా కోసం కబురు చేసినప్పుడు డార్సీ ఇక్కడే ఉన్నాడట కదూ!"

"అవును. ఆయనతో నేను రాలేకపోతున్నామని చెప్పాను. అదేం బెంగలేదు!"

47

మార్గమధ్యంలో గార్డినర్ ఇలా అన్నాడు: "వికం ఇటువంటి పని చేయగలడా! తన కల్నల్ ఇంట్లో ఉన్న అమ్మాయిని లేవదీసుకుని వెళ్ళగలడా? ఆమె స్నేహితులంతా

వెదుకుతారనీ, తనతోటి ఉద్యోగులంతా కాకుల్లాగ పొడుచుకు తింటారనీ ఎరగడూ? నీ మటుకు నీకూ, వికం తెలుసుగా! అతనలాంటి పని చేస్తాడంటావా?"

"ఇతరుల విషయం ఎలావున్నా, తన కోసమైనా ఇటువంటి పని చేయడు. నాకు ఇలాగే అనిపిస్తోంది. కాకపోయినట్టయితే వాళ్ళు స్కాట్లండ్‌కు ఎందుకు వెళ్లలేదు?"

"వాళ్ళు స్కాట్లండ్‌కు వెళ్ళలేదని మటుకు బలమైన ఋజువు లేదుగా!"

"కొద్దిపాటి ఆధారాలు ఉన్నాయి కదూ?"

"వాళ్ళు లండన్‌లోనే ఉన్నారనుకుందాం. కొన్నాళ్ళు అజ్ఞాతంగా ఉండటానికి అక్కడే ఉంటారు. ఇద్దరి దగ్గర కూడా అంత ఎక్కువగా డబ్బు లేదనుకుంటాను. బహుశా వాళ్ళకు స్కాట్లండ్‌లో కంటే లండన్‌లోనే చౌకగా వివాహం చేసుకోవచ్చునని తోచి ఉండవచ్చు."

"అయితే- ఈ దాపరికమంతా ఎందుకు? ఎవరన్నా కనుక్కుంటారేమోనని భయమెందుకు? వివాహం రహస్యంగా ఎందుకు జరుపుకోవాలి? లేదు, లేదు- ఇదంతా జరగని పని! జేన్ ఉత్తరంలో, అతని స్నేహితుడు చెప్పిన ముక్క చదివావుగా- లిడియాను వివాహం చేసుకునే ఉద్దేశమే అతనికి లేదట, అటువంటి అభిప్రాయమే ఉంటే బహిరంగంగా చేసుకోవచ్చు కదా వివాహం!"

"అయితే, లిడియా ప్రేమకోసం గుడ్డిదైపోయి, స్వంత కుటుంబాన్ని మరిచిపోయి వివాహ ప్రసక్తే లేకుండా అతనితో కాపురం చేసే స్థితికి దిగజారిందంటావా?"

"అంతే అయుండాలి! నాకు ఏమనటానికీ తోచటం లేదు. లిడియా చిన్నది! దానికి ఏదిమంచో, ఏది చెడ్డో కూడా సరిగా తెలియదు. బొత్తిగా ఒక సంవత్సరం నుంచి మెరిటాన్‌లో విడిదివున్న సైనికోద్యోగులే దాని మదిలో మెదులుతున్నారు. వికంకు ఆడదాన్ని ఆకర్షించే అందచందాలు, అంగసౌష్టవం ఉన్నాయి!"

"జేన్‌కు వికం అంటే అంత దురభిప్రాయం ఉన్నట్టు లేదే- ఉత్తరం చదివితే!"

"జేన్ ఎవరిని గురించి మటుకు చెడ్డగా తలపోస్తుంది గనుక? అయితే వికంను గురించి జేన్ ఎరుగును. అతను మోసగాడనీ, అవకాశం వస్తే ఎంత దగా అయినా చేయటానికి వెనుకాడడనీ మా ఇద్దరికీ తెలుసు!" అంది.

"నీకు నిజంగా ఇవన్నీ ముందుగానే తెలుసా?" అనడిగింది మిసెస్ గార్డినర్.

"అవును! లాంగ్‌బర్న్‌లో ఉండగా ఒక రోజు నీతో చెప్పాను గుర్తుందా, అతను డార్సీ పట్ల ఎలా ప్రవర్తించాడో! తన ఎడల సానుభూతి చూపిన మనిషి గురించి ఎంత ఘోరంగా మాట్లాడాడో చెప్పానుగా! మొత్తంమీద అతను పెంబర్లే కుటుంబాన్ని గురించి ఎన్ని అపనిందలు వేశాడో లెక్కలేదు. మిస్ డార్సీని గురించి అన్నీ అబద్ధాలు చెప్పాడు."

"అయితే లిడియాకు ఇవేవీ తెలియవా? నీకు, జేన్‌కు ఇంత క్షుణ్ణంగా తెలిసిన విషయాలు- లిడియాకు సూచన మాత్రంగానైనా తెలియవా?"

"అవును. అదే విచిత్రమైన పరిస్థితి. కెంట్‌కు వెళ్ళి డార్సీని, అతని మిత్రుడు ఫిట్ విలియంను స్వయంగా కలుసుకునేంతవరకూ నాకు ఈ విషయాలు తెలియవు. నేను ఇంటికి తిరిగి వచ్చిన పది పదిహేను రోజులకే సైనిక రథాలు మెరిటాన్ నుంచి తరలిపోనున్నాయి. వెళ్ళిపోయేవాళ్ళ నిజస్వరూపాలు బయటపెట్టడం దేనికని నేను మిన్నకుండిపోయాను. ఒక్క జేన్‌కు మటుకు ఇదంతా చెప్పాను. మేమిద్దరం ఆలోచించుకుని, ఈ నిజాన్ని బయటకు చెప్పనవసరం లేదని నిశ్చయించుకున్నాం. ఇందువల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు గనుక్క వీటిని మరచిపోదామనుకున్నాం. లిడియా కల్నల్ ఫోర్ట్స్ సతితో బ్రైటన్ వెళుతున్న విషయం తెలిసినా, దాని కళ్ళు తెరవవలసిన అవసరం నాకు తోచలేదు. వికం ఆమె దగ్గర చేరి మోసం చేస్తాడన్న ఆలోచనే నాకు కలగలేదు. ఇటువంటి దారుణం జరుగుతుందని నేను ఊహించలేదు!"

బ్రైటన్‌కు వాళ్ళంతా వెడుతున్నప్పుడు కూడా, వాళ్ళిద్దరి మధ్య అనురాగం ఉన్న సంగతి నీకు తెలియదన్నమాట!"

"అవును."

వాళ్ళు సాధ్యమైనంత వేగంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఒక రాత్రంతా రోడ్డుమీదే గడిపారు. మరునాడు మధ్యాహ్నం భోజనాల వేళకు లాంగ్‌బర్న్ చేరుకున్నారు.

గార్డినర్ కొడుకులు, కూతుళ్ళు బగ్గీ చప్పుడు వినడంతోటే కేరింతలు కొడుతూ పరుగెత్తుకు వచ్చారు.

ఎలిజబెత్ బగ్గీలోంచి కిందికి దూకింది. వెంటనే జేన్ ఉన్న చోటికి పరుగెత్తింది. ఆప్యాయంగా ఆమెను కౌగలించుకుంది. ఇద్దరికీ కళ్ళనిండా నీళ్ళు నిండాయి. ఎలిజబెత్ తరువాత సమాచారం ఏమైనా తెలియవచ్చిందా అని అడిగింది.

"ఏమీ తెలియలేదు. మామయ్య వచ్చాడుగా! ఇప్పుడు పరిస్థితంతా చక్కబడుతుంది."

"నాన్న వచ్చారా?"

"ఇంకా రాలేదు."

ఉత్తరం ఏమైనా వచ్చిందా?"

"ఒక్కటే వచ్చింది బుధవారంనాడు. క్షేమంగా చేరినట్టు రాశాడు. తిరిగి రాయదగ్గ వివరాలేమైనా దొరికితే తప్ప ఉత్తరం రాయనని రాశాడు."

"అమ్మ- అమ్మ ఎలా ఉంది?"

"విచారంతో కుమిలిపోతోంది. ఇప్పుడు కాస్త నయమే. మేడమీద ఉంది. నిన్ను చూస్తే ఎంతో సంబరపడుతుంది. పద."

"నీవు ఎలా ఉన్నావు? చిక్కిపోయావేం?"

గార్డినర్ కుటుంబం అంతా అక్కడికి వచ్చారు. దాంతో వాళ్ళ సంభాషణ

ఆగిపోయింది. జేన్ గార్డినర్ దగ్గరకు పరుగెత్తి ఆయన వచ్చినందుకు కృతజ్ఞత తెలిపింది.

అందరూ డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు. ఇందాక ఎలిజబెత్‌కి వేసిన ప్రశ్నలే మళ్ళీ వేశారు. జేన్‌కు ఇప్పటికీ ఈ వ్యవహారం సజావుగా ముగుస్తుందనీ, ఒకనాడు ఉదయమే లిడియా నుంచో, తండ్రి దగ్గర నుంచో ఉత్తరం వస్తుందనీ ఆశగా ఉంది.

మిసెస్ బెనెట్ ఏడుపులు పెడబొబ్బల మధ్య వికంను దూయబడుతోంది.

“నేను చెప్పిన ప్రకారం, మేమందరం కూడా బ్రైటన్ వెళ్ళటం జరిగినట్టయితే, ఇలా దాపురించేది కాదు. పాపం, లిడియాకు ఎవరూ పెద్ద దిక్కులేరు. ఫోర్ట్స్ ఆమెను రాత్రిపూట కూడా బయటకు ఎలా వెళ్ళనిచ్చారు? వాళ్ళదే తప్పిదం. మంచి కాపు ఉంటే లిడియా ఇటువంటి పని చేసేదికాదు. ఇప్పుడు ఆయన లండన్ వెళ్ళి కూర్చున్నారు. వికం కనపడగానే అతనితో పోట్లాట వేసుకుంటారు. ఆయన కాస్తా గుటుక్కుమంటే మా అందరి గతీ ఏమిటి? ఆయన్ను ఇంకా పూర్తిగా సమాధి చేయకముందే కోలిన్స్ వచ్చి ఇల్లు, ఆస్తి అప్పజెప్పమంటాడు. ఇంక మాకు నీవే దిక్కు గార్డినర్!”

వాళ్ళు ఆమె ధోరణికి నివ్వెరపోయారు. గార్డినర్ ఆమెను ఓదార్చాడు. ఆమెకు, ఆమె కుటుంబానికి వచ్చిన భయమేమీ లేదని నచ్చచెప్పాడు. మరునాడే తను లండన్ వెడతానని, లిడియాను వెదకటంలో బెనెట్‌కు తోడు పడతానని చెప్పాడు.

మిసెస్ బెనెట్ ఇలా అంది: “అవును, అలాగే చేయి. ఎలాగైనా వెదికి లిడియాను, వికంను పట్టుకోండి. వాళ్ళిద్దరూ అప్పుడే పెళ్ళి చేసుకోకపోయినట్టయితే, మీరు ఆ పని ముందుగా చేయించండి. బెనెట్ గారు అనవసరంగా పోట్లాటకి దిగకుండా మటుకు చూడండి. నేనిక్కడ ఎలా కుంగి కృశించిపోతున్నానో ఆయనకు చెప్పండి.”

మధ్యాహ్నం ఎలిజా, జేన్‌లు ఒక అరగంటసేపు ఒంటరిగా కూర్చునే అవకాశం కలిగింది. “కల్నల్ ఫోర్ట్స్ ఏమన్నాడు?” వాళ్ళకు ఈ విషయంలో ముందుగా అనుమానమైనా కలగలేదటనా?” అడిగింది ఎలిజబెత్.

“కల్నల్ ఫోర్ట్స్‌కు లిడియా ప్రవర్తన విచిత్రంగా కనిపించిందట. అయితే భయపడవలసిందేమీ లేదనుకున్నాట్ట.”

“డెన్నీకి వికం వివాహం చేసుకోడని నిర్ధారణగా తెలుసునటగా? వాళ్ళిద్దరూ అలా పారిపోదామనుకోవటం అతనికి తెలుసా? డెన్నీతో వికం మాట్లాడాడా?”

“ఆ! కానీ డెన్నీకి ఈ చర్యను గురించి ఏమీ తెలియదట.”

“అయితే కల్నల్ ఫోర్ట్స్ చెప్పేంతవరకు మీకెవరికీ వారిద్దరూ నిజంగా వివాహం చేసుకుంటారన్న అనుమానమే కలుగలేదన్నమాట!”

“ఎలా కలుగుతుంది? అతని శీలాన్ని ఎరిగిన దాన్ని గనుక నేను కొంచెం భయపడ్డాను. అమ్మకు, నాన్నకు అసలు ఈ సంగతులేమీ తెలియవు గదా! అయితే ఈ

దాంపత్యం చూడముచ్చటగా ఉండదని మటుకు విచారించారు. కిట్టీ మటుకు ఈ విషయం తనకు లిడియా కిందటి ఉత్తరంలోనే రాసినదని చెప్పింది. వాళ్ళిద్దరి ప్రేమ కలాపాలు దానికి కొన్ని వారాలుగా తెలుసు!"

"బ్రైటన్ వెళ్ళటానికి ముందేనా?"

"కాదనుకుంటాను."

"వికం గురించి కల్నల్ అభిప్రాయమేమిటి? ఆయనకు అతని గురించి తెలుసునా?"

"ఆయన వికంను గురించి పూర్వం మాట్లాడినంత మంచిగా మాట్లాడలేదు.

"జేన్! మనమే గనుక వికం శీలాన్ని, స్వభావాన్ని గురించి ఏమీ దాపరికం లేకుండా, ఉన్నది ఉన్నట్టుగా అందరికీ చెప్పివేసినట్టయితే- ఇదంతా జరిగి ఉండేది కాదేమో!"

"కానీ మనకలా చెప్పవలసిన అవసరం, అవకాశం రాలేదు కదా! మన ఉద్దేశం ఒకడిని పాడుచేయటం కాదు గనుక, మిన్నకుండిపోయాం."

"లిడియా పోర్ట్స్ సతికి రాసిన ఉత్తరం ముక్కలోని సంగతులు ఆయన వివరించారా?"

"దాన్ని మనకోసం కూడానే తెచ్చారు" అంటూ ఒక చీటీ ఎలిజబెత్‌కు అందించింది. ఎలిజబెత్ చదువుకుంది.

ప్రియమైన హరియట్‌కు-

నేనెక్కడికి వెళ్ళానో తెలుసుకుని మీరు నవ్వుతారు. కానీ, రేపు పొద్దున్నే లేచి నేను లేకపోవటం చూసి మీరు ఆశ్చర్యపోవటం తలచుకుంటే నాకు నవ్వు ఆగటం లేదు. నేను గ్రేట్నాగ్రీస్ వెడుతున్నాను- నా దేవతతో కలిసి! ఎవరో గ్రహించలేకపోతే మీరు తెలివితక్కువ వారంటాను. నాకు అతనే స్వర్గం. నేనిట్లా వెళ్ళిపోవటాన్ని గురించి మీరు లాంగ్‌బర్న్‌కు కబురు చేయనక్కరలేదు; మీకు ఇష్టంలేకపోతే నేనే ఒక ఉత్తరం రాసి దానికింద **లిడియా వికం** అని సంతకం చేసినప్పుడు వాళ్ళకు ఈ తమాషా అర్థం అవుతుంది. సెలవు, ఫోర్ట్స్ గారికి నా నమస్కారాలు.

-లిడియా బెనెట్.

ఉత్తరం చదువుకోవటం ముగించి ఎలిజబెత్ "ఆలోచనలేని వెర్రిది- లిడియా! ఇదేం ఉత్తరం. ఇలాగేనా రాసేది? ఈ ఉత్తరం చూసి నాన్న ఎంతగా బాధపడి ఉంటారు."

"ఆయనలా నిర్ఘాంతపోయిన మనిషిని నేను చూడలేదు. పది నిమిషాలదాకా ఒక్క మాటైనా పలకలేకపోయాడు. అమ్మ అడ్డం పడింది. ఇల్లంతా బీభత్సంగా ఉంది."

48

మరునాడు బెనెట్ నుంచి ఉత్తరం వస్తుందని ఎదురుచూశారు. గార్డినర్ టపావేళ దాటిపోయిన తరువాత బయలుదేరాడు. గార్డినర్ వెళ్ళిన మీదటనైనా అక్కడి సమాచారం

ఎప్పటికప్పుడు సక్రమంగా తెలుస్తుందని ఆశిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలో బెనెట్‌ను ఇంటికి తీసుకు వస్తానని ఆయన వాగ్దానం చేశాడు కూడా.

మిసెస్ గార్డినర్ పిల్లలతో కొన్నాళ్ళపాటు లాంగ్‌బర్న్‌లోనే ఉండి మిసెస్ బెనెట్‌ను, ఆమె కూతుళ్ళను ఓదార్చాలి. మిసెస్ ఫిలిప్స్ కూడా మధ్య మధ్య వచ్చి చూసి వెడుతోంది.

మూడు నెలల క్రితం మెరిటాన్‌లో వికం ఒక దేవత. ఇప్పుడతడు అక్కడ రాక్షసుడు.

గార్డినర్ లాంగ్‌బర్న్ వదిలింది ఆదివారంనాడు. మంగళవారంనాడు భార్య పేరిట ఉత్తరం రాయనే రాశాడు. బెనెట్‌ను కలుసుకున్నాడట. అక్కడి ప్రధానమైన హోటళ్ళన్నీ గాలించారట. ఏమీ ప్రయోజనం లేకపోయిందట. బెనెట్‌కు ఇప్పట్లో లండన్ వదలి రావటం ఇష్టంలేదట. ఆ ఉత్తరంలో తాజా కలం ఇలా ఉంది:

"నేను కల్నల్ ఫోర్ట్స్‌కు కూడా అతన్ని వెతకమని, సైనిక దళంలోని అతని మిత్రులను విచారిస్తే ఏదైనా ప్రయోజనకరమైన విషయం బయటపడుతుందేమోనని రాశాను. వికంకు బంధువులెవరైనా ఉన్నారేమో విచారించమన్నాను. కల్నల్ ఫోర్ట్స్ ఈ విషయంలో మనకు సాధ్యమైనంత వరకూ సహాయం చేస్తాడు, సందేహం లేదు. బహుశా ఎలిజబెత్‌కు కూడా ఈ సమాచారం ఏమైనా తెలుసునేమో కనుక్కోండి."

ఎలిజబెత్‌కు ఏం తెలుసు కనుక?

లాంగ్‌బర్న్‌లో ఏ రోజుకారోజు ఆతురత ఎక్కువైపోతోంది. ఉత్తరాలకోసం ఎదురు చూడటమే ప్రధాన కార్యక్రమం అయింది.

గార్డినర్ నుంచీ కోలిన్స్ నుంచీ ఉత్తరాలొచ్చాయి. జేన్ కోలిన్స్ ఉత్తరం చదివింది.

"ప్రియమైన అయ్యా!

నిన్న హేర్ట్‌ఫోర్డ్‌షైరు నుంచి వచ్చిన ఉత్తరాల వల్ల సమాచారమంతా తెలిసింది. మన బంధుత్వం రీత్యాను, జీవితంలో నా స్థాయిరీత్యాను నేను మిమ్మల్ని ఆదరించాలని, ఓదార్చాలని భావిస్తున్నాను. మా దంపతులం ఇద్దరం ఈ దారుణానికి సానుభూతి తెలుపుతున్నాం. ఇంతకన్నా మీ కూతురు మరణించటమే శ్రేయస్కరంగా ఉండేది. ఇక్కడ లేడీ కాథరైన్ ఆమె కూతురు కూడా మాతోపాటు మీకు సానుభూతి తెలుపుతున్నారు. ఒక అమ్మాయి ఇటువంటి తప్పటడుగు వేయటం, తతిమ్మా అమ్మాయిల భవిష్యత్తుకు కూడా దెబ్బ అని నా ఉద్దేశం. ఇటువంటి కుటుంబంతో గౌరవనీయులెవరూ సంబంధం పెట్టుకోవటానికి సమ్మతించరు. ప్రస్తుత పరిస్థితిలో మిమ్మల్ని మీరే ఓదార్చుకోండి. ఈ అప్రతిష్ట తెచ్చిన పిల్లను మీ దానిగా భావించుకోవటం మానివేయండి, సాధ్యమైనంత త్వరలో ఆ అనుబంధాన్ని తెంపుకోవటానికి ప్రయత్నించండి..."

గార్డినర్ రాసిన సమాచారం ఇలా ఉంది: వికంకు బంధువెవరూ ఉన్నట్టు ఆచూకీ దొరకలేదట. సైనికోద్యోగులలో కూడా అతనికి చెప్పుకోదగ్గ స్నేహితులంటూ ఎవరూ

లేరట! అతని ఆదాయం తక్కువ, కనుక సాధ్యమైన చోటల్లా అప్పులు చేశాడట. బ్రైటన్ నుంచి సజావుగా బయటపడటానికి వెయ్యి పౌన్లకు పైనే కావాలనుకుంటున్నారు. ఈ వివరాలు, లాంగ్‌బర్న్ కుటుంబం తెలుసుకోకుండా దాచాలని, గార్డినర్ ప్రయత్నించలేదు. ఇది విని జేన్ గుండెలు బాదుకొంది. "జూదగాడు, బొత్తిగా పనికిమాలిన వెధవలా ఉన్నాడు. నేనింత దారుణం అనుకోలేదు" అంది.

గార్డినర్ మరో సంగతి రాశాడు, బహుశా మరునాటికి బెనెట్ తిరిగి ఇంటికి రావచ్చునేమోనని. ఆ రోజు శనివారం. ఈ విషయం విని మిసెస్ బెనెట్ "లిడియా లేకుండా ఆయన ఇంటికి ఎందుకు తిరిగి వస్తున్నారు? ఆయన ఇలా వచ్చేస్తే ఇక వాళ్ళను వెదకటం ఎలాగు? వాళ్ళు కనిపిస్తే వాళ్ళిద్దరికీ పెళ్ళి చేయించే భారం ఎవరిది?"

మిసెస్ గార్డినర్, పిల్లలతో సహా ఇంటికి వెళ్ళాలనుకుంది. అందుకని బగ్గీ వేసుకుని ముందు లండన్ వెళ్ళింది. ఆ బగ్గీలోనే బెనెట్ లాంగ్‌బర్న్‌కు తిరిగి వచ్చాడు.

మిసెస్ గార్డినర్‌కు ఎలిజబెత్‌తో పెంబర్లే కుటుంబ పరిచయాన్ని గురించి ప్రశ్నలు మిగిలిపోయే ఉన్నాయి. వాటికి జవాబులు సేకరించుకునే లోపలే ఈ ఉపద్రవం తటస్థించింది. ఎలిజబెత్‌కు ఈ మధ్య పెంబర్లే నుంచి ఉత్తరాలు కూడా ఏమీ రాలేదు.

బెనెట్ వచ్చాక, ఆయన మామూలు ధోరణిలోనే ఉండిపోయాడు. ఏమీ మాట్లాడలేదు. ఆయనను మాట్లాడించే సాహసం కూడా ఆ ఇంట్లో ఎవరికీ లేకపోయింది.

మధ్యాహ్నం, టీ సమయంలో ఎలిజబెత్ ఈ విషయాన్ని ప్రస్తావించగలిగింది. "ఆ ప్రస్తావన ఏమీ తీసుకురాకు. నా కంటే బాధపడే వాళ్ళు ఎవరున్నారు? నేను చేసిన పాపం, నేనే అనుభవించాలి!" అన్నాడాయన.

"అంత బాధపెట్టుకోకండి నాన్నా!"

"మానవ మనస్తత్వమే అంత!"

"అయితే వాళ్ళు ఇంకా లండన్‌లోనే ఉన్నారంటారా?"

"ఆ! అంతకంటే దాక్కోవటానికి అదునైన ప్రదేశం ఇంకేం ఉంది?"

"లిడియా లండన్ వెళ్ళాలని అనుకుంటూ ఉండేది!" అంది కిట్టీ.

"అయితే అదృష్టవంతురాలన్న మాట. కొన్నాళ్ళపాటు అక్కడ ఉండగలుగుతుంది."

కొద్ది విరామం తరువాత ఆయన ఇలా అన్నాడు: "లిజ్జీ! నీవు గడిచిన మే నెలలోనే నాకు సలహా ఇచ్చావు. నీకు దూరదృష్టి ఉంది!"

ఇంతలో జేన్ అక్కడికి వచ్చింది; తల్లికి టీ తీసుకు వెళ్ళేందుకు.

"ఇదంతా ఒక ఆట! కొందరికి ఇది మంచి, కొందరికి చెడ్డ. ఒకరోజు నేను కూడా ఈ పనే చేస్తాను... లేకపోతే కిట్టీ ఈ పని చేసేదాకా, నేను వాయిదా వేస్తాలే."

"నేనేం పారిపోబోవటం లేదు నాన్నా" అంది కిట్టీ. నేనే గనుక బ్రైటన్ వెళ్ళటం

తటస్థిస్తే, లిడియా కంటే చక్కగానే ప్రవర్తిస్తాను."

"నా కిప్పుడు జాగ్రత్తగా ఉండటం అంటే ఎలాగో తెలుస్తోంది. ఇక ముందు ఎలాంటి ఆఫీసర్లూ నా ఇంటికి రాలేరు. వాళ్ళు ఈ గ్రామంలోకే అడుగుపెట్టలేరు. బాల్ డ్యాన్స్‌లకు ఇక పూర్తి నిషేధం. మీరు ఎప్పుడూ ఇల్లు కదిలి బయటికి అడుగుపెట్టడానికి వీల్లేదు."

కిట్టీ ఈ బెదిరింపు మాటలకు భయపడిపోయి ఏడుపు ప్రారంభించింది.

"ఎందుకట్లా పిరికిదానిలా ఏడుస్తావు? కొంత కాలం పాటు నీవు మంచి పిల్లలా ప్రవర్తిస్తే, దాని సత్ఫలితాన్ని నీవే అనుభవిస్తావు!" అన్నాడు బెనెట్.

49

బెనెట్ తిరిగి వచ్చిన రెండు రోజుల తర్వాత, జేన్ ఎలిజబెత్ ఇద్దరూ ఇంటి వెనుక ఆవరణలో షికారుగా తిరుగుతూ ఉండగా ఇంటి దాసీ వాళ్ళ దగ్గరకు వచ్చింది. 'అమ్మాయి గార్లూ, మిమ్మల్ని పిలవకుండా వచ్చి పలకరించినందుకు క్షమించండి. అయితే- పట్టణం నుంచి ఏదైనా శుభవార్త వచ్చిందేమో కనుక్కుందామని వచ్చాను' అంది. వాళ్ళకేమీ అర్థం కాలేదు.

"ఏమిటి నీవనేది? పట్టణం నుంచి ఏ వార్తా రాలేదే!"

మిసెస్ హిల్ ఆశ్చర్యపోతూ 'గార్డినర్ గారి దగ్గర్నుంచి అయ్యగారికి ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది. అరగంట అయింది. అయ్యగారు ఉత్తరం అందుకున్నారు' అంది.

అమ్మాయిలు పరుగెత్తారు. మాట్లాడటానికి కాలం వ్యర్థపరచకుండా ఫలహారాల గదిలోకి పరుగెత్తారు. అక్కడి నుంచి లైబ్రరీ గదికి వెళ్ళారు. తండ్రి కనిపించకపోవటంతో మేడమీదికి వెళ్ళబోతూ ఉండగా, బట్లర్ ఎదురుపడి- 'మీరు అయ్యగారి కోసం వెతుకుతున్నారా? ఆయన ముందు తోటలో పచార్లు చేస్తున్నారు' అన్నాడు.

ఇద్దరూ అటువైపు పరుగుతీశారు. ఎలిజబెత్ 'నాన్నా, ఏమిటి సమాచారం. మామయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందట కదా?' అనడిగింది.

"వచ్చిందమ్మా."

"శుభవార్తా- లేక ఏదైనా చెడ్డవార్తా?"

"శుభవార్త అనుకోటానికి ఆస్కారం ఏదీ?" అంటూ ఆయన జేబులోంచి ఉత్తరం తీసి ఆమెకు అందించాడు!

"పైకి చదువు, నేను కూడా మరోసారి వింటాను."

"చివరకు నేను లిడియాను గురించి ఏదో కబురు పంపగలుగుతున్నాను. ఈ కబురు నీకు తృప్తి కలిగిస్తుందనుకుంటాను. నీవు శనివారం ఇక్కడి నుంచి వెళ్ళిన తరువాత, వాళ్ళు లండన్‌లో ఎక్కడ ఉంటున్నారో నాకు తెలిసింది. వివరాలన్నీ సమక్షంలో

మాట్లాడుకోవచ్చు. ఇంతకూ, వాళ్ళిద్దర్నీ పట్టేసుకున్నాను. వాళ్ళిద్దర్నీ చూశాను."

జేన్ మధ్యలో అడ్డువచ్చి 'అంతా అనుకున్నట్టుగానే అయింది. వాళ్ళు వివాహం చేసుకున్నారు' అంది.

ఎలిజబెత్ చదవటం సాగించింది.

"నేను వాళ్ళిద్దర్నీ చూశాను. వాళ్ళు వివాహం చేసుకోలేదు. కనీసం చేసుకునే తలంపైనా వాళ్ళకు ఉన్నట్టు కనిపించటం లేదు. నీ తరఫున నేను వాళ్ళతో విషయమంతా మాట్లాడాను. ఇప్పుడు నీవు చేయవలసిందంతా నీ తదనంతరం అమ్మాయిలందరికీ వచ్చే అయిదు వేలలో లిడియాకు కూడా భాగం ఉంటుందని నిర్ధారణ చేయటం, నీవు బతికున్నన్నాళ్ళు సంవత్సరానికో వందపౌన్లు ఇవ్వటానికి అంగీకరించటమూ. ఇవే షరతులు. నీవు తేలికగా అంగీకరించవచ్చును. అదీగాక, వికం పరిస్థితులు నేను విచారించాను. అతను మనం అనుకున్నంత బీదవాడుకాడు. నీ తరఫున నేను పని చేయటానికి హక్కు పత్రం రాసి పంపించు. ఇక నీవు లండన్ రావలసిన అవసరం ఉండదు. నీ తరఫున ఇక్కడ అంతా చేయిస్తాను. అమ్మాయి వివాహం మా ఇంట్లోనే జరగాలని నిశ్చయించాం. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత మరోసారి రాస్తాను.

-ఎడ్వర్డ్ గార్డినర్

ఉత్తరం చదవటం పూర్తిచేసి, ఎలిజబెత్ 'ఇది సాధ్యమా? ఆమెను అతడు వివాహం చేసుకోవటం సాధ్యమేనా?' అంది.

"అయితే వికం మనం అనుకున్నంత దుర్మార్గుడు కాదన్నమాట!" అంది జేన్.

"ఉత్తరానికి జవాబు రాశావా నాన్నా."

"లేదు. రాయాలి."

వెంటనే రాయమని చెప్పింది.

"పోనీ నీ బదులు నేను రాస్తాలే" అంది జేన్.

అందరూ ఇంటిలోకి వెళ్ళారు.

ఎలిజబెత్ "అయితే ఆ షరతులకు అంగీకరించవలసిందేగా!" అంది.

"అంత తేలిగ్గా వొదులుతుందనుకోలేదు."

"వాళ్ళు వివాహం చేసుకోవాలి, తప్పదు."

"అవును. అంతకంటే మార్గంలేదు. నాకు రెండు విషయాలు తెలుసుకోవాలని ఉంది: ఈ వ్యవహారంలో మీ మామయ్య ఎంత డబ్బు ఖర్చుపెట్టాడు? రెండు, దాన్ని నేనతనికి చెల్లించే మార్గం ఏమిటి?"

"డబ్బా? ఏమిటి నాన్నా నువ్వనేదీ?"

"మతివున్న వాడెవడూ- ఈ చిన్న షరతులకు లిడియాను పెళ్ళిచేసుకోడు."

"అదీ నిజమే! నాకు ముందే తోచలేదు సుమా! ఆయన అప్పు తీర్చుకోవాలి. ఇదంతా మామయ్య చేసిన ఉపకారమే! ఎంతో మంచివాడు, ఉదారుడు, మహాత్ముడు!"

"పదివేల పౌన్ల కట్నమన్నా లేకుండా ఆమెను వివాహం చేసుకుంటే, వికం శుద్ధ తెలివితక్కువవాడన్న మాట."

"పదివేలపౌన్లా? దాన్నంతా మళ్ళీ చెల్లించటం ఎలా?"

బెనెట్ జవాబు చెప్పలేదు. ఇంటికి వెళ్ళేంతవరకూ ఇద్దరూ దీర్ఘాలోచనలో మునిగి ఉన్నారు. తండ్రి ఉత్తరం రాయటానికి లైబ్రరీ గదిలోకి వెళ్ళాడు.

"వికంకు ఏమాత్రం అప్పులున్నాయో తెలిస్తే గార్డినర్ ఎంత ఇచ్చాడో మనం తెలుసుకోవచ్చును. వికం దగ్గర చిల్లు నాణెం కూడా లేని విషయం మనకు తెలుసుగా! నిజంగా మామయ్య, అత్త చేస్తున్న మేలు ఇంతంతకాదు!"

"సరే. మొత్తం మీద అతనామెను వివాహం చేసుకోవటానికి ఒప్పుకున్నాడు. అంతేచాలు! ఇకమీద వాళ్ళే తిన్నగా ఉంటారులే" అంది జేన్.

ఇంతవరకు తల్లికి ఈ సమాచారం ఏమీ చెప్పలేదని తోచింది; వాళ్ళకిప్పుడు తండ్రి అనుమతి తీసుకుని, ఉత్తరంతో సహా తల్లి దగ్గరికి వెళ్ళారు. మేరీ, కిట్టీ తల్లి దగ్గరే ఉన్నారు. తల్లి ఉత్తరంలో సంగతులు విని చాలా సంతోషించింది.

50

మిస్టర్ బెనెట్, ఇంతకు ముందు తన సంపాదనలో అంతా ఖర్చుచేసుకోకుండా- పిల్లలకోసం తన తదనంతరం జీవించేట్టయితే- భార్యకోసం కూడా- కొంత డబ్బు నిలవచేసి ఉంచాలని అనుకుంటూ ఉండేవాడు. ఇప్పుడు ఆ కోరిక మరింత తీవ్రరూపం దాల్చింది. తనే గనుక ఈ పని శ్రద్ధగా చేసినట్టయితే, ఇప్పుడు లిడియా తన భవిష్యత్తు కోసం, మామయ్య మీద ఆధారపడి ఉండదు. గార్డినర్ ఈ వ్యవహారంలో ఎంత ఖర్చుచేశాడో తెలుసుకుని అదంతా ఇచ్చివేయాలని ఆయన సంకల్పం.

మొదట, బెనెట్ వివాహం జరిగినప్పుడు, పొదుపనేది కేవలం నిరర్థకమైపోయింది. వారిద్దరూ సుపుత్రుడికోసం ఎదురుచూశారు. అయితే వారికి వరసగా అయిదుగురు అమ్మాయిలు పుట్టారు. ఆ పుత్రుడు ఇంకా పుట్టవలసి ఉన్నాడు. లిడియా పుట్టిన చాలా సంవత్సరాల వరకు కూడా- మిసెస్ బెనెట్ ఈ విషయమై నిర్ధారణగానే ఉంది. తరువాత ఈ ఆశ వొదిలిపోయినా, ఇక పొదుపు అనేది అసాధ్యం అయిపోయింది!

వివాహాదికాలకు అయిదు వేలు ఉన్నాయి. అయితే ఇవి పిల్లలకు ఏ నిష్పత్తిలో పంచాలనేది కేవలం తల్లిదండ్రుల ఇష్టం మీద ఆధారపడి ఉంది. ఇప్పుడు లిడియా విషయం తుదియేర్పాటు చేసెయ్యాలి. గార్డినర్‌కు ఆయన ఉత్తరం వెళ్ళిపోయింది. ఈ

ఉత్తరంలో ఎంత ఖర్చుపెట్టిందీ తెలియపర్చమని రాశాడు.

ఈ శుభవార్త ఇరుగుపొరుగు వారందరికీ నిమిషాల మీద పాకిపోయింది.

పదిహేను రోజుల నుంచి మిసెస్ బెనెట్ మేడ దిగి రావటం లేదు. కానీ ఈ శుభవార్త తెలిసిన రోజున ఆమె ఆ పని చేసింది. తన కుమార్తెలలో ఒక దాని వివాహం! జేన్‌కు పదహారు సంవత్సరాలు వచ్చినప్పటి నుంచీ ఆమెకు మనసులో ఇదే కోరిక. తన కూతురుకు, అల్లుడికి మంచి బంగళా చూద్దామని ఆలోచిస్తోంది. చివరికి బెనెట్ ఇలా అన్నాడు: "నీ కూతురికీ, అల్లుడికీ ఇల్లు చూసేముందు ఒక విషయం తెలుసుకో. ఈ ప్రాంతాలకు వాళ్ళిద్దర్లో ఎవరూ రాలేరు. లాంగ్‌బర్న్‌లో ఎవరికీ ప్రవేశంలేదు!"

ఎలిజబెత్, ఈ కథంతా ముందుగానే డార్సీకి తెలిసిపోయినందుకు చాలా విచారిస్తోంది. ఇటువంటి దారుణమైన వార్త విన్న తర్వాత, ఈ కుటుంబంతో అతను సంబంధం పెట్టుకోవటానికి భయపడతాడేమో! అతన్ని గురించి వార్తలు వినాలని ఉంది. తను అతనితో సుఖపడగలనని అనిపిస్తోంది.

గార్డినర్ దగ్గర్నుంచి మరో లేఖ వచ్చింది. ఉత్తరంలోని ముఖ్యవిషయం ఏమిటంటే వికం మిలటరీ సేవను వొదిలిపెట్టటానికి నిర్ణయించుకున్నాడు. ఆయన ఇంకా ఇలా రాశాడు: "నేను కల్నల్ ఫోర్ట్స్‌కు ఉత్తరం రాశాను. బ్రైటన్‌లోను, వెలుపల వికం తాలూకు అప్పులన్నీ త్వరలోనే చెల్లుకడతామని అప్పుల వాళ్ళతో చెప్పమన్నాడు. ఇందుకు నాదీ పూచీ అని తెలియపరిచాను. మెంటాన్‌లోని అతని అప్పుల వాళ్ళ విషయంలో కూడా నీవు ఇటువంటి భరోసా ఇవ్వడం మంచిది. అంతా ఒక వారంలో పూర్తయిపోయింది. లిడియాకు మిమ్మల్ని అందరినీ చూడాలని బెంగగా ఉందట..."

-గార్డినర్

తమ దారిన తాము వెళ్ళిపోయే ముందు ఒకసారి ఇంటికి వచ్చి నలుగురితో పాటు కలిసి ఉండాలనే లిడియా కోరికను బెనెట్ నిరాకరించాడు. అయితే ఎలిజబెత్ జేన్‌లు గట్టిగా వాదించి తండ్రిని బతిమాలి, భంగపడి, ఇందుకు ఒప్పించారు. వివాహం అయిన తమ అమ్మాయిని ఇరుగుపొరుగు వారికి చూపవచ్చునని మిసెస్ బెనెట్ గర్వపడింది. వికం ఇటువంటి ప్రణాళికకు ఆమోదించటం ఎలిజబెత్‌కు ఆశ్చర్యంగా ఉంది. అయితే అతన్ని కలుసుకోవటం అనేది, ఎలిజబెత్ కోరికలలో చిట్టచివరిది.

51

చెల్లెలి పెళ్ళిరోజు దగ్గర పడుతున్నకొద్దీ జేన్ ఎలిజబెత్‌లకు హడావిడి ఎక్కువ అవుతోంది. బహుశా లిడియా కూడా ఇంత హడావిడిపడటం లేదేమో! వాళ్ళకోసం బగ్గీ

పంపించారు. వాళ్ళు భోజనం వేళకల్లా ఇక్కడ చేరుకోవాలి. వాళ్ళరాక తల్చుకుంటే ఈ ఇద్దరికీ భయం భయంగా ఉంది. ముఖ్యంగా జేన్‌కు.

వాళ్ళు వచ్చారు. అందరూ ఫలహారాల గదిలో చేరి వాళ్ళకు స్వాగతం ఇచ్చారు. బగ్గీ గుమ్మం దగ్గరకు వచ్చేసరికి మిసెస్ బెనెట్ ముఖంలో చిరునవ్వులు మొలకెత్తాయి. బెనెట్ గంభీరంగా కూర్చున్నాడు. అమ్మాయిలు భయంగా, ఆదుర్దాగా, చికాగ్గా కనిపిస్తున్నారు.

లిడియా గొంతు వినిపించింది. తలుపు తెరుచుకుంది. లిడియా పరుగెత్తుకుంటూ లోనికి వచ్చింది. తల్లి ముందుకు వెళ్ళి ఆమెను కౌగలించుకుంది. తల్లి వికంతో కరస్పర్శచేసి లోపలకు తీసుకు వచ్చింది.

దంపతులు లోపలకు వచ్చాక కూడా బెనెట్ గంభీరంగానే ఉన్నాడు. మిసెస్ బెనెట్ ఆయన్ను చూసి నివ్వెరపోయింది. లిడియా అక్కలందరి వంకా పరికించి చూసింది. అందర్నీ సరదాగా పలుకరించింది. వికం, ఎలిజబెత్‌కు దగ్గరగా కూర్చున్నాడు. చుట్టుపక్కల ఉన్న తన స్నేహితులను గురించి అడుగుతున్నాడు. ఎలిజబెత్ చికాగ్గానే జవాబులు చెబుతోంది.

లిడియా ఇలా అంది: "అప్పుడే మూడు నెలలయింది. అంతా పది పదిహేను రోజుల క్రితం జరిగినట్టుగా ఉంది నాకు. నేను వెళ్ళిపోయేటప్పుడు, నాకు వివాహాన్ని గురించి చింతేలేదు- తిరిగి వచ్చేదాకా!'

తండ్రి తలపైకెత్తి చూశాడు. జేన్ అదిరిపడింది. ఎలిజబెత్ లిడియా వంక ఏమిటన్నట్టు చూసింది. లిడియా తన ధోరణిలో తను మాట్లాడుకు పోతూనే ఉంది. "ఏం, అమ్మా! ఇక్కడి వాళ్ళందరికీ నాకు పెళ్ళయిందని తెలుసా? వాళ్ళకు తెలియదేమో!"

ఎలిజాకు ఈ ధోరణేమీ నచ్చ లేదు. లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది. తిరిగి భోజనం వేళదాకా వాళ్ళ దగ్గరకు రాలేదు. భోజనాల బల్ల దగ్గర లిడియా జేన్‌తో ఇలా అంది: "జేన్ ఇవాళ నేను నీ స్థలంలో కూర్చుంటాను. ఎందుకంటే నేను వివాహితను!"

భోజనాలయ్యాక లిడియా తల్లితో అంది: "ఏం, అమ్మా, నా భర్త ఎలా ఉన్నాడు? చాలా మంచివాడు కదూ! నా అక్కయ్యలంతా నన్ను చూసి అసూయ పడతారులే!"

"నిజమే! కానీ నీవలా అతనితోపాటు పారిపోవటం మాకేం నచ్చలేదు."

"ఓ! దానిలో ఏముంది? నాకలా ఇష్టం. నువ్వు, నాన్న, అక్కలు అందరూ మా దగ్గరికి రండి. మేం శీతాకాలమంతా న్యూకాజిల్‌లో ఉంటాం. అక్కడ కొన్ని బాల్స్ ఏర్పాటు చేస్తాం. అక్కలందరికీ మంచి భాగస్వాములు దొరికేట్టు చూస్తాలే."

"అలాగా! అయితే నాకెంతో ఇష్టం" అంది తల్లి.

"తరువాత మీరు వెళ్ళిపోయేటప్పుడు ఇద్దరు అక్కలను నా దగ్గర వదిలి వెళ్ళవచ్చు. శీతాకాలం ముగిసే లోపల వాళ్ళందరికీ భర్తలను చేకూర్చే బాధ్యత నాది!"

"నీ మాటలకు ధన్యవాదాలు. కానీ నీలా మొగుడిని సంపాదించుకోవటం నాకు ఇష్టంలేదు'' అంది ఎలిజబెత్.

– వీళ్ళు పది రోజుల కంటే ఎక్కువ ఉండటానికి లేదు అని బెనెట్ తేల్చి చెప్పేశాడు.

అందుకు ఆ ఇంట్లో మిసెస్ బెనెట్ తప్ప పెద్దగా విచారించిన వారెవరూ లేరు.

ఒక రోజు ఉదయం లిడియా ఎలిజబెత్ జేన్‌లు ముగ్గురూ ఒక చోట కూర్చుని ఉన్నప్పుడు లిడియా ఇలా అంది: "లిజ్జీ! నా వివాహం సంగతులు చెబుతున్నప్పుడు నీవు లేవు. నీకా ముచ్చటలు విందామనిలేదా? పదకొండు గంటలకు ముహూర్తం. మామయ్య, అత్త, నేను కలిసి చర్చికి వెళ్ళాం. తతిమ్మా వాళ్ళంతా అక్కడికే వచ్చారు. నాకు భయంగా ఉంది. ఏదైనా జరిగి పెళ్లి ఆగిపోతుందేమోనని! అత్తయ్య నాకు పురాణ కాలక్షేపంలా ఏదో చెబుతూనే ఉన్నది. నాకు ఏవీ వినపడటం లేదనుకో. నేను నా వికంను గురించి ఆలోచిస్తున్నాను. చర్చి దగ్గిర ముహూర్తం. ఇంకా పావుగంట ఉందనగా మావయ్య ఎటో వెళ్ళాడు. ఆయన తిరిగి రాడేమోనని బెంగ! పది నిమిషాలలోనే తిరిగి వచ్చాడులే! ఆయన రాకపోయినా, వివాహం వాయిదా పడదు. ఎందుకంటే, మిస్టర్ డార్సీ వచ్చాడు. ఒక వేళ మావయ్య వేళకు లేకపోతే ఈ తతంగం అంతా ఆయనే నడిపేవాడు."

"డార్సీ!" అంది ఎలిజబెత్ ఆశ్చర్యపోయి.

"అవును! ఆయన వికంతో పాటు అక్కడికి వచ్చాడు. ఓ... అన్నట్టు నేను అంతా మరిచిపోయి వాగేస్తున్నానేమిటి? అదంతా రహస్యం. అమిత రహస్యంగా ఉంచుతానని వాళ్ళకు వాగ్దానం కూడా చేశాను. వికం ఏమంటాడో! నేనీ రహస్యాన్ని కాపాడాలి!"

లిజ్జీకి ఆ విషయం వివరంగా విందామని ఎంత కుతూహలం ఉంది. కానీ లిడియాని అడగటం అసంభవమైన విషయం. డార్సీ తన చెల్లెలి వివాహానికి హాజరైనాడన్నమాట! ఎంత విచిత్రమైన విషయం. కానీ ఆ విషయం గురించి తెలుసుకోవాలి. ఎలా!?

"అంత రహస్యం అయితే, ఆ విషయం ఇంకో ముక్కకూడా చెప్పకు. మేం అడుగుతామేమోనని నీకు భయం అక్కర్లేదు" అంది జేన్.

"మంచిది. ఒక వేళ మీరు బలవంతం చేసి అడిగేట్టయితే నేను అంతా చెప్పేస్తాను. అప్పుడు వికంకు కోపం వస్తుంది'' అంది లిడియా.

ఎలిజబెత్ అత్తకి వివరాల కోసం ఉత్తరం రాసి జవాబుకోసం ఎదురు చూస్తొంది.

52

తిరుగు టపాలోనే ఎలిజబెత్ జవాబు వచ్చింది. ఉత్తరం తీసుకుని, ఆమె తోటలోకి పరుగెత్తి ఒంటరిగా ఒక బల్లమీద కూర్చుని తీరుబడిగా ఉత్తరం చదువుకుంది.

"ప్రియమైన ఎలిజా!

నీ ఉత్తరం ఇప్పుడే అందింది. ఈ ఉదయమంతా దీనికి జవాబు రాయటంలో గడుపుదామనుకుంటున్నాను. నీ దగ్గర్నించి ఇటువంటి వింత ఉత్తరం వస్తుందని నాకు తట్టలేదు, ఈ విషయమంతా నీకు వివరంగా చెబుతా విను:

"నేను లాంగ్‌బర్న్ నుంచి తిరిగి వచ్చిన రోజునే, మీ మావయ్య దగ్గరకు డార్సీ వచ్చాడు. వాళ్లు గంటలకొద్దీ ఏకాంతంగా మాట్లాడుకున్నారు. ఆయన ఎందుకు వచ్చాడో తెలుసా, లిడియా వికంలు ఎక్కడున్నారో తను కనిపెట్టాననీ, వాళ్ళిద్దరితో మాట్లాడి వచ్చాననీ, చెప్పటానికి! అతను వాళ్ళను వెదకటం కోసమే డెర్బీ షైర్ నుంచి లండన్ వచ్చాడట.

"మిసెస్ యంగ్ అనే ఆమె ఒకతె ఉన్నదట. ఈమె పూర్వం ఎప్పుడో డార్సీకి గవర్నెస్‌గా పనిచేసింది. ఇప్పుడు ఎడ్వర్డ్‌స్ట్రీట్‌లో మేడ కొనుక్కొని గదులు అద్దెకు ఇస్తూ ఉంటుందట. ఈ యంగ్‌కు వికంతో పరిచయం ఉందట. డార్సీ ఈమె ద్వారా వికం గుట్టు తెలుసుకుని అతనితో మాట్లాడాడు. లిడియాతో కూడా మాట్లాడాడు. ఇటువంటి సిగ్గుమాలిన పరిస్థితి నుంచి బయటపడమని సలహా ఇచ్చాడు. హాయిగా ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పాడు. అయితే లిడియా అందుకు ఒప్పుకోక తన ప్రస్తుత స్థితే బాగుందన్నదట. వికంను వదిలిరాననీ, ఇటువంటి పనికోసం ఎవరి సలహాలు, సహకారాలు అక్కర్లేదన్నదట. తామిద్దరూ వివాహం చేసుకుంటామన్నదట. అయితే వికంతో మాట్లాడిన మొదటిసారే, అతనికి వివాహం చేసుకునే తలంపులేదని గ్రహించాడట డార్సీ. ఈ విషయంలో డార్సీ అనేక పర్యాయాలు వికంను కలిసి మాట్లాడాడట. చివరకు ఎంతో బలవంతం మీద, ఇద్దరికీ సమాధానం కుదిరింది. అప్పుడు డార్సీ వచ్చి మీ మావయ్యతో ఇదంతా చెప్పాడు. ఇద్దరూ ఈ విషయం గంటలకొద్దీ చర్చించుకున్నారు. రాజీ ఏర్పాటంతా మీ మావయ్య చేసినట్టే ఉంచమనీ, తను ఈ సందర్భంలో అజ్ఞాతంగా ఉండదలచుకున్నాననీ అన్నాడు. అందుచేత ఇదంతా రహస్యంగానే ఉండిపోయింది. నీవు కూడా దీన్ని ఎవరికీ చెప్పకు, ఒక్క జేన్‌కు తప్ప.

"ఇంతకూ వికం కోసం ఏం చేశారో చెప్పనా, అతని అప్పులన్నీ తీర్చటానికి వెయ్యి పౌన్లు కావాలి. తతిమ్మా ఏర్పాట్ల కోసం మరో వెయ్యి.

"వివాహానికి డార్సీ కూడా వచ్చాడు. మరురోజు మా ఇంట్లో విందులో పాల్గొన్నాడు కూడా. అతను ఇక్కడున్నన్నాళ్ళు ఎంతో అనుకూలంగా చక్కగా ఉన్నాడు. అతనికి అమిత సిగ్గు కూడాను. నీ పేరు ఎప్పుడు అనలేదు- అదో ఫ్యాషన్ కాబోలు.

"ఇంకా రాయాలని ఉంది. కానీ- పిల్లలు గోలచేస్తున్నారు. ఉంటా..."

- మిసెస్ గార్డినర్

ఎలిజబెత్ ఆశ్చర్యంలో మునిగిపోయింది. డార్సీ గురించి ఆలోచిస్తూ కూర్చుండి పోయింది. లిడియాని తిరిగి తమలో కలవటానికి అతను ఎంత శ్రమపడ్డాడు. ఎంత డబ్బు ఖర్చు చేశాడు!

ఇంతలో ఎవరో వస్తున్నట్టు అడుగుల చప్పుడు అయింది. ఎలిజబెత్ లేచి నడకసాగించింది. వికం ఎదురొచ్చాడు. 'నీ ఏకాంతానికి భంగం కలిగించానా' అన్నాడు.

"అవును. అయినా ఫరవాలేదు. ఇంకెవరైనా వస్తున్నారా?"

"లేదు. మీ అమ్మ, లిడియా మెంటాన్ వెళుతున్నారు. నీవు పెంబర్లే వెళ్ళి ప్రత్యక్షంగా చూసి వచ్చావటగా!"

"అవును."

"అక్కడ పాపం, ముసలి గవర్నెస్ కనిపించిందా? నేనంటే ఎంతో ఆప్యాయంగా ఉండేది. నన్ను గురించి ఏమైనా అన్నారా?"

"చెప్పింది. యుద్ధంలోకి వెళ్ళారనీ, ఇప్పుడంతా బాగా ఉండటం లేదనీ."

కొద్ది విరామం తర్వాత అతను ఇలా అన్నాడు:

"పోయిన నెల లండన్‌లో డార్సీ కనిపించాడు. అనేక మార్లు ఇద్దరం తారసపడ్డాం కూడా. ఎందుకోసం వచ్చాడో!"

"బహుశా లేడీ కాథరైన్ కుమార్తెతో వివాహం స్థిరపరుచుకోవడానికేమో!" అంది.

"కావచ్చు. లండన్‌లో ఉండగా, నీవు అతన్ని చూశావా?"

"చూశాను. అతని చెల్లెల్ని కూడా పరిచయం చేశాడు."

"ఆమె అంటే నీకు ఇష్టమేనా?"

"చాలా."

"మీరు క్రింప్టన్ గ్రామం మీదుగా వెళ్ళారా?"

"లేదనుకుంటాను. సరిగా గుర్తులేదు."

"ఎందుకడిగానంటే, న్యాయప్రకారం ఆ గ్రామం నాకు రావలసింది!"

53

లిడియా వెళ్ళిపోయేరోజు వచ్చింది. మిసెస్ బెనెట్ 'అమ్మాయి, లిడియా మనం మళ్ళీ ఎన్నాళ్ళకు కలుసుకుంటామో' అని ఆక్రోశించింది.

"ఏ రెండు మూడేళ్ళకోగాని కలవలేమేమో!"

"అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూ ఉండు సుమా!"

"అలాగే రాస్తాను. కానీ నాకు అంత తీరుబడి అవదేమో. అక్కయ్యల్ని రాస్తూ ఉండమను. వాళ్ళకు వేరే పన్లేమీ లేవుగా."

వాళ్ళు వెళ్లాక మిసెస్ బెనెట్ లిడియా కోసం కొన్నాళ్ళు బెంగపెట్టుకుంది.

ఇంతలో నెదర్‌ఫీల్డ్‌లో ఉండే పని మనిషికి యజమాని రాబోతున్నాడనీ, అందుకని ఇల్లంతా శుభ్రం చేసి ఉంచమనీ కబురు వచ్చింది. ఈ కబురు తెలియటంతో మిసెస్ బెనెట్ ఆశలు మళ్ళీ చిగురించాయి. బింగ్లీ కొన్ని వారాలపాటు వేట వినోదంలో గడపడానికి ఒకటి రెండు రోజుల్లో ఇక్కడికి వస్తున్నాడట!

భర్తతో 'బింగ్లీ వచ్చీ రావటంతోటే, మీరు వెళ్ళి చూసిరండి' అంది.

"వెళ్ళను. పోయిన సంవత్సరం కూడా ఇలాగే వెళ్ళమని నా ప్రాణం తీశావు. నేను వెళ్ళి రావడంతోటే, అతను మన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడని ఊహాగానం చేశావు. చివరకు అయిందేమిటి? మళ్ళీ ఈ ఏడు కూడా ఇటువంటి వెర్రిపని నేను చేయను!"

ఆమె ఆయనకు నచ్చచెప్పటానికి ఎంతగానో ప్రయత్నించింది.

చివరకాయన ఇలా అన్నాడు: "నాకు ఇటువంటి సంప్రదాయాలంటే చికాకు. అంతగా కావాలంటే అతనే మన ఇంటికి వస్తాడులే. మన ఇల్లు అతను ఎరుగును!"

ఎలిజబెత్‌తో జేన్ ఇలా అంది: "అతను వస్తున్నాడంటే నాకు విచారంగా ఉంది. చివరకు ఏ పరిణామం లేకుండా అతను వెళ్ళిపోతాడు!'

"అంతా చూద్దాంగా."

బింగ్లీ వచ్చాడు. అతనికోసం ఆహ్వానం పంపిద్దామని మిసెస్ బెనెట్ అనుకుంటూ ఉండగా, అతను వచ్చిన మూడో రోజు ఉదయం, అకస్మాత్తుగా లాంగ్‌బర్న్ రానే వచ్చాడు.

"అతనితో పాటు మరో మనిషి ఉన్నాడు. అతనెవరమ్మా!" అంది కిట్టీ.

"ఎవరో పరిచయస్థుడై ఉంటాడు."

"ఓ! అప్పుడూ, పోయిన సంవత్సరం కూడా వచ్చాడే- అతను- పేరేమిటీ... అదేమిటి, పొడుగ్గా, గర్వంగా ఉండేవాడే అతను."

"డార్సీయా?... బింగ్లీ స్నేహితుడు, ఎవరైనా కానీ, అతనికిక్కడ సుస్వాగతమే!"

జేన్ ఎలిజబెత్ వంక విచిత్రంగా చూసింది. ఆమెకు డెర్బీషైర్‌లో వాళ్ళిద్దరూ కలుసుకున్న వైనం తెలియదు. అందుచేత డార్సీ రాక చెల్లెలికి అయిష్టమవుతుందని అనుకొంది. మిసెస్ బెనెట్‌కు కూడా డార్సీ అంటే అయిష్టమే.

గార్డినర్ ఉత్తరాన్ని గురించి ఎలిజబెత్ కనీసం జేన్‌కు కూడా చెప్పలేదు.

అందరూ లోనికి వచ్చి కూర్చున్నారు. మిసెస్ బెనెట్ వాళ్ళకు స్వాగతం చెప్పి కుశల ప్రశ్నలు వేస్తూ కూర్చుంది. డార్సీ ఎక్కువగా మాట్లాడటం లేదు.

"మిస్టర్ బింగ్లీ, మీరు ఇక్కడి నుంచి వెళ్ళి చాలాకాలం అయింది." అంది మిసెస్ బెనెట్. అతను అవునన్నాడు. ఆమె ఇలా చెప్పుకుపోయింది: 'మీరిక తిరిగి రారేమోనని భయపడిపోయాను. ఇక్కడ అందరూ అలాగే చెప్పుకోసాగారు. మైకేల్మన్సు పండుగకు

అందరూ ఇక్కడి నుంచి తరలి వెళ్ళిపోతారని చెప్పుకున్నారు. ఈ మధ్య ఇక్కడ చాలా మార్పులు; చేర్పులు జరిగాయి. మిస్ లూకా వివాహం చేసుకుని స్థిరపడింది. మా అమ్మాయిలలో ఒకతె కూడా పెళ్ళి చేసుకుంది. బహుశా మీరు వినే ఉంటారు. ఇదంతా గార్డినర్ ప్రయోజకత్వమే."

బింగ్లీ ఆమెకు అభినందనలు తెలిపాడు. ఎలిజబెత్ ధైర్యంచేసి కళ్ళు పైకి ఎత్తలేకపోయింది. అందుచేత డార్సీ వాలకం ప్రస్తుతం ఎలా ఉందో ఆమెకు తెలియదు.

మిసెస్ బెనెట్ ఇంకా విడియా దాంపత్యాన్ని గురించి చెబుతూనే ఉంది. చివరకామె ఇలా అంది: "మిస్టర్ బింగ్లీ మీ ఆవరణలో పిట్టలన్నిటినీ వేటాడాక, ఇక్కడి తోటలో పక్షులను కూడా వేటాడు. బెనెట్ గారు సంతోషంగా సమ్మతిస్తారు."

ఎలిజబెత్‌కి ఇదంతా కంపరంగా ఉంది. జేన్‌కు ఇప్పుడు సంతోషంగానే ఉన్నట్టుంది. బింగ్లీ రావడంతోటే ఆమెను పలుకరించాడు. ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి ఆమె వంక తిరిగి చూస్తున్నాడు. జేన్ అతన్ని అన్ని విధాలా ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది.

కొద్దిసేపు అయ్యాక, వాళ్ళిద్దరూ వెళ్ళిపోతామంటూ లేచారు. కొద్ది రోజుల్లో ఒకసారి లాంగ్‌బర్న్ వచ్చి విందారగించమని ఆహ్వానించింది బెనెట్. అసలు అప్పుడే ఇక్కడ ఉండిపోయి భోజనం చేసి వెళ్ళమని బలవంతం చేసింది మొదట. అయితే బింగ్లీ వేరే ఒకచోట తప్పనిసరి అయిన పని ఉన్నదనీ, వెళ్ళి తీరాలనీ అన్నాడు.

54

వాళ్ళు వెళ్ళిపోయాక, ఎలిజబెత్ తనను తాను సంబాళించుకో యత్నించింది. డార్సీ ప్రవర్తన ఆమెకు అత్యంత ఆశ్చర్యం కలిగించింది. "ఏమీ మాట్లాడకుండా ఉండటానికే వచ్చినట్టయితే ఎందుకు వచ్చినట్టు?" అనుకొంది.

"లండన్‌లో మా వాళ్ళతో కులాసాగా ఉన్నవాడు, ఇక్కడ నాతో కూడా అలా ఎందుకు ఉండడు? నేనంటే భయమైతే, అసలు ఎందుకు వచ్చాడు? పోనీ, నేనంటే లక్ష్యం లేకపోతే- నిశ్శబ్దంగా ఉన్నాడెందుకని?" అనుకుంది.

ఇంతలో జేన్ ఆమె దగ్గరకు వచ్చింది. "ప్రథమ సమావేశం అయింది. నా మనస్సు కుదటపడింది. నాకు నా బలం తెలుసు, అతను రావటంతోటే నేనేం ఎగిరి గంతులేయను. మంగళవారంనాడు ఇక్కడికి భోజనానికి రమ్మన్నాంగా- అప్పుడు చూస్తాను మజా! నేను మామూలుగా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తాను."

ఎలిజబెత్ నవ్వుతూ "నిర్లక్ష్యంగానా? జాగ్రత్త సుమా!" అంది.

"ప్రమాదంలో ఇరుక్కోవటానికి నేనేం బలహీనురాలిని కాదులే!"

"అతన్నే ప్రమాదంలో ఇరికిస్తావేమోనని!"

మంగళవారం వరకు మళ్ళీ వాళ్ళను చూడలేదు. మిసెస్ బెనెట్ ఈ లోపుగా బింగ్లీ సద్గుణాలను మననం చేసుకుంటూంది. లాంగ్‌బర్న్‌లో మంగళవారంనాడు పెద్ద పెట్టున విందు. అతిథులు ఇద్దరు ముందుగానే వచ్చి కూర్చున్నారు. బింగ్లీ జేన్ పక్కన కూర్చుంటాడా లేదా అని లిజ్జీ గమనించింది. లోపలకు అడుగుపెడుతూనే అతను సందేహిస్తూ కుర్చీల వంక చూశాడు. జేన్ మందహాసం చేసి ఆహ్వానించింది. అంతే. అతను వచ్చి పక్కనే కూర్చున్నాడు.

డార్సీ మటుకు ఎలిజబెత్‌కు దూరంగా కూర్చున్నాడు. అయితే సాయంత్రాని కన్నా తామిద్దరూ ఒక చోట చేరుతామేమోనని ఆశించింది. సాయంత్రానికి అతను నా దగ్గరకు రాకపోతే, ఇక అతన్ని శాశ్వతంగా దూరంగా ఉంచుతాను- అనుకుంది.

అతను వచ్చాడు. తన ఆశలకు జవాబు చెపుతున్నట్టే దగ్గరకు వచ్చాడు. అయితే ఏం లాభం? ఆడవాళ్ళు బల్లచుట్టూ చేరి కబుర్లు చెబుతున్నారు. అతను లోపలకు రావటం చూసి ఒక అమ్మాయి ఎలిజబెత్‌కు దగ్గరగా వచ్చి చెవిలో డార్సీ వినేలా ఇలా అంది: "మనం ఉన్న చోటికి మగవాళ్ళు ఎవరూ రాకూడదు కదూ?"

డార్సీ గదిలో మరో పక్కకు వెళ్ళాడు. ఆమె తన చూపులతో అతన్ని అనుసరించింది. అతను ఎవరెవరితో మాట్లాడితే వాళ్ళందరి పట్లా అసూయపడింది.

"ఒకసారి నిరాకరించబడిన వాడు! అతని ప్రేమను ఆశించటానికి నేనెంత తెలివి తక్కువదాన్ని! ఎంత బలహీనుడైతే మటుకు, ఒకే స్త్రీని రెండుమార్లు వేడుకొంటాడా?"

ఆమె ఇలా అనుకుంటూ ఉండగా, డార్సీ కాఫీ కప్పు తీసుకుని ఇటువైపు వచ్చాడు. ఎలిజా ధైర్యం చేసి "మీ చెల్లెలు ఇంకా పెంబర్లేలోనే ఉన్నదా?" అనడిగింది.

"అక్కడే ఉంది. క్రిస్టమస్ వరకు అక్కడే ఉంటుంది."

"ఒంటరిగానే? ఆమె స్నేహితులంతా వెళ్ళిపోయారేమో!"

"మిసెస్ ఆనెస్ ఉంది. తతిమ్మా వాళ్ళంతా వెళ్ళిపోయారు."

ఆమెకు ఈ పైన అడగటానికి ఇంకేమీ తోచలేదు. కొన్ని నిమిషాల వరకు అతను నిశ్శబ్దంగా ఆమె సరసనే నిలుచున్నాడు. కానీ, ఇంతలో ఒక అమ్మాయి ఎలిజాతో గుసగుస ప్రారంభించడంతో వెళ్ళిపోయాడు.

టీ పదార్థాలన్నీ తీసివేసిన తర్వాత, పేకాట బల్లలు పరిచారు. ఆడవాళ్ళంతా లేచారు. ఎలిజబెత్ ఇప్పుడతన్ని కలుసుకునేందుకు ప్రయత్నించింది. కానీ సాధ్యం కాలేదు. మిసెస్ బెనెట్ అతిథులిద్దర్నీ ప్రత్యేకంగా రాత్రి భోజనాలకు ఉంచుదామనుకుంది. అయితే వారి బగ్గీ అందరి కన్నా ముందుగా వచ్చి కూచుంది. అందుచేత ఈ ఆశ నెరవేరలేదు.

అందరూ వెళ్ళిపోయిన తరువాత ఆమె ఇలా అంది. "ఏం అమ్మాయిలూ, ఇవాళ ఎలా గడిచింది? అంతా సవ్యంగా జరిగిపోయింది కదూ. భోజన పదార్థాలన్నీ ఎప్పుడూ

లేనంత రుచిగా తయారైనాయి. డార్సీ ఎంతగానో మెచ్చుకున్నాడు. జేన్ 'ఇవాళ నీవు అచ్చం అప్సరసలా ఉన్నావు' అన్నది వాళ్లమ్మ. మిసెస్ లాంగ్ కూడా ఈ మాటే అన్నది. ఆమె ఇంకా నీవు నెదర్‌ఫీల్డ్‌కు ఇల్లాలివి కావటం తథ్యం అంది..."

జేన్ ఎలిజబెత్‌తో "మొత్తంమీద ఇవాళ సుదినం! మేమిద్దరం కులాసాగా గడిపాం. ఇక తరచూ కలుసుకుంటూ ఉంటాంలే" అంది.

ఎలిజబెత్ నవ్వింది.

"అలా నవ్వకు లిజ్జీ! నన్నేం అనుమానించకు" అంది జేన్.

55

కొద్ది రోజుల తరువాత, బింగ్లీ ఒక్కడే వచ్చాడు. అతని స్నేహితుడు ఆ ఉదయమే లండన్ వెళ్ళాడట, పది రోజుల్లో వస్తాడట. బింగ్లీ ఒక గంటసేపు కూర్చున్నాడు. హుషారుగా మాట్లాడాడు. మిసెస్ బెనెట్ అతన్ని భోజనానికి ఉండమన్నది. అయితే అతను మరెవరో ఆహ్వానించారన్నాడు.

"ఈసారి వచ్చినప్పుడైనా భోజనం చేసి వెళ్ళాలి" అంది ఆమె.

మరురోజే భోజనానికి రావటానికి ఏర్పాటయింది.

అతను అనుకున్న దానికంటే ముందుగానే వచ్చాడు. ఇంకా ఆడవాళ్ళు ఎవ్వరూ ముస్తాబు చేసుకోనేలేదు. మిసెస్ బెనెట్ అమ్మాయిలను తొందరచేసింది.

టీ అయినాక మిస్టర్ బెనెట్ తన అలవాటు ప్రకారం లైబ్రరీ గదిలోకి వెళ్ళాడు. మేరీ మేడమీద సంగీత సాధనం చేసుకుంటూంది. మిసెస్ బెనెట్ ఎలిజబెత్ వంక చూస్తూ కూర్చుంది. చివరకు తానే పైకి వెళ్ళింది. జేన్ ఎలిజబెత్ వంక చూసింది. ఇంతలో మిసెస్ బెనెట్ పైనుంచి ఎలిజాను కేక వేసింది. ఎలిజా హాలులోకి వెళ్ళేసరికి తల్లి "మనం వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదలటం మంచిది" అంది.

బింగ్లీ ఆ రోజంతా హుషారుగా, సంతోషంగా ఉన్నాడు. రాత్రి భోజనానికి ఉండటానికి అతనికి ఆహ్వానమే అనవసరమయింది. మరునాడు బింగ్లీని వచ్చి బెనెట్‌తో పాటు వేటలో పాల్గొనమని మిసెస్ బెనెట్ చెప్పింది.

ఈరోజు తరువాత, అక్కాచెల్లెళ్ళ సంభాషణలో బింగ్లీ ప్రస్తావన రానేలేదు. జేన్ ఇప్పుడు తన నిర్లక్ష్యాన్ని గురించి చెప్పటమే లేదు. బింగ్లీ అన్నమాట ప్రకారం ఉదయమే వచ్చాడు. బెనెట్, అతను ఉదయమంతా కలిసే గడిపారు. ఈ సాయంత్రం కూడా మిసెస్ బెనెట్ అతిప్రయత్నం మీద జేన్‌ను బింగ్లీని ఒంటరిగా ఒకచోట చేర్చగలిగింది.

ఆ రోజు సాయంత్రమే, బింగ్లీ తను జేన్‌ను వివాహమాడాలని నిశ్చయం చేసుకున్నట్టు ఆమె తల్లిదండ్రులకు చెప్పేశాడు. ఇంటిల్లిపాదీ సంతోష సముద్రంలో మునిగి తేలారు.

ఆ రోజు నుంచి బింగ్లీ దాదాపు రోజూ లాంగ్‌బర్న్ వస్తూనే ఉన్నాడు. మధ్యాహ్నం భోజన వేళకు ముందుగా వచ్చి, రాత్రి భోజనాలైన తరువాత వెళుతున్నాడు.

ఎలిజబెత్‌కు అక్కతో మాట్లాడే అవకాశమే రావడం లేదు. జేన్‌కు ఇతర ధ్యాసే లేదు.

ఒకనాడు జేన్ ఇలా అంది: "ఈ భూప్రపంచం మీద అదృష్టవంతురాలైన వనిత ఎవరైనా ఉన్నదంటే అది నేనే! ఎలిజా! పోతే నీ విషయంలో కూడా గొప్ప భర్త దొరికితే..."

"ఆ తరుణమూ త్వరలోనే వస్తుందేమోలే!"

జేన్, బింగ్లీల వివాహ నిశ్చయం చుట్టుపక్కల అందరికీ తెలిసింది. అందరూ బెనెట్‌ల అదృష్టాన్ని, పొగడసాగారు. కొన్ని వారాల క్రితమే, చిన్న అమ్మాయి విషయంలో జరిగిన విషాద పరిస్థితికి– పెద్దమ్మాయి శుభపరిణామం నిజంగా అదృష్టం అన్నారు.

56

ఒక వారం రోజుల తరువాత విచిత్రమైన సంఘటన జరిగింది. ఆ ఉదయమే జోడు గుఱ్ఱాల బగ్గీ లాంగ్‌బర్న్‌లో బెనెట్ గారి ఇంటిముందు ఆగింది. దానిలోంచి లేడీ కాథరైన్ దిగింది. అనుకోని ఆమె రాకకు అందరూ ఆశ్చర్యపోయారు. ఆమె అతి హుందాగా, దర్జాగా లోనికి వచ్చింది. ఎలిజబెత్ చేసిన నమస్కారానికి చెప్పుకోదగ్గ జవాబేమీ చెప్పకుండా తల ఊపింది. ఎలిజబెత్ తన తల్లితో ఈమె ఫలాన అని చెప్పింది మిసెస్ బెనెట్ అమందానందంతో ముందుకు వచ్చి ఆమెకు స్వాగతం ఇచ్చింది. కొద్దిసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాక– కాథరైన్ ఎలిజాతో 'అంతా కులాసాగా ఉన్నారమ్మా? ఆమె, మీ అమ్మే కదూ!' అంది. ఎలిజబెత్ అవునని తల ఊపింది.

"ఆమె మీ చెల్లెలా?"

"అవును. ఆఖరుదికాక పైది. ఆఖరు చెల్లెలికి ఈ మధ్యనే వివాహం అయింది. మా అక్కయ్య ఎక్కడో తోటలో షికారు చేస్తున్నట్టుంది. ఆమెతో షికారు చేస్తున్న యువకుడు త్వరలోనే మా కుటుంబంలో ఒకడవుతాడు."

లేడీ కాథరైన్ కాసేపయాక "ఇక్కడ చిన్నపార్కు ఉన్నట్టుంది కదూ!" అంది.

"రోసింగ్స్‌లోని పార్కుతో పోలిస్తే ఇది లెక్కలోకే రాదు. అయితే లూకాల ఇంటి పార్కు కంటే చాలా పెద్దది!"

"వేసవికాలం ఈ గదుల్లో కూర్చోటం యాతనగా ఉంటుందనుకుంటాను. కిటికీలు పశ్చిమంగా ఉన్నాయి."

మిసెస్ బెనెట్, తాము ఎప్పుడూ భోజనాలయ్యాక ఇక్కడ కూర్చోమని చెప్పింది. "మీరు వచ్చేటప్పటికి కోలిన్స్ దంపతులు క్షేమంగానే ఉన్నారా" అని అడిగింది.

"కులాసాగానే ఉన్నారు. నిన్న రాత్రి వాళ్ళను చూశాను."

మిసెస్ బెనెట్ ఆమెను కొద్దిగా ఫలహారం చేయమని ప్రాధేయపడింది. కానీ, లేడీ కాథరైన్ వీల్లేదని లేచి, ఎలిజబెత్‌తో "మీ పార్కులో కాస్సేపు తిరుగుదాం" అంది.

ఎలిజబెత్ ఆమెను తీసుకుని తోటలోకి వెళ్ళింది. లేడీ కాథరైన్ దారిలో, భోజనాల గది, కచేరి గది చూసి 'విశాలంగా బాగానే ఉన్నాయ'ని అంది.

ఆమె బగ్గీ ఇంకా గుమ్మం దగ్గరే ఉంది. అందులో ఒక పరిచారిక కూడా ఉన్నట్టు ఎలిజబెత్ గమనించింది.

ఉద్యానవనంలోకి వెళ్ళగానే కాథరైన్ ఇలా అంది:

"నేనిక్కడికి ఎందుకు వచ్చానో చెబుతాను విను. నీ హృదయానికి, నీ ఇంగితానికి... బహుశా ఈ కారణం తెలిసే ఉంటుంది."

ఎలిజబెత్ ఆశ్చర్యపోయి చూస్తూ నిలుచుంది.

"నాకు తెలియదు" అంది.

లేడీ కాథరైన్ కోపంగా అంది: 'మిస్ బెనెట్, నాకు కోపం తెప్పించకు. రెండు రోజుల క్రితం నాకో దారుణమైన కబురు తెలిసింది. నీ అక్కను బింగ్లీ చేసుకోవటమేగాక నిన్ను నా మేనల్లుడు డార్సీ చేసుకోబోతున్నాడని! బహుశా ఈ వార్త అబద్ధమే అనుకుంటాను. ఏమైనా, ఇక్కడికి వచ్చిన నా ఉద్దేశం ఏమిటో నీకు చెప్పి వెడదాం అనుకున్నాను."

"ఇది నిజం కాదనుకోవటం వల్లనే అనుకుంటాను. మీరు ఇంతదూరం శ్రమపడి వచ్చారు. ఇంతకూ మీరు చెప్పదలచుకున్నదేమిటి?" అంది ఎలిజబెత్.

"నేను విన్న వార్త అబద్ధమని నీ నోటి మీదుగా చెప్పిద్దామని!"

"అటువంటి వార్త అంటూ ఒకటి ఉంటే, మీరు లాంగ్‌బర్న్ వచ్చి నన్ను, మా కుటుంబాన్ని చూసి వెళ్ళటం దాన్ని మరింతగా ధృవపరుస్తోంది."

"అలాగా! అటువంటి వార్త ఉన్నట్టు నీకేం తెలియదంటావా? దాన్ని ప్రచారం చేసినదంతా మీరేగా! కాదా?" అని కాథరైన్ గద్దించింది.

"నేనెప్పుడూ ఇలా వినలేదు."

"అయితే – ఈ వార్తకు ఆధారం కూడా లేదంటావా?"

"మీతో హృదయం విప్పి మాట్లాడగల తాహతు నాకు లేదు. అందుచేత మీ ప్రశ్నలకు నేను జవాబులు చెప్పలేను."

"ఎలిజబెత్! సహించరాని మాట చెబుతున్నావు. నాకు జవాబు చెప్పి తీరాలి. నా మేనల్లుడు, డార్సీ వివాహాన్ని గురించి సంప్రదించాడా?"

"అది మీకు ఇష్టం లేదంటున్నారుగా!"

"అవును. అయినా నువ్వు నీ టక్కులతో, మాయాజాలంతో అతన్ని లోబర్చుకున్నావు!"

"ఒక వేళ నేనే అలా చేసి ఉన్నట్టయితే, అలాగని ఒప్పుకుంటానా?"

"మిస్ బెనెట్, ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? నాతో ఎవరూ ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడరు. డార్సీకి బంధువుని నేనొక్కదాన్నే. అతని ఆలోచనలన్నీ నాకు తెలియాలి!"

"కానీ నా ఆలోచనలు తెలుసుకునే అధికారం మీకు లేదుగా! నాతో ఇలా కర్కశంగా మాట్లాడటానికి మీకు మటుకు అధికారం ఏముంది?"

"నన్ను సూటిగా చెప్పనివ్వు. నీవు జరుగుతుందని ఆశిస్తున్న ఈ వివాహం, జరగటానికి ఎంతమాత్రం వీలులేదు. డార్సీకి నా కుమార్తెతో సంబంధం ఎప్పుడో నిశ్చయం అయింది. దీనికేమంటావు?"

"అలా అయితే డార్సీ నన్ను పెళ్ళాడతాడని ఎలా అన్నాడనుకుంటున్నారు?"

లేడీ కాథరైన్ క్షణంపాటు సంశయించి, ఇలా అంది: "వాళ్ళిద్దరి మధ్య ఏర్పాటు ఒక ప్రత్యేక తరహాకు చెందినది. చిన్నతనం నుంచి వాళ్ళు ఒకళ్ళ కోసం ఒకళ్ళు పెరిగారు. ఇది డార్సీ తల్లి కోరిక. ఉయ్యాలలో పిల్లలుగా ఉన్నప్పుడే, మేం వాళ్ళను దంపతులుగా నిర్ణయించాం. ఇక నీ విషయం ఏమంటావు? అతని వాళ్ళందరికీ ఇష్టం లేకపోయినా అతగాడినే కట్టుకుని ఊరేగుతానంటావా?"

"ఇది నేను లోగడ విన్నాను. మీరు వివాహానికి మీకు వీలైన ఏర్పాట్లన్నీ చేసుకొన్నారు. కానీ, డార్సీకేమీ అందులో ప్రమేయం ఉండదా? అతను నన్ను వివాహం చేసుకుంటాను అంటే, నాకు అభ్యంతరం మటుకు ఎందుకుండాలి?"

"ఎందుకంటే– గౌరవం, దర్జా, నిజాయితీ– ఇవన్నీ ఉండాలి కనుక. ఒక వేళ ఇది జరిగినా నిన్ను మేం మన్నించం. నా కుమార్తె, నా మేనల్లుడు ఒకరి కోసం ఒకరు జన్మించారు. వాళ్ళిద్దరూ ఒకే స్థాయిగల కుటుంబం నుంచి వచ్చిన వాళ్ళు. ఒకే స్థాయి సిరిసంపదలు కలవాళ్ళు. మధ్య నీవు అడ్డుతగలటం మంచిది కాదు."

"మీ మేనల్లుడిని వివాహం చేసుకోవటంలో నాకీ ఆలోచనలన్నీ లేవు. అతనొక పెద్ద మనిషి, గౌరవనీయుడు. నేనొక గౌరవనీయుని కుమార్తెను. అంతే!"

"నీవు గౌరవనీయుని కుమార్తెవే కావచ్చు– కానీ నీ తల్లి విషయం, నీ పిన్నులు, అత్తలు – అందరి విషయం? ఇవన్నీ తెలియనంత అమాయకురాలిననుకోకు."

"నా బంధువర్గం ఎటువంటి వాళ్ళయినా డార్సీకి అభ్యంతరం లేకపోతే చాలు!"

"ఒక్కటే మాట చెప్పు. డార్సీకి, నీకూ నిశ్చయం అయిందా?"

ఆమె ఒక్క క్షణం ఆలోచించి 'లేదు' అంది.

లేడీ కాథరైన్ ముఖంలో సంతృప్తి కనిపించింది.

"అటువంటి ఏర్పాటుకు ఇక ముందు అంగీకరించనని నాకు మాట ఇస్తావా?"

"అటువంటి వాగ్దానాలేమీ చేయలేను, క్షమించండి."

"నాకు ఆశ్చర్యంగా ఉంది నీ వైఖరి! ఏమిటింత అర్థం, పర్థంలేని, తెలివి లేని పిల్లలా

మాట్లాడతావు? నేను వెనక్కు తిరిగిపోతానని నిన్ను నీవు మోసం చేసుకోకు. నీవు అలాంటి వాగ్దానం చేసేదాకా ఇక్కడ నించి కదలను!"

"నేను అటువంటి వాగ్దానం ఏ పరిస్థితుల్లోనూ చేయను. ఒక వేళ నేను ఇలా వాగ్దానం చేసినా డార్సీ మీ అమ్మాయినే చేసుకుంటాడని రూఢి ఏమిటి? మీరిలా అడగటాన్ని మీ మేనల్లుడు ఎంతవరకు సమర్థించగలడో ముందు ఆలోచించండి!"

"అలా తొందరపడకు. నేను చెప్పవలసింది ఇంకో విషయం ఉంది. మీ చిన్న చెల్లెలు ప్రియుడితో పారిపోయిన సంగతి నాకు తెలియదనుకోకు. వాళ్ళ వివాహం ఎంత అతుకుల కథో నాకు బాగా తెలుసు. అటువంటి అమ్మాయి నా మేనల్లుడికి మరదలు అవటమా? ఆ వికం నా మేనల్లుడికి తోడల్లుడు అవటమా? నీవు ఏమనుకుంటున్నావు? పెంబర్లే కీర్తి ప్రతిష్టలు ఇలా నీళ్ళపాలు చేద్దామనా?"

"ఇంక మీరు చెప్పవలసిందేమీ మిగలలేదనుకుంటాను. సాధ్యమైనన్ని విధాలా నన్ను అవమానించారు. ఇక ఇంట్లోకి వెడదాం రండి" అంటూ ఎలిజబెత్ లేచింది.

"అయితే నా మేనల్లుడి గౌరవానికీ, కీర్తి ప్రతిష్టలకు నీకేం లక్ష్యం లేదన్నమాట! నీ స్వార్థమే నీది కానీ నీతో సంబంధం పెట్టుకుంటే అతను అందరి దృష్టిలోనూ చౌక అయిపోతాడని నీకు తోచడం లేదా?"

"లేడీ కాథరైన్, ఈ విషయంలో ఇంకా నేను చెప్పవలసిందేమీ లేదు."

"అయితే అతన్ని చేపట్టటానికే సంసిద్ధమై ఉన్నావన్నమాట!"

"నా మనసుకి ఏది మంచో అదే చేస్తాను. మీ కోసం నేనేం చేయను."

"అయితే అతన్ని సర్వనాశనం చేస్తావన్న మాట!" ఇదే నీ చివరి నిశ్చయం కదూ! ఎలిజా, ఇది ఎప్పటికీ జరుగుతుందనుకోకు. నిన్ను కదిలించి వెడదామని వచ్చాను. నీ నిజస్వరూపం తెలిసిపోయింది. ఇక నా పని నేను చేస్తాలే."

ఈ సరికి వాళ్ళు గుమ్మం దగ్గరకు చేరుకున్నారు. లేడీ కాథరైన్ బగ్గీ ఎక్కి కూర్చుని "నేను నీ దగ్గర సెలవు తీసుకోను. మీ అమ్మకు అభివందనలు తెలుపను. నాకు చాలా అసంతృప్తిగా ఉంది. మీరంతా అలగా మనుషులు" అంది.

ఎలిజబెత్ ఒక్కతే ఇంట్లోకి నడిచింది.

మెరిటాన్ మీదుగా వెడుతూ ఒకసారి చూసి వెళ్ళిందనీ, ఆమె చాలా ఉదార స్వభావురాలనీ అంతా చెప్పుకున్నారు. ఎలిజబెత్ కూడా ఏ విషయమూ బయటపెట్టలేదు.

57

ఎలిజబెత్ మనసంతా ఛిన్నాభిన్నం అయింది. లేడీ కాథరైన్ అంతదూరం ఇక్కడికి వచ్చింది ఈ పనిమీదా! ఆమె ఈ విషయాలను గురించే తనలో తాను రకరకాలుగా

ఆలోచించుకుంటూంది. మరునాడు ఎలిజబెత్ మేడమెట్లు దిగుతూ ఉండగా తండ్రి పైకి వస్తూ ఎదురయ్యాడు. ఆయన చేతిలో ఒక ఉత్తరం ఉంది.

"లిజ్జీ నీ కోసమే వస్తున్నానమ్మా. ఒకసారి నా గదిలోకి రా."

ఇద్దరూ విరామంగా కూర్చున్నాక ఆయన ఇలా అన్నాడు:

"ఈ వేళ ఉదయం ఈ ఉత్తరం చదువుకుని నేను అమితాశ్చర్యపడిపోయాను. ఇది ముఖ్యంగా నీకు సంబంధించింది గనుక- దీనిలో సంగతులేమిటో నీవు తెలుసుకోవాలి. ఈ ఉత్తరం చదవక ముందు, నా కుమార్తెల్లో ఇద్దరు వివాహితలు కాబోతున్నారని నాకు తెలియదు. ఈ శుభసమయంలో నీకు నా శుభాకాంక్షలు!"

ఎలిజబెత్ చెక్కిళ్ళు ఎర్రబారాయి. బహుశా ఈ ఉత్తరం తను అనుకున్నట్టుగా లేడీ కాథరైన్ నుంచికాక, ఆమె మేనల్లుడు డార్సీ నుంచి అని నిర్ధారించుకుంది. ఇంతలో తండ్రి ఇలా అన్నాడు: "నీకంతా తెలిసినట్టే ఉంది. ఈ రోజుల్లో యువతులు నిండు కుండలు. ఈ ఉత్తరం కోలిన్స్ నుంచి వచ్చింది!"

"కోలిన్స్ నుంచా? ఏమని రాశాడు?"

"నీకు సంబంధించిన పేరాలు చదువుతాను విను. 'మీ పెద్ద అమ్మాయి వివాహం జరుగబోయే సందర్భంలో మీకు మా ఉభయుల అభివందనలు. పోతే మరో చిన్న వార్త. అక్కగారి వివాహం అవగానే, చెల్లెలిది కూడా! ఆమె భాగస్వామి ఎవరంటే ఈ ప్రాంతాలలో గొప్ప పేరు ప్రతిష్టలు, గౌరవ మర్యాదలు ఉన్నవాడు. ఈ యువకుడికి ఎనలేని సిరిసంపదలు, ధనకనక వస్తు వాహనాలు ఉన్నాయి. ఇంతకూ మీరు ఈ వివాహానుబంధానికి ముందు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నాను. నా హెచ్చరికకు కారణం ఏమిటంటే- ఈ అనుబంధం అతని అత్త, లేడీ కాథరైన్‌కు ఇష్టంలేదని వినికిడి.' చూశావా- నీకు రాబోతున్నవాడు డార్సీ. నిన్ను వలచి, వివాహం చేసుకోబోతున్నాడు. నీ జీవితంలో కొత్త అధ్యాయం ఆరంభమవుతోంది- చాలా సంతోషమైన విషయం."

ఉత్తరంలో ఇంకా ఇలా ఉంది! 'గత రాత్రి, డార్సీ ఈ వివాహాన్ని గురించి మేనత్త గారికి చెప్పాడట. ఆమె వెంటనే ఏవేవో కుటుంబ అభ్యంతరాలు తెలిపిందట. లిడియా వ్యవహారం సవ్యంగా పూర్తయినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. వాళ్ళను మీరు లాంగ్ బర్న్‌కు ఆదరించి తీసుకు రావలసింది కాదు. నేనే అక్కడి బిషప్‌ను అయితే మిమ్మల్ని వెలివేయాల్సి ఉండేది...' తతిమ్మా ఉత్తరం చార్లెట్ సిరిసంపదల గురించి, భోగభాగ్యాల గురించీని.

"ఉత్తరమంతా విచిత్రంగా ఉందే!"

"అవును. ఇంకో మనిషి అయితే నేను నమ్మి ఉండేవాడినే. కానీ డార్సీ నిర్లక్ష్యం నీ అయిష్టం చూశాక, ఇది కేవలం అసంబద్ధం అనిపించింది. ఇంతకూ మనం అనుకోనివి

జరుగుతూ ఉంటాయి. మొన్న కాథరైన్ వచ్చింది కదా, ఈ విషయంలోనేనా?"

ఈ ప్రశ్నకు ఎలిజబెత్ నవ్వింది. అంతకన్నా ఇంకేం చెప్పలేకపోయింది.

58

లేడీ కాథరైన్ వచ్చి వెళ్ళి ఎక్కువ రోజులు కాకముందే బింగ్లీ లాంగ్‌బర్న్‌కు తిరిగి వచ్చాడు. అతనితోపాటు డార్సీని కూడా తీసుకు వచ్చాడు. మిసెస్ బెనెట్ ఏమీ మాట్లాడక ముందే, జేన్‌తో ఏకాంతం కోరిన బింగ్లీ అందరినీ కాస్సేపు షికారు చేసివద్దాం రమ్మన్నాడు. మిసెస్ బెనెట్ తనకు నడక అలవాటు లేదంది. మేరీ ఇంతకన్నా తను లైబ్రరీ గదిలోనే కులాసాగా గడుపుతానంది. అందుచేత మిగిలిన ఐదుగురూ షికారుకు బయలుదేరారు. బింగ్లీ, జేన్‌లు నెమ్మదిగా నడిచి చాలా వెనుకబడిపోయారు. ఎలిజబెత్, డార్సీ, కిట్టీ ముందు నడుస్తున్నారు. కిట్టీకి అతనితో మాట్లాడటమంటే భయం. ఎలిజబెత్ తనలో తాను ఒక నిశ్చయానికి వచ్చింది.

వాళ్ళు లూకా ఇంటి వంక నడిచారు. కిట్టీ మరియాను చూడాలంది. ఆమె వెళ్ళిపోగానే, ఎలిజబెత్ ధైర్యం కూడగట్టుకుని డార్సీతో ఇలా అంది: 'నేను చాలా స్వార్థ పరురాలను. నా భావాలను పరీక్షించుకోవటం కోసం, ఇతరులను బాధపెడుతున్నానేమో! మీరు మా చెల్లెలికి చేసిన ఉపకారానికి మేమంతా మీకు ఎంతో రుణపడి ఉన్నాము. నాకా విషయం తెలిసినప్పటి నుంచీ, మీకు కృతజ్ఞత తెలియజేద్దామని తహతహ లాడిపోతున్నాను. నా కుటుంబంలో వారికి ఈ విషయం తెలిసినట్టయితే, వారు ఎంతో సంతోషిస్తారు. మిమ్మల్ని ఎంతగానో సన్మానిస్తారు.'

డార్సీ ఆశ్చర్యం మిళితమైన కంఠంతో "జరిగినదంతా మీకు ఎవరో తప్పుగా చెప్పినట్టున్నారు. మిసెస్ గార్డినర్ ఇంతమాట దాచుకోలేదని నేననుకోలేదు" అన్నాడు.

"ఆమెను నిందించకండి. లిడియా వెర్రి వాగుడుతో నాకీ విషయం సూచనప్రాయం గా తెలిసింది. తరువాత పూర్తి వివరాలు తెలుసుకునేంత వరకు నేను నిద్రపోలేదు. మా కోసం మీరు ఇంత కష్టపడి, ఇంత మేలు చేసినందుకు మా కుటుంబం తరఫున ధన్యవాదాలు, కృతజ్ఞతాభివందనాలు, నమస్కారాలు.."

"నీ వందనాలు, నీ కుటుంబం తరఫున అక్కర్లేదు. నీవొక్కత్తె దగ్గర్నుంచి వస్తే చాలు. ఏమంటే నేను నీ కుటుంబాన్ని గురించి ఆలోచించనే లేదు. ఇదంతా నీకోసం చేశాను."

ఎలిజబెత్ ఇంకేమీ చెప్పలేకపోయింది. కొద్దిసేపు గడిచాక అతనిలా అన్నాడు: "నీవు చాలా ఉదారంగా మాట్లాడుతున్నావు. ఇదే నన్ను చిక్కుల్లో పడేస్తోంది. నీ ఆలోచనలు పోయిన ఏప్రిల్ నెలలో మాదిరే ఉన్నాయా? ఉంటే తక్షణం నాకు చెప్పు. నా అనురాగం, కోరికలు, ఆప్యాయత అన్నీ అలాగే చెక్కుచెదరకుండా ఉన్నాయి. నీ దగ్గర్నుంచి ఒక్క

జవాబు ముక్క వస్తే నేను సంతోషిస్తాను."

ఎలిజబెత్ మాటలు కూడబలుక్కుంటూ చెప్పింది. తన ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చిందనీ అతని రాక తనకిప్పుడు ఎంతో సంతోషాన్నిచ్చిందనీ చెప్పింది.

వాళ్ళు దారితెన్ను చూసుకోకుండా నడిచి వెడుతున్నారు. డార్సీ తన మేనత్తను గురించి ఆమె లాంగ్‌బర్న్, లండన్... వచ్చి వెళ్ళటాన్ని గురించి చెప్పాడు.

"ఆమె ధోరణి నాకు ఆశలు ఏర్పరచుకోవడానికి అవకాశం కలిగించింది. నాకు నీ పరిస్థితులన్నీ ముందుగానే తెలుసుననుకో. అయితే నేనంటే నీకు ఇష్టం కాదేమో అని అనుకున్నాను. లేడీ కాథరైన్ నీవు చెప్పిన జవాబులన్నీ నాకు అప్పజెప్పిన మీదట, నీ మనోభావం తెలుసుకున్నాను. అప్పుడు నేను నిర్ణయించుకోగలిగాను."

తరువాత డార్సీ తన ఉత్తరాన్ని గురించి మాట్లాడాడు. 'ఆ ఉత్తరం చదువుకున్న తరువాత, నేనంటే నీకు మంచి అభిప్రాయం కలగడం ఆరంభమైందా?' అనడిగాడు.

ఎలిజబెత్ తనకు అప్పుడు కలిగిన ఆలోచనలన్నీ తెలిపింది. తన అనుమానాలన్నీ తీరిపోయాయని అంది. ఇద్దరూ దాన్ని గురించే చర్చించుకున్నారు. అలా చాలాసేపు మాట్లాడుకుని నడచిన మీదట వాళ్ళకు బింగ్లీ జేన్‌లు ఏమైనారని ప్రశ్న వచ్చింది.

"వాళ్ల వివాహ ప్రసక్తి విని మీరు ఆశ్చర్యపోయారా?" అనడిగింది ఎలిజబెత్.

"ఎంతమాత్రం ఆశ్చర్యపడలేదు. నేను వెళ్ళినప్పుడే ఇటువంటిదేదో త్వరలోనే జరుగుతుంది అనుకున్నాను."

"అంటే దీనికి మీ అనుమతి ఇచ్చారన్నమాట. అంతేగా!"

"లండన్ వెళ్ళబోయేముందు అతనితో స్పష్టంగా ఈ విషయమై చెప్పాను. లోగడ నేను అతని వివాహ విషయంలో జోక్యం కలిగించుకుని అసంబద్ధంగా ప్రవర్తించానని అనిపించింది. అతనెంతో ఆశ్చర్యపడ్డాడు. వాళ్ళిద్దరూ వివాహం చేసుకుంటే తప్పకుండా సంసారసుఖం పొందగలరని వక్కాణించాను."

ఎలిజబెత్ సంతోషంగా నవ్వింది: "మా అక్క అతన్ని ప్రేమిస్తోందని చెప్పటం, మీరు గమనించిన దానిమీద ఆధారపడలేక నేను చెప్పిందే అప్పగించారా?"

"మొదటిదే. రెండుసార్లు ఇక్కడికి వచ్చినప్పుడు, ఆమెనే శ్రద్ధగా గమనించిన తర్వాతే ఈ విషయం నిర్ధారించుకున్నాను.

మీరిలా భరోసా ఇవ్వటం అతనికి చేయూత ఇచ్చిందనుకుంటాను."

"అవును. నేనీ కథంతా పూర్తిగా చెప్పిన తరువాత అతనికి గట్టి నమ్మకం కలిగింది. నన్ను క్షమించానని కూడా హృదయ పూర్వకంగా అన్నాడు."

బింగ్లీ ఇంతగా ఇతరుల అభిప్రాయాల మీద ఆధారపడి నడిచే వ్యక్తి అని ఎలిజబెత్ బెంగపడింది. ఏమైతేనేం, కథ సుఖాంతం కాబోతోంది.

59

ఆమె గదిలోకి రాగానే జేన్ అడిగింది. "ఏం, ఎలిజబెత్! ఇంతసేపూ ఎక్కడ తిరుగుతున్నావు?" ఇంతసేపూ తామిద్దరూ జేన్ బింగ్లీల కోసమే వెదుకుతున్నామని చెప్పింది ఎలిజబెత్. ఆమె చెప్పిన దానిలో ఎవరికీ అనుమానం కలిగించే విషయమేమీ లేదు.

సాయంత్రం మామూలుగా సాధారణంగా జరిగిపోయింది. ప్రేమికులు నవ్వుకున్నారు, కబుర్లు చెప్పుకున్నారు. బహిరంగం కాని ప్రేమికులు మౌనం వహించారు. తమ ప్రేమ బహిర్గతం అయితే ఇంట్లో వాళ్ళంతా ఏమనుకుంటారో ఊహిస్తోంది ఎలిజబెత్.

ఆ రాత్రి ఆమె జేన్ ముందు తన హృదయం విప్పింది.

"వేళాకోళాలాడుతున్నావా లిజ్జీ! డార్సీతో వివాహమా?"

"ఈ విషయం నీవే నమ్మలేకపోతే ఇంకెవరూ నమ్మలేరు. నేచెబుతున్నది నిజమే. అక్షరాలా నిజం. అతనింకా నన్ను ప్రేమిస్తూనే ఉన్నాడు."

"లిజ్జీ నీకు అతనంటే ఎంత అయిష్టమో నాకు తెలుసు." జేన్ అంది.

"లేదు. నేనిప్పుడు ప్రేమిస్తున్నంత తీవ్రంగా ఇదివరకెన్నడూ అతన్ని ప్రేమించలేదు."

"ఇదంతా నిజమేనా? ఎలిజా, నీకు నా అభివందనలు. ఏమీ అనుకోకు. అతనితో సుఖపడగలనని నీకు నమ్మకం ఉందా?"

"ఆ విషయంలో సంశయపడాల్సిందేమీ లేదు. ప్రపంచంలో కల్లా సుఖంగా ఉండగలిగిన దంపతులం మేమే. కానీ నీకు ఈ ఏర్పాటు ఇష్టంగానే ఉందా?"

"ఇష్టమా? బింగ్లీకి నాకు ఇంతకంటే సంతోషకరమైన వార్త ఉండదు. నిజంగా నీవు అతన్ని ప్రేమిస్తున్నావా? లిజ్జీ. ప్రేమించకుండా మటుకు వివాహం చేసుకోకు."

ఎలిజెబెత్ కులాసాగా, హాయిగా నవ్వింది.

ఎలిజబెత్ అక్కకు తన రహస్యాలన్నీ విన్నవించింది. అర్ధరాత్రి వరకు వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూనే కూర్చున్నారు. మిసెస్ బెనెట్ కిటికీ దగ్గర నిలుచుని రోడ్డు వైపు చూస్తూ 'ఆ డార్సీ ఒకడు, ఎప్పుడూ బింగ్లీ వెనకే వస్తాడు! ఎందుకో? ఎప్పుడూ ఎందుకలా కాళ్ళు అరిగేట్టు నడిచి వస్తాడు? ఏమీ మాట్లాడడు. ఉలకడు, పలకడు. బింగ్లీకి అడ్డు రాకుండా, లిజ్జీ, నీవే అతన్ని మాటల్లోకి దింపి బయటికి తీసుకు పోవాలి" అంది.

తల్లి మాటలకు ఎలిజబెత్ విసుక్కున్నా ఆ ఆలోచనకు సంతోషపడింది.

ఈ షికారులో డార్సీ, లిజ్జీ ఒక నిశ్చయానికి వచ్చారు. అదేమిటంటే ఆ సాయంత్రానికి, తమ వివాహానికి గాను బెనెట్‌గారి అనుమతి తీసుకుందామని.

సాయంత్రం, బెనెట్ తన లైబ్రరీ గదిలోకి వెడుతూ ఉండగా డార్సీ కూడా ఆయనను అనుసరించాడు. ఈ దృశ్యం చూసి ఎలిజబెత్ గుండె భయంతో కొట్టుమిట్టాడింది. తండ్రి

ఒప్పుకోడేమోనని కాదు భయం, తను ఆయనకు దూరంగా వెళ్ళిపోవాలి గదా అని! డార్సీ ముఖంలో చిరునవ్వు చిందులాడుతోంది. కొద్ది నిమిషాల్లో అతను కిట్టీతో లిజ్జీ కలిసి కూర్చుని ఉన్న బల్ల దగ్గరకు వచ్చాడు. 'మీ నాన్న దగ్గరకు వెళ్ళు, ఆయన నిన్ను పిలుస్తున్నాడు' అన్నాడు. ఆమె అలాగే వెళ్ళింది.

తండ్రి లైబ్రరీ గదిలో పచార్లు చేస్తున్నాడు. ఆయన ముఖం ఆదుర్దాగా, గంభీరంగా ఉంది. "లిజ్జీ, నువ్వేం చేస్తున్నావు? అతనంటే నీకు ఇష్టం లేదుగదా!" అన్నాడు.

ఎలిజబెత్ అతి కష్టం మీద డార్సీతో తన పరిచయం మొదలు, ఇప్పటి వరకు చెప్పింది. "మీకు వేరే అభ్యంతరం ఉందా?" అని అడిగింది.

"ఏమీ లేదు. అతనంటే నీవు ఇష్టపడేట్టయితే, నాకూ ఇష్టమేనమ్మా" అన్నాడు.

ఎలిజబెత్ కళ్ళలో నీళ్ళు నింపుకుని "నాకు అతనంటే ఇష్టమే. నేనతన్ని ప్రేమిస్తున్నాను. అతనెంతో మంచివాడు. మీరు పూర్తిగా ఎరుగరు." అంది.

"లిజ్జీ. అతనికి నా అంగీకారం తెలిపాను. నీవు బాగా ఆలోచించుకొని అతన్నే వివాహమాడదామని నిర్ణయించుకొంటే, ఇంకేం అలాగే కానీ."

ఎలిజబెత్ తను బాగా ఆలోచించుకునే ఈ నిర్ణయానికి వచ్చానని మళ్ళీ చెప్పింది.

బెనెట్‌కు ఇంకా సదుద్దేశం కలిగించడం కోసం, ఎలిజబెత్ లిడియా వ్యవహారంలో డార్సీ చేసిన ఉపకారమంతా చెప్పింది.

"ఈ సాయంత్రం అన్నీ వింతలు వింటున్నాను. అయితే ఇదంతా చేసినవాడు డార్సీ అన్నమాట! డబ్బు ఇచ్చాడు. అతని బాకీలన్నీ తీర్చాడు, అతని ఉద్యోగం నిలిపాడు. అంతా బాగానే ఉంది. నాకు కూడా ఒక బాదరబందీ వదిలింది. ఇదంతా మీ మామయ్య చేసినట్టయితే ఆ బాకీ తీర్చి ఉండేవాడిని...' అంటూ ఆయన కృతజ్ఞత తెలిపాడు.

ఎలిజబెత్ మనస్సు ఇప్పుడు ప్రశాంతంగా ఉంది. ఆ రాత్రి ఆమె తల్లి దగ్గరకు చేరింది. ఆమె ఈ కబురు విని అపరిమితానంద భరితురాలైంది. కూతురుకు సిరి సంపదలు పడుతున్నాయని సంబరపడింది. ఆమెకు కావలసింది అంతవరకే.

60

ఎలిజబెత్ డార్సీని అడిగింది. తన పట్ల అతనికి ప్రేమ ఎప్పుడు మొదలయిందని.

"నేను ఆ కాలాన్ని, స్థలాన్ని ఇతమిత్థంగా చెప్పలేను. అయితే ఈ ప్రేమకు పునాది చాలాకాలం కిందటే ఏర్పడింది. నాకు తెలియకుండానే ఇదంతా ప్రారంభమైంది."

కాసేపటికి వాళ్ళ మాటలలో లేడీ కాథరైన్ ప్రసక్తి కూడా వచ్చింది.

మిసెస్ గార్డినర్‌కి ఎలిజబెత్ ఓ పెద్ద ఉత్తరం రాసింది:

"నీకు ఇంతకు ముందే జవాబు రాసి ఉండవలసింది. ఆలస్యం అయింది, క్షమించు.

డార్సీతో నీవు ఊహించినదానికంటే నాకు ఎక్కువ పరిచయం ఉంది. ఇప్పుడు ప్రపంచంలో నా కంటే సుఖవంతురాలు ఉండదు. జేన్ కంటే కూడా అదృష్టవంతురాలను. ఆమె మందహాసం మటుకే చేస్తుంది. నేను మనసారా నవ్వుతాను. డార్సీగారు మిమ్మల్ని అందరినీ అడిగానని చెప్పమన్నారు. వచ్చే క్రిస్‌మస్‌కు మీరంతా తప్పకుండా పెంబర్లే వచ్చి మా అతిథ్యం స్వీకరించాలి... ఎలిజబెత్."

డార్సీ, లేడీ కాథరైన్‌కి రాసిన ఉత్తరం మరో ధోరణిలో ఉంది.

మిస్టర్ బెనెట్ కోలిన్స్‌కు రాశాడు: "నీ అభివందనలు అందాయి. ఎలిజబెత్ త్వరలోనే డార్సీ భార్య అవుతుంది. లేడీ కాథరైన్‌ను సాధ్యమైనంతగా ఓదార్చు. నేనే నీ స్థానంలో ఉంటే, మేనల్లుడినే సమర్థిస్తాను. **బెనెట్.**"

మిస్ డార్సీ పంపిన శుభసందేశం మటుకు హృదయ పూర్వకమైనదే.

కోలిన్స్ దంపతులు లూకాల ఇంటికి వచ్చి దిగారు. లేడీ కాథరైన్‌కు మేనల్లుడి ఉత్తరంతో విపరీతమైన కోపం వచ్చింది. చార్లెట్ ఎలిజబెత్ అదృష్టానికి సంతోషపడి, లేడీ కాథరైన్‌ను కలుసుకోకముందే స్నేహితురాలిని కలుసుకుని అభినందించాలని తీర్మానించుకుంది. అందుకే ఇంత హడావిడిగా రావటం.

61

తన కూతుళ్ళలో ముఖ్యులైన ఇద్దరి వివాహం జరిపించిన రోజు, మిసెస్ బెనెట్‌కు పర్వదినం. ఆమె ఆనందానికి అంతులేదు. ఉత్సాహానికి అవధిలేదు.

మిస్టర్ బెనెట్‌కు ఎలిజబెత్‌ను దూరంగా పంపటం కష్టంగానే ఉంది. వాళ్ళు రమ్మన్నప్పుడు పెంబర్లే వెడదామనుకున్నాడు.

బింగ్లీ జేన్‌లు నెదర్‌ఫీల్డ్‌లో కొద్దిరోజులు మటుకే ఉన్నారు. మెంటాస్‌కు దరిదాపుల్లో ఉండటం అతనికి హాయిగా లేదు. ఆమెకు ఆనందంగానూ లేదు. అందుచేత అతనికి చెల్లెళ్ళ చిరకాలవాంఛ ఈడేరింది. బింగ్లీ డెర్బీషైర్‌లోనే ఒక ఎస్టేటు కొనేశాడు. ఇప్పుడు జేన్, ఎలిజబెత్‌లకు దూరం 30 మైళ్ళు మాత్రమే.

కిట్టీ తన సమయంలో చాలా భాగం పెద్ద అక్కలిద్దరితోనూ గడుపుతోంది. లిడియా లాగా ఆమె చిల్లర మనస్తత్వం కలది కాదు. లిడియా ఎప్పుడైనా విందులకు, వినోదాలకు ఆహ్వానించినా కిట్టీ వెళ్ళటానికి ఆమె తండ్రి ఒప్పుకోవటం లేదు కూడా!

ఇంక ఇంటిపట్టున ఉన్న అమ్మాయల్లా మేరీయే. ఈమె మిసెస్ బెనెట్‌కు తోడు.

ఎలిజబెత్, జేన్‌ల వివాహాలతో వికం లిడియాల ప్రవర్తనలో పెద్ద మార్పేమీ రాలేదు. తను చెప్పిన తప్పుడు కథంతా ఇప్పుడు ఎలిజబెత్‌కు తెలిసిపోయిందని వికం గ్రహించాడు. అయినా, డార్సీ తనకు అన్యాయం చేయడనే ఆశించాడు. ఎలిజబెత్‌కు

లిడియా ఇలా రాసింది: "ప్రియమైన లిజ్జీ! నేను నా ప్రియతమ వికంను ప్రేమిస్తున్న దానిలో సగమైనా నీవు డార్సీని ప్రేమించగలిగితే, నిజంగా సుఖపడతావు. నీ కిప్పుడు చేయవలసిన పనంటూ ఏమీ ఉండదు. మమ్మల్ని గురించి ఆలోచిస్తావనుకుంటాను. మాకు ఏదైనా సహకారం చేస్తావనుకొంటాను. ఈ సంగతి డార్సీతో మాట్లాడకు..."

ఎలిజబెత్ ఈ ఉత్తరానికి జవాబు రాసింది. ఇటువంటి అభ్యర్థనలేమీ చేయవద్దంది. అయితే ఆమె తన సొంత ఖర్చులలో పొదుపుగా ఉండగా మిగిలినది వాళ్ళకు పంపుతోంది. వికం, లిడియాలకు ఆదాయం తక్కువైనా ఆశలు మటుకు బారెడు. ఆదాయాన్ని మించిన ఖర్చు. తరచూ జేన్‌కో, ఎలిజబెత్‌కో దబ్బుకోసం ఇళ్ళు మారుస్తున్నాం అనేవాళ్ళు. వికం అనురాగం కొద్దికాలంలోనే ఆవిరై నిర్లక్ష్యంగా మారింది.

డార్సీ అతన్ని ఎన్నడూ పెంబర్లేలో అడుగుపెట్టనివ్వలేదు. అయినా, ఎలిజబెత్‌ను చూసి అతనికి ఏవో సహాయాలు చేస్తూనే ఉన్నాడు. లిడియా అప్పుడప్పుడు అక్కడికి వస్తూ ఉండేది. బింగ్లీ ఇంటికి మటుకు దంపతులు ఇరువురూ వెళ్ళి వస్తూ ఉండేవాళ్ళు.

డార్సీ వివాహంతో మిస్ బింగ్లీ చాలా కుంచించుకుపోయింది. పెంబర్లేకు తరచూ వెళ్ళి రావటమనే సదుపాయాన్ని పోగొట్టుకోవటం ఇష్టంలేక తన కోపాన్నంతా దిగమింగుకుంది. జార్జియానా పట్ల ఇప్పుడు ఆప్యాయత ప్రదర్శిస్తోంది. ఎలిజబెత్ పట్ల ఇదివరకులా కాకుండా అమిత మర్యాదగా ప్రవర్తిస్తోంది.

జార్జియానా ఇప్పుడు పెంబర్లేలోనే ఉంటూంది. ఒదిన, మరదళ్ళు డార్సీ ఆశించినట్టు ఒద్దికగానే ఉంటున్నారు. జార్జియానాకు ఎలిజబెత్ అంటే ఎంతో ఇష్టం, భక్తి గౌరవం. స్త్రీ తన భర్తతో ఎంత చనువుగా ఉండగలదో, అంత చనువు పది సంవత్సరాలు చిన్నదైన చెల్లెలికి సైతం అన్నగారి ఎడల లభ్యం కాదని, ఆమె ఎలిజబెత్ నుంచి తెలుసుకుంది.

లేడీ కాథరైన్ డార్సీని, ఎలిజబెత్‌ను దుయ్యబడుతూ ఉత్తరాలు రాసింది. అయితే ఎలిజబెత్ ప్రేరణ మీద కొన్నాళ్ళ తరువాత డార్సీ ఆమెతో రాజీ కుదుర్చుకున్నాడు. గార్డినర్లతో వాళ్ళు ఎప్పుడూ మంచిగానే ఉన్నారు. డార్సీ, ఎలిజబెత్‌లకు వాళ్ళంటే అమిత ప్రేమ. వాళ్ళు ఆమెను డెర్బీషైర్‌కు తీసుకు రావటం వల్లనే తమ కలయిక తటస్థించింది. అందుకనే ఇద్దరికీ వారి పట్ల అంతులేని కృతజ్ఞత!

సమాప్తం



అహం - అసూయ

నవల ఇంగ్లండులో 1813లో వెలువడింది. అంతకుముందు పాఠకలోకానికి బొత్తిగా తెలియని జేన్ ఆస్టన్ అనే ఓ యువ రచయిత్రి ఈ పుస్తకంతో సాహిత్య లోకంలోకి దూసుకొచ్చింది. రెండు శతాబ్దాలనాటి ఈ నవల ఇప్పటికీ పాఠకుల మన్ననలను పొందుతూనే ఉంది. పాత్రలన్నీ ఆనాటి గ్రామీణ భూస్వాముల కుటుంబాలకు చెందినవే.

మానం-మర్యాద, సంస్కారం, కుసంస్కారం, నీతి-అవినీతి, విద్య, వివాహం, పెంపకంలో పాటించాల్సిన విలువలు తదితరాలు ఈ నవల్లో చర్చకి వస్తాయి. ఇప్పటికి రెండు కోట్ల ఇంగ్లిషు ప్రతులు అమ్ముడుపోయిన నవల ఇది.

ఇందులో ఎలిజబెత్ బెన్నెట్ అనే పాత్ర చుట్టూ ఈ నవల తిరుగుతుంది. ఐదుగురు ఆడ పిల్లలున్న కుటుంబంలో ఈమె రెండోది. తండ్రి బెన్నెట్ సంస్కారి, విద్యావంతుడు. కాని వ్యవహర్త కాదు. బాగా డబ్బులున్నవాళ్లకి కూతుళ్లను కట్టబెట్టాలనే యావ తప్ప, తల్లికి మరే సంస్కారమూ లేదు. ఎలిజబెత్ మాత్రం అచ్చంగా తండ్రి కూతురు.

PEACOCK CLASSICS